
# బోల్షివిక్

సంపుటి:10
సంచిక:2
జులై-డిసెంబర్
2021

సీపీఐ(మావోయిస్టు)
ఏఓబీ సమాచారపత్రిక



## నేను ఎవరినంటే!

నేను
నేను ఎవరినంటే
పుట్టుకతో ప్రమేయం లేని వాడిని
మరణంతో ప్రమేయం ఉండీ లేనివాడిని
మధ్య కాలంలో నేను,
నేను
గత నా మానవసారాన్ని ఆకళింపు చేసుకుంటున్నవాడిని
గతం వర్తమానంలోకి ఎగబాకిన వైనాన్ని అధ్యయనం చేస్తున్నవాడిని
వర్తమానం భవిష్యత్‌లోకి పురోగమించే గతిశీలతను విశ్వసించినవాడిని
అందుకే నేను,
చరిత్ర పురోగమిస్తుందని నమ్మినవాడిని
చరిత్ర పురోగమనంలో భాగమైనవాడిని
చరిత్రను నడిపించే చోదకశక్తిని
ఇప్పుడు
నేనెవరినంటే
నేను కమ్యూనిస్టును!

- కామ్రేడ్ సాకేత్ రాసిన కవిత
(మరణానంతరం తన డైరీలో దొరికినది)

# విషయ సూచిక


1. మూడు సాగు చట్టాలు 4

2. మిలటరీ వ్యాసం 8

3. సిద్ధాంత వ్యాసం 10

4. శత్రు గుఢాచారి వ్యవస్థ 13

5. పత్రికా ప్రకటనా 15

6. అమరుల జీవిత చరిత్ర 30

7. పోరాట ప్రవంతి 52




మార్క్సిజం

లెనినిజం

మావోయిజం

ఆంధ్రా-ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ కమిటీ

పత్రికా ప్రకటన





# మీ త్యాగాల వెలుగులో ప్రజాయుద్ధమార్గం ప్రకాశవంతమైంది! లక్ష్యం చేరేదాకా మీరు చూపిన మార్గాన్ని వదలం!



భారత దేశంలో ప్రస్తుతం నెలకొని వున్న అర్ధ భూస్వామ్య, అర్ధవలస సమాజాన్ని కూకటివేళ్ళతో పెళ్ళగించి, నూతన ప్రజాస్వామిక వ్యవస్థనూ, ఈ క్రమంలో సోషలిజాన్ని, అంతిమంగా కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) నేతృత్వంలో ప్రజలు వీరోచితంగా ఉద్యమిస్తున్నారు. ఈ ఉద్యమాన్ని అణచి వేసి, తమ అధికారాన్ని సుస్థిరం చేసుకొనేందుకూ, దోపిడీ పీడనలను కొనసాగించేందుకు ఈ దేశ దోపిడీ పాలక వర్గాలైన దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు, వారి యజమానులైన సామ్రాజ్యవాదులు తమ రాజ్యాంగ యంత్రం ద్వారా పార్టీపైనా, పీఎల్‌జీఏపైనా, ప్రజలపైన తీవ్రమైన సాయుధ అణచివేతను కొనసాగిస్తున్నారు. ఈ అణచివేత 2009 సెప్టెంబర్ నుంచి గ్రీన్‌హంట్ బహుముఖ, సైనిక దాడి రూపంలో మరింత తీవ్రతరమై, 2017 ఫిబ్రవరి నుండి 'సమాధాన్-ప్రహార్' పేర్లతో ఈ దాడి అత్యంత పాశవికంగా, క్రూరంగా, మోసపూరితంగా కొనసాగుతున్నది. విరుద్ధ ప్రయోజనాల కోసం జరుగుతున్న ఈ యుద్ధంలో ప్రజల రాజ్యాధికారాన్ని నెలకొల్పే లక్ష్యంతో దోపిడీ వర్గాల రాజ్యంతో వీరోచితంగా పోరాడుతూ అనేక మంది ప్రజల ఉత్తమ పుత్రులు, పుత్రికలు తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పిస్తున్నారు. చరిత్ర పురోగమనానికి తమ వంతు కర్తవ్యంగా వీరోచితమైన త్యాగాలను చేస్తూ గొప్ప విప్లవ సాంప్రదాయాలను నెలకొల్పుతున్నారు. జులై నుంచి డిసెంబర్ 2021 వరకు దేశవ్యాప్తంగా పదుల సంఖ్యలోనే పార్టీ, పీఎల్‌జీఏ, ప్రజాసంఘాల సభ్యుల నాయకత్వంతో పాటు, సాధారణ ప్రజలు నేలకొరిగారు. ఏఓబీ ఉద్యమ రథసారథి, కేంద్రకమిటీ సభ్యుడు కామ్రేడ్ సాకేత్ (అక్కిరాజు హరగోపాల్), కామ్రేడ్ అనిల్ (మూక-డీవీసీఎమ్), కామ్రేడ్ సోని (పారో-ఏసీఎమ్), కామ్రేడ్ చిన్నారావు(ఆజాద్-పీఎమ్)లతోపాటు దేశ వ్యాపితంగా అనేక మంది కామ్రేడ్స్ శత్రువుతో వీరోచితంగా పోరాడుతూ అమరులైనారు. మన ఈ కామ్రేడ్స్ అమరత్వం పార్టీకి, ఉద్యమానికి ఎనలేని నష్టాన్ని కల్పించింది. వారి కుటుంబాలకూ, శ్రేయోభిలాషులకు తీవ్రమైన దుఃఖాన్ని నింపింది. ఈ పరిస్థితులలో అమరుల కుటుంబాల, శ్రేయోభిలాషుల దుఃఖంలో పాల్పంచుకుంటూ, వారికి ఎస్‌జడ్‌సి ప్రగాఢ సంతాపాన్ని తెలియ జేస్తున్నది. అలాగే అమరుల ఆశయాలను సఫలీకృతం చేస్తామని ప్రతిజ్ఞ చేస్తూ, వారికి తలవంచి వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నది.

మన అమరుల త్యాగాలు మన వెంటనే వున్నాయి. వారి త్యాగాలతో మన మార్గం ప్రకాశవంతమైంది. మన పురోగమనంలో వారిస్తున్న ఉత్తేజం మనకు నూతన శక్తినీ, చైతన్యాన్ని అందిస్తున్నది. అందుకే వారు సదా చిరస్మరణీయులు.

వ్యాసం

# మూడు సాగుచట్టాలను సమర్థించే అన్ని పార్టీల రాజకీయ నాయకులను సామాజిక బహిష్కరణకు గురిచేయండి!!
# నూతన ప్రజాస్వామ్యం కోసం ఐక్య, రాజకీయ మహోద్యమాన్ని నిర్మించండి!!

**దేశీయ, అంతర్జాతీయ కార్పొరేట్ శక్తుల బారి నుంచి వ్యవసాయాన్నీ, ప్రజాస్వామ్యాన్నీ, దేశ సార్వభౌమత్వాన్ని రక్షించేందుకు పోరాడుతున్న రైతాంగానికి క్రియాశీల మద్దతును తెలపండి!**

మోడీ ప్రభుత్వం, 2020 జూన్-సెప్టెంబర్ మాసాల మధ్య, కరోనా కాళరాత్రి సమయంలో, పార్లమెంటులో తమకున్న మూకబలంతో, వ్యవసాయానికి చెందిన మూడు ఆర్డినెన్సులను, ఆ తదుపరి చట్టాలను చేసింది. ప్రజలంతా, ఒక్కమాటలో చెప్పాలంటే దేశమంతా కరోనా వైరస్ బారినపడి సతమతమవుతుంటే, మోడీ ప్రభుత్వం మాత్రం పార్లమెంటులో చర్చ, ఓటింగ్ వంటి కనీస ప్రజాస్వామిక సూత్రాలను కూడా పరిగణలోకి తీసుకోకుండా హడావిడిగా, ఏకపక్షంగా, నిరంకుశంగా మూడు సాగుచట్టాలను చేసింది. ఈ చట్టాలను తేవడానికి రాష్ట్రాలకున్న అధికారాలను గుంజుకొని, రాజ్యాంగ ఫెడరల్ లక్షణాన్ని ధ్వంసం చేసింది. వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం, నిలువ, ధాన్యాలను దాచడం, వ్యవసాయ మార్కెట్, ఒప్పంద వ్యవసాయం -వంటి మార్పులన్నీ 7వ షెడ్యూల్‌లోని రాష్ట్రాల జాబితాలోనివి అయినప్పటికీ, వీటిపై పార్లమెంటులో చట్టాలు చేయడానికి వీలు లేనప్పటికీ, మోడీ ప్రభుత్వం బెదిరింపులతో, అదిరింపులతో రాష్ట్రాల అధికారాన్ని గుంజుకొని ఈ మూడు సాగుచట్టాలను చేసింది. ఈ మూడు సాగుచట్టాలు రైతులకు తమ వ్యవసాయ ఉత్పత్తులను దేశంలో ఎక్కడైనా అమ్ముకునే స్వేచ్ఛను కల్పిస్తూ, తమ ఆదాయం పెంచుకోవడానికి దోహదపడేవి అంటూ పచ్చి అబద్ధాలను ప్రచారం చేసింది. వాస్తవంగా ఈ మూడు సాగుచట్టాలు దేశ సార్వభౌమత్వానికీ, రైతాంగ ప్రయోజనాలకు వ్యతిరేకమైనవి. ఈ చట్టాలను రూపొందించిన క్రమం కూడా, కనీస ప్రజాస్వామిక సూత్రాలకు వ్యతిరేకమైనది. ఈ ప్రభుత్వం తన కార్యాచరణకు మార్గదర్శిగా భావిస్తున్న రాజ్యాంగ సూత్రాలకు సైతం విఘాతం కలిగించేదే.

మోడీ ప్రభుత్వం తెచ్చిన మూడు సాగుచట్టాలు, రైతులకోసం తెచ్చినవి కావు. అవి అంబానీ, ఆదాని వంటి దేశీయ కార్పొరేట్ సంస్థలతోపాటు, విదేశీ బహుళజాతి సంస్థలకోసం మాత్రమే తెచ్చినవి. ఈ మూడు సాగుచట్టాలు, రైతులకు తమ వ్యవసాయ ఉత్పత్తులను, దేశంలో ఎక్కడైనా అమ్ముకునే స్వేచ్ఛను కల్పిస్తాయనేది పచ్చి బూటకం. ఇందుకు బదులుగా ఆ చట్టాలు, ఇప్పటికే ఎంతో కొంత మేలు చేస్తున్న వ్యవసాయ మార్కెట్(మండి)లను ధ్వంసం చేసి, దేశీయ, అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థలకు, రైతాంగం నుంచి వ్యవసాయ ఉత్పత్తులను అగ్వ(తక్కువ ధర)కు కొని దోపిడీ చేసే, వినియోగదారున్ని కష్టాలపాలు చేసే, స్వేచ్ఛను మాత్రం కల్పిస్తాయి. ఇంకో మాటలో చెప్పాలంటే, నూటికి 80 మంది 5 ఎకరాలలోపు రైతులే ఉన్న ఈ దేశ ప్రత్యేక పరిస్థితులలో, ఒకరాల వంటి ఒక్కచిక్కిన రైతులను దేశీయ, అంతర్జాతీయ కార్పొరేట్ తొడేళ్ళతో ఒప్పందాలు చేసుకునే స్వేచ్ఛను మాత్రం మోడీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిందని చెప్పాలి.

పై వాస్తవాలను అర్థం చేసుకున్న అనేక రైతుసంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చాలో సమీకృతులవుతూ, ఈ మూడు సాగుచట్టాలకు వ్యతిరేకంగా, క్రూరమైన ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదుర్కొంటూ సమరశీలంగా తమ పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. ఈ రైతాంగ పోరాటం పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌ల నుంచి క్రమంగా దేశం నలుమూలలకు విస్తరిస్తూ బలపడుతున్నది. ఈ పోరాటం, కేవలం మూడు సాగుచట్టాల రద్దుకే పరిమితం కాలేదు, రైతాంగానికి వ్యతిరేకంగా కేంద్రప్రభుత్వం ముందుకు తెచ్చిన విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలని కూడా డిమాండ్ చేస్తున్నది. ఆయిల్

ధరల, నిత్యవసర సరుకుల ధరల పెంపునకు వ్యతిరేకంగా ఆందోళన చేపడుతున్నది. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న దేశీయ, అంతర్జాతీయ కార్పొరేట్‌ల అనుకూల విధానాలను, వ్యతిరేకిస్తూ నినదిస్తున్నది. ఈ పోరాటం కేవలం రైతాంగానికే పరిమితం కాలేదు, సమాజంలోని అన్ని పీడితవర్గాలు, సెక్షన్‌లు ఈ పోరాటానికి మద్దతు తెలియజేస్తున్నాయి. నవంబర్ 26న జాతీయస్థాయిలో జరిగిన సాధారణ సమ్మెలో, 25 కోట్ల మంది కార్మికులు మూడు సాగుచట్టాలను వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టారు. సంయుక్త కిసాన్ మోర్చ (ఎస్.కే.ఎమ్), అఖిల భారత రైతుపోరాట సమన్వయ కమిటీ (ఏ.ఐ.కే.ఎస్.సీ.సీ)లు ఇచ్చిన పిలుపులకు, దేశవ్యాపితంగా విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు ఇతర శ్రామిక ప్రజానీకం అనుకూలంగా స్పందించారు, స్పందిస్తున్నారు.

కేంద్రప్రభుత్వం మాత్రం, ఉద్యమం ప్రారంభమై 8 నెలలు గడుస్తున్నా, మొక్కుబడిగా 11సార్లు రైతాంగంతో చర్చలు జరిపి, సమస్యను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నది. ఈ చర్చలలో పాల్గొంటున్న రైతునాయకులు ప్రధానంగా మూడు సాగుచట్టాలను రద్దు చేయాలనీ, కనీస మద్దతు ధర (ఎమ్.ఎస్.పీ)ను చట్టబద్ధం చేయాలని డిమాండ్ చేస్తూ, మరోమధ్యేమార్గం లేదని తేల్చి చెప్పారు. ప్రభుత్వం మాత్రం రైతాంగం చేస్తున్న డిమాండ్‌లను ఆమోదించడం సాధ్యం కాదని మొరటుగా సమాధానం ఇస్తూ, ఆ చట్టాలకు లోబడి కొన్ని సవరణలను మాత్రం పరిశీలనలోకి తీసుకుంటామని అంటున్నది. కేంద్ర వ్యవసాయమంత్రి నరేంద్రసింగ్ తోమర్, ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాలలో, ప్రతిపక్షాలు మూడు సాగుచట్టాలపై అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, దేశంలో మెజారిటీ రైతులు సాగుచట్టాలను ఆహ్వానిస్తున్నారని రైతాంగ ఉద్యమకారులను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసాడు. మొత్తంగా చూసినప్పుడు కేంద్రప్రభుత్వం, సుప్రీంకోర్టు ఇచ్చిన స్టేతో, ఈ మూడు సాగుచట్టాల అమలును 18 నెలలకు వాయిదా వేసినప్పటికీ, ఈ లోపు సమస్యను న్యాయబద్ధంగా పరిష్కరించేందుకు ఏ మాత్రం సిద్ధపడకుండా, మొండి వైఖరిని చేపట్టి కాలయాపన చేస్తున్నది. మరోవైపు సుప్రీంకోర్టు కేంద్రప్రభుత్వానికీ, రైతుసంఘాలకు మధ్య నెలకొన్న ప్రతిష్ఠంబనను తొలగించేందుకు తీసుకోవాల్సిన చర్యలను సూచించేందుకు, గతంలో 3 సాగుచట్టాలకు మద్దతు తెలిపిన 4గురు పెద్దమనుషులతో మొక్కుబడిగా ఒక కమిటీని నియమించింది. ఈ నియామకాన్ని మొదట్లోనే భారతీయ కిసాన్ మోర్చా నాయకులతోపాటు, ఇతర రైతుసంఘాల నాయకులు కూడా వ్యతిరేకించారు. ఈ కమిటీ ఇటీవలనే తన నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించింది.

కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న పై కుట్రపూరిత, మోసపూరిత పద్ధతులనూ, విధానాలను రైతాంగ ఉద్యమకారులు ఎటువంటి శషబిషలు లేకుండా తిరస్కరిస్తున్నారు, తిప్పికొడుతున్నారు. గడ్డకట్టే చలిలో సైతం, వేలాది మంది రైతాంగ ఉద్యమకారులతో దేశ రాజధాని ఢిల్లీ ప్రవేశమార్గాలు ఘాజియాబాద్, సింఘూ, టిక్రీ సరిహద్దులు దద్దరిల్లిపోతున్నాయి. రైతాంగ కమిటీలు ఇచ్చిన పిలుపులతో, రైతులు నిరవధిక, నిరంతర దివారాత్రి బైటాయింపు కొనసాగిస్తున్నారు. గడిచిన 8 నెలలుగా భారతబంద్, చలో పార్లమెంట్ వంటి సామూహిక, సమరశీల ఆందోళనలు చేపట్టారు. నిరంతరాయంగా నిరసన కార్యక్రమాలను కేంద్రీకరణ, వికేంద్రీకరణ పద్ధతులలో నిర్వహిస్తున్నారు. ఖేతీ బచావో, లోక్‌తంత్ర్ బచావో నినాదాలతో ఢిల్లీ సరిహద్దులు దద్దరిల్లుతున్నాయి. ఈ రైతాంగ ఉద్యమం రోజురోజుకు తీవ్రతరం అవ్వటమే కాకుండా, దేశంలోని వివిధ రాష్ట్రాలకు విస్తరిస్తున్నది. జులై మాసంలో సంయుక్త కిసాన్ మోర్చ ఇచ్చిన పిలుపు మేరకు మూడు సాగుచట్టాలకు వ్యతిరేకంగానూ, ఆయిల్, నిత్యావసర ధరలకు వ్యతిరేకంగాను 13 రాష్ట్రాలలో రైతాంగ నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఈ మధ్య కాలంలో రైతాంగ కమిటీలు ఇచ్చిన పిలుపు మేరకు ఎన్.డీ.ఏలో ఉన్న రాజకీయ పార్టీలను గ్రామాలకు రాకుండా హర్యానా, పంజాబ్ రాష్ట్రాలలో సామాజిక బహిష్కరణకు గురి చేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న వర్షాకాలపు పార్లమెంటరీ సమావేశాల సందర్భంగా, ప్రభుత్వం నిర్బంధ ఉత్తర్వులు జారీ చేయడం వలన ప్రతిరోజు 200 మంది రైతులు మాత్రమే, జంతర్ మంతర్ వద్ద, నిజమైన ప్రజాస్వామిక స్ఫూర్తితో 'కిసాన్ సంసద్' (పార్లమెంట్ సమావేశాలు)ను నిర్వహిస్తున్నారు. పార్లమెంట్ దిశగా కవాతులు చేస్తున్నారు. ఇందులో మహిళా రైతుల పాత్ర చాలా కీలకంగా ఉంటున్నది. జులై 26న మహిళా రైతులు ప్రత్యేకంగా నిర్వహించిన 'కిసాన్ సంసద్'లో 'పొలాలనూ దున్నగలం, దేశాన్నీ నడపగలం' అంటూ చేసిన ఉపన్యాసాలు దేశప్రజలకు గొప్ప ప్రేరణగా నిలిచాయి. ఈ సందర్భంగా రైతాంగం, పార్లమెంట్ సమావేశాలకు హాజరయ్యే ఎమ్.పీ(పార్లమెంట్ మెంబర్లు)లకు, మూడు సాగుచట్టాలకు వ్యతిరేకంగా చర్చించాలని 'పీపుల్స్‌విప్' జారీ చేసారు. పార్లమెంట్ సమావేశాల ఎదురుగా జరుగుతున్న ఈ పోరాట రూపాలను, పార్లమెంట్ సమావేశాల ముగింపు తేదీ (ఆగస్టు 9)వరకు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్న రైతాంగం, రోజువారి కార్యక్రమాలను కూడా ప్లాన్ చేసుకున్నారు. ఆగస్టు 9న మరోసారి, మహిళా రైతుల ప్రత్యేక పార్లమెంట్, మార్చ్‌కు పథకం రూపొందించారు. పార్లమెంట్ సమావేశాలనంతరం తమ ఉద్యమాన్ని తీవ్రతరం చేసేలా భవిష్యత్ కార్యక్రమాన్ని కూడా రూపొందించుకున్నారు.

అయితే ఈ నిరసన కార్యక్రమాలన్నీ, ప్రభుత్వ పోలీసు సిబ్బంది చేపట్టిన క్రూరమైన అణిచివేత చర్యల మధ్యనే జరిగాయి. ఉద్యమ ప్రారంభ దశలో, 2020 శీతాకాలంలో టిక్రీ, సింఘూ సరిహద్దు రోడ్లమీద విపరీతమైన శీతల పవనాలు వీస్తుండటంవల్ల, ఇక్కడ నిరసన వ్యక్తం చేస్తున్న చాలా మంది రైతులు తీవ్రమైన చలికి మరణించారు. ఇంతటి అననుకూల పరిస్థితులలో సైతం, తమ న్యాయమైన హక్కుల కోసం ఎంతో శాంతియుతంగా, క్రమశిక్షణగా పోరాడుతున్న రైతాంగంపై, కేంద్రప్రభుత్వం ఉసిగొలిపిన పోలీసులు అత్యంత అమానుషంగా నీటి ఫిరంగులతో దాడి చేసారు. అసలే గడ్డకట్టుకుపోయే చలి పరిస్థితులలో, పోలీసులు జరిపిన ఈ అమానుషమైన దాడిలో రైతుల మరణాలు వందల సంఖ్యకు చేరాయి. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాలలో ప్రతిపక్షాలు, ప్రభుత్వాన్ని, మరణించిన రైతుల సంఖ్యను చెప్పాల్సిందిగా నిలేస్తే, కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి

నరేంద్రసింగ్ తోమర్ మరణాల సంఖ్యను చెప్పలేకపోయాడు. ఈ స్థితి, పోరాడుతున్న రైతాంగం విషయంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్యపూరిత, బాధ్యతారాహిత్య వైఖరిని బహిర్గతపరిచింది.

జనవరి 26న, ఢిల్లీలో రైతుల ర్యాలీకి అంగీకారం తెలిపిన ప్రభుత్వం, తాను అనుమతించిన మార్గాలలో సైతం పోలీసులతో బారికేడ్లు నిర్మించి, రైతుల ర్యాలీకి అనేక ఆటంకాలు సృష్టించింది. అయినా రైతులు తమ ర్యాలీని విరమించలేదు, పోలీసులు నిర్మించిన బారికేడ్లను తొలగించుకొంటూ, వారు సృష్టించిన ఆటంకాలను తిప్పికొడుతూ పురోగమించారు. ఇదే సందర్భంలో కొందరు, తమ తీవ్ర నిరసనను తెలియజేయడంలో భాగంగా, ఎర్రకోట బురుజులపై రైతాంగ జెండాలను ఆవిష్కరించారు. ఈ సంఘటనను ఆసరా చేసుకొని జనవరి 27న పోలీసులు రైతాంగంపై అల్లర్లు ప్రోత్సహించారనీ, ప్రజల ఆస్తిని ధ్వంసం చేసారనీ, పోలీసులపై దాడి చేసారనీ, 200 మంది నుంచి 300 మంది పోలీసులను గాయపరిచాని తప్పుడు ఆరోపణలు చేస్తూ, 22 ఎఫ్.ఐ.ఆర్‌లు దాఖలు చేసారు.

జులై 11, 2021న హర్యానా రాష్ట్రం, సిర్సాలో రైతులు బీ.జే.పీకి చెందిన అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రణబీర్‌గంగ్వాను, మూడు సాగుచట్టాలకు మద్దతు తెలిపినందుకు, సామాజిక బహిష్కరణలో భాగంగా అడ్డుకున్నారు. అప్పటికే క్రాంతికారీ కిసాన్ మజ్దూర్ సంఘనేత దర్శన్‌పాల్‌సింగ్, 'బీ.జే.పీ నేతృత్వంలోని ఎన్.డీ.ఏ ప్రభుత్వం అన్యాయంగా రూపొందించిన మూడు సాగుచట్టాలకు మద్దతు ఇచ్చే స్వతంత్రులతో సహా, అందరూ శాసన సభ్యులను శాంతియుతంగా బహిష్కరిస్తామనీ, రాష్ట్రవ్యాపితంగా గ్రామాలలోకి రాకుండా అడ్డుకుంటామని' ప్రకటించి ఉన్నాడు. ఈ పిలుపు నేపథ్యంలోనే ఈ సంఘటన జరిగింది. దీంతో సిర్సా పోలీసులు 100 మంది రైతులపై 124ఏ (రాజద్రోహం)తో పాటు, 307 (హత్యాయత్నం), 186 (ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వర్తించడంలో ప్రభుత్వ ఉద్యోగులను అడ్డుకోవడం) వంటి క్రూరమైన సెక్షన్‌ల కింద కేసులు బనాయించారు. కొంతమందిని వెంటనే అరెస్టు చేసి జైళ్ళలో వేసారు. దీంతో రైతులు తమ సహచరుల విడుదల కోసం, సిర్సాలో ఆందోళనలు తీవ్రతరం చేసారు. జాతీయ రహదారులపై బైఠాయించారు. రోడ్లను దిగ్బంధించారు. తమ సహచరులను విడుదల చేసే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని ప్రతిజ్ఞ చేసారు.

మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ క్రూరమైన నిర్బంధం, రైతుల మేరకే ఆగలేదు, చివరికి, అన్నదాతలకు అన్నం పెట్టడానికి వనరుల సహాయం చేస్తున్న, ధార్మికసంస్థల కార్యనిర్వాహకులను సైతం వెంటాడింది. వారిపై కూడా రాజద్రోహం కేసులు పెట్టింది. ఈ కేసులలో, సాక్షులుగా, ఎన్.ఐ.ఏ పోలీసులు హాజరు కావాలని సమన్లు జారీ చేసింది. రైతులపై జరుగుతున్న ఈ దాడుల్లో, పోలీసులతోపాటు, కొన్నిచోట్ల ఫాసిస్టు మూకలైన బీ.జే.పీ, ఆర్.ఎస్.ఎస్ కార్యకర్తలు కూడా పాల్గొన్నారు. ఢిల్లీ సరిహద్దులోని ఘాజీపూర్‌లో, జూన్ 30న ఈ ఫాసిస్టు మూకలు రైతులపై రాళ్ళదాడికి పాల్పడ్డారు. ఢిల్లీ–ఉత్తరప్రదేశ్ సరిహద్దు ఘాజీపూర్‌వద్ద, ఢిల్లీ–మీరట్ ఎక్స్‌ప్రెస్‌వే పై ఉన్న రైతుల పోరాట శిబిరంపై, మధ్యాహ్నం ప్రాంతంలో ఈ ఫాసిస్టు మూకలు బీ.జే.పీ జెండాలు పట్టుకొని గుంపుగా వచ్చి అరుపులు, కేకలతో దాడి చేసారు. ఈ దాడిలో రైతులతోపాటు, రైతు ఉద్యమానికి మద్దతునిచ్చేందుకు వచ్చిన ఇతర పార్టీల కార్యకర్తలు కూడా గాయపడ్డారు. దీంతో కోపోద్రిక్తులైన రైతులు, ప్రతిదాడికి దిగడంతో, ఈ గుండాలు తోకముడిచారు. మోడీ ప్రభుత్వం, ఢిల్లీ సరిహద్దులను, భారత సరిహద్దులకంటే బందోబస్త్‌గా, మూడంచెల బారికేడ్లను నిర్మించి, రైతాంగ ఉద్యమాన్ని క్రూరంగా అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నది.

మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ క్రూర నిర్బంధాన్ని, రైతుఉద్యమకారులు ధీటుగా ఎదుర్కొంటూ, ఉద్యమాన్ని తీవ్రతరం చేసే క్రమంలో, మరింతగా రాటుదేలుతున్నారు. ఎప్పటికప్పుడు సృజనాత్మక పద్ధతుల్లో, నూతన పోరాటరూపాలు చేపడుతున్నారు. మూడు సాగుచట్టాలకు వ్యతిరేకంగా, రైతాంగం నిర్వహిస్తున్న ఈ సమరశీల మహోద్యమానికి, మెజారిటీ ప్రతిపక్ష పార్టీలు అనివార్యంగా మద్దతునివ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ మద్దతు ఎంత అవకాశవాదంతో కూడుకున్నదైనప్పటికీ, ఆయా పార్టీలు ప్రస్తుతం జరుగుతున్న వర్షాకాలపు చట్టసభ(లోక్‌సభ, రాజ్యసభ)ల సమావేశాలలో, మూడు సాగుచట్టాలకు నిరసనగా ఆందోళన చేపట్టి, చట్టసభలను స్తంభింపజేస్తున్నారు. ఈ క్రమంలో, రైతాంగ ఉద్యమ న్యాయబద్ధతకు, దేశవ్యాపితంగా రోజురోజుకు మద్దతు పెరుగుతున్నది.

ఈ పరిణామాలతో బెంబేలెత్తిన మోడీ ప్రభుత్వం, ఒకవైపున రైతాంగ ఉద్యమాన్ని అణిచివేసేందుకు ఫాసిస్టు నిర్బంధాన్ని అమలు జరుపుతూనే, మరోవైపు మోసపూరిత గిమ్మిక్కులకు పాల్పడుతున్నది. గతంలో ప్రభుత్వానికీ, రైతాంగానికి మధ్య జరిగిన చర్చల సందర్భంగా, కేంద్ర వ్యవసాయశాఖమంత్రి రైతాంగ ప్రతినిధులతో, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ (మండి)లను మూసివేయడంలేదని చెప్పాడు. కానీ, వాస్తవంగా మూడు సాగుచట్టాల ప్రకటన వెలువడిన తర్వాత, మెజారిటీ మండీలు మూతపడ్డాయి. మండీలలో పని చేస్తున్న వందలాది మంది ఉద్యోగులు, ఉపాధి కోల్పోయి వీధిన పడ్డారు. ఈ చర్చల సందర్భంగానే, మోడీ ప్రభుత్వం, కనీస మద్దతుధర (ఎమ్.ఎస్.పీ)పై లిఖితపూర్వక హామినిస్తానంటున్నది. ఈ సంవత్సరం రైతాంగం నుంచి, ముఖ్యంగా పంజాబ్ రైతాంగం నుంచి ప్రభుత్వం ఎప్పుడూ సేకరించనంత ఆహార ధాన్యాలను, మద్దతు ధరకు సేకరించిదని ప్రకటనలు చేస్తున్నది. ఈ గిమ్మిక్కులను రైతాంగం ఏ మాత్రం విశ్వసించడం లేదు. చేసిన చట్టాలకే దిక్కులేనప్పుడు, ఇచ్చిన హామీలకు గ్యారంటీ ఏమిటని ప్రశ్నిస్తూ, ఎమ్.ఎస్.పీ విషయంలో కనీసం, చట్టమైనా చేయాలని పట్టుబడుతున్నారు.

ఈ మధ్య, జులై మాసంలో, మోడీ ప్రభుత్వం 'వ్యవసాయ మౌలిక వసతుల నిధి' (ఏ.ఐ.ఎఫ్) పేరిట, ఒక లక్ష కోట్ల రూపాయలను కేటాయిస్తూ రైతులను బురిడి కొట్టించి, ఉద్యమం నుంచి పక్కదారి పట్టించేందుకు ప్రయత్నించింది. ఈ ప్రకటన వెలువడగానే 'సంయుక్త కిసాన్ మోర్చా', ఇది రైతులను వంచించేందుకు చేసిన కేటాయింపనీ, ఈ పథకం కింద రైతులు బ్యాంకు ఋణాలు పొందడం అసాధ్యమనీ, ఇది మరొక 'జుమ్లా' (తమాషా, ఆకర్షణ భాషణం) అని వర్ణించింది.

మోడీ ప్రభుత్వం మూడు సాగుచట్టాల పేరుతో, భారతదేశ వ్యవసాయ రంగాన్ని అంతర్జాతీయ, దేశీయ కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేసేందుకు ఎంత మొండిగా ఉందో, రైతాంగం, భారతదేశ వ్యవసాయరంగంతోపాటు, ప్రజాస్వామ్యాన్నీ, దేశ సార్వభౌమత్వాన్ని రక్షించేందుకు అంతకంటే అనేక రెట్ల వజ్రసంకల్పాన్ని కలిగి ఉన్నది. ఈ మహోద్యమం, భారతదేశంలో, మోడీ ప్రభుత్వం పెంచి పోషిస్తున్న బ్రాహ్మణవాద హిందుత్వ ఫాసిజానికీ, అది సంస్కరణల పేరుతో అమలు చేస్తున్న సామ్రాజ్యవాద అనుకూల నయాఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా, నిజమైన ప్రజాస్వామ్యం కోసం పోరాడమని భారత పీడిత ప్రజానీకానికి సందేశాన్ని ఇస్తున్నది. ఈ మధ్య కాలంలో, మోడీ ప్రభుత్వం 'అభివృద్ధి' పేరుతో నయా ఉదారవాద విధానాల అమలును వేగవంతం చేసింది. ప్రభుత్వరంగ పరిశ్రమలలో వందశాతం పెట్టుబడుల ఉపసంహరణ పేరుతో వాటిని ప్రైవేటీకరిస్తున్నది. ఈ నిర్ణయంలో భాగంగానే విశాఖ ఉక్కును అమ్మివేస్తున్నది. ప్రస్తుతం జరుగుతున్న శీతాకాలపు చట్టసభల సమావేశాలలో, ఈ దిశగా బిల్లులు వేగంగా ఆమోదం పొందుతున్నాయి. ఒకవైపున పెగాసెస్, సాగుచట్టాల వంటి కీలక సమస్యాత్మక అంశాల మీద చట్టసభలలో నిరసనలు వెల్లువెత్తుతున్నా, మోడీ ప్రభుత్వం మందబలంతో ప్రజావ్యతిరేక బిల్లులను ఆమోదింపజేస్తున్నది. ముఖ్యంగా జనరల్ ఇన్సూరెన్స్ బిజినెస్ (జాతీయికరణ) సవరణ బిల్లు – 2021ని, ఆమోదింపజేయడం ద్వారా, ప్రభుత్వ రంగ బీమాకంపెనీల్లో ప్రైవేటు పెట్టుబడి భాగస్వామ్యానికి వీలు కల్పించింది. అత్యవసర రక్షణ సర్వీసుల బిల్లు – 2021పై కూడా ఆమోద ముద్ర వేయించుకుంది. దీంతో రక్షణ రంగంలోని కీలక ఉత్పాదక సంస్థలను, ప్రైవేటీకరించడానికి అవరోధాలు లేకుండా చేసుకుంది. ఘోరమైన విషయమేమిటంటే, రక్షణ ఉత్పత్తుల సంస్థలలో కార్మికుల సమ్మె హక్కును అత్యంత అప్రజాస్వామికంగా రద్దు చేసింది. ఈ ప్రజావ్యతిరేక చట్టాలన్నీ 'అభివృద్ధి' ముసుగులో రూపొందుతున్నాయి. వాస్తవంగా మోడీ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, రూపొందిస్తున్న విధానాలు, చట్టాలు సంక్షోభంలోకి కూరుకుపోయిన ప్రపంచపెట్టుబడిదారీ విధానానికి ఊతమిచ్చేందుకే. సామ్రాజ్యవాదులకూ, దేశంలోని దళారీ బూర్జువా, భూస్వామ్య వర్గాలకు లాభాలు చేకూర్చేందుకే.

గడిచిన 30 ఏళ్ళుగా, దేశ పాలకవర్గాలు అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలతో, పర్యావరణ సంక్షోభం, వనరుల సంక్షోభం వంటి ఆందోళన కలిగించే అంశాలే కాకుండా, ధనికులు, పేదల మధ్య వ్యత్యాసం ఎన్నడూ లేనంతగా పెరిగింది. పేదలకూ, అధిక సంపన్నులకు మధ్య అగాధాన్ని పూడ్చాలన్న, రాజ్యాంగంలోని ఆర్టికల్ 37 కింద పేర్కొన్న విద్యుక్త ధర్మాన్ని, దేశ పాలకవర్గాలు ఎప్పుడో అటకెక్కించేసాయి. ప్రస్తుతం మోడీ ప్రభుత్వం, నయా ఉదారవాద విధానాలను వేగంగా, మొరటుగా అమలు చేస్తూ, ఈ విధానాలకు ఆటంకం లేకుండా చేసేందుకు బ్రాహ్మణవాద హిందుత్వ ఫాసిజాన్ని ఒక రాజకీయ కార్యాచరణగా అమలు చేస్తూ, ప్రజలను విభజించి, పక్కదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నది. తన 'అభివృద్ధి' కార్యక్రమాలను వ్యతిరేకించేవారినందరినీ, జాతీయవాదాన్నీ, దేశభక్తిని ముందుకు తెచ్చి నోరు మూయిస్తున్నది. అమానవీయమైన రాజ్యహింసను అమలు చేస్తున్నది.

దేశంలో కొనసాగుతున్న పై రాజకీయ ధోరణికి పూర్తిగా వ్యతిరేక దిశలో, మరో రాజకీయ ధోరణి కూడా కొనసాగుతున్నది. అది ప్రజా రాజకీయాలకు సంబంధించిన ధోరణి. ఈ ధోరణిలో భాగంగా, దేశవ్యాపితంగా అనేక ప్రజా ఉద్యమాలు, స్పష్టమైన ప్రజాస్వామిక రాజకీయ అవగాహనతో పురోగమిస్తున్నాయి. వీటిలో మూడు సాగుచట్టాలకు వ్యతిరేకంగా జరుగుతున్న రైతాంగ ఉద్యమం, దేశవ్యాపిత స్వభావాన్ని సంతరించుకొంటున్నది. సీ.ఏ.ఏ, ఎన్.ఆర్.సీలకు వ్యతిరేకంగా, తిరిగి ఉద్యమించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. విశాఖ ఉక్కు పరిశ్రమను రక్షించుకొనేందుకు, ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం తమ పోరాట కరవాలాలకు సానపడుతున్నారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న హక్కులను, మోడీ ప్రభుత్వం కాలరాచివేస్తుండటంతో, కార్మికవర్గంలో ఆగ్రహం లావాలా రగులుతున్నది. వారు పోరాట చైతన్యాన్ని తమలో నింపుకుంటున్నారు. దేశవ్యాపిత సాధారణ సమ్మెలలో, వారు ఒక్కటై, తమ పోరాట చేవను ప్రదర్శిస్తున్నారు. ఆదివాసీ ప్రాంతాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఫాసిస్టు దమనకాండకు వ్యతిరేకంగా, ముఖ్యంగా, కార్పొట్ సెక్యూరిటీలో భాగంగా ఏర్పాటు చేస్తున్న పోలీసు క్యాంపులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ, సమరశీలంగా పోరాడుతున్నారు, అనేక త్యాగాలు చేస్తున్నారు. ఇంకా అనేక సెక్షన్ల ప్రజలు, తమ సమస్యల పరిష్కారం కోసం, పోరాటబాట పడుతున్నారు. ఈ పోరాటాలు జరగటమే కాదు, ఒకదానికి మరొకటి సంఘీభావం తెలుపుకుంటున్నాయి, మద్దతునిస్తున్నాయి.

ప్రస్తుతం దేశంలో, ప్రధానంగా పైన చెప్పుకున్న రెండు రాజకీయ ధోరణులు కొనసాగుతున్నాయి. ఈ రెండు రాజకీయ ధోరణులు, దేశంలో నెలకొని ఉన్న వస్తుగత స్థితిని అసాధారణమైన రీతిలో ప్రతిబింబిస్తున్నాయి. అయితే తిరోగామి స్వభావం కలిగిన ప్రభుత్వ విధానాలు, దాని ఫాసిస్టు చర్యలు తప్పనిసరిగా పరాజయం పాలవుతాయి. పురోగామి స్వభావం కలిగిన ప్రజా పోరాటాలు, నిరసన పోరాటాలు తప్పనిసరిగా విజయం సాధిస్తాయి. ఈ విజయం ప్రజాస్వామిక విజయంగా ఉంటుంది. ఈ చారిత్రక గమనాన్ని అర్థం చేసుకుంటూ, దేశంలోని పీడితవర్గాలు, పీడిత సామాజిక సెక్షన్లు వర్తమానంలో జరుగుతున్న పోరాటాలకు మద్దతునివ్వాలి. ముఖ్యంగా మూడు సాగుచట్టాలకు వ్యతిరేకంగా, రైతాంగం నిర్వహిస్తున్న చారిత్రక పోరాటానికి, క్రియాశీలక మద్దతును ఇవ్వాలి. అలాగే ప్రజాపోరాటాలన్నీ అనుసంధానించబడాలి. అవి ఐక్య ఉద్యమాలుగా సంఘటితపడాలి. అందుకు పోరాడే శక్తులన్నీ ఐక్యత కోసం గట్టిగా కృషి చేయాలి. అప్పుడే దేశవ్యాపితంగా ప్రజాఉద్యమ వెల్లువ సృష్టించబడి, నూతన ప్రజాస్వామం దిశగా ముందడుగు వేయగలుగుతాము.

**తేది : ఆగస్టు 7, 2021**

# శత్రువు పురోగమిస్తే, మనం తిరోగమిస్తాం! మన సైన్యాన్ని కొండల్లోనూ, అడవుల్లోను రహస్యంగా వుంచుతాం!

1929 మే లో మావో గెరిల్లా యుద్ధానికి సంబంధించి ముఖ్యమైన 16 సూత్రాల ఫార్ములాను రూపొందించాడు.

*శత్రువు పురోగమిస్తే, మనం తిరోగమిస్తాం;*

*శత్రువు మకాం వేస్తే, మనం చికాకు పరుస్తాం;*

*శత్రువు అలసిపోతే, మనం దాడి చేస్తాం;*

*శత్రువు తిరోగమిస్తే, మనం వెంబడిస్తాం.*

ఆయన రూపొందించిన ఈ 16 సూత్రాల ఫార్ములా గెరిల్లా యుద్ధ నియమాల ప్రాథమిక సూత్రంగాను, అద్భుతమైన ఆయుధంగాను పనిచేస్తుంది. ఈ ఫార్ములా ఏదో ఒక రోజు అకస్మాత్తుగా పుట్టిందికాదు. ఇది మావో అనేక యుద్ధాల సారాంశాన్ని అర్థం చేసుకొని రూపొందించిన సూత్రం. ముందు ఈ 16 సూత్రాల ఫార్ములా ఈ క్రింది విధంగా ఉండేది.

*వాడు పోతే, మనం వస్తాం;*

*వాడు వస్తే, మనం పోతాం;*

*బలమైన శత్రువు నుండి పక్కకు తప్పుకో;*

*బలహీనుడిపై దాడి చేయి;*

*మన శక్తులను రహస్యంగా వుంచు.*

మావో 16 సూత్రాల ఫార్ములా చింకాంగ్ కొండల్లో ఎర్ర సైన్యం స్థావర ప్రాంతం కోసం ప్రధానంగా రూపొందించబడింది. దీని అర్థం ఏమిటంటే? శత్రువు ఆ కొండల ప్రాంతాన్ని వదిలిపెడితే, మనం ఆ ప్రాంతానికి వెళతాం; శత్రువు ఆ ప్రాంతానికి వస్తే, మనం అక్కడి నుండి పక్కకు తప్పుకుంటాం; శత్రువు యొక్క బలమైన పాయింట్లను వదిలివేసి, వాడి బలహీనమైన పాయింట్లవద్ద దాడి చేస్తాం; ఎర్ర సైన్యపు యూనిట్లను రహస్యంగా వుంచి శత్రువు ఊహించని చోట దాడులు చేస్తాం.

"ఎర్రసైన్యపు ప్రాంతాన్ని తెల్ల సైన్యం చుట్టుముట్టినప్పుడు, కఠినమైన టెర్రయిన్‌తో కూడిన పర్వత ప్రాంతాలను ఉపయోగించుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది" అని మావో చెప్పాడు.

చింకాంగ్ కొండలను మావో బేస్ ఏరియాగా ఎందుకు ఎంచుకున్నాడు?

దీనికి జవాబుగా చైనా కమ్యూనిస్టు పార్టీ చరిత్ర పుస్తకాల్లో ఇలా ఉంటుంది. "దీనికి గల కారణాలేమిటంటే: 1. ఈ చింకాంగ్ కొండలు లువాంగ్జియో పర్వతాలకు మధ్యభాగంలో వున్నాయి. అవి దక్షిణాన గ్వాంగ్‌డాంగ్ వరకూ, ఉత్తరాన హుబె వరకూ విస్తరించి జియాంగ్‌జీ, హునాన్ రాష్ట్రాల మధ్య సరిహద్దున వున్నాయి. విప్లవ కార్యకలాపాలు హునాన్, హుబె, జియాంగ్‌జీ రాష్ట్రాల ప్రజలను ప్రభావితం చేస్తాయి. 2. అక్కడ సుసంఘటితమైన పార్టీ సెల్స్ నిర్మాణాలు, విప్లవాన్ని సమర్థించే ప్రజలు, యుద్ధ కార్యకలాపాలలో మంచి అనుభవం గడించిన సాయుధ శక్తి వుంది. 3. చింకాంగ్ పర్వత ప్రాంతాలలో ధాన్యంతో సహా, వివిధ రకాల ఆహార ధాన్యాలను ఉత్పత్తిచేసే గ్రామాలు ఉన్నాయి. చింకాంగ్ పర్వతాలను ఆనుకొని అధిక దిగుబడినిచ్చే సారవంతమైన భూములున్నాయి. ఆ ప్రాంతం నుండి ఎర్రసైన్యం ఆహారాన్ని, డబ్బుని సంపాదించవచ్చు. 4. ఈ చింకాంగ్ పర్వతాలు హునాన్‌లోని చాలింగ్ ప్రాంతానికి, జియాంగ్‌జీలోని సుచువాన్, నిన్‌గాంగ్, యాంగ్‌జిన్ మరియు లియాన్‌హువా ప్రాంతాలలో విస్తరించి వున్నాయి. నిన్‌గాంగ్ మధ్యప్రాంతంలో ఉండగా, ఈ పర్వతాలు 250 కి.మీ చుట్టుకొలతతో, 40కి.మీ పొడవు-వెడల్పుతో వ్యాపించి వున్నాయి. ఈ పర్వతాల్లోకి పోవటానికి ఎత్తైన చెట్లతో కూడుకొని ఉన్న 5 సన్నని ఇరుకైన మార్గాలు మాత్రమే ఉన్నాయి. అక్కడున్న టెర్రెయిన్ ఎర్రసైన్యానికి బలమైన శత్రువును ఎదుర్కొనేందుకు అనుకూలంగానూ, శత్రువు దిగ్బంధనాలను తిప్పికొట్టి స్వతంత్రంగా స్థావర ప్రాంతాన్ని కొనసాగించడానికి వీలుగాను వుంటుంది".

ఇదే ప్రశ్నకు జవాబుగా కొమింగ్‌టాంగ్ ప్రచురించిన చరిత్ర పుస్తకంలో కూడా ఈవిధంగా వుంది: "ఎర్రబంధిపోటు దొంగలు భౌగోళిక ప్రాంతపు అనుకూలతను ఉపయోగించుకొని ఆ ప్రాంతంలో

చురుకుగా వున్నారు. దక్షిణ జియాంగ్జీ ప్రాంతం గ్యాన్‌నది వరకూ వ్యాపించి సముద్ర మట్టానికి ఈ పర్వతాలు 700 నుంచి 800 మీటర్ల ఎత్తు కలిగి వున్నాయి. ఆ పర్వతాలలో సుదీర్ఘకాలపు వర్షపు నీటి కోతవలన ఏర్పడిన లోతైన, పొడవైన పగుళ్ళు దారులుగా ఏర్పడ్డాయి. పర్వత అగ్రభాగాన సమతలమైన, సారవంతమైన భూములు, విస్తారమైన వర్షపు నీటితో కూడిన అందమైన చెరువులు వున్నాయి. దాడులు చేయడానికి ఎత్తైన కొండలు, దట్టమైన అడవులు కష్టతరంగా వుంటాయి. బందిపోట్లు ఆ ప్రాంతంలోని దారులను వదిలిపెట్టి లోతట్టు ప్రాంతాల్లో స్థావరాలను ఏర్పాటు చేసుకున్నారు. జియాంగ్జీలోని బందిపోట్ల స్థావరాలు కొమింగ్‌టాంగ్ దాడులుకు ఆటంకంగా ఉన్నాయి. ఆ ప్రాంతం ఆర్థికంగాను స్వయంసంపూర్ణంగా వుంది. చింకాంగ్ మరియు డోంగ్‌లలోని బందిపోట్ల స్థావర ప్రాంతం ప్రమాదకరమైన టెర్రయిన్‌తో కూడి ఉంది. బందిపోట్లు దాడులలో ఓడిపోయిన ప్రతిసారి ఈ స్థావరాల్లోకి తిరోగమిస్తూ, వ్యూహాత్మక ప్రాంతంలో వుండి బయట నుండి వచ్చిన దాడులను ప్రతిఘటించేవారు".

ఆ చింకాంగ్ పర్వత ప్రాంతాన్ని మావో విప్లవ స్థావర ప్రాంతంగా మార్చినప్పుడు ఎలావుంది? కమ్యూనిస్టు చరిత్ర పుస్తకాలు దీని గురించి ఈ విధంగా చెప్పాయి. "ఆ ప్రజలను ఐక్యం చేసి స్థానిక శత్రువులను నిర్మూలించారు. భూములను పంచి కార్మికుల, రైతుల రాజ్యాన్ని స్థాపించారు". కొమింగ్‌టాంగ్ చరిత్ర పుస్తకాలు దీని గురించి వివరమైన రిపోర్టులు వ్రాసాయి: "దక్షిణ జియాంగ్జీలో ఎర్ర బందిపోట్లు కొన్ని సంవత్సరాలలో నిలదొక్కుకున్న తర్వాత సాగుభూముల సరిహద్దులను తొలగించడమే కాకుండా, ఆ ప్రాంతపు టెర్రయిన్‌లో మార్పులు చేసారు. (భూములను విభజించినప్పుడు పాత యజమానుల భూములకు సంబంధించిన సరిహద్దులను ధ్వంసం చేసారు). పర్వతాలనూ, నదులను మినహా, మిగతా ప్రాంతాన్నంతా తమకు అనుకూలంగా మార్చుకున్నారు. పర్వతాలలో దారులను కూడా మార్చివేసారు. రెండు గ్రామాల మధ్య ఉపయోగిస్తున్న దారులు కూడా ఇప్పుడు దట్టమైన పొదలతో నిండిపోయాయి. పాత సందులు, చిత్తడినేలలు, సన్నని కాలిబాటలతో అనేక ఆటంకాలు ఏర్పడాయి. సైన్యానికి ప్రయాణంలోనూ, యుద్ధసమయంలోను మిలటరీ మ్యాపులు చాలా ఉపయోగపడతాయి. అయితే ఆ సైన్యం పాత మిలటరీ మ్యాపులను గనుక అనుసరించినట్లుయితే నష్టాలకు గురికాక తప్పదు".

పై విధంగా మావో చింకాంగ్ పర్వత ప్రాంత టెర్రయిన్‌లో, మార్చడానికి వీలున్న ప్రతిదాన్ని మార్చివేయటంతో కొమింగ్‌టాంగ్ మిలటరీ అధికారులు పాత మిలటరీ మ్యాపులను పట్టుకుని పోయి నష్టాలకు గురయ్యారు.

కొమింగ్‌టాంగ్ సైన్య అధికారులను కించపరచాలనే ఉద్దేశం ఈ పుస్తక రచయితకు లేదు. చాంగ్‌కైషేక్ ఈ విధంగా చెప్పాడు. "పెద్ద యుద్ధాన్నైనా చెయ్యొచ్చుకాని ఎర్రబంధిపోట్లను నిర్మూలించడం చాలా కష్టం. వారికి స్థానిక టెర్రయిన్ బాగా తెలుసు. వారికి మద్దతునిచ్చేలా ప్రజలును వొత్తిడి చేస్తారు. బలమైన శక్తి మీద దాడి చేయకుండా బలహీనమైన దానిపై దాడి చేస్తారు. ప్రభుత్వ బలగాలు వారి వెంటపడి అలసిపోయి ఏ విధమైన విజయాన్ని సాధించలేకపోయాయి".

చింకాంగ్ కొండల్లో మావో ప్రారంభించిన ఉద్యమం క్రమంగా వేగం పుంజుకోవడంతో చాంగ్‌కైషేక్ కూడా అప్రమత్తమయ్యాడు. అయితే ఆ ఉద్యమం ఎటువంటి ఓటములు లేకుండా సాగిందా? లేదు. "1928 జులైలో కమ్యూనిస్టు పార్టీలోని అత్యున్నత స్థానంలో ఉన్న కొంత మంది "అతివాదులు" కొన్ని వాదనలు ముందుకు తెచ్చారు. "పెటీ బూర్జువాలు విప్లవంలో చేరాలంటే ముందుగా వారి ఆస్తులను స్వాధీనం చేసుకోవాలి". వారికి యుద్ధరంగంలో ఎలా యుద్ధం చేయాలో తెలియదు. కానీ ఆజ్ఞలు జారి చేయడానికి మాత్రం ఇష్టపడతారు. మావో యాంగ్‌జిన్ ప్రాంతానికి వెళ్ళినప్పుడు కొంతమంది అతివాద నాయకులు నాలుగో ఎర్రసైన్యాన్ని తీసుకెళ్ళి హూనాన్ దక్షిణ ప్రాంతంలోని చెంజు పట్టణం మీద దాడికి ప్లాన్ చేసారు. ఈ యుద్ధానికి నాయకత్వం వహించిన 29వ రెజిమెంట్ ఓటమికి గురికాగా, సగానికి పైగా ఎర్రసైన్యం నష్టపోయింది. ఈ "అతివాదుల" విధానాల ఫలితంగా మధ్యస్తంగా ఉండే ప్రజలు శత్రువువైపు పోయారు. పేద రైతువర్గం ఒంటరివాళ్లయ్యారు. ఎర్ర ప్రాంతాల్లోని చాలా పట్టణ ప్రాంతాలను కొమింగ్‌టాంగ్ ఆక్రమించింది.

కొమింగ్‌టాంగ్ దాడులకు మావో ఆందోళనకు గురికాకుండా పరిస్థితిని సరిగ్గా అంచనా వేసాడు. 28, 29వ రెజిమెంట్‌లు హునాన్ దక్షిణ ప్రాంతానికి పోతున్న సమయంలో 31వ రెజిమెంటుకు చెందిన రెండు బెటాలియన్ల బలగాలను తీసుకొని యాంగ్‌జిన్ ప్రాంతానికి వెళ్లి జీయాన్ నుండి వచ్చే శత్రు బలగాలను అడ్డుకునే ప్రయత్నం చేశారు.

ఈ యుద్ధంలో అనుసరించిన ఎత్తుగడల గురించి మావో ఈ విధంగా చెప్పాడు.

"అన్నివైపులా గెరిల్లాయుద్ధాన్ని చేయడం"

"విశాల ప్రజానికాన్ని అంటిపెట్టుకొని ఉండడం"

ఇంకా ఆయన ఇలా అన్నాడు, "మనం 'అన్నివైపులా గెరిల్లాయుద్ధం' అనే పద్ధతిని అనుసరించడం వలన 11 రెజిమెంట్ల శత్రుబలగాలను ఓడించి 25 రోజులు యాంగ్‌జిన్ పట్టణానికి 15 కి.మీ దూరంలో శత్రువుని కదలనీయకుండా చేసాం."

# భారతదేశ చరిత్రలో వర్గాలు-వర్ణాలు-కులాల మధ్య సంబంధం

**ఈ వ్యాసం 'భారతదేశంలోని కుల సమస్య - మన దృక్పథం' అనే దస్తావేజు నుంచి తీసుకోబడింది. ఈ దస్తావేజుని సి.పి.ఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ జనవరి 2021లో, తన అధికారిక దస్తావేజుగా విడుదల చేసింది. ఈ దాస్తావేజులోని 4వ అధ్యాయాన్ని ఈ సంచికలో ప్రచురిస్తున్నాం.** ***-(తెలుగు దస్తావేజు 55పేజి నుంచి 60వ పేజి వరకు)***

నూతన ప్రజాస్వామిక విప్లవ వ్యూహం, ఎత్తుగడల రీత్యా, వర్గం-కులం మధ్యగల సంబంధాన్ని గురించి సైద్ధాంతికంగా సరియైన అవగాహన కలిగి ఉండడమనేది అత్యంత ప్రాముఖ్యత కలిగిన అంశం. అందువల్ల మనం, మొదటి మూడు అధ్యాయాలలో వేర్వేరు సామాజిక దశలలో వర్గాల-వర్ణాల-కులాల పుట్టుక, అభివృద్ధి, పరివర్తనల గురించి వివరించిన నేపథ్యంలో వాటి మధ్య ఉన్న సంబంధాన్ని పరిశీలిద్దాం. అలాగే నేటి సమాజంలో ఉన్న ఈ సంబంధాన్ని కూడా నిర్దిష్టంగా విశ్లేషిద్దాం.

**సింధూలోయ నాగరికత కాలం :** భారత దేశంలో ప్రాథమికంగా వర్గాలు క్రీ.పూ. 2000కు ముందు సింధు లోయ నాగరికత కాలంలో ఆవిర్భవించాయి. అయినప్పటికీ, ఈ వర్గాలు స్వజాతి వివాహ పద్ధతి (endogamous) కలిగిన వారసత్వ గుంపులుగా ఉన్నాయనే సమాచారం లేదు. అందువల్ల కులాలు, లేదా కులాల వివిధ రూపాలను వేద-పూర్వ కాలంలో గుర్తించలేము.

**వర్ణాశ్రమ కాలం :** క్రీ.పూ. 1500-500 సంవత్సరాలలో ఆర్యులు ప్రవేశించిన తరువాతి కాలంలో మాత్రమే మొదటిసారిగా వర్గం అభివ్యక్తీకరణగా వర్ణం కనబడుతుంది. ఆ తదనంతర కాలంలో ఏర్పడిన కులవ్యవస్థకు ఇందులోనే మూలాలు ఉన్నాయి. ఆర్యగణాలు మరియు మూల ద్రావిడ నాగరికతలు-గణాల మధ్య కొనసాగిన ఘర్షణలు, మిశ్రమణాల సుదీర్ఘ క్రమం ద్వారానూ, బంధుత్వాల సంబంధాలు తెగిపోవడం వల్లనూ, వ్యవసాయం అభివృద్ధి చెందడం వల్లనూ ఆ కాలంలో వర్గాల యొక్క నిర్దిష్ట రూపాలుగా వర్ణాలు ఆవిర్భవించాయి. నేడు మనకు కనపడుతున్న కులాల లాగానే అప్పటి వర్ణాలు లేనప్పటికీ సామాజికాభివృద్ధి క్రమంలో అవి వాటి ఆవిర్భావానికి దారితీశాయి.

క్రీ.పూ. 7వ శతాబ్ద ప్రాంతంలో వర్గాలుగా ఉన్న రెండు అగ్ర(పీడక)వర్ణాలైన క్షత్రియులు, బ్రాహ్మణులపై ఆధారపడి తెగల ప్రభు కూటమి (tribal oligarchy) ఏర్పడింది. ఇది వైశ్యుల (విశ్)ను, శూద్రులనూ నియంత్రించింది. రాజ్యం ఇంకా అస్తిత్వంలోకి రావలసి ఉండినప్పటికీ నియంత్రణను, ప్రవర్తనా నియమావళినీ వర్ణాశ్రమ ధర్మం అందించింది. ఈ విధంగా వర్గమూ, వర్ణమూ ఈ కాలంలో కలిసిపోయే ఉన్నాయి.

**తొలి ఫ్యూడల్ రాజ్యం :** అయితే సుమారు క్రీ.పూ. 500 సంవత్సరాల నుండి ఫ్యూడలిజాన్ని పోలిన రాజ్యం ఆవిర్భవించి, అభివృద్ధి చెందడంతో, వర్గమూ, వర్ణమూ మధ్య సంబంధం కూడా మార్పు చెందింది. వివిధ వర్ణాలలో వర్గ విభజన మొదలైంది. బ్రాహ్మణులు పరిపాలనా విధులను నిర్వహించడమేకాక వర్తకులుగానూ పరివర్తన చెందారు. వైశ్యులలో వర్తకులుగా, సంపన్న భూస్వాములుగా (wealthy land owners), చేతివృత్తికారులుగా ఏర్పడినారు. వ్యవసాయ కూలీలుగా మారడం వలన శూద్రుల లక్షణాలలో కూడా మార్పు వచ్చింది. అలా గత కాలంలో ఉన్నంత సన్నిహిత సంబంధం వర్ణాలు-వర్గాల మధ్య లేదు. ఈ తొలి ఫ్యూడల్ రాజ్యంలో పాలకవర్గాలుగా ఉన్నది క్షత్రియులు, బ్రాహ్మణులు మరియు వైశ్య వర్గంలోని పైస్థాయికి చెందినవారు. ఆ విధంగా వైశ్యులలోని ఒక సెక్షన్ పాలక వర్గంలో భాగం కాగా, మరో సెక్షన్ పాలిత వర్గంలో కలిసిపోయింది.

గుర్తుంచుకోవాల్సిన మరో అంశం ఏమంటే ఈ వర్ణవ్యవస్థ అప్పటికి ఇంకా కులవ్యవస్థగా మార్పు చెందలేదనేది. ఒక వర్ణం నుండి మరో వర్ణానికి మారడం కొంతమేరకు సాధ్యమయ్యేది. ఆ తరువాత దశలో మాత్రమే కులాలు ఏర్పడి, విస్తరిస్తూ సంఘటితమయ్యాయి.

**బ్రాహ్మణీయ కుల ఆధారిత ఫ్యూడలిజం :** సుమారు క్రీ.శ. 4వ శతాబ్దం నుండి అస్తిత్వంలోకి వచ్చిన కుల-ఆధారిత ఫ్యూడల్ విధానంతో భారతదేశంలో కులవ్యవస్థ అనేది ఏర్పడింది. ఫ్యూడలిజం విస్తరించేకొలదీ, తెగలను స్వజాతి వివాహ (endogamous)-వృత్తి ఆధారిత కులాలుగా స్వయం పోషక గ్రామ సముదాయాలలో ఇముడ్చుకున్నారు. వారు శూద్రులుగానో లేదా పెరుగుతున్న అతి-శూద్రులు (అంటరానివారు)గానో పరిగణించబడ్డారు. పట్టణాలకు పరిమితమైన వైశ్యులలోని చిన్న సెక్షన్ వర్తకవర్గంగా కొనసాగగా,

ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో జీవిస్తున్న అత్యధికులు శూద్రులుగా గుర్తించబడ్డారు. విదేశీ ఆక్రమణదారులకు మరియు కొత్తగా పాలకవర్గాలలో చేరిన మునుపటి శూద్రులకు క్షత్రియకులం స్థాయి కల్పించబడింది. బ్రాహ్మణులు పురోహిత విధులను నిర్వహించడంతో పాటు భూస్వాములుగా తమ స్థానాన్ని పటిష్టపరచుకొన్నారు.

అనేక కులాలు వృద్ధిచెంది స్వయం-పోషక గ్రామ ఆర్థిక వ్యవస్థలో స్వజాతి వివాహ పద్ధతిని కలిగి విడిగా వృత్తి చేసుకుంటూ, సంఘటితమైనది ఈ కాలంలోనే. ఒక వ్యక్తి గుర్తింపుకుగానీ, సాంఘిక, ఆర్థిక అంతర్ సంబంధానికి గానీ ఈ కులాలే ప్రధాన యూనిట్‌గా వ్యవహరించాయి. ఫ్యూడలిజం వృద్ధి అయ్యే క్రమంలో పెరిగిన అసంఖ్యాక కులాలు అంతకు ముందటి దశలోని వర్ణాల కంటే భిన్నమైనవి. అయితే వాటిని పాలకవర్గాలు వర్ణాశ్రమ ధర్మ చట్రంలో బిగించాయి. అంతేకాక కొత్తగా పాలకవర్గాలలో భాగమైనవారికీ, నూతన ఆవిష్కరించిన 'వర్ణ సంస్కరణ' సిద్ధాంతానికి అనుగుణంగా తగిన స్థాయిని కల్పించారు. అలా వర్ణాలనేవి స్వజాతి సంబంధ గుంపులుగా వ్యవహరించడమనేది అంతమై, బదులుగా వాస్తవంలో స్వజాతి వివాహ పద్ధతి కలిగి వృత్తుల గుంపులుగా ఉన్న ఒక్కో కులం యొక్క స్థాయిని సూచించేవిగా మారాయి.

వర్గము-కులం మధ్య సంబంధం ఆ విధంగా ఈ కాలంలో చాలా వరకు పునఃప్రతిష్టించబడి బలపడింది. కులవ్యవస్థ మరింత కట్టుదిట్టం కావడం వలన, ఒక కులానికి చెందిన సభ్యులు వారికి కేటాయించని మరో వృత్తికి మారడాన్ని నిరోధించే విధంగా ఖచ్చితమైన కట్టుబాట్లను అమలులోకి తెచ్చారు. ఆ విధంగా, ఒకరి కులము, వృత్తి అంటే ఉత్పత్తి సంబంధాలలో వారి స్థానం అనేది పుట్టుకతోనే నిర్ధారించబడి మరణం వరకూ ఏ మార్పు లేకుండా కొనసాగేది. ఒక నిర్దిష్ట వర్గం, ఉదాహరణకు రైతాంగం, వివిధ కులాలను కలిగి ఉండేది కానీ ఒక కులం మాత్రం ఎప్పటికీ ఒకే వర్గంలో, ఉదాహరణకు గ్రామసేవకుడు, వ్యవసాయ కూలీలు, చేతివృత్తికారులు, రైతు, వర్తకుడు, పురోహితుడు, భూస్వామి, దళారీ, అధికారులు వగైరాలలో భాగంగా ఉండేది.

కులానికి, వర్గానికి మధ్య సంబంధం ముఖ్యంగా స్వయంపోషక గ్రామ సముదాయ స్థాయిలో కట్టుదిట్టంగా ఉన్నప్పటికీ, పాలకవర్గాలకు మాత్రం ఇది వర్తించేది కాదు. బ్రాహ్మణులు, క్షత్రియులే ప్రధానంగా పాలకవర్గాలైనప్పటికీ, ఆక్రమణల ద్వారా మిగతా కులాల సభ్యులు కానీ, విదేశీ దురాక్రమణదారులు కానీ పాలకవర్గాల్లో భాగమయ్యేవారు. వీరిలో కొంతమంది (ముఖ్యంగా ఉత్తర భారతంలో) క్షత్రియ స్థాయిని స్వీకరించినప్పటికీ, ఇతరులు తమ పూర్వపు శూద్ర స్థాయిలోగానీ లేదా ముస్లింలుగాగానీ కొనసాగారు. అయినప్పటికీ మొత్తం మీద కులవ్యవస్థలో పెద్దగా మార్పులేమీ రాలేదు. వాస్తవానికి ఫ్యూడల్ దశ అంతటా పాలకవర్గాలు తమ దోపిడీని, వర్గ పరిపాలనను పటిష్టపరచుకోవడానికి కులాన్ని పూర్తిగా ఉపయోగించుకున్నాయి.

**వలస విధానం, అర్ధభూస్వామ్య విధానం :** తమ దోపిడీ, పరిపాలనకనుగుణంగా కులవ్యవస్థను మునుపటి పాలకవర్గాలన్నీ వినియోగించుకొన్న విధానాన్నే వలసవాదులు కూడా కొనసాగించారు. అయితే వలస పాలన కంటే ముందే జరుగుతున్నటువంటి మార్పుల వల్లనూ, 19వ శతాబ్దంలో వలస దోపిడీ, పరిపాలనల మూలంగా ఉద్భవించిన ఆర్థిక మార్పుల వల్లనూ, కుల-ఆధారిత ఫ్యూడల్ వ్యవస్థలో గణనీయమైన మార్పులు సంభవించాయి. నూతన వర్గాల పుట్టుక మరియు వివిధ కులాల మధ్య వర్గవిభజన కులం, వర్గం మధ్య సంబంధంలో మార్పులను కొనితెచ్చాయి. ఈ దశ నుండి కులం, వర్గం మధ్య ఉన్న సమాన (coincided) సంబంధం తగ్గుతూ వచ్చింది.

బ్రిటీషువారు భారతదేశాన్ని వలసగా మార్చుకోకముందు మొగలుల పాలనలో వర్తకము, పట్టణాల వృద్ధి తిరిగి ఉచ్ఛస్థితినందుకున్నాయి. నూతన వ్యాపారవర్గం పుట్టింది. ఈ జాతీయ బూర్జువా వర్గం శైశవదశలో ఉండగానే వలస దోపిడీదార్లచే గొంతు నులమబడింది. బ్రిటీషువారి కాలంలోనే ఆధునిక కార్మికవర్గం పుట్టింది. అలాగే దళారీ బూర్జువా వర్గం కూడా పుట్టింది. సామ్రాజ్యవాదులే దాన్ని పెంచి పోషించారు. రైతాంగంలో కూడా మెల్లగా క్రమక్రమంగా వర్గ విభజన జరుగుతూ వచ్చింది. ఈ కాలం నుండే కులం, వర్గం మధ్య సమాన సంబంధం ఉండడమనేది ఇంకా ఇంకా తగ్గుతూ వచ్చింది. ఎందువల్లనంటే, శూద్రస్థాయి కలిగిన రైతుల, చేతివృత్తుల కులాల వారు ఫ్యాక్టరీ కార్మికులుగా మారారు.

ఒకప్పటి అతిశూద్రులూ, అంటరానివారూ అయిన దళితులను పెద్ద సంఖ్యలో సైన్యంలో, రైల్వేలలో, రోడ్ల నిర్మాణంలో, ఫ్యాక్టరీలలో, నైపుణ్యం లేని పనులలో చేర్చుకున్నారు. దళితులు, ఆదివాసులు గనులలో, ప్లాంటేషన్‌లలో కూడా పనిచేశారు. వీరంతా కలిసి ఆధునిక కార్మికవర్గం ఏర్పడింది.

బ్రాహ్మణులు, క్షత్రియులు, ముస్లింల నుండి, వర్తక కులాలైన వైశ్యుల నుండి, ఒకప్పటి శూద్రుల నుండి కూడా వ్యాపారులు, వడ్డీ వ్యాపారులు ఏర్పడ్డారు.

పారశీలు, జైనులు, ఖట్రియ (అంటే క్షత్రియ కులం), బనియా వంటి వ్యాపార కులాల, మతాల వారి నుండి దళారీ వ్యాపార సంస్థలు ఏర్పడ్డాయి. బ్రాహ్మణుల నుండి, ఒకప్పటి శూద్రకులాల నుండి కూడా కొన్ని వ్యాపార సంస్థలు ఏర్పడ్డాయి.

బ్రాహ్మణులు, కాయస్థులు, ఆంగ్లో ఇండియన్‌లు, పారశీలు, ముస్లింలలోని విద్యావంతులైన ఉన్నత వర్గాలు పాలనా యంత్రాంగంపై ఆధిపత్యం వహించారు.

బ్రిటీషువారు కూడా భూస్వాములు (వతన్‌దారులు లేదా ఈనామ్‌దారులు కానివారు), కౌలుదార్లు, కూలీలు అనే వర్గాలను చట్టబద్ధం చేశారు. జమీందార్లు, ఖోతేదార్లు, తాలూక్‌దార్లు ఎక్కువగా పీడక కులాలకు చెందినవారే. కౌలుదార్లుగా ప్రకటించిన చిన్న భూస్వాములు, ధనికరైతులు ఒకప్పటి శూద్రకులాల నుండి వచ్చినవారు. భూమిలేని రైతాంగం, వ్యవసాయ శ్రామికులలో అత్యధిక భాగం అతిశూద్ర, ఆదివాసి, సంచార తెగలకు చెందినవారు. దారిద్ర్యానికి గురైన శూద్ర రైతాంగంలోని ఒక పెద్ద సెక్షను కూడా భూమిలేని రైతులుగా, కూలీలుగా మారారు.

ఈ దశలో ఆవిర్భవించిన నూతన వర్గాలు అలా అనేక కులాలతో కూడినవిగా ఉండేవి. ప్రత్యేకించి ప్రధానంగా వెనకబడిన కులాల పేదలను, దళితులను తమలో కలుపుకున్న ఆధునిక కార్మికవర్గం జనించింది. అతి ముఖ్యమైన మార్పు ఏమంటే మునుపటి దశలో ఒకే వర్గంగా ఉన్నటువంటి అనేక కులాలు అదే స్థితిలో

కొనసాగకపోవడమే. వర్గవిభజన అనేది కులాలను విభజించి వివిధ వర్గాలుగా విడగొట్టింది. ప్రత్యేకించి శూద్ర కులాలలోని చిన్నవైనప్పటికీ పలుకుబడి కలిగిన సెక్షన్లు పాలకవర్గాల్లో స్థానాలను పొందే స్థితికి చేరుకోసాగాయి. అనేక కులాల్లో కొద్దిపాటి పెటీబూర్జువా సెక్షన్లు ఏర్పడ్డాయి. అలాగే పీడక కులాల్లో కొన్ని సెక్షన్లు కార్మికులుగా మారారు.

అయినప్పటికీ మొత్తంగా చూసినట్లయితే ఉత్పత్తి సాధనాలపై యాజమాన్యం, ఆధిపత్యం కలిగిఉండి పాలకవర్గాల్లో ప్రధాన భాగస్వామిగా ఉన్నది ముఖ్యంగా పీడక కులాల లోని వారే. మరోప్రక్క దళితులలో 90 శాతంకు పైగా వ్యవసాయ కూలీ, పేద రైతులుగానూ, కార్మికులుగానూ ఉన్నారు.

**అర్ధవలస, అర్ధభూస్వామ్య విధానం :** 1947 తర్వాతి కాలంలో భారతదేశంలో, ప్రత్యేకించి గ్రామీణ భారతదేశంలో మరిన్ని మార్పులొచ్చాయి. పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలు విస్తరించడంతో, ప్రజా ఉద్యమాల తాకిడితో అర్ధవలస, అర్ధభూస్వామ్య భారతదేశంలో కులం, వర్గం సంబంధాలు నూతన రూపాలను ధరించాయి. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతంలో బ్రాహ్మణ, క్షత్రియ కులాల ఆధిపత్యం గణనీయంగా క్షీణించింది. ఒకప్పటి శూద్ర వర్ణంలోని పీడక కులాలు ఆ స్థానాన్ని ఆక్రమించాయి. నేటి గ్రామీణ ప్రాంతంలోని పాలక ఉన్నతవర్గాలలో బ్రాహ్మణులు, రాజ్‌పుత్‌లు, భూమిహారులు మొదలైన కులాలవారే గాక లింగాయతులు, వొక్కలిగలు, వెల్లాలులు, కమ్మలు, రెడ్లు, పటేళ్లు, మరాఠాలు, కున్బిలు, జాట్లు, యాదవులు, కుర్మీలు మొదలైనవారు కూడా ఉన్నారు.

అయితే వీరిలో గణనీయమైన భాగం ధనిక, మధ్యతరగతి రైతులు కాగా కొద్దిమంది మాత్రం వ్యవసాయదారులుగా, పేదరైతాంగంగా ఉన్నారు. వెనుకబడిన కులాలలోని దాదాపు సగం మంది వ్యవసాయ కూలీలు, పేద రైతాంగానికి చెందినవారు కాగా, మిగతా వారిలో ఎక్కువ భాగం మధ్య, ధనిక రైతులు, కొద్దిమంది భూస్వాములుగా కూడా వున్నారు. దళితుల్లో అత్యధిక భాగం వ్యవసాయకూలీ భూమిలేని నిరుపేద రైతాంగానికి చెందినవారే. కొద్దిమంది మధ్య రైతాంగానికి చెందినవారు. ఆ పై తరగతికి చెందినవారు అత్యల్పం మాత్రమే. ఈ విధంగా దళితులు ఇప్పటికీ పీడిత వర్గంగానే కొనసాగుతున్నారు.

ఈ విధంగా నేడు వర్గము, కులము మధ్య సమాన సంబంధం మరింతగా తగ్గింది. దాదాపు అన్ని కులాలు అనేక వర్గాల పొందికగా మారాయి. కుల ఆధారిత ఫ్యూడలిజం బలహీనపడినప్పటికీ, ఇంకా అస్థిత్వంలో ఉన్న అర్ధభూస్వామ్య సంబంధాల వల్లనూ, ఈ సంబంధాలను కొనసాగించడంలో పాలకవర్గాలకూ, సామ్రాజ్యవాదులకూ ఉన్న ప్రయోజనాల దృష్ట్యా కులవ్యవస్థ నూతన రూపాలలో ఇంకా ఘనీభవిస్తున్నది.

పాలకవర్గాల యొక్క ఎన్నికల రాజకీయాల అవసరాలు, హిందూ మతోన్మాదుల పెరుగుదల కులవ్యవస్థకు వివిధ రూపాలలో కొత్త ఊపిరినిచ్చింది. కులవ్యవస్థను ఉపయోగించుకొని తమ నాయకత్వాన కులాలపై ఆధారపడిన బహువర్గ సంస్థలను నిర్మించడానికి పాలకవర్గాలు ప్రయత్నిస్తున్నాయి. పెటీబూర్జువా నాయకత్వంలో కొన్ని పీడిత కులాల సంస్థలు కూడా అస్థిత్వంలోకి వచ్చాయి. ఈ మొత్తం క్రమం యొక్క సంశ్లేషణ నేడు ఉనికిలో ఉన్న బ్రాహ్మణవాద సిద్ధాంత సారాన్ని కింది విధంగా నిర్వచిస్తుంది.

శ్రేణీకృత అసమానత, ఆధిపత్య, పీడనల సిద్ధాంతం బ్రాహ్మణిజం. ఇది స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వాలను నిషేధిస్తుంది. దీని మూలాలు వేల సంవత్సరాల క్రితపు వేద కాలంలో ఉన్నాయి. అయితే ఏ దోపిడీ వర్గం ఆవిర్భవించి అధికారం నెలకొల్పుకుంటే, ఆ వర్గ అవసరాలకు తగిన విధంగా దాన్ని పునర్నిర్మించడంతో నిలదొక్కుకుంటూ వచ్చింది. ఇవాళ బ్రాహ్మణిజం భారతదేశ దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య పాలకవర్గాలలో సమస్త సెక్షన్ల ప్రాపంచిక దృక్పథానికీ, విలువ వ్యవస్థకూ కేంద్రకంగా ఉన్నది. దానిలో వున్న శ్రేణీకృత ఆధిపత్యం, న్యూనతల దృక్పథం హెచ్చుతగ్గులతో ప్రతీ కులపర, మతపర సమూహాన్ని కాపాడుతున్నది, ప్రభావితం చేస్తున్నది. ఇది భారత సమాజంలో ప్రతీఘాతుక విలువలనూ, సంబంధాలను పెంచి పోషిస్తున్నది.

బ్రాహ్మణిజం శారీరక శ్రమను చులకనగా చూస్తుంది. కులవ్యవస్థ దళితులను అమానవీయ బ్రాహ్మణీయ భావజాలంపై ఆధారపడి ఏర్పడిన దుర్భర పరిస్థితులకు నెడుతూ కుల ప్రాతిపదికన శ్రామికులను విడదీస్తుంది. మహిళా వ్యతిరేక దృక్పథం, పీడక సంబంధాలు, అలవాట్లు ఈ సిద్ధాంతంలో విడదీయరాని అంశాలు. ఇది ఆదివాసీ ప్రజల పట్ల ఆధిపత్యాన్ని, ద్వేషాన్ని, జాతుల పట్ల వివక్షను, మతమైనారిటీలపై ముఖ్యంగా ముస్లింలపై మతోన్మాదపూరిత శతృత్వాన్ని ప్రోత్సహిస్తుంది. భారత రాజ్య ప్రతిఘాతుక 'జాతీయ సమైఖ్యత'కు ఇది సైద్ధాంతిక ఆధారం కల్పిస్తుంది. భారతదేశంలో అసంఖ్యాక జాతుల స్వయం నిర్ణయాధికార న్యాయమైన హక్కులను ఇది నిరాకరిస్తుంది. దీని భావవాదం అత్యంత ఘోరమైన మూఢనమ్మకాలను, నిర్హేతుకమైన ఆలోచనలను కలిగిస్తుంది. ప్రధానంగా పుట్టుకతోనే గొప్పవాళ్ళు, అల్పులు అనే తారతమ్యాన్ని సృష్టిస్తుంది.

ఈ నేపథ్యంలోనే కుల అణచివేతను ప్రతిఘటిస్తూ, కుల వ్యవస్థను రూపుమాపే ప్రత్యామ్నాయ కార్యక్రమాన్ని కార్మికవర్గ పార్టీ రూపొందించుకుంటుంది.

నూతన ప్రజాస్వామిక విప్లవ దశ నుంచి కమ్యూనిజానికి సోషలిజం గుండా ప్రయాణం చేసే క్రమమంతటిలో కార్మికవర్గ పార్టీ నేతృత్వంలో జరిగే విప్లవంలో అన్ని దశలలోనూ ఈ ప్రమాదకరమైన సిద్ధాంతాన్ని ఎండగట్టి, భావజాల రంగంలో పెళ్ళగించడానికి శక్తివంతమైన పోరాటాన్ని నిర్వహిస్తుంది. భావజాల రంగంలో బ్రాహ్మణవాద వ్యతిరేక పోరాటాన్ని, బూర్జువావర్గ వ్యతిరేక పోరాటాన్ని స్థిరంగా చేపట్టడం ద్వారానే కార్మికవర్గ పార్టీ తన వర్గచైతన్యాన్ని మరింతగా పెంపొందించుకుంటూ విశాల ప్రజారాశుల చైతన్యాన్ని పెంపొందిస్తూ విప్లవానికి ప్రభావవంతంగా నాయకత్వ పాత్ర వహిస్తుంది.

బ్రాహ్మణవాద భావజాల వ్యతిరేక రాజకీయ పోరాటాల వివిధ స్రవంతులలో కులనిర్మూలన కోసం జరిగే పోరాటం అత్యంత ముఖ్యమైనది. ఎందుకంటే భారత సమాజంలో ఇది ఉత్పత్తి సంబంధాలతో విడదీయరాని భాగంగా ఉంటూ ఉపరితలంలో ఆధిపత్య పాత్ర వహిస్తున్నది. తరువాతి అధ్యాయాల్లో దీని గురించి చూద్దాం.

# శత్రు గూఢాచారి వ్యవస్థ అనుభవం-4

ఈ బులిటెన్‌లో ఎస్ఐబీ నాల్గవ అనుభవానికి సంబంధించి ఏఓబీ సంఘటన గురించి తెలుసుకుందాం. పార్టీ విస్తరణలో భాగంగా 1998 ప్రారంభంలో ఒడిశా రాష్ట్రంలోని రాయగడ జిల్లాలో కొన్ని గ్రామాలూ, ఆంధ్ర రాష్ట్రం విజయనగరం జిల్లాలోని కొన్ని గ్రామాలలో జంఝావతిదళం పని చేస్తుండేది. ఆ ప్రాంతంలో ప్రధానంగా కువ్వి ప్రజలతోపాటు, సుండీ, డోంబు (దళితులు) ప్రజలు నివసించేవారు. స్థానికంగా ప్రజలు, దుకాణదారులు, చిన్న వ్యాపారులు తమ కోసమే పార్టీ పని చేస్తుందని విశ్వసించడమే కాకుండా, పార్టీ అవసరాలను తీర్చేవారు. స్థానిక ప్రజలు పార్టీనైతే స్వాగతించారు కానీ, ప్రజల్లో ఒక సంఘటిత ఓ నిర్మాణ రూపమంటూ ఏర్పడలేదు. ఈ క్రమంలో ఇరుకుబడి (ఒడిశా) అనే గ్రామంలో కృష్ణ అనే సుండి షావుకారి పార్టీ పరిచయాల్లోకి వచ్చాడు. నమ్మకంగా ఉంటూ పార్టీ విశ్వాసాన్ని చూరగొన్నాడు. అతనిపై ఏర్పడిన నమ్మకంలో అప్పుడప్పుడు స్థానికదళం కొన్ని వస్తువులు తెప్పించుకొనేది. ఇలా రెండు మూడు సార్లు పార్టీ అవసరాలను తీర్చాడు. కృష్ణ తన దుకాణంలోకి సరుకులు తేవడానికి రాయగడ టౌన్‌కిగానీ, విజయనగరం జిల్లాలోని పార్వతిపురంగాని వెళ్ళేవాడు.

ఇప్పటివరకు పార్టీ, ప్రజల పరిస్థితినే తెలుసుకున్నాం. ఇక సాయుధ శత్రువు విషయానికొస్తే విజయనగరం జిల్లాలోని కొమరాడ పోలీస్టేషన్‌లో ఎస్ఐగా పని చేస్తున్న గాంధీ అనే పోలీసు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే నియమించబడి, ప్రత్యేకంగా పీపుల్స్‌వార్ పార్టీని అణచివేసే పథకంలో భాగంగా పని చేస్తుండేవాడు. గాంధీ ఎస్ఐబీ డైరెక్షన్‌లో పని చేస్తూ, సరిహద్దు ప్రాంతాలలోని, పార్టీ దళాలలపై ప్రత్యేక నిఘా పెట్టేవాడు. ఈ క్రమంలో విస్తరణలో భాగంగా వెళ్ళిన జంఝావతి దళాన్ని ఎస్ఐ గాంధీ మొదట్లోనే తుడిచేయాలనే లక్ష్యాన్ని ఎంచుకున్నాడు. వాడి ప్లాన్ ప్రకారం గ్రామాలలోకి వెళ్ళి పార్టీ సమాచారాన్ని ప్రజల ద్వారా కనుక్కుంటుండేవాడు. విజయనగరంలోని, పార్వతిపురం పరిసర ప్రాంతాల ప్రజలతో నిరంతరం పార్టీ సమాచారాన్ని సేకరించేవాడు. అనేకసార్లు ఆంధ్రా రాష్ట్రపు గ్రేహౌండ్స్ బలగాలతో నిరంతరమూ ఆ ప్రాంతంలో కూంబింగ్‌లు నిర్వహించేవారు.

పార్టీ కార్యకలాపాలలో భాగంగా జంఝావతిదళం ఏరియాలో డివిజన్ ప్లీనం జరుపుకోవాలని డివిజనల్ కమిటీ నిర్ణయించింది. అందుకు కావాల్సిన ఏర్పాట్లన్నీ స్థానిక దళమే బాధ్యత వహిస్తూ, సరుకులను సమకూర్చడం ప్రారంభించింది. అదే ఏరియాలోని కోపర్‌డంగ్ అనే గ్రామ పరిసరాలలో ప్లీనం నడుపుకోవాలని స్థలాన్ని ఎంచుకున్నారు. వీరు ఎంచుకున్న స్థలం గ్రామానికి కొంత దగ్గరలోనే ఉండటంతో, గ్రామంలోకి ఎవరూ వచ్చినా, క్యాంపు అర్థమయ్యే విధంగా ఉండేది. ఆగస్టు మొదటి వారంలో అనుకున్న దాని ప్రకారం ప్లీనాన్ని మొదలు పెట్టుకున్నారు. పీఎల్‌జీఏ కామ్రేడ్స్ దాదాపు 100 మంది వరకు జమయ్యారు. ప్లీనం నడుస్తున్న సమయంలో వారి అవసరాలలో భాగంగా కొన్ని వస్తువుల నిమిత్తం దుకాణదారుడు కృష్ణకి చెప్పడంతో వెంటనే కావాల్సిన వస్తువులు తెచ్చిపెట్టాడు. 3 రోజుల తేడాతో డోంబు వ్యాపారులు బుట్టలతో వస్తువులను తెచ్చుకొని అమ్ముకోవడం కోసం ఆ గ్రామానికి వచ్చి వెళ్ళారు. మరో రెండు రోజుల తర్వాత ఒక డాక్టర్ టీం ఆ గ్రామంలో సంచరించి వెళ్ళింది. మూడవసారి గొర్రెలను కొనే వ్యాపారులు వచ్చారు. అనుమానం వచ్చి ఈ విషయాలన్నింటిని వెంటవెంటనే కనుక్కుంటున్నప్పటికీ, శత్రువును ఏ విధంగా పసిగట్టాలో అనుభవం లేని స్థానిక ప్రజలు, అంతా సాధారణమేననీ అని చెప్పడంతో, స్థానిక ఏసీతోపాటు మిగతా నాయకత్వం కూడా మామూలే అనుకొని వారి వారి పనులలోకి వెళ్ళారు.

ఈ క్రమంలో ప్లీనం ఐదవ రోజుకు చేరుకుంది. ఆగస్టు 13న రోజులాగానే సెంట్రీలు నడుస్తుండగా, ఉదయం 6 గం॥ సమయంలో ఒక రౌండ్ పెట్రోలింగ్ వెళ్ళివచ్చారు. 8 గం॥లకు పెట్రోలింగ్ మరో రౌండ్ నిర్వహించారు. 'పరిస్థితి అంతా సాధారణంగానే ఉంది' అని చెప్పడంతో చివరి దశలో ఉన్న ప్లీనాన్ని ముంగించుకోవడం కోసం ప్లీనం హాల్‌ల్లో నాయకత్వంతో సహా, వివిధ స్థాయిల కామ్రేడ్స్ సమావేశమయ్యారు. సరిగ్గా సమయం 9 గంటలు కావస్తుంది. ఒక్కసారిగా రాఫిడ్ ఫైరింగ్ ప్లీనం హాలుపై ప్రారంభమైంది. వెంటనే హాల్లో ఉన్న కామ్రేడ్స్ అందరూ పొజీషన్ తీసుకొని ఫైరింగ్ చేస్తుండగా, అప్పటికే ఎల్ఎమ్‌జీలు ఫిట్ చేసుకొని ఉన్న పోలీసు సాయుధ బలగాలు భీకరమైన ఫైరింగ్ చేయడంతో, 13 మంది కామ్రేడ్స్ శత్రువుతో వీరోచితంగా పోరాడి అక్కడికక్కడే అమరులయ్యారు. సుమారు 2గంటలపాటు జరిగిన ఈ ఫైరింగ్‌లో పీఎల్‌జీఏ బలగాల చేతిలో శత్రు బలగాలు నలుగురు చనిపోగా, మరో ఆరుగురికి గాయాలయ్యాయి. అమరులైనవారిలో ముగ్గురు డీవీసీ స్థాయి కామ్రేడ్స్, మరో ఐదుగురు ఏసీ స్థాయి (కమాండర్స్, డిప్యూటీ కమాండర్స్) కామ్రేడ్స్ కాగా, మిగతా ఐదుగురు పార్టీ సభ్యులు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి చెందిన వందలాది మంది గ్రేహౌండ్స్ పోలీసులు ఈ

ఆపరేషన్‌లో పాల్గొన్నారు. పకడ్బందీగా ఎస్ఐబీ ఆధ్వర్యంలో గాంధీ నాయకత్వాన చేపట్టిన ఈ ఆపరేషన్‌లో తమవాళ్ళే 4గురు చనిపోయారనీ, మరో 6గురికి గాయాలయ్యాయనీ, అనుకున్న విజయాన్ని సాధించలేకపోయామని సమీక్షించుకున్నారు. దోపిడీ పాలకవర్గాలు మాత్రం 13 మంది అమరత్వానికి కారకుడైన ఎస్ఐ గాంధీగాడికి సీఐగా ప్రమోషన్ ఇస్తూ, అవార్డులతో సన్మానిస్తూ, సాలూరు టౌన్‌కి బదిలీ చేసింది.

ఘటన జరిగిన కొన్ని నెలల తర్వాత స్థానిక దళం కోపర్‌డంగ్ గ్రామానికి వెళ్ళింది. ఆగస్టు 13న జరిగిన ఎన్‌కౌంటర్ వివరాల కోసం ప్రజలను సమావేశపరిచింది. ఘటన తర్వాత ప్రజలకు, పార్టీని తుడిచిపట్టాలనే శత్రువు పన్నాగం మరింత బోదపడటంతో, తమకు తెలిసిన విషయాలను వివరంగానే పార్టీముందుంచారు. "ఆ రోజు 8గం॥ల ప్రాంతంలో పోలీసు బలగాలు మీరు వేసుకునే డ్రస్సుల లాంటివే వారికి కూడా ఉండటంతో, వాళ్ళను చూసి పార్టీ కామ్రేడ్స్ అనుకున్నాం. పోలీసులేనని నిర్ధారించుకోలేకపోయాం. దాంతో విషయాన్ని క్యాంపుకు చేర్చలేకపోయాం. డోంబు వ్యాపారులతో ఎస్ఐ గాంధీకి ప్రత్యక్ష సంబంధాలు ఉన్నాయి. ప్లీనం జరుగుతున్న విషయాలను మరింత నిర్ధిష్టంగా తెలుసుకోవడం కోసమే డోంబులను పోలీసులే పంపారు. డాక్టర్ టీం కూడా పార్టీ విషయాల కోసమే వచ్చి వెళ్ళింది. గొడ్లను కొనే పేరుతో వచ్చిన చివరి టీంని కూడా పోలీసులే పంపారు. ఈ విషయాలన్నీ మాకు ఆలస్యంగా అర్థమయ్యాయి" అంటూ వారికి తెలిసిన విషయాలను చెప్పారు. ఈ సందర్భంగానే డోంబు వ్యాపారులతో చర్చించినప్పుడు "అమ్మే వస్తువుల కోసం మేము పర్వతాపురం టౌన్‌కి వెళ్ళిప్పుడూ, ఇతర పనులకు వెళ్ళినప్పుడు పోలీసులు పట్టుకొని మమ్మల్ని స్టేషన్‌కి తీసుకెళ్ళి, ఎస్ఐ గాంధీ ఆధ్వర్యంలో ఇబ్బందులకు గురిచేసి, నయానా బయానా లొంగదీసుకున్నాడు. దుకాణదారుడు కృష్ణ మా కన్న ముందుగానే గాంధీ కనుసన్నల్లోనే పని చేస్తున్నాడు. ప్లీనం జరుగుతున్నప్పుడు కృష్ణ మీకు సరుకులు తెచ్చివ్వడం గాంధీకి తెలుసు. కృష్ణ సహాయంతో మీ సమాచారాన్ని మరింత నిర్ధిష్టంగా తెలుసుకోవడం కోసమే, ఇద్దరు పోలీసులు సివిల్‌లో ఊరికి వచ్చి వెళ్ళారు. అంతేకాక మీరున్న డేరా చుట్టూ తిరిగి సెంట్రీ పోస్టులు ఉన్న స్థలాలనూ, మీటింగ్ జరుగుతున్న హాల్‌నూ, వివిధ సెక్షన్స్ డేరాలను ...అన్నింటిని రెక్కీ చేసుకొని వెళ్ళారు. పైసల కోసమే పార్టీ సమాచారాన్ని పోలీసులకు చెప్పాం. మాది తప్పే, ఇంకెప్పుడూ ఇలాంటి ద్రోహానికి పాల్పడం" అంటూ డోంబులు బాధపడ్డారు. విషయాలన్నింటిని సేకరించిన స్థానిక యాక్షన్ టీం కృష్ణని పట్టుకోని, ఇంటరాగేషన్ చేయాలని నిర్ణయించుకొని బయలుదేరింది. ముందుగానే విషయం అర్థమైన ఇన్‌ఫార్మర్ కృష్ణ పరుగు లంకించుకొని పారిపోతుండగా, యాక్షన్ టీం కామ్రేడ్స్ చూసి, వెంటపడి పరుగెడుతూ ఫైర్ చేసి వాడిని ఖతం చేసారు. పార్టీ నిర్ణయంలో భాగంగా నరహంతకుడు గాంధీని ఖతం చేయాలనే తీర్మాణానికి అనుగుణంగా వాడి సమాచారంకై వేటను ప్రారంభించింది.

13 మంది పీడిత ప్రజల ప్రియతమ బిడ్డల రక్తం కళ్ళ జూసి, ప్రమోషన్లు, అవార్డులతో విలాసాలను అనుభవిస్తున్న గాంధీని, పీపుల్స్‌వార్ యాక్షన్ టీం సరిగ్గా మూడు సంవత్సరాల తర్వాత పూర్తి సమాచారాన్ని సేకరించింది. ఈ క్రమంలో కోపర్‌డంగ్ ఎన్‌కౌంటర్‌లో అమరులైన కామ్రేడ్స్ శవాలను కుటుంబాలకు అప్పగించకపోవడంతో, పౌరహక్కులసంఘం వేసిన ఫిటీషన్ కోర్టులో ఇంకా నడుస్తూనే ఉంది. కోర్టుకు హాజరు కావాల్సిన గాంధీ ఏనాడు వెళ్ళకపోవడంతో, మరోసారి పౌరహక్కుల సంఘం అమరుల కుటుంబాల ఆధ్వర్యంలో వివిధ నిరసన రూపాలను చేపట్టింది. గాంధీ కోర్టుకు రాక తప్పని పరిస్థితి ఏర్పడింది.

సాలూరు బదిలీ అనంతరం అక్కడే నివాసం ఉంటున్న గాంధీ వెనకాల సాధారణంగా ఎప్పుడూ 10 మంది వరకు పోలీసులు ఉంటారు. కానీ ఆ రోజు (2001, సెప్టెంబర్) మధ్యాహ్నం 12 గం॥ల సమయంలో అరగంట దూరంలో ఉన్న పోలీస్టేషన్‌కి వెళ్ళి, తన లాయర్‌తో తిరిగి మునిసిపల్ కోర్టుకు బయలుదేరిన గాంధీ, ఒక ఎస్ఐ, ఒక గార్డుతోనే ప్రయాణమై కోర్టులోకి ప్రవేశించాడు. కోర్టులోపల లాయర్లు, జడ్జీ తదితరులు తమ తమ సీట్లలో ఆసీనులై ఉండగా, అప్పటికే అప్రమత్తమై ఉన్న పీపుల్స్‌వార్ యాక్షన్ టీం గాంధీని టార్గెట్ చేస్తూ, ఫైరింగ్ ఓపెన్ చేసింది. విప్లవ ప్రతీఘాతకుడు గాంధీ అక్కడికక్కడే ప్రాణం వదలగా, ఒక గార్డు కూడా మరణించాడు. వీడితోపాటు వచ్చిన ఎస్ఐ వణికిపోతూ టేబుల్ కింద దూరిపోయాడు. గాంధీనే మెయిన్ టార్గెట్ కాబట్టి, యాక్షన్ టీం ఎస్ఐని పసిగట్టలేదు. అకస్మాత్తుగా ఫైరింగ్ శబ్దాలను విన్న లాయర్లు, జడ్జి తదితరులు ఎవరి చాంబర్‌లోకి వారు వెళ్ళి డోర్‌లు మూసేసుకున్నారు. వివిధ ఖైదీల వెనకాల వచ్చిన పోలీసులు, ఇతర పనులపై ప్రొటక్షన్‌గా వచ్చిన మరికొంత మంది పోలీసులు ... అందరూ కోర్టు ఆవరణాన్ని ఖాళీ చేసి మాయమయ్యారు. యాక్షన్ టీం తన పనిని ముగించుకొని గార్డు దగ్గర ఉన్న ఏకే 47, మరో పిస్టల్‌తోపాటు, గాంధీ దగ్గర ఉన్న పిస్టల్‌ను స్వాధీనం చేసుకొని క్షేమంగా అక్కడి నుండి రిట్రీట్ అయ్యింది.

కోపర్‌డంగ్ ఎన్‌కౌంటర్‌కి సంబంధించి పార్టీ సమీక్ష విషయానికొస్తే ఆ ప్రాంతానికి దళం వెళ్ళి చాలా తక్కువ సమయమే (6 నెలలు) అయింది. దీంతో ఆ ప్రాంతంలో పార్టీకి ఇంకా ప్రజాపునాది బలపడలేదు. ప్రజలైతే పార్టీ పట్ల ఎనలేని విశ్వాసంతో ఉన్నారు కానీ, ఎలాంటి నిర్మాణ రూపం ఏర్పడలేదు. సీఐ గాంధీకి ఈ అనుకూలత కలిసొచ్చింది. దీంతో ఎస్ఐబీ డైరెక్షన్‌తో ఈ ఆపరేషన్ చేయగలిగాడు. 'ప్రజాపునాది బలపడకపోవడం ఒక కారణమైతే, డివిజన్ ప్లీనం నిర్ణయించిన స్థల ఎంపిక సరైంది కాదనీ, గ్రామంలోకి వచ్చి వెళ్ళిన అనేక రకాల వ్యక్తుల విషయంలో నాయకత్వం మరింత సీరియస్‌గా ఆలోచించాల్సి ఉండే' అని పార్టీ సమీక్షించింది. మనం కోపర్‌డంగ్ ఘటన తర్వాత, విస్తరణలో భాగంగా విశాల ప్రజల్లోకి వెళ్ళే క్రమంలో, కొత్త ప్రాంతాల్లోకి వెళ్ళినప్పుడు, ముందుగా నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా ప్రజాబలాన్ని కూడగట్టుకోవడమే లక్ష్యంగా పని చేయాలే తప్ప, స్థానిక పునాది పెరగకుండా పెద్ద మీటింగ్‌లను నిర్వహించుకోవడమనేది మన లోపమే. కోపర్‌డంగ్ ఎన్‌కౌంటర్ తర్వాత ఈ అనుభవం మనకు చాలా ఉపయోగపడింది. భవిష్యత్‌లో కూడా గుర్తుంచుకోవాల్సిన ముఖ్య విషయం.

**పత్రికా ప్రకటన**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

**పత్రికా ప్రకటన**

**20 నవంబర్, 2021**

## మోదీ ప్రభుత్వ మెడలు వంచి సాగు చట్టాలను రద్దు చేయించిన భారత రైతాంగానికి విప్లవ జేజేలు

సామ్రాజ్యవాద, బహుళజాతి కార్పొరేషన్ల, భారత దళారీ నిరంకుశ పెట్టుబడిదార్ల ప్రయోజనాలను ఈడేర్చడానికి కేంద్ర ప్రభుత్వం రూపొందించిన సాగు చట్టాల రద్దుకై యేడాది కాలంగా లక్షలాది రైతాంగం ఢిల్లీలో ధర్నా కొనసాగిస్తూ తుదకు విజయం సాధించారు. తమకు ఎదురు లేదని విర్రవీగుతూ, పార్లమెంటులో తమకు గల మెజారిటీతో తాము ఏమైనా చేయగలమనే అహంతో అత్యంత నిరంకుశంగా 2020 సెప్టెంబర్‌లో రూపొందించిన మూడు సాగు చట్టాలను నవంబర్ 2021చివరలో జరుగనున్న శీతాకాల సమావేశాలలో ఉపసంహరించుకుంటామనీ దేశ ప్రధాని నరేంద్ర మోదీ 19 నవంబర్ నాడు ఒక ప్రత్యేక ప్రకటన ద్వార తెలియజేశాడు. ఇది భారత రైతుల పోరాట విజయం. యేడాదికాలంగా ఢిల్లీలో అనేక కష్టనష్టాలకు ఓర్చుకుంటూ తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై ఉద్యమాన్ని కొనసాగించిన అన్నదాతలకు దేశం మొత్తం అండగా నిల్చింది. విదేశాలలోని అనేక శక్తులు, సంస్థలు భారత రైతాంగానికి తమ సంఘీభావాన్ని ప్రకటించాయి. ఆ రకంగా ఈ విజయం దేశ ప్రజలది. నిరంకుశ సాగుచట్టాల రద్దుకై యేడాది కాలంగా పోరాడుతూ దాదాపు 700కు పైగా రైతులు అసువులు బాసారు. వారందరికి ముందుగా మా పార్టీ కేంద్ర కమిటీ విప్లవ జోహార్లర్పిస్తోంది. కేంద్ర ప్రభుత్వ మెడలు వంచి సాగు చట్టాలు ఉపసంహరించుకునేలా చేసిన సందర్భంగా దేశ రైతాంగం 26 నవంబర్‌నాడు విజయ దినం జరుపుకోవలసిందిగా మా పార్టీ పిలుపునిస్తోంది.

మన దేశ చరిత్రలో ముందెన్నడూ లేని విధంగా వందలాది రైతు సంఘాలు సమైక్యమై 'సంయుక్త కిసాన్ మోర్చా'ను ఏర్పర్చుకొని దాని నాయకత్వంలో రాజీలేని ఉజ్వల పోరాటాన్ని కొనసాగించారు. వారి పోరాటాన్ని నిర్వీర్యం చేయడానికి హిందుత్వ శక్తులు అనేక కుట్రలకు పాల్పడినాయి. వారి మీద అనేక దాడులకు పూనుకున్నాయి. అయినప్పటికీ, వారు వాటిని లెక్క చేయకుండా పోరాట మార్గంలో దృఢంగా నిలిచి మోదీ ప్రభుత్వానికి గట్టి బుద్ధి చెప్పారు. కేంద్రంలోని బ్రాహ్మణీయ హిందుత్వ భాజపా ప్రభుత్వం ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలన్నింటినీ మన దేశ ప్రజలు గట్టిగా వ్యతిరేకిస్తున్నారనడానికి ప్రస్తుత రైతాంగ పోరాట విజయం మరో పెద్ద ఉదాహరణ. పోరాటాల ద్వారానే బ్రాహ్మణీయ హిందుత్వ శక్తుల ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టగలమనే విశ్వాసభరిత సందేశాన్ని ఈ పోరాటం మరోసారి ప్రజల ముందుంచింది.

2015లో కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన భూసేకరణ బిల్లును భారత రైతాంగం దృఢంగా వ్యతిరేకించడంతో మోదీ తొక ముడవక తప్పలేదు. అదే విధంగా 2018 మార్చ్‌లో సుప్రీంకోర్టు దళిత ఆదివాసీ అత్యాచార నిరోధక చట్టానికి సవరణ చేయాలనే ఆదేశాన్ని వెలువరించినపుడు దేశ ప్రజలు వీధుల్లోకి వచ్చి హిందుత్వ కుట్రకు వ్యతిరేకంగా తమ ఆగ్రహాన్ని తెలిపారు. ఆ సందర్భంగా పోలీసుల కాల్పులలో 7గురు ప్రాణాలు కోల్పోయారు. ప్రజల ఆగ్రహ జ్వాలల రుచి చూసిన కేంద్రం వెంటనే అలాంటిదేమీ జరుగదని ప్రజలకు హామీ ఇవ్వక తప్పలేదు. మరుసటి సంవత్సరం 2020 ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు దేశ అడవుల నుండి భూముల పట్టాలు లేని ఆదివాసీలను,

గిరాదివాసులను బేదఖల్ చేయించాలని ఆదేశాలు వెలువరించినపుడు దేశం మొత్తం సుప్రీంకోర్టు ఆదేశాన్ని వ్యతిరేకించి ఆదివాసీ ప్రజలతో భుజం భుజం కలిపి పోరాటంలోకి దిగింది. దానితో వెంటనే మళ్లీ కేంద్ర ప్రభుత్వం ఆ ఆదేశాన్ని అమలుకాకుండా నిలపక తప్పలేదు. ఇవన్నీ పోరాటాల ద్వారనే ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోగలుగుతారనే తిరుగులేని తీర్పును ఇస్తున్నాయి. ఆ దారినే దేశ వ్యాప్తంగా మూలవాసులు విస్థాపనకు వ్యతిరేకంగా అడవులను కాపాడుకుందామనే విశాల దృష్టితో *'ఖదాన్ నహీ, అనాజ్'* అంటూ జల్, జంగల్, జమీన్ కోసం ఉద్యమిస్తుంటే ప్రభుత్వాలు అడవులను ఖాకీమయం చేస్తున్నాయి. అది అక్కడి ప్రజల అస్తిత్వ సమస్యగా మారుతుండడంతో దండకారణ్యం, ఝార్ఖండ్, ఒడిశా, తెలంగాణ సహా అనేక రాష్ట్రాలలోని ఉద్యమ ప్రాంతాల ప్రజలు ప్రధానంగా మూలవాసులు నూతన పోలీసు క్యాంపుల వ్యతిరేక పోరాటాలను చేపట్టి తీవ్రతరం చేస్తున్నారు. ఈ రోజు ప్రభుత్వ దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా ఆ మూలవాసుల జీవన్మరణ పోరాటాలకు అండగా నిలువాల్సిన ఆవశ్యకత దేశ ప్రజల ముందుంది.

పోరాటాల ద్వార తమ సమస్యలను పరిష్కరించుకున్న రైతుల, దళితుల, ఆదివాసుల బాటలోనే దేశ కార్మిక వర్గం పోరాటానికి నడుం బిగించాలి. 40 చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి వారి హక్కులను హననం చేసిన మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటాన్ని జరుపాలనీ మా పార్టీ పిలుపునిస్తోంది. దేశ రైతాంగానికి అండగా నిల్చిన ప్రజానీకం, ఇపుడు కార్మికుల పక్షం మరింత గట్టిగా నిలవాలి. బ్రాహ్మణీయ హిందుత్వ శక్తులు రూపొందించిన ప్రజా వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక సీఏఏ చట్టాన్ని ప్రభుత్వం రద్దు చేయాలనీ దేశ ప్రజలు మరోసారి ముందుకు రావాలి. ఘరానా కార్పొరేట్ వర్గాల సులభ వ్యాపారం కోసం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)1,400 చట్టాలను రద్దుచేసిన కేంద్రం దేశంలోని ప్రజాస్వామిక, ప్రశ్నించే గొంతులకు తాళాలు వేయడానికి వినియోగిస్తున్న కాలం చెల్లిన రాజద్రోహ చట్టాన్ని (సెడిషన్ ఆక్ట్), నిరంకుశ ఊపా చట్టాన్ని తక్షణం రద్దుచేయాలనీ, పోరాట రైతులపై మోపిన అన్ని కేసులు వెంటనే ఉపసంహరించుకోవాలనీ ఉద్యమించాలి. ఈ రోజు దేశం హిందుత్వ శక్తుల మహా ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నది. దానికి వ్యతిరేకంగా అన్ని వర్గాల, అన్ని సెక్షన్ల ప్రజలు, విప్లవ ప్రజా సంఘాలు, కార్మికవర్గ సంస్థలు, వామపక్షపార్టీలు సహ కలిసివచ్చే వారందరితో కలిసి ప్రజాసమస్యలపై సమైక్యంగా అన్ని రంగాలలో మిలిటెంట్ పోరాటాలను చేపట్టాలి.

దేశ ప్రధాని మోదీ చేసిన తాజా ప్రకటనతో రైతులు మోసపోకూడదనీ పార్లమెంటులో చట్ట ప్రక్రియ ద్వార తిరిగి 3 సాగు చట్టాలను రద్దు చేసేవరకు గట్టిగా పోరాడాలనీ మా పార్టీ రైతులను జాగృతం చేస్తోంది. యేడాది పోరాట కాలంలో అసువులు బాసిన ప్రతి రైతు కుటుంబానికి కేంద్రం కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలనీ రైతులు డిమాండ్ చేయాలి. మూడు సాగు చట్టాల రద్దుతో ఈ దేశ రైతుల వ్యవసాయ సమస్యలు సమసిపోవు. మన దేశంలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడకుండా ఉండాలంటే వారు మూడు దశాబ్దాలకు పైగా ఎదుర్కొంటున్న ఇంకా అనేకానేక వ్యవసాయ సమస్యల తుది పరిష్కారం కోసం వారు ప్రస్తుత పోరాట స్ఫూర్తితోనే కార్మికవర్గ నాయకత్వంలో మరిన్ని మిలిటంట్ పోరాటాలకు సిద్ధం కావాలనీ మా పార్టీ కోరుతోంది. వ్యవసాయ ప్రధానమైన మన దేశ ప్రజల మౌలిక సమస్యల పరిష్కారానికి వ్యవసాయ విప్లవం జయప్రదం చేయడం మినహా మరో మార్గం లేదు. బ్రాహ్మణీయ హిందుత్వ శక్తుల నయా భారత్ కలలను ధ్వంసం చేయకుండా దేశ ప్రజలకు నిజమైన శాంతి, లౌకికవాదం, ప్రజాస్వామ్యం, స్వావలంబన రవ్వంతైనా మిగలవు.

☛ 26 నవంబర్ నాడు దేశ వ్యాప్తంగా బ్రాహ్మణీయ హిందుత్వ శక్తులపై విజయ దినాన్ని పాటించండి.

☛ దేశ వ్యాప్త విప్లవ ప్రజాసంఘాలు, పీఎల్‌జీఏ ప్రస్తుత రైతాంగ విజయాన్ని ఎత్తిపడుతూ ప్రజలను వారి మౌలిక సమస్యలపై సంఘటిత పోరాటాలలోకి సమీకరించండి.

☛ దేశంలో ఏ రూపంలోనూ బ్రాహ్మణీయ హిందుత్వ పాలక వర్గాల 'నయాభారత్' విధానాలు అమలు కాకుండా అడ్డుకుందాం. సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాల దోపిడీకి వ్యతిరేకంగా నూతన ప్రజాతంత్ర విప్లవ విజయానికై పోరాడుదాం.

**విప్లవాభివందనాలతో,**

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**

# ఆంధ్ర-ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ కమిటీ
# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

***తేది : జులై, 2021***

## విప్లవోద్యమం నుండి దిగజారిన ద్రోహులను అసహ్యించుకుందాం!
## ప్రజలకోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను ఎత్తిపడదాం!
## శత్రు దుష్ప్రచార దాడిని తీవ్రంగా ఎండగడదాం!!

విప్లవ సిద్ధాంతాన్ని ఆమోదించి విప్లవ పార్టీలో చేరడం వేరు, దాని లక్ష్యసాధనలో చివరి వరకూ విప్లవ ఆచరణలో కొనసాగడం వేరు. విప్లవం అంటే విందుభోజనం కాదు, అల్లికలు, కుట్లు అసలేకాదు, చిత్రలేఖనం, సొల్లు కబుర్లు చెప్పడం కాదు. ఒక వర్గాన్ని మరోవర్గం బలప్రయోగం ద్వారా కూలదోయడం, అందుకు సరైన విప్లవ సిద్ధాంతం, పంథా, కఠోరమైన విప్లవ కార్యాచరణ, త్యాగాలు అవసరం. అయితే అది సాదాసీదాగా నల్లేరు మీద బండి నడకలాగా ఉండదు. అనేక మలుపులు, మెలికలు, ఆటుపోట్లు, గెలుపోటముల గుండా ముందుకు సాగుతుంది. అందుకు విప్లవకారులైన ప్రతీవాళ్ళు విప్లవోద్యమ డిమాండ్‌కు అనుగుణంగా తమను తాము తీర్చి మలచుకుంటూ, ఆచరణలో ముందుకు సాగాల్సి ఉంటుంది. విప్లవంలోని ప్రతి మలుపూ, ఆనాటి పరిస్థితులు క్రింది స్థాయి కార్యకర్తల నుండి పై స్థాయి నాయకత్వం వరకూ పరీక్షకు గురి చేస్తాయి. అయితే మా పార్టీలో మెజారిటీ క్యాడర్ వీటిని ఎదుర్కొంటూ, అనేక త్యాగాలు చేస్తూ, విప్లవాన్ని అభివృద్ధి చేస్తూ, విస్తరింపజేస్తూ, పురోగమింప చేస్తున్నారు. అదే సందర్భంలో కొందరు రాజకీయంగా బలహీనపడి విప్లవమార్గంలో ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కొనే చైతన్యాన్ని ప్రదర్శించక, వ్యక్తిగత బలహీనతలను సరిదిద్దుకోలేక స్వార్థంతో, త్యాగ సంసిద్ధతను కోల్పోయి ఉద్యమం నుండి దిగజారిపోవడం కూడా సహజమైనదే. అలాంటి కోవకు చెందిన విశాఖ-ఈస్ట్ డివిజన్ కమిటీ సభ్యుడు సుధీర్‌తోపాటు, మేము పార్టీ నుండి తొలగించిన వంతల వన్నో (మహిత), దీర్ఘకాలంగా వ్యక్తిగత సమస్యలతో సతమతమవుతూ పార్టీలో క్రమశిక్షణా చర్యకు గురైన సోమ్డితోపాటు, మరో ముగ్గురు కొత్త సభ్యులు ఉద్యమాన్ని విడిచి శత్రువు పాదాల చెంత వాలారు. ఆ సందర్భంగా ప్రభుత్వం ఇచ్చే అవార్డులు, రివార్డులకు, కేసుల మాఫీ కోసం, పోలీసు అధికారులు చెప్పినట్లుగా పార్టీకి వ్యతిరేకంగా చిలక పలుకులు పలుకుతున్న ఈ ద్రోహుల మాటలకు, ప్రజల, పార్టీ దృష్టిలో ఎలాంటి విలువ లేదు. అవే విషయాలు వీరు ప్రజల ముందుకు వచ్చి మాట్లాడితే అప్పుడు ప్రజలే నిజాలను నిగ్గుతేల్చుతారు. అదే సందర్భంగా డీజీపీ గౌతంసావంగ్ ప్రజలపై, పార్టీపై చేసే మానసిక యుద్ధంలో భాగంగా, ప్రజలెవరూ నమ్మరు అనే ఇంకితజ్ఞానం లేకుండా ఇప్పుడు ప్రజలకు బాక్సైట్, భూమి, విద్యా, వైద్యం వంటి సమస్యలేమీ లేవనీ, కనుక ప్రజలు పోరాటం చేయాల్సిన అవసరం లేదనీ, మావోయిస్టులే తమ ఉనికి కోసం ప్రజలకు లేని సమస్యలను సృష్టిస్తున్నారనీ, మావోయిస్టులకు ప్రజల మద్దతు లేదనీ, ఉద్యమం బలహీనపడిందనీ, అందుకే క్యాడర్ లొంగిపోతున్నారనీ చాలా అవివేకంగా, హాస్యాస్పదంగా మాట్లాడుతున్నాడు. కనీస సామాజిక స్పృహ లేకుండా చారిత్రక వాస్తవాలను చూడలేని వాడిని రాష్ట్ర డీజీపీగా నియమించడం వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం దౌర్భాగ్యం. ఇతడిని డీజీపీగా నియమించడం కన్నా వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తగా చేర్చుకుంటే బాగుంటుంది.

ప్రజలకు సమస్యలే లేవనీ, పోరాడాల్సిన అవసరమే లేదనడం చాలా అవివేకం. జగన్ రెండేళ్ళ పాలనలో రాష్ట్రం పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయింది. నిరుద్యోగులకు ఎన్నికల్లో హామి ఇచ్చిన 2.30 లక్షల ఉద్యోగాల మాటల అటుంచితే అంగన్‌వాడీలను, ప్రాథమిక పాఠశాలలను విలీనం చేయడం, నూతన విద్యావిధానం వంటి ప్రజా వ్యతిరేక విధానాల వలన ఉన్న ఉద్యోగాలను కూడా కోల్పోయి లక్షలాది మంది నిరుద్యోగులవుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతం కూడా ఇవ్వలేని దౌర్భాగ్య పరిస్థితుల్లో నేడు రాష్ట్ర ప్రభుత్వం ఉంది. మన్యంలో లేటరైట్ పేరుతో కోట్లాది రూపాయల విలువైన సంపదనూ, బాక్సైట్‌ను తరలించుకుపోవడానికి వ్యతిరేకంగా, పోలవరం ప్రాజెక్టువలన భూములు కోల్పోయిన నిర్వాసితులు, తూర్పు గోదావరి జిల్లాలో పోడు భూముల కోసం ఆదివాసీ ప్రజలు విరోచితంగా తెగించి పోరాడుతున్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున కార్మికులు ఆందోళన చేస్తున్నారు. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగం సమరశీలంగా ఉద్యమిస్తున్నారు. అధిక ధరలు, పన్నులకు వ్యతిరేకంగా ఇలా అనేక దైనందిన సమస్యలతో అన్ని సెక్షన్ల ప్రజలు రోడ్లపైకి వచ్చి చేస్తున్న పోరాటాలు గౌతంసావంగ్ లాంటి ప్రభుత్వ తొత్తుల కంటికి కనిపించవు. కరోనా కాలంలో ఆదివాసీ గ్రామాల్లో కనీస వైద్య సౌకర్యాలు కల్పించలేదు. ఎంతో అభివృద్ధి చెందిందని చెబుతున్న పట్టణాల్లో కనీసం ఆక్సిజన్ కూడా అందించలేని దౌర్భాగ్య పరిస్థితుల్లో ప్రజలు పిట్టల్లా రాలిపోయారు, రాలిపోతున్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూని చేయబడింది. మీడియాపైన, ప్రజాస్వామికవాదులపైన, ప్రజాసంఘాలపైన కనీసం భావప్రకటనా స్వేచ్ఛను కూడా లేకుండా అత్యంత క్రూరమైన నిర్బంధాన్ని అమలు చేస్తూ, నియంత పరిపాలన కొనసాగిస్తున్నారు. నిజంగా ప్రజలకు సమస్యలే లేనప్పుడు ఆగస్టు 9న ఆదివాసీ దినోత్సవాన్ని ఆదివాసీ సంఘాలే ఎందుకు బహిష్కరించాయి? మావోయిస్టు పార్టీ ఉనికే

లేనప్పుడూ వేలాది పోలీసు బలగాలను మన్యంలోకి పంపి కూంబింగ్‌లు ఎందుకు నిర్వహిస్తున్నారు? పెద్దఎత్తున పోలీసు క్యాంపులు పెట్టి అక్రమ అరెస్టులనూ, ప్రజలపై దాడులను ఎందుకు చేస్తున్నారు? ఈ ప్రశ్నలన్నింటికీ గౌతం సావంగ్ సమాధానం చెప్పాలి.

ఇకపోతే సుధీర్ లొంగుబాటు పార్టీకి ప్రజల సహకారం లేదనీ, పార్టీలో ఆదివాసీలపై అగ్రనాయకత్వ ఆధిపత్యం, వివక్ష ఉందనీ, అరుణ పెత్తనం చెలాయిస్తుందనీ మాట్లాడాడు. ఇవన్నీ పచ్చి అబద్ధాలేననీ మా పార్టీ క్యాడర్‌కు, ప్రజలందరికీ తెలుసు. మా పార్టీ కేంద్రీకృత ప్రజాస్వామ్యానికి కట్టుబడి పని చేస్తుంది. దీనికి భిన్నంగా అతి ప్రజాస్వామ్యంతో, ఉదారవాదంతో సమిష్టి ప్రయోజనాలకు భంగం కలిగించే వాళ్ళను విమర్శిస్తే వారికి అది నియంతృత్వంగా అనిపించవచ్చు. సుధీర్ పార్టీలో ఉండగా తనను నమ్మిన ప్రజలను, పార్టీనీ, చివరకు తన కుటుంబాన్ని కూడా మోసం చేసి, ద్రోహం చేసి, నిర్బంధానికి భయపడి, నైతికంగా కూడా పతనమైపోయి మహితను తీసుకొని పారిపోయిన వాడికి పార్టీ కోసం, ప్రజల కోసం మాట్లాడే నైతిక హక్కు లేదు. మహిత ఉద్యమంలోకి వచ్చిన తర్వాత స్వార్థంతో, క్రమశిక్షణా రాహిత్యంతో, ప్రజలపై విశ్వాసం కోల్పోయి, నిర్బంధానికి భయపడి పిరికితనంతో గతంలో ఒకసారి పారిపోతే, తన తప్పులను సరిదిద్దుకుని తిరిగి పార్టీలో పని చేస్తానంటే పార్టీ అవకాశం ఇచ్చింది. కానీ మళ్ళీ అవే తప్పులను చేస్తూ, సుధీర్‌తో అక్రమ సంబంధాన్ని కొనసాగిస్తూ, చివరకు అతడితో కలిసి పారిపోయిన మహితకు పార్టీలో పితృస్వామ్యం గురించి మాట్లాడే అర్హత లేదు. వీరిద్దరూ అత్యంత నీచంగా పతనమై, పోలీసుల ముందు లొంగిపోయి మాట్లాడుతున్న మాటలకు విలువలేదు.

ఏసీ సభ్యురాలిగా పని చేసిన సోమ్డి కూడా రాజకీయ బలహీనతతో కొత్తగా వచ్చిన ముగ్గురు సభ్యులకు ఇక్కడి పరిస్థితిని అతిగా చెప్పి, నిర్బంధాన్ని చూపించి భయపెట్టి, అధైర్యపరిచి తనతోపాటు తీసుకుని పోయింది. వీరు నలుగురూ పారిపోతుండగా మధ్యదారిలో పోలీసులకు దొరకడంతో వీళ్ళను కూడా సుధీర్ వాళ్ళతో కలిపి పోలీసులు లొంగుబాటును ప్రకటించారు. వీరంతా లొంగిపోవటానికి గల వాస్తవ కారణాలైతే ప్రధానంగా వారిలో రాజకీయ బలహీనత, స్వార్థం, త్యాగసంసిద్ధత కొరవడటమే.

వీరి లొంగుబాటు సందర్భంగా గౌతం సావంగ్ ఏఓబీ ఉద్యమ పరిస్థితిని అంచనా వేస్తూ, గత 2 ఏళ్ళలో జరిగిన ఎన్‌కౌంటర్లు, అరెస్టులు, లొంగుబాట్లలో క్యాడర్ సంఖ్య తగ్గిపోయిందనీ, ప్రాంతాలు తగ్గిపోయాయనీ, మావోయిస్టులకు ప్రజల మద్దతు, సహకారం తగ్గిపోయిందనీ, కనుక మిగిలిన వారంతా వచ్చి లొంగిపోవాలని పిలుపునిచ్చాడు. ఏఓబీ ఉద్యమం బలహీనపడిన మాట వాస్తవమే. అయితే ఇలాంటి నిర్బంధాలు, దిగజారుళ్ళు, ఆటుపోట్లు ఏఓబీ ఉద్యమానికి కొత్తకాదు. 4 దశాబ్దాల ఏఓబీ ఉద్యమాన్ని వాస్తవికంగా చూసినట్లయితే 1980లో ఒకరు, ఇద్దరు ఆర్గనైజర్లుగా మన్యంలోకి అడుగు పెట్టిన పార్టీ, ఒక్క దశాబ్ద కాలంలో అంటే 1990 నాటికి బలమైన డివిజనోద్యమాన్ని నిర్మించింది. ప్రజలు పెద్దపెత్తున సంఘటితమై పోరాటాలు చేసారు. గ్రామరాజ్య కమిటీలు ఏర్పర్చుకున్నారు. అయితే ఆ ఉద్యమంపై ప్రభుత్వం కొనసాగించిన క్రూరమైన నిర్బంధకాండలో, క్రూరమైన పోలీసు అధికారి డీజీపీ పోతారెడ్డి హయాంలో వందలాది పోలీసు క్యాంపులు పెట్టి, గ్రామాలను తగులబెట్టి, సంఘ నాయకులనూ, ప్రజలను హత్యలు చేసిన నిర్బంధ కాలంలో పార్టీ చాలా నష్టాలను పొంది కేవలం 11 మంది కామ్రేడ్స్ మిగిలారు. అలాంటి కఠిన పరిస్థితుల్లో కూడా ఆ కామ్రేడ్స్ లోపాలను సమీక్షించుకొని, గుణపాఠాలు తీసుకొని, సరైన ఎత్తుగడలను మార్చుకొని, ప్రజలను అంటిపెట్టుకొని ఉంటూ, చేసిన రాజకీయ కృషి వలన మళ్ళీ 2002 నాటికి 200 మంది క్యాడర్‌తో 4 డివిజన్ల ఏఓబీ ఉద్యమంగా విస్తరించి అభివృద్ధి చెందింది. అంటే ఈ చరిత్ర ఏం చెబుతుంది? దెబ్బతిన్నా మళ్ళీ గెలుస్తాం. నిర్బందాలు, అరెస్టులు, లొంగుబాట్లు ప్రజాయుద్ధాన్ని ఆపలేవు. విప్లవోద్యమంలో అనేక కష్టనష్టాలు, ఆటుపోట్లు ఉంటాయి. కానీ ఇవి తాత్కాలికమే. కమ్యూనిస్టులు ఓటమిలో విజయాన్నీ, ప్రతికూలతల్లో అనుకూలతలను పట్టుకుంటారు. భారతదేశంలో నిజమైన ప్రజాస్వామ్యం కోసం, పీడిత ప్రజల రాజ్యాధికారం కోసం జరుగుతున్న ఈ ప్రజాయుద్ధం న్యాయమైనది. ఇది ప్రజలు చేసే యుద్ధం. కనుక వ్యక్తులు కొంత మంది దిగజారిపోయినంత మాత్రానా, సంఖ్యలు తగ్గిపోయినంత మాత్రానా ఉద్యమం ఆగిపోదు. అన్ని సెక్షన్ల ప్రజలు తమ సమస్యలు పరిష్కారం కోసం యుద్ధం చేయక తప్పని అనివార్యమైన, అద్భుతమైన విప్లవ పరిస్థితి నేడు దేశంలోనూ, రాష్ట్రంలోను నెలకొని ఉంది. అందుకే మేము స్టీల్‌ప్లాంట్ ఉద్యమానికి మద్దతునిస్తూ స్టేట్‌మెంట్ ఇస్తేనే గౌతం సావంగ్ ఉలికిపడుతున్నాడు. మా పార్టీ కేవలం మద్దతే కాదు, విజయం సాధించే వరకూ నాయకత్వం అందిస్తుంది. అందుకే నేడు ఉన్న కఠిన పరిస్థితుల్లో సైతం ప్రజలు మా పార్టీని కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. అనేక దాడుల నుండ రక్షించుకుంటున్నారు, శతృవును ప్రతిఘటిస్తున్నారు. అయితే ప్రజాయుద్ధంలో మరింత క్రియాశీలంగా భాగస్వాములై, ప్రజాయుద్ధం అజేయమైనదని నిరూపించాల్సిందిగా ప్రజలకు పిలుపునిస్తున్నాం. విప్లవ ద్రోహులను అసహ్యించుకుంటూ అమరుల త్యాగాలను ఎత్తిపడదాం. ప్రజలే చరిత్ర నిర్మాతలు. అంతిమ విజయం ప్రజలదే.

**విప్లవాభివందనాలతో,**

Ganesh

**గణేష్,**

**కార్యదర్శి,**

**ఏఓబీ ఎస్‌జడ్‌సీ,**

**సీపీఐ (మావోయిస్టు).**

## ఆంధ్ర-ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ కమిటీ
## భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

### మన్యంలో లేటరైట్ ముసుగులో జరుగుతున్న బాక్సైట్ తవ్వకాలను సమరశీలంగా తిప్పికొట్టండి!
### మైనింగ్‌కు వ్యతిరేకంగా ఆగస్టు 10న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా 'బంద్'ను విజయవంతం చేయండి!

విశాఖ జిల్లా, నాతవరం మండలం, సుందరకోట పంచాయితీ పరిధిలోని 'బమిడికలొద్ది'లో 121 హెక్టార్ల విస్తీర్ణంలో ప్రతి సంవత్సరం 10 లక్షల క్యూబిక్ మీటర్ల లేటరైట్‌ను 15 సంవత్సరాలపాటు తవ్వుకునేందుకు జర్తా లక్ష్మణరావు అనే ఆదివాసీకి ఫిబ్రవరిలో ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు, జూన్ 17 నుండి లేటరైట్ తవ్వకాలు ప్రారంభించి అంతా చట్టప్రకారం న్యాయబద్ధంగానే జరుగుతున్నట్లు చూపిస్తూ, ప్రభుత్వం ప్రజలను మోసం చేయాలని ప్రయత్నం చేస్తున్నది. కానీ జర్తా లక్ష్మణరావు కేవలం ప్రభుత్వానికి బినామీ మాత్రమే. ఇది ఒక్క 'బమిడికలొద్ది'లోనే కాదు, విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల మన్యంలో లేటరైట్ పేరుతో జరుగుతున్నదంతా బాక్సైట్ తవ్వకాలే. ప్రభుత్వం, అధికార పార్టీ మంత్రులు, పోలీసు యంత్రాంగం, ఫారెస్టు శాఖ తదితర రాజ్యయంత్రాంగం అంతా కుమ్మక్కై, మైనింగ్ మాఫియాగా ఏర్పడి ఈ లేటరైట్ ముసుగులో వేల కోట్ల విలువైన బాక్సైట్‌ను తవ్వి విదేశాల్లో అమ్ముకోవడానికి కుట్రలు చేస్తున్నారు. ఈ బాక్సైట్‌ను అటవీమార్గంలో తరలించడం కోసం తూర్పుగోదావరి జిల్లా, ఏలేశ్వరం రేంజ్ పరిధిలో భారీ టిప్పర్లు వెళ్లేలా మట్టిరోడ్డును నిర్మించడానికి అటవీ సంరక్షణ చట్టాలనూ, అటవీశాఖ అనుమతులనూ, గ్రామ పంచాయితీ తీర్మాణాలనూ, ఐటీడీఏ నిబంధనలను అన్నింటిని పక్కకు పెట్టేసి, ప్రజల సాగు భూములనూ, లక్షలాది చెట్లను నరికేసి, అడవిని విధ్వంసం చేసి, యుద్ధప్రాతిపదికన 32 అడుగుల వెడల్పుతో రోడ్ల నిర్మాణం చేసారు. చట్టప్రకారం రిజర్వు ఫారెస్టులో గనులు తవ్వకం, రోడ్లు నిర్మాణం చేయడానికి వీలులేదు. కానీ ఇప్పుడారోడ్ల పైన 14టైర్ల టిప్పర్లు దూసుకుపోతూ, రాత్రీపగలూ తవ్వకాలు జరుపుతూ బాక్సైట్‌ను తరలించివేస్తున్నారు. ఈ అక్రమ మైనింగ్ పై ప్రజలు ఆందోళనలు, పోరాటాలు చేయకుండా ఉండేందుకు స్థానిక ఆదివాసీలలో ఒక దళారీ సెక్షన్‌కు డబ్బును ఎర వేస్తున్నారు. నాతవరం మండలంలో 8 గ్రామాలకూ, ఏలేశ్వరం రేంజ్ రౌతులపూడి మండలంలో 5 గ్రామలకు మొత్తం 13 గ్రామాల్లో ఆదివాసీ తెగ పెద్దలకూ, పనులు లేక ఖాళీగా వున్న యువకులకు ప్యాకేజీలనూ, ఉపాధి పథకాలను ప్రకటిస్తూ, ఆదివాసీ ప్రజలలోని ఒక సెక్షన్‌ను చీలదీసి, తమకు అనుకూలంగా మలుచుకొని, మన్యంలో బాక్సైట్‌కు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ఆదివాసీలనే వ్యతిరేకంగా నిలబెట్టి, ఉసిగొల్పే నీచమైన కుట్రలకు పాల్పడుతున్నారు. అంతే కాకుండా అక్కడ జరుగుతున్న మైనింగ్, రవాణా ఇతర అంశాలేవీ బయటకు రాకుండా ఉండేందుకు నర్సీపట్నం, నాతవరం, రౌతులపూడి మండలాల్లోని సోషల్ మీడియాకు చెందిన కొంత మందిని ఈ మైనింగ్ మాఫియా కొనివేసింది. అందుకే అక్కడ జరుగుతున్న ప్రజల పోరాటాలు బయటకు రానీయడం లేదు. ఇక అక్కడ లేటరైట్ ఉందా? బాక్సైట్ ఉందా? వాటికి అన్ని అనుమతులు ఉన్నాయా లేవా? తదితర విషయాలు తెలుసుకోవడానికి ఎన్‌జీటీ(నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్) విచారణ కమిటీ వేసినా, అది ప్రభుత్వపక్షమే వహిస్తుంది అనడంలో సందేహం లేదు.

**ప్రియమైన ప్రజలారా!**

ఎన్నికల్లో ఓట్లకోసమే జగన్ 97 జీవోను రద్దు చేసి, బాక్సైట్‌ను తవ్వనన్నాడు. అధికారంలోకి వచ్చాక 89 జీవోను ముందుకు తెచ్చి తిరిగి బాక్సైట్ తవ్వకాలకు ప్రయత్నించాడు. గత 2 సంవత్సరాల పాలనలో 'నవరత్నాల' పేరుతో బూటకపు సంస్కరణలనూ, పథకాలను ప్రవేశపెట్టి, ప్రజలను మభ్యపెట్టి, నేడు మన్యంలో బాక్సైట్ తవ్వి తీసుకుపోయినా కూడా 'ప్రజలను పోరాడనీయకుండా చేయవచ్చు' అనుకుంటున్నాడు. కానీ మన్యం ప్రజల పోరాట చరిత్ర వీరోచితమైనది. అనన్యమైన త్యాగాలతో ఎన్నో హక్కులను సాధించుకున్న పోరాటచరిత్రను మరువకండి! అల్లూరి వారసత్వాన్ని కొనసాగించండి. అడవిపై హక్కు ఆదివాసీలకూ, పీడిత ప్రజలకే అనే నినాదంతో తిరుగుబాటుకు సిద్ధంకండి. పీడిత ప్రజల రాజ్యాధికారం కోసం మన్యంలో నాలుగు దశాబ్దాలుగా మావోయిస్టు పార్టీ ఎనలేని త్యాగాలను చేసింది. లక్ష్యాన్ని సాధించే వరకూ మరిన్ని త్యాగాలకూ సిద్ధంగా ఉంది. మన్యం నుండి మైనింగ్ మాఫియాను తన్ని తరమండి, అధికార పార్టీ నాయకులను నిలదీయండి, అల్లూరి వారసులుగా మరో మన్యం పితూరికి సిద్ధకండి. అదీవాసీల న్యాయమైన పోరాటానికి అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాల్సిందిగా కోరుతున్నాం. మీ పోరాటానికి ఏఓబీ ఎస్‌జడ్‌సీ నాయకత్వం అందిస్తుంది. నాతవరం, రౌతులపూడి మండలాల్లోని ఆదివాసీ ప్రజలు ప్రభుత్వం ఎర వేస్తున్న ప్యాకేజీలకు లొంగిపోకుండా, చీలిపోకుండా ఐక్యంగా, దృఢంగా ఉద్యమించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

***మన్యంలో మైనింగ్‌కు వ్యతిరేకంగా ఈ కింది డిమాండ్స్‌తో పోరాడుదాం.***

*1. విశాఖ-తూర్పుగోదావరి జిల్లాల మన్యంలో జరుగుతున్న మైనింగ్‌నూ, మైనింగ్ కోసం తవ్వుతున్న రోడ్ల నిర్మాణాలు తక్షణమే నిలిపివేయండి. లేనిచో మైనింగ్ కోసం ఉపయోగిస్తున్న యంత్రాలనూ, రోడ్లను ప్రజలంతా సామూహికంగా కదిలి ధ్వంసం చేయండి!*

*2. మన్యం నుండి మైనింగ్ మాఫియాను తన్ని తరమండి. అధికార పార్టీ సర్పంచ్‌ల నుండి ఎమ్‌పీల వరకూ రాజకీయ నాయకులను ప్రజల పక్షమా, ప్రభుత్వ పక్షమా తేల్చి చెప్పమని నిలదీయండి!*

*3. పోలీసు వ్యవస్థ కూడా మైనింగ్ మాఫియాతో కుమ్మక్కై వారిచ్చే డబ్బులతోనే ఆదివాసీల అభివృద్ధి కోసం అంటూ ఒకవైపు వాలీబాల్ కిట్లు ఇస్తూ, వైద్య శిబిరాలు నిర్వహిస్తూ, మరోవైపు మైనింగ్ కోసం వేసే రోడ్లకు కాపలా వుంటున్నారు. పోరాడే ప్రజలపై, పార్టీపై క్రూరమైన నిర్బంధాన్ని అమలు చేస్తున్నారు, 32 అడుగుల రోడ్లు ఏ ప్రజల అభివృద్ధి కోసం అని ప్రశ్నించండి. పోలీసు నిర్బంధాన్ని మిలిటెంట్‌గా ప్రతిఘటించండి.*

*4. ఎన్‌జీటీ వాళ్ళు వేసిన బూటకపు విచారణ కమిటీని వ్యతిరేకించండి.*

*ఇప్పటికే ఆందోళనలు చేస్తున్న ప్రతిపక్ష, వామపక్ష, బూర్జువా పార్టీలు, ఆదివాసీ సంఘాలు మన్యం ప్రజల మనుగడను కోరుకునే వారైతే నిజాయితీగా, నిస్వార్థంగా ఆదివాసీ ప్రజల పక్షాన నిలబడాలనీ, ఉద్యమంలో క్రియాశీలంగా భాగస్వామ్యం కావాలని పిలుపునిస్తున్నాం.*

*మైనింగ్‌కు వ్యతిరేకంగా ఆగస్టు 10న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా 'బంద్'ను విజయవంతం చేయాల్సిందిగా అన్ని సెక్షన్ల ప్రజలు, ప్రస్వామికవాదులు, విద్యార్థులు, మేధావులు అందరూ ఆదివాసీ ప్రజల జీవన్మరణ పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలియజేయాల్సిందిగా కోరుతున్నాం.*

**విప్లవాభివందనాలతో,**

Ganesh

**గణేష్,**

**కార్యదర్శి,**

**ఏఓబీ ఎస్‌జడ్‌సీ,**


**సీపీఐ (మావోయిస్టు).**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

పత్రికా ప్రకటన

ఆగస్టు 14, 2021

**నక్సల్బరి తరం నాటి కమ్యూనిస్టు విప్లవకారుడు, సీపిఐ(మావోయిస్టు) కేంద్రకమిటీ సభ్యుడు కామ్రేడ్ పూర్ణేందు శేఖర్ ముకర్జీ/అంబర్ దా/గగన్ దా, వయస్సు, అనారోగ్యం కారణాలతో కలకత్తాలో అమరుడైనాడు. కేంద్రకమిటీ ఆయనకు అరుణారుణ జోహార్లు చెపుతోంది!**



***ప్రియమైన ప్రజలారా!***

మా పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు, నక్సల్బరీ మొదటి తరం విప్లవ కమ్యూనిస్టు కామ్రేడ్ పూర్ణేందు శేఖర్ ముకర్జీ/అంబర్ దా/గగన్ దాదా 75 సంవత్సరాల వమస్సులో శ్వాసకోశ సంబంధిత వ్యాధితో ఆగస్టు 7వ తేది, 2021 కలకత్తా నగరంలో అమరుడయ్యాడు. కేంద్రకమిటీ ఆయనకు తలవంచి వినమ్రంగా జోహార్లు చెపుతున్నది. ఆయన ఆశయాన్ని తుదకంటా కొనసాగిస్తామని శపథం చేస్తోంది. ఆయన కుటుంబ సభ్యులకు, మిత్రులకు మా సహానుభూతిని, సంతాపాన్ని తెలియజేస్తున్నాం. కామ్రేడ్ పూర్ణేందు శేఖర్ ముకర్జీ పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర 24 పరగణ జిల్లాలో జన్మించాడు. 60వ దశకంలో వచ్చిన మహత్తర నక్సల్బరీ ఆందోళనకు ప్రభావితులై విప్లవోద్యమంలో చేరాడు. సీపీఎమ్ పార్టీలో వుండి వారి రివిజనిస్టు విధానాలకు వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటం చేశాడు. చిన్న వయస్సులోనే 1969లో ఏర్పడిన ఎమ్‌సీసీలో చేరాడు. ఆయన తన విప్లవ ప్రారంభ దశలో విద్యార్థులు, కార్మికుల్లో పని చేశాడు. బీహార్–పశ్చిమ్ బెంగాల్/స్పెషల్ ఏరియా కమిటీ కాంక్షా, బుద్‌బుద్, హజారిబాగ్ ప్రాంతాల్లో వ్యవసాయ విప్లవ కార్యక్రమాన్ని అమలు జరుపుతూ దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని ఎత్తిపడుతూ గెరిల్లా యుద్ధాన్ని అభివృద్ధి చేశారు. దీనిలో అంబర్ దా తన పాత్రను పోషించాడు. ఉద్యమంలో ఆయన అభివృద్ధి చెందుతూ పశ్చిమ్ బెంగాల్ రాష్ట్రకమిటీ సభ్యుడిగా ఎదిగాడు. వర్గ పోరాటానికి నాయకత్వం వహిస్తూ, పార్టీ యొక్క రాజకీయ, మిలటరీ లైన్‌లను విశాల ప్రజల్లో నిరంతరం

అర్థంచేయించాడు. మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సిద్ధాంతం పట్ల అచంచల విశ్వాసాన్ని ప్రకటించాడు. 1998-99లో పొడచూపిన కొన్ని సమస్యలు, అభిప్రాయ భేదాల వలన కొద్ది మందితో విప్లవ కమ్యూనిస్టు మావోయిస్టు) కేంద్రాన్ని ఏర్పరిచాడు. వాస్తవానికి ఎమ్‌సీసీతో రాజకీయ, సిద్ధాంత పరమైన విషయాలలో విభేదాలు ఏమి లేవు గతంలోని సమస్యలను పరిష్కరించుకొని 2003లో విప్లవ కమ్యూనిస్టు కేంద్రాన్ని విలీనం చేసి ఆ పార్టీ కేంద్రకమిటీలోకి వచ్చాడు.

2004లో సీపీఐ(ఎమ్ఎల్)(పీపుల్స్‌వార్) మరియు ఎమ్‌సీసీఐలు కలిసి సీపీఐ(మావోయిస్టు) పార్టీగా ఏర్పడినప్పుడు, నూతన పార్టీ కేంద్రకమిటీ సభ్యుడయ్యాడు. ఛత్తీస్‌గడ్‌లో విప్లవ ఉద్యమాన్ని సంఘటితం చేసే బాధ్యతనిచ్చినప్పుడు కేంద్రకమిటీ సభ్యునిగా ఆ బాధ్యతను తీసుకున్నాడు. ఇదే క్రమంలో పట్టణోద్యమ నిర్మాణ బాధ్యతలు స్వీకరించాడు. అర్బన్ సబ్‌కమిటీలో ఆయన కొనసాగి ఆందోళనకు నాయకత్వం వహించాడు. 2005 నుండి 2008 వరకు ఛత్తీస్‌గడ్‌లో కొనసాగిన సల్వాజుడుంకు వ్యతిరేకంగా ప్రచార-ఆందోళన కార్యక్రమానికి నాయకత్వం వహించాడు. దేశ వ్యాప్తంగా సల్వాజుడుంకు వ్యతిరేకంగా అనేక శక్తులను కూడగట్టి సల్వాజుడుం ఓటమికి సాయశక్తుల కృషి చేశాడు.

కార్మిక, రైతు, విద్యార్థి, యువత, మహిళా ఆందోళనల నిర్మాణానికి కృషి చేశాడు. మహిళల మీద రాజ్యహింస, గృహ హింసలకు వ్యతిరేకంగా ఆందోళన నిర్మించడానికి ఎంతో కృషి చేశాడు. విస్తాపన సమస్య, ప్రత్యేక ఆర్థిక జోన్లకు వ్యతిరేకంగానూ, ఆదివాసీ, దళితుల సమస్య మీద ప్రజా ఉద్యమాలు నిర్మించడానికి కృషి చేశాడు. చారిత్రక లాల్‌గఢ్ ఆందోళనకి మద్దతుని కూడగట్టడం కోసం వివిధ సెక్షన్ల ప్రజలను, ప్రజాస్వామిక వాదులను, ప్రగతిశీల శక్తులను కలిపి ఐక్య సంఘటన నిర్మాణానికి కృషి చేశాడు.

2011 ఏప్రిల్ 29న బీహార్‌లోని కటిహార్ జిల్లాలో, బర్సోయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒక గ్రామంలో బీహార్ ఎస్‌టీఎఫ్ పోలీసులు అంబర్ దాదాతో పాటూ కేంద్రకమిటీ సభ్యులైన వారనాసీ సుబ్రమన్యం, విజయ్‌కుమార్ ఆర్యలను అరెస్టు చేశారు. పశ్చిమ్ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, బీహార్, ఝార్ఖండ్, ఛత్తీస్‌గడ్‌లలో అనేక తప్పుడు కేసులను అంబర్‌దా మీద పెట్టారు. ఛత్తీస్‌గడ్‌లోనే 10 కేసులను పెట్టారు. వివిధ రాష్ట్రాలలోని అనేక జైళ్లల్లో ఉంచారు. 2015లో విడుదలయి కలకత్తా నగరంలో వుంటూ తన కార్యకలాపాలను కొనసాగించాడు. రాజకీయ ఖైదీల విడుదల కొసం జరిగే ఆందోళనలోను, పౌరహక్కుల ఉద్యమ నిర్మాణానికి కృషి చేశాడు. మహత్తర నక్సల్బరీ 50వ వార్షికోత్సవాల సందర్భంగా అనేక సభలలో పాల్గొని సీపీఐ(మావోయిస్టు)పార్టీ రాజకీయ, మిలటరీ లైన్‌లను ప్రచారం చేశాడు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ప్రతీఘాతుక 'సమాధాన్' పథకానికి వ్యతిరేకంగా ప్రచారం చేసేందుకు, మేధావులను, ప్రజాస్వామిక వాదులను, ప్రగతిశీల శక్తులను ఒక వేదిక మీదకు తెచ్చేందుకు కృషి చేశాడు. ఎల్గార్ పరిషద్ భీమా కొరేగాం 200 వార్షికోత్సవ సందర్భంగా సభను నిర్వహించింది. ఆ సభమీద బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టులు దాడులు చేసి తిరిగి బాధితుల మీదనే కేసులు పెట్టారు. ఇందులో మేధావులను, రచయితలను, కళాకారులను, జర్నలిస్టులను, సామాజిక కార్యకర్తలను, ప్రొఫెసర్లను, లాయర్ల మీద 'ఉపా' కేసులు పెట్టి జైళ్లలో పెట్టారు. వీరందరి విడుదల కోసం కామ్రేడ్ అంబర్ దా దేశంలోని ప్రగతిశీల, ప్రజాస్వామిక శక్తులతో ఐక్యవేదిక నిర్మించి వీరి విడుదల కోసం కృషి చేశాడు.

విప్లవోద్యమాన్ని దేశ వ్యాప్తంగా సంఘటితపరచడానికి కేంద్రకమిటీ సభ్యునిగా తన వంతు పాత్రను పోషించాడు. కమిటీ సమావేశాలలో పాలసీలను రూపొందించే విషయంలో ముఖ్య భూమిక పోషించాడు. భారత విప్లవోద్యమంలో ఆయన పాత్ర మరువరానిది. అంబర్‌దా అమరత్వం సీపీఐ(మావోయిస్టు)పార్టీకి, విప్లవోద్యమానికి తీవ్రమైన నష్టం. అయినప్పటికి పార్టీ నాయకత్వంలో వర్గ పోరాటం, ప్రజాయుద్ధం తీవ్రతరం అయి దాని నుండి అనేక కార్యకర్తలు, నాయకులు పుట్టుకొస్తారు. ఆయన వదిలి వెళ్లిన ఆశయాలను పూర్తి చేస్తారు. దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసి, సోషలిజం కమ్యూనిజాన్ని తెచ్చేందుకు సాయశక్తుల కృషి చేస్తాం.

విప్లవోద్యమంలో అంబర్ దాదాను సాహెబ్ దాదా పేరుతో పిలిచేవారు. ఆయన అనారోగ్య పీడితుడైనప్పటకీ ప్రజా సేవను విడువలేదు. నిస్వార్థ బుద్ధితో ఆయన ప్రజలకు సేవ చేశాడు. వివాహం విప్లవానికి ఆటంకం అని భావించి ఆయన వివాహం చేసుకోలేదు. చనిపోయిన తరువాత తన శరీరాన్ని వైద్య కళాశాలకు అప్పగించమని తన కోరికను వెల్లడించాడు. చివరి వరకు మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సిద్ధాంతాన్ని, పార్టీ పంథాను, దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని, తూచ తప్పకుండా అమలు జరిపాడు. కేంద్రకమిటీ ఆయనకు ఇచ్చిన సైద్ధాంతిక రాజకీయ, ప్రచార బాధ్యతను చక్కగా నిర్వహించాడు. విప్లవోద్యమంలో ఆయన నెలకొల్పిన ఆదర్శాలను, త్యాగ సాంప్రదాయలతో ప్రేరితులై ఆయన నడిచిన మార్గంలోకి రావాలని దేశంలోని యువతి, యువకులకు కేంద్రకమిటీ పిలుపునిస్తోంది.

Abhay

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

పత్రికా ప్రకటన

సెప్టెంబర్ 15, 2021

## పెరు కమ్యూనిస్టు పార్టీ షైనింగ్ పాత్ సంస్థాపక నాయకుడు మాజి ఛైర్మన్ కామ్రేడ్ అబిమియెల్ గుజ్‌మెన్ (గొంజాలో)కు నివాళి!

గత సెప్టెంబర్ 11న పెరులోని కైలావో నావికా దళ కేంద్రంలోని అత్యధిక భద్రతతో కూడిన సెల్‌లో అమరుడైన పెరు కమ్యూనిస్టు పార్టీ–షైనింగ్ పాత్ సంస్థాపక నాయకుడు మాజీ ఛైర్మన్ 86 సంవత్సరాల కామ్రేడ్ మాన్యూయెల్ రూబెన్ అబిమియెల్ గుజ్‌మెన్ రైనోసో గొంజాలోకు భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) కేంద్రకమిటీ వినమ్రంగా శ్రద్ధాంజలి అర్పిస్తున్నది. పెరు కమ్యూనిస్టు పార్టీకి, పెరు కార్మికులకు, రైతాంగానికి, విప్లవ ప్రజానికానికి కామ్రేడ్ గొంజాలో మిత్రులకు, సహచరులకు, కుటుంబ సభ్యులకు మా కేంద్రకమిటీ ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేస్తున్నది.



3 డిసెంబర్ 1934న పెరులోని ఒక ఓడరేవు పట్టణం ముల్లెండోలో జన్మించిన కామ్రేడ్ గొంజాలో విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేసే క్రమంలోనే మార్క్సిజం పట్ల ఆకర్షితుడై పెరు కమ్యూనిస్టు పార్టీలో చేరాడు. 1962 నుండి 1970వ దశకం మధ్య వరకు ఆయన ఆయా కూచోలోని హువామాంగా విశ్వవిద్యాలయంలోని సైన్ క్రిస్టోబల్‌లో తత్వశాస్త్ర ప్రొఫెసర్‌గా పనిచేశాడు. 1970వ దశకంలో పెరు ప్రభుత్వానికి వ్యతిరేకంగా హింసాత్మక కార్యకలాపాల్లో పాల్గొన్నాడనే ఆరోపనపై ఆయన రెండు సార్లు అరెస్టు అయ్యాడు. 1965లో జనచైనా రిపబ్లిక్ వెళ్లి కామ్రేడ్ మావో సెటుంగ్‌ను కలుసుకున్నాడు. ఆ తర్వాత 1970ల మధ్యలో ప్రొఫెసర్ ఉద్యోగాన్ని వదిలి అజ్ఞాతానికి వెళ్లాడు. కామ్రేడ్ స్టాలిన్ అమరత్వం తర్వాత 1950–60 దశకాల్లో సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ రివిజనిస్టు పార్టీగా, సోవియట్ యూనియన్ సోషల్ సామ్రాజ్యవాద దేశంగా మారడం, గ్రేట్ డిబేట్, మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో వచ్చిన విభజన నేపథ్యంలో పెరు కమ్యూనిస్టు పార్టీలోనూ చీలిక వచ్చిన సందర్భంగా కామ్రేడ్ గొంజాలో మావో నాయకత్వంలో చైనా కమ్యూనిస్టు పార్టీ అభివృద్ధి చేసిన నూతన ప్రజాస్వామిక విప్లవం, దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాను చేపట్టాడు. ఆయన మహత్తర శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవంతో ప్రభావితమై రివిజనిజాన్ని తిరస్కరించి 1969లో మరో 11 మంది నాయకులతో కలిసి పెరు కమ్యూనిస్టు పార్టీ–షైనింగ్ పాత్‌ను స్థాపించాడు. పెరు నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడం కోసం కామ్రేడ్ గొంజాలో నాయకత్వంలో పెరు కమ్యూనిస్టు పార్టీ 1980 మే నుండి సామ్రాజ్యవాదం, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదం, పెరు దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గం, భూస్వామ్యానికి వ్యతిరేకంగా వర్గ పోరాటాన్ని ప్రజాయుద్ధం–గెరిల్లాయుద్ధాన్ని ప్రారంభించింది. ఈ ప్రజాయుద్ధంలో అభివృద్ధి నిరోధక, విప్లవ ప్రతిఘాతుక పెరు పాలకవర్గాలకు ప్రాతినిధ్యం వహించే పెరు ప్రభుత్వ సాయుధ బలగాలకు వ్యతిరేకంగా షైనింగ్ పాత్ గెరిల్లాలు ఎన్నో పేర్కొనదగిన విజయాలు సాధించారు.

ప్రపంచంలోని కొన్ని దేశాల విప్లవ కమ్యూనిస్టు పార్టీలతో ప్రత్యేకించి మార్క్సిస్టు–లెనినిస్టు–మావోయిస్టు పార్టీలతో, శక్తులతో కలిసి కామ్రేడ్ గొంజాలో నాయకత్వంలోని పెరు కమ్యూనిస్టు పార్టీ విప్లవ అంతర్జాతీయ ఉద్యమాన్ని (రిమ్) ఏర్పాటు చేసింది. పెరు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో రిమ్ పెరు సహా అనేక దేశాల్లోని విప్లవోద్యమాలకు వివిధ రూపాల్లో మద్దతును కూడగట్టడానికి ప్రయత్నించింది. చైనా విప్లవం, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి కామ్రేడ్ మావో అందించిన సేవలను రిమ్ మార్క్సిజం యొక్క 3వ ఉన్నత దశగా సంశ్లేషించి దాన్ని మావోయిజంగా పేర్కొంది. ఆ తర్వాత నుండి ప్రపంచంలోని అనేక దేశాల విప్లవ కమ్యూనిస్టు పార్టీలు మార్క్సిజం–లెనినిజం–మావోయిజాన్ని నేటి మార్క్సిజంగా గుర్తిస్తున్నారు. నిర్దిష్ట పరిస్థితుల, నిర్దిష్ట విశ్లేషన–సంశ్లేషన పద్దతిని అభివృద్ధి చేసి కామ్రేడ్ గొంజాలో మార్క్సిస్టు తత్వశాస్త్రానికి తన సేవలనందించారు.

చైనా నూతన ప్రజాస్వామిక అనుభవాలను, మార్క్సిజం-లెనినిజం-మావోయిజాన్ని పెరు నిర్దిష్ట ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పరిస్థితులతో జోడించి అమలు చేస్తు పెరు విప్లవోద్యమాన్ని, ప్రజాయుద్ధాన్ని వేగంగా ముందుకు నడిపించాడు. అర్ధవలస-అర్ధభూస్వామ్య దేశాల్లోని నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్యాల్లో ఒకటైన దళారీ నిరంకుశ బూర్జువా వర్గం గురించి కామ్రేడ్ మావో అందించిన సైద్ధాంతిక అవగాహనను మరింత నిర్దిష్టంగా నిర్వచించడంలో ఆయన పాత్ర కీలకమైనది. పెరు నూతన ప్రజాస్వామిక విప్లవం మరియు ప్రజాయుద్ధానికి ఆయన అందించిన సేవలను పెరు కమ్యూనిస్టు పార్టీ గొంజాలో ఆలోచన విధానంగా ప్రచారం చేసింది.

కామ్రేడ్ గొంజాలో నాయకత్వంలో అభివృద్ధి చెందుతున్న పెరు నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని చూసి బెంబేలెత్తిన అమెరికా సామ్రాజ్యవాదులు పెరు దళారీ పాలకవర్గాలు పెరు విప్లవోద్యమాన్నీ, దానికి నాయకత్వం వహిస్తున్న పెరు కమ్యూనిస్టు పార్టీ షైనింగ్ పాత్‌ను, దాని గెరిల్లాలను అంతమొందించే దుష్ట లక్ష్యంతో అమెరికా ఇంటెలిజెన్స్ సంస్థలైన ఎఫ్‌బీఐ, సీఐఏల మార్గదర్శకత్వంలో అప్పటి పెరు అధ్యక్షుడైన అల్బర్టో ఫ్యుజిమోరీ మొదటి హయంలో ఎన్‌డీఏటీ-టెర్రరిస్టు వ్యతిరేక జాతీయ డైరక్టరేట్ ఒక ప్రత్యేక ఇంటెలిజెన్స్ ఇన్‌పుట్ యంత్రాంగం పై ఆధారపడిన ప్రత్యేక నిర్బంధ క్యాంపెయిన్‌ను నిర్వహించింది. ఎన్‌డీఏటీ కి సంబంధించిన ఒక ప్రత్యేక టీమ్ 12 సెప్టెంబర్ 1992న లీమాలోని ఒక డాన్స్ టీచర్ ఇంటి నుండి పెరు కమ్యూనిస్టు పార్టీకి చెందిన 8 మంది ఇతర నాయకులతో సహా కామ్రేడ్ గొంజాలోను అరెస్టు చేసింది.

కామ్రేడ్ గొంజాలోపై మోపబడిన కేసుల విచారణ ప్రక్రియ వాస్తవానికి సహజ, సామాజిక న్యాయం పట్ల పెరు ప్రభుత్వం యొక్క ఘోరమైన అపహస్యానికి ప్రతీకగా నిలుస్తుంది. అరెస్టు తర్వాత కేవలం మూడు రోజుల విచారణ అనంతరం ఇనుప టోపీలు ధరించిన సైనిక న్యాయాధిశుల కోర్టు, టెర్రరిజం, రాజద్రోహం ఆరోపణలపై ఆయనకు జీవితఖైదు విధించింది. శిక్ష అనుభవించడం కోసం ఆయనను సాన్ లొరెంజో ద్వీపంలోని నావిక దళ కేంద్రానికి పంపించింది. వేలాది ప్రజల డిమాండు నేపథ్యంలో రాజ్యాంగబద్ధ కోర్టు గత సైనిక కోర్టు విచారణను రాజ్యాంగ వ్యతిరేకమైనదిగా ప్రకటించి కామ్రేడ్ గొంజాలో పై 5 నవంబర్ 2004 నుండి తిరిగి విచారణను ప్రారంభించింది. అయితే అది సైనిక కోర్టు అడుగు జాడల్లోనే 13 అక్టోబర్ 2006న టెర్రరిజాన్ని ప్రోత్సహించే, హత్య ఆరోపణలపై ఆయనకు యావజ్జీవ శిక్షను విధించింది. పై న్యాయవిచారణ సందర్భంగా ఒకే ఒక్కసారి మాత్రం కామ్రేడ్ గొంజాలో ఇచ్చిన నినాదాలను-"పెరు కమ్యూనిస్టు పార్టీ వర్ధిల్లాలి", "మార్క్సిజం-లెనినిజం-మావోయిజం జేజేలు", "పెరు ప్రజలకు జేజేలు", "ప్రజాయుద్ధ వీరులు మృత్యుంజయులు'. మీడియా, పెరు సహా ప్రపంచ ప్రజలు విన్నారు. పెరు, అంతర్జాతీయ మీడియాను విచారణకు దూరంగా వుంచారు. 2014లో కామ్రేడ్ గొంజాలో పై లీమా పట్టణంలో జరిగిన బాంబు పేలుల్లకు సంబంధించిన ఒక కేసు మోపి మరోసారి న్యాయ విచారణ నిర్వహించి 11 సెప్టెంబర్ 2018న 2వ యావజ్జీవ శిక్షను విధించింది. ముందు నుండే ఎన్నో రోగాలతో పోరాడుతుండిన కామ్రేడ్ గొంజాలో ఆరోగ్యం జులై 2021 నుండి క్రమంగా క్షీణిస్తు సెప్టెంబర్ 11న ఆయన మృత్యువు పాలయ్యాడు. పెరు కమ్యూనిస్టు పార్టీ పిలుపుపై మా పార్టీ సహా ప్రపంచంలోని అనేక మావోయిస్టు పార్టీలు, సంఘాలు, కార్మిక సంఘాలు, మేధావులు ఆయనకు మెరుగైన వైద్య సేవలందించాలని, వెంటనే విడుదల చేయాలని పెరులో ఇటీవల అధికారంలోకి వచ్చిన నూతన వామపక్ష ప్రభుత్వాన్ని కోరాయి. కాని సోషల్ ఫాసిస్టు వామపక్ష ప్రభుత్వం అమెరికా, దాని పెరు దళారీ పాలకవర్గాల ఎజెండాకు అనుగుణంగానే అది పనిచేసింది. కామ్రేడ్ గొంజాలోను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తు ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన అపీళ్లను అది తన స్వభావ రీత్యానే పెడచెవినబెట్టింది.

ఈ విధంగా అమెరికా, పెరు దళారీ పాలకవర్గాలు కామ్రేడ్ గొంజాలోను గత 29 ఏళ్లుగా ఖైదులో ఉంచడమే కాకుండా ఆయనకు మెరుగైన వైద్య సేవలందించకుండా జైళ్లో మృత్యువాత పడేవిధంగా అమానుష పరిస్థితులను సృష్టించారు. నిజానికి నావిక దళ కేంద్రంలో కామ్రేడ్ గొంజాలో మృతువాత పడ్డాడు. అమెరికా సామ్రాజ్యవాదులు, పెరు దళారీ పాలకుల మార్గదర్శకత్వంలో పోలీసు మిలటరీ, న్యాయవ్యవస్థ చేసిన పాశవిక హత్య తప్ప మరేమి కాదు.

మా కేంద్రకమిటీ ఈ దు:ఖ పూరిత సమయంలో పెరు నూతన ప్రజాస్వామిక విప్లవానికి, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమానికి, మార్క్సిజం-లెనినిజం-మావోయిజాన్ని ఎత్తిపట్టడం కోసం కామ్రేడ్ గొంజాలో చేసిన సేవలను ఆదరపూర్వకంగా స్మరించుకొంటోంది. ప్రపంచ సోషలిస్టు విప్లవంలో అంతర్భాగమైన భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని, సోషలిస్టు విప్లవాన్ని విజయం వైపుకు ముందుకు నడిపించడం కోసం విరామమెరుగకుండా కృషి సల్పుతామని మరోసారి ప్రతిజ్ఞ చేస్తున్నది. ఇదే కామ్రేడ్ గొంజాలోకు నిజమైన నివాళి.

కామ్రేడ్ గొంజాలోకు నిజమైన నివాళి అర్పించడం, ఆయన అసంపూర్తి ఆశయాలను పూర్తి చేయడం కోసం పెరు నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయం వైపుకు పురోగమింపజేయడానికి ప్రజాయుద్ధ మార్గంలో ముందుకు సాగాల్సిందిగా మా కేంద్రకమిటీ పెరు విప్లవ ప్రజానికానికి పిలుపునిస్తున్నది.

కైలావో నావికా దళ కేంద్రంలోని ఖైదులో వుండిన కామ్రేడ్ గొంజాలో పట్ల అమెరికా సామ్రాజ్యవాదులు పెరు దళారీ ప్రభుత్వం, మిలటరీ అమానవియంగా వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండించాల్సిందిగా, సామ్రాజ్యవాదులతో సహా తమతమ దేశాల్లోని దళారీ నిరంకుశ బూర్జువా వర్గానికి, భూస్వామ్యానికి వ్యతిరేకంగా వర్గ పోరాటాన్ని, ప్రజాయుద్ధాన్ని తీవ్రం చేయాల్సిందిగా, ప్రపంచ కార్మికులంతా ఐక్యమై సామ్రాజ్యవాదాన్ని భూస్థాపితం చేయాల్సిందిగా మా కేంద్రకమిటీ ప్రపంచ కార్మికులకు, పీడిత జాతులకు ప్రజలకు పిలుపునిస్తున్నది.

Abhay

**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

పత్రికా ప్రకటన

నవంబర్ 5, 2021

## ఫిలిప్పీన్స్ 'నూతన ప్రజా సైన్యం' (ఎన్‌పీఏ) అధికార ప్రతినిధి కామ్రేడ్ కా ఓరిస్ హత్యను ఖండిస్తున్నాం. కామ్రేడ్ కా ఓరిస్ విప్లవ త్యాగాన్ని ఎత్తిపడుతూ ఆయన ఆశయాల పరిపూర్తికై అంతర్జాతీయవాదులుగా తుదివరకూ పోరాడుదాం

ప్రియమైన కామ్రేడ్స్

ఫిలిప్పీన్స్ ఫాసిస్టు డుటర్టే ప్రభుత్వం అక్కడి విప్లవోద్యమంపై నిరంతరం దాడులకు పాల్పడుతోంది. 2017 నుండి వైమానికదాడులకు, డ్రోన్ దాడులకు పాల్పడుతోంది. వందలాది మంది రెడ్ ఫైటర్స్‌ను, రైతులను, ఇతర సెక్షన్‌ల ప్రజలను అరెస్టులు చేస్తూ జైలు పాలు చేస్తోంది. ఎంతో మందిని అపహరించి హత్యలు చేస్తోంది. అమెరికా సామ్రాజ్యవాదుల ప్రయోజనాలను నెరవేరుస్తూ డుటెర్టే దేశాన్ని వల్లకాడుగా మార్చాలనుకుంటున్నాడు. కానీ, ఫిలిప్పీన్ దోపిడీ పాలకవర్గాల కలలను అక్కడి విప్లవోద్యమం ఎన్నటికీ వాస్తవం కానివ్వదనీ, మా పార్టీ దృఢంగా విశ్వసిస్తూ అక్కడి ప్రభుత్వ హత్యలను, వైమానిక దాడులను నిర్ద్వందంగా ఖండిస్తున్నది. అంతర్జాతీయ వాదులుగా మావోయిస్టు పార్టీలు, శక్తులతో పాటుగా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా యుద్ధాలు లేని ప్రపంచాన్ని, విశ్వ శాంతిని కోరుకునే ప్రజాస్వామికవాదులు, విప్లవాభిమానులు, ఫిలిప్పీన్ విప్లవోద్యమానికి అండగా నిలువాలనీ మా పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) విజ్ఞప్తి చేస్తోంది.

ఫిలిప్పీన్స్ విప్లవోద్యమ నాయకులు అంటోనియో కబనాటన్ దంపతులను 2020 డిసెంబర్ 26నాడు ప్రభుత్వ ప్రాయోజిత హంతక ముఠాలు అపహరించి రోజుల తరబడి చిత్రహింసల పాలు చేసి తుదకు వారి శవాలను బయట పడవేయడం, 2021 మార్చ్ 15నాడు జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌లో ఫిలిప్పీన్స్ కమ్యూనిస్టు పార్టీ సెకండ్ సెంట్రల్ కమిటీ మెంబర్ కామ్రేడ్ రొసాలినో కనుబస్‌ను, ఆ పిదప ప్రజా ఉద్యమ నాయకులైన ఫిలిప్పీన్స్ జాతీయ చర్చి కౌన్సిల్ పాస్టర్ డాన్ బలెసియో, జోవిన్స్ అనక్‌బయాన్ అధికార ప్రతినిధి ష షా స్టా. రోసాలను మేలో అరెస్టు చేయడం, ప్రపంచ ప్రెస్ స్వేచ్ఛా దినం మే 2కు ఒక రోజు ముందు ఫిలిప్పీన్స్ జాతీయ పాత్రికేయ సంఘ పూర్వ డైరెక్టర్ జాన్ హిరేడియాను హత్య చేయడం, మే 14నాడు రైతు నాయకులు మర్సెలా డియాజ్, వర్జిలియో లిన్‌కునాలను అరెస్టు చేయడం, మే 28నాడు జాతీయ ప్రజాస్వామిక ఫ్రంట్ సలహాదారులు (కన్సల్‌టెంట్స్) రుస్టికో టాన్, రేనాల్డో బోకాలాలను హత్యచేయడం, 7 జూన్ నాడు వివిధ పట్టణాల నుండి ముగ్గురు రైతులను ఐలన్ ఈకిట్ బులాలకవో, రామన్ బోయ్ వాలెంజులా, అంటోనియో పొలిగ్రెట్స్‌లను అరెస్టు చేసి తెల్లారి 8వ తేదీనాడు నిర్దాక్షిణ్యంగా హత్య చేయడం, అనేక ఆవాస ప్రాంతాలను సైనికులు తమ అదుపులోనీ తీసుకొని ప్రజలను అరెస్టు చేయడం, హత్య చేయడం అక్కడ సాధారణమవుతోంది. ఫిలిప్పీన్స్‌లో డుటెర్టే అధికారంలోకి వచ్చాక దాదాపు 60 మందికి పైగా పాత్రికేయులపై దాడులు జరగగా 21 మంది హతులయ్యారు.

2017 నుండి ఫిలిప్పీన్స్ విప్లవోద్యమ ప్రాంతాలపై బాంబులు వేయడం కొనసాగుతోంది. 2021 ఆగస్టు 16నా బారంగే ఉస్మేనా, డోలరిస్, తూర్పు సమర్‌లలో బాంబింగ్ చేసి 19 మందిని హత్య చేయడం, 21 సెప్టెంబర్ రోజు బారంగేలో పంటపొలాలపై, జనావాసాలపై ఫిలిప్పీన్స్ వాయు సైనికులు వరుసగా బాంబులు వేయడం, 16 సెప్టెంబర్ నాడు ఉత్తర సమర్‌లో వరుసగా 7గంటలు బాంబులు వేయడం, ప్రజలను పట్టణాల నుండి ఖాళీ చేయించడం, క్షతగాత్రులను చేయడం, భయభ్రాంతులకు గురి చేయడం పెరుగుతోంది. గాలింపు చర్యల పేరుతో రకరకాల ఫిలిప్పీన్స్ సాయుధ బలగాల హత్యాకాండ పెచ్చరిల్లిపోతోంది. 15 సెప్టెంబర్ నాడు మానవ హక్కుల కార్యకర్త, అధివక్త, జాతీయ ప్రజా అధివక్తల సంఘ సభ్యుడు జాఆన్ మాక్‌బబ్బుడ్‌ను హత్య చేయడం, కా ఇల్లా, కా పబ్లింగ్ లాంటి మహిళా గెరిల్లాలను (రెడ్ ఫైటర్స్) హత్య చేయడం అందులో భాగమే. ఇలాంటి భయ బీభత్స వాతావరణంలో బుకిడన్ ప్రాంతంలో ఇటీవలే మరో హత్య చోటు చేసుకుంది. ఎన్‌పీఏ అధికార ప్రతినిధి కామ్రేడ్ కా ఓరిస్‌ను ప్రభుత్వ సాయుధ బలగాలు దారి కాచి హత్య చేశాయి. ఆయన తన వైద్య

సహాయకునితో మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా హతమార్చినట్టు ఆయన జీవిత సహచరి వెల్లడించింది. ప్రభుత్వ సాయుధ బలగాలు తమ పాశవిక హత్యను మరుగుపరచడానికి ఆ ప్రాంతంలో ఎన్‌పీఏతో ఎదురుకాల్పులు జరిగినట్టుగా చిత్రించి అక్కడ రెండుగంటల పాటు వైమానిక బాంబు దాడులకు పాల్పడి కామ్రేడ్ కా ఓరిస్‌తో పాటు కా పీకాను కూడ హత్య చేశారు. తమ క్రూరమైన హత్యాకాండను ఒక సైనిక చర్యగా మభ్య పెట్టడానికి అనేక తప్పుడు రిపోర్టులను మీడియాకు విడుదల చేశారు. వీటన్నింటిని మా పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నది. అమరుల బంధు మిత్రులు వారి శవాలకు వైద్య పరీక్షలు జరిపి నిజాలను నిగ్గు తేల్చాలని చేస్తున్న డిమాండ్‌ను మా పార్టీ సమర్థిస్తున్నది. వారి బంధు మిత్రుల డిమాండ్‌ను గౌరవిస్తూ అమరుల శవాలను అంతిమ దర్శనానికై వారికి ఇవ్వాలని కూడ డిమాండ్ చేస్తోంది. ఎన్‌పీఏకు కల్గిన లోటును అది త్వరలోనే పూడ్చుకుంటుందని భావిస్తూ అమరుల బంధు మిత్రులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియచేస్తోంది.

ఈ రోజు ఫిలిప్పీన్స్ విప్లవోద్యమంపై కొనసాగుతున్న ఫాసిస్టు అణచివేత చర్యలు ప్రపంచంలోని అన్ని దేశాలలో పెల్లుబుకుతున్న సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రజా పోరాటాలపై ముఖ్యంగా విప్లవోద్యమాలపై తీవ్రమవుతున్నాయి. ప్రజాహిత శక్తులను అరెస్టు చేయడం, ప్రశ్నించే గొంతులను వేదించడం, జైలు పాలు చేయడం, అంతిమంగా అవసరం అనుకుంటే హత్య చేయడం అతి సాధారణ చర్యలుగా ముందుకు వస్తున్నవి. అనేక దేశాలలో అధికారంలో ఉన్న పరమ మితవాద శక్తులు వామపక్ష భావాలను, ఉద్యమాలను ఎంతమాత్రం ఉపేక్షించడం లేదు. వారి ద్రవ్య ఆర్థిక రాజకీయ సంక్షోభ తీవ్రతను ఈ చర్యలన్నీ వెల్లడి చేస్తున్నవి. కానీ, ఇలాంటి ఏ చర్యలైనా ప్రపంచ విప్లవోద్యమాలను ఎక్కడా నివారించలేకపోయాయి. ఇది చారిత్రిక వాస్తవం. ఫిలిప్పీన్ ప్రజలు, ప్రజా యుద్ధం అమెరికా సామ్రాజ్యవాదుల అండదండలతో డుటెర్టే కొనసాగిస్తున్న ఫాసిస్టు చర్యలన్నీ తిప్పికొడుతూ అక్కడి ప్రజల ప్రజాస్వామిక విప్లవోద్యమాన్ని విజయపథంలో పురోగమింపచేస్తుందనీ, ప్రపంచ కార్మిక వర్గ విప్లవాల జాబితాలో అగ్రభాగాన నిల్చిన ఆ పార్టీ ప్రపంచ సోషలిస్టు విప్లవ విజయానికి తన వంతు కర్తవ్యాన్ని అది మరింత పట్టుదలతో నిర్వర్తిస్తుందనీ మా పార్టీ పూర్తిగా విశ్వసిస్తోంది.

Abhay

**అభయ్**
**అధికార ప్రతినిధి**
**కేంద్ర కమిటీ**
**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**

**కమ్యూనిస్టులకు తమ అభిప్రాయాలూ, లక్ష్యాలూ దాచుకోవడం అంటే అసహ్యం. సమస్త వర్తమాన సాంఘీక పరిస్థితులనూ బలవంతంగా కూలదోయడం ద్వారానే తమ లక్ష్యాలు సిద్ధించగలవని వాళ్ళు బహిరంగంగానే ప్రకటిస్తారు. కమ్యూనిస్టు విప్లవమంటే పాలకవర్గాలు గజగజ వణకనీ. కార్మికులు పోగొట్టుకునేది ఏమిలేదు, తమ శృంఖలాలు తప్ప. వాళ్ళు పొందవలసింది యెంత్రైనా ఉంది.**

**సకల దేశాల కార్మికులారా ఏకం కండి!**

*(కమ్యూనిస్టు ప్రణాళిక)*

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

పత్రికా ప్రకటన

నవంబర్ 27, 2021

## కోబాడ్ ఘాండీని సీపీఐ(మావోయిస్టు) నుంచి బహిష్కరిస్తున్నాం

2019లో కోబాడ్ ఘాండీ జైలు నుండి బెయిల్‌పై విడుదలై తన కుటుంబంతో వుంటూ 'ఫ్రాక్చర్డ్ ఫ్రీడమ్ ఎ ప్రిజన్ మెమొయిర్' అనే పేరుతో ఒక పుస్తకాన్ని రాసి 2021లో ప్రచురించి విడుదల చేసాడు. యీ పుస్తకం ద్వారా కోబాడ్ మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సిద్ధాంతం నుండి పూర్తిగా తెగతెంపులు చేసుకున్నాడనే విషయం స్పష్టమయింది. ఆయన జైలులో వుండగానే 2010లో ఈ పుస్తకంలోని ప్రధాన ప్రతిపాదనలను "క్వశ్చన్ ఆఫ్ ఫ్రీడమ్ పీపుల్స్ ఇమాన్సిపేషన్" శీర్షికన 6 వ్యాసాలు మేయిన్‌స్ట్రీమ్ పత్రికలో రాసాడు. అవి మానవతవాద, ఆధ్యాత్మిక మార్గాన్ని ఎత్తిపడుతూ భావజాలపరంగా బూర్జువా సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చాయి. ప్రస్తుతం ఆయన రాసిన ఫ్రాక్చర్డ్ ఫ్రీడమ్ పుస్తకం ద్వారా ఘనీభవించిన ఆ భావాలు మరింత స్పష్టంగా వెల్లడైనాయి. తీహార్ జైలులో చెట్ల కింద కూర్చోని దీర్ఘాలోచన చేసిన కోబాడ్‌కు తన 40 ఏళ్ల విప్లవ జీవిత ప్రతిఫలంలో ప్రపంచాన్ని మార్చే సాధనలో అన్నింటికంటే ముందు స్వేచ్ఛా, మంచి విలువలు, సంతోషం సమాజంలో అవసరమని, సంతోషాన్ని సాధించే గోల్ పోస్టుగా మన ఆచరణ కొనసాగాలని చెబుతున్నాడు. నీతి కథల నుండి సారాంశాన్ని గ్రహించాలని కూడా చెబుతున్నాడు. ఇలా ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంచుకున్న కోబాడ్‌కు మార్క్సిస్టు ఆచరణలో అవి లేవని, తత్ఫలితంగా మార్క్సిజం తన లక్ష్యాన్ని సాధించలేకపోయిందని అంటున్నాడు. కాని ఆయన మార్క్సిజం-లెనినిజం-మావోయిజానికి తప్పుడు భాష్యం చెబుతున్నాడు. వర్గపోరాటం, ఉత్పత్తి, శాస్త్రీయ పరిశోధనల ద్వారానే సమాజంలో సరియైన భావాలు ఉత్పన్నమవుతాయని మార్క్సిజం చెబుతోంది. "బాహ్య ప్రపంచంపై ప్రతిచర్య జరుపుతూ, దాన్ని మార్చడం ద్వారా అతడు అదే సమయంలో తన స్వంత స్వభావాన్నే మార్చుకుంటాడు. అతడు తనలో నిద్రాణమైవున్న శక్తి సామర్థ్యాలను అభివృద్ధి చేసుకుని, ఈ అంతర శక్తులను తన ఆధీనంలోకి తెచ్చుకుంటాడు" అని మార్క్స్ తన పెట్టుబడి గ్రంథంలో రాసాడు. ప్రపంచంలో మార్పుకు విప్లవ ప్రతిచర్య జరపకుండా మనిషిలో కూడ మార్పును ఆశించలేం. కోబాడ్ ఆధ్యాత్మిక ఆలోచనలు, భూస్వామ్య, బూర్జువా భావవాద భావజాలానికి సంబంధించినవే తప్ప వాటికి అత్యంత శాస్త్రీయ, తాత్విక చింతనతో కూడిన మార్క్సిజంతో ఎలాంటి పొత్తులేదు. కోబాడ్ గతితార్కిక చారిత్రక భౌతికవాదాన్ని, మార్క్సిస్టు మూల సూత్రాలను, వర్గపోరాటాన్ని విడిచిపెట్టి భావవాద ఆలోచనలతో సమాజంలో సంతోషాన్ని సాధించే ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంచుకున్నాడు.

ఆయన 50 యేళ్లకు పైగా నక్సల్బరీ రాజకీయాలను అనుసరిస్తూ మునుపటి సీపీఐ(ఎమ్ఎల్)(పీపుల్స్‌వార్)లో కేంద్రకమిటీ సభ్యుడుగా, మహారాష్ట్ర రాష్ట్రకమిటీ నాయకుడిగానూ, పిమ్మట ఐక్యతా పార్టీ సీపీఐ(మావోయిస్టు)పార్టీలో కేంద్రకమిటీ పోలిట్ బ్యూరో సభ్యుడిగా అరెస్టు అయ్యేంతవరకు కొనసాగాడు. ఆయన 2009లో అరెస్టై జైలుకు వెళ్లడం, పదేళ్ల తర్వాత జైలు నుండి విడుదలైన తర్వాత కూడ ఈ కాలమంతా తాను మావోయిస్టు పార్టీలో సభ్యుడిని కాదని పదేపదే నిరాకరిస్తూ వచ్చాడు. పోలీసులే ఈ ఆరోపణ నాపై చేస్తున్నారనీ, అలా తనను అనేక మావోయిస్టు కేసుల్లో ఇరికించారనీ, తన పుస్తకంలో రాయడమే గాక గతంలో ప్రెస్‌మీట్లలో కూడ ఈ విషయం చెబుతూ వచ్చాడు. ఒక విప్లవ పార్టీలో అత్యున్నత స్థాయిలో పనిచేసి అరెస్టు కాగానే ఆయన వాస్తవాలను మరుగుపర్చి పాలకవర్గాల మెప్పుకోసం పాకులాడడం ఆయన నిజాయితీ కూడ కోల్పోయాడని తెలుస్తూనే వున్నది. నిజాయితీ కోల్పోయిన వ్యక్తి సమాజానికి ఏమి సందేశం ఇవ్వగలుగుతాడు? దానికి ఏమి విలువ వుంటుంది?

కోబాడ్ జైలు నుండి బయటకు వచ్చిన పిదప పార్టీని కాంటాక్టు చేయకపోవడమే గాక పార్టీతో చర్చించకుండా పార్టీ సైద్ధాంతిక రాజకీయాలకు వ్యతిరేకంగా పార్టీ నిబంధనావళిని, పార్టీ కేంద్రీకృత ప్రజాస్వామిక క్రమశిక్షణను ఉల్లంఘించి, ఈ పుస్తకాన్ని రాసి

ప్రచురించి, విడుదల చేయడం మంచి విలువల గురించి మాట్లాడుతున్న కోబాడ్‌లో గల అనార్కిస్టు ధోరణులను బయటపెడుతున్నది. మోదీ నాయకత్వంలోని బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు బీజేపీ ప్రభుత్వం మావోయిస్టు పార్టీని 'సమాధాన్-ప్రహార్'ల క్రూర దాడి ద్వారా 2022 జూన్ లోగా నిర్మూలిస్తామని తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్న సమయంలో కోబాడ్ ఈ పుస్తకం ద్వారా విప్లవ శిబిరంలో, ప్రజల్లో నిరాశవాదాన్ని పెంచే లక్ష్యంతో తనను కాపాడుకోవడానికి కూడ పాలకవర్గాల సేవకు అంకితమై ఆ పుస్తకంలో మావోయిస్టు పార్టీ పైన అనేక అసత్య ఆరోపణలు చేశాడు. జైలులో వున్నంతకాలం నేరజగత్తుతో, జైలు అధికారులతో చట్టాపట్టాలేసుకుని సౌకర్యవంతమైన జీవితాన్ని అనుభవించి వారంతా మంచివారని పొగుడుతూ నిర్లజ్జగా తన పుస్తకంలో రాసాడు. జైలులో మావోయిస్టు ఖైదీలు మాఫియాలతో కలిసిపోవడమే గాక, కొన్నిసార్లు వారికి నాయకత్వం కూడ వహిస్తారని నిరాధారణమైన ఆరోపనకు ఒడిగట్టాడు. నక్సల్బరీ కాలం నుండి జైళ్ళలో విప్లవకారులు నెలకొల్పిన పోరాట సాంప్రదాయాలను, త్యాగాలను తూలనాడి పార్టీపై నిందలకు పాల్పడ్డాడు. కోబాడ్ జైలులో నిస్వార్థంగా, సాధారణ ఖైదీల హక్కుల కోసం ఏరోజు జైలు అధికారులకు వ్యతిరేకంగా పోరాడింది లేదు. పైగా వారి నుండి అనేక వ్యక్తిగత స్వార్ధ రాయితీలు పొందాడు. అలాంటి వ్యక్తికి మావోయిస్టు ఖైదీల పట్ల మాట్లాడే హక్కు వుంటుందా? అంతేగాక మావోయిస్టు పార్టీకి ప్రజల మద్దతు లేదని, పార్టీ తిరుగుబోతు దళాలు(రోవింగ్ రెబల్స్)గా పని చేస్తున్నదని నిందిస్తున్నాడు. ఇది పాలకవర్గాల గొంతులో గొంతు కలపడమే తప్ప మరేమి లేదు.

కోబాడ్ ఘాండీ తన పుస్తకంలో మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సిద్ధాంత, రాజకీయ ఆచరణపై విమర్శలను ఎక్కుపెట్టాడు. మార్క్స్, లెనిన్, స్టాలిన్, మావోల నాయకత్వంలో సోషలిజం కోసం జరిగిన పోరాటం ఎందుకు ఓడిపోయింది? చైనాలో జరిగిన సాంస్కృతిక విప్లవం మావో మరణించిన అనంతరం విఫలమవడానికి కారణాలేమిటి? మార్క్స్ మొదట రాసిన సిద్ధాంతంలో మానవతా విలువలు వెలుగు చూడగా ఆ తర్వాత కాలంలో ఆచరణాత్మక ఉద్యమాలు ముందుకు వచ్చి అవి మరుగున పడిపోయాయని. తర్వాత లెనిన్, స్టాలిన్, మావో నేతృత్వంలో ఏర్పడిన సోషలిస్టు రాజ్యాల్లో ఈ మానవతా విలువలకు ప్రాధాన్యతనివ్వలేదని, ఆర్థిక నిర్ణయాక సిద్ధాంతాలే అధిపత్యం వహించాయనీ, కమ్యూనిస్టు పార్టీలో కూడ కేంద్రీకృత ప్రజాస్వామ్యం ద్వారా నియంతృత్వమే రాజ్యమేలిందని అందుకే సోషలిజం వెనకడుగు వేసిందని ఆయన పుస్తకంలో రాసాడు. ప్రపంచ యుద్ధం జరిగిన కాలాల్లోనే విప్లవాలు విజయవంతమయినాయని, శాంతి కాలాల్లో విప్లవాలు విజయవంతం కాలేదని చరిత్రను తప్పుడుగా వక్రీకరిస్తున్నాడు. అధికారం, డబ్బును వదిలించుకోవడానికి కమ్యూనిస్టు సమాజంలోనే సాధ్యమని, అందుకు ఏ మార్గం చేపట్టాలో మార్క్సిజం చెప్పింది. అయినప్పటికీ సమాజంలో అధికారం, డబ్బు అనేవే ప్రధాన సమస్యలని వాటి మూలంగానే అనర్థాలకు దారి తీస్తున్నాయని చెప్పడం ద్వారా ప్రజలను అధికార పోరాటం నుండి విముఖులను చేయడానికి ప్రయత్నిస్తున్నాడు. యీ రకంగా ఆయన మార్క్సిజం-లెనినిజం-మావోయిజం మూల సూత్రాలనే వ్యతిరేకిస్తున్నాడు. సుమారు 175 సంవత్సరాలుగా మార్క్సిజం-లెనినిజం-మావోయిజం బూర్జువా సిద్ధాంతం పై చేసిన సైద్ధాంతిక-రాజకీయ దాడి, అది ఆచరణలో సాధించిన విజయాలను నిరాకరిస్తూ కార్మికవర్గానికి, యావత్తు పీడిత ప్రజలకు ద్రోహం చేయ తలపెట్టాడు.

భారత దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన నుండి అది సాధించింది ఏమిటనీ, దేశంలో విప్లవోద్యమం వెనుకపట్టు ఎందుకు పట్టిందనీ, విప్లవ పార్టీలు పరిశోధన చేయకుండా నిశ్చయవాదంతో దేశంలో విప్లవం తప్పక వస్తుందని చెప్తూనే ఉంటాయని విమర్శిసున్నాడు. కార్మికవర్గంలో ఈ కాలమంతా జరిగిన మార్పులను దృష్టిలోకి తీసుకోరనీ, కుల సమస్యను వర్గ విభజనలోకి కుదించి పారిశ్రామికీకరణ ద్వారా, విప్లవం ద్వారా కులాంతరాలు వాటికవే అంతరించిపోతాయని కమ్యూనిస్టులు చెబుతున్నారని పాత చింతకాయ పచ్చడిలా విమర్శిస్తున్నాడు. దేశంలో రివిజనిజానికి వ్యతిరేకంగా బలంగా జరిగిన పోరాటం ద్వారా నిజమైన విప్లవ పార్టీగా భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) ఉద్భవించింది. దేశంలో నిర్దిష్ట సమస్యలపై నిర్దిష్ట విశ్లేషణ జరిపి శాస్త్రీయంగా ఎప్పటికప్పుడు పార్టీ అవగాహనను మెరుగుపర్చుకుంటూ డాక్యుమెంట్లను రూపొందించుకుంటున్నది. కోబాడ్ లేవనెత్తిన అంశాలన్నింటికి పార్టీ డాక్యుమెంట్లలో జవాబులు వున్నాయి. మావోయిస్టు పార్టీలో దీర్ఘకాలం ఒక నాయకుడిగా వుండి, యీ డాక్యుమెంట్లు రూపొందించే చర్చల్లో పాల్గొని కూడ వాస్తవాలను మరుగుపరచడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనం.

కోబాడ్ ఈరోజు విప్లవ రాజకీయాలకు తిలోదకాలిచ్చి బూర్జువా రొచ్చుగుంటలోకి ఎందుకు దిగజారాడనేది మనం చూడాలి. కోబాడ్ సంపన్న మధ్యతరగతి కుటుంబానికి చెందినవాడు. ఆయన వర్గ రీత్యా జాతీయ బూర్జువా వర్గం నుండి పార్టీలోకి వచ్చాడు. కార్పోరేట్ ప్రపంచంలో పెరిగాడు. డూన్ స్కూల్లో చదివాడు. కొంతకాలం లండన్‌లో విద్యాభ్యాసం చేశాడు. ఆయన లండన్‌లో చదువుతున్న కాలంలోనే భారతదేశంలో నక్సల్బరీ వసంతమేఘగర్జనతో ప్రభావితమై విప్లవోద్యమంలో చేరాడు. మహరాష్ట్ర విప్లవ

పార్టీ నిర్మాతల్లో ఒకరుగా ముందుకొచ్చాడు. ఆయన లండన్‌లో మార్క్స్ అధ్యయనం చేసిన లైబ్రరిలో మార్క్సిజం–లెనినిజం సిద్ధాంతం అధ్యయనం చేశాడు. కాని ఆయన మార్క్సిజంలో ప్రాణప్రదమైన మూల సూత్రాల్లో భాగమైన నిర్దిష్ట పరిస్థితులకు నిర్దిష్ట అధ్యయనం చేయడంలో, గతితార్కిక చారిత్రక భౌతికవాదానికి, పద్ధతికి భిన్నంగా ఆయనలో తాత్వికంగా పిడివాద ఆలోచనలు కొనసాగాయి. ఇవి మాటల్లో అతివాద రూపంలో, ఆచరణలో మితవాద రూపంలో రాజకీయంగా తరచూ వ్యక్తమయ్యేవి. పార్టీలో ముఠాలు కట్టడానికి దారి తీసేవి. కోబాడ్‌ను పార్టీ అంతర్గత పోరాటం ద్వారా సరిదిద్దడానికి తీవ్ర ప్రయత్నాలు చేసింది. కాని ఆయన సైద్ధాంతిక, రాజకీయ పెడధోరణుల నుండి స్వచ్ఛందంగా బయటపడలేకపోవడమే గాక, దేశంలో మావోయిస్టు పార్టీ ఆవిర్భావంతో పాలకవర్గాలు తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించడం, అందులో ఆయన అరెస్టు కావడంతో ఆయనలో గూడుకట్టుకొని వున్న తప్పుడు భావాలు ఆయన రచనల ద్వారా వ్యక్తమయ్యాయి. ఏ వ్యక్తి అయిన తనను తాను సరిదిద్దుకోవడానికి నేరుగా వర్గపోరాటంలో, ప్రజాయుద్ధంలో పాల్గొనడం, నిర్దిష్ట పరిస్థితులను అధ్యయనం చేయడం, తద్వారా స్వీయాత్మకత ఆలోచనలలో గల పిడివాద తప్పుడు భావాలను సరిదిద్దుకోవడం అవసరమవుతుంది. ఆయన తన 40 ఏళ్ల విప్లవ జీవితంలో దీని కోసం తక్కువ ప్రాధాన్యతనిచ్చాడు. ఆయన చెప్పుకున్నట్లే అంతర్ముఖి స్వభావం కల్గినవాడు. దీనితో ఆయన ఏ విషయాన్నైనా విస్తృతంగా తోటి కామ్రేడ్స్‌తో చర్చించడం, భావాలను ఇచ్చిపుచ్చుకోవడంలో ఆసక్తి చూపలేకపోయాడు. ఆయన సుదీర్ఘ విప్లవ జీవితం కార్మికవర్గ భావాలకనుగుణంగా మార్చుకోలేకపోయాడు. తద్వారా విప్లవోద్యమాల్లో సహజంగా వచ్చే ఆటుపోట్లను మార్క్సిస్టు పద్ధతి ద్వారా విశ్లేషించుకోలేకపోయాడు. తరచు అలాంటి సందర్భాల్లో నిరాశవాదానికి నెట్టబడడం, పార్టీ తప్పులను ఏకపక్షంగా అధికంగా అంచనా వేసి ద్వేషంగా మార్చుకోవడం ఆయనలో గల పెటీబూర్జువా అహంభావానికి నిదర్శనంగా అనేకమార్లు పొడచూపాయి. చివరకు ఆయన వాటికే బలైపోయి మార్క్సిజం–లెనినిజం–మావోయిజం సిద్ధాంతాన్ని వ్యతిరేకించడం వరకు దారితీసింది. ఆయన మళ్లీ జైలు జీవితం తదుపరి కార్పోరేట్ ప్రపంచంలోకి వెళ్లాడు. అందుకే ఆయన 40 సంవత్సరాల తర్వాత కుళ్లిపోయిన సామ్రాజ్యవాద ,అర్ధవలస–అర్ధ భూస్వామ్య వ్యవస్థలోకి తిరిగిరావడాన్ని గొప్పగా చెప్పుకుంటున్నాడు. విప్లవోద్యమంలో సృజనాత్మకత దెబ్బతిన్నదని వాపోయాడు. కార్పోరేట్ ప్రపంచమే నా ఆలోచనలకు చలనశీలతనిస్తుందని గర్వంగా చెప్పుకుంటున్నాడు. కొండమీది నుండి రాలిన రాయి పాతాళానికి వెళ్లే వరకూ ప్రయాణిస్తుందనేది నిజమే కదా!

కోబాడ్ తీసుకొచ్చిన అభిప్రాయాలు చరిత్రలో కొత్తవేమి కావు. మార్క్సిజాన్ని అంగీకరిస్తూనే మార్క్సిజంలోని మూల సూత్రాలను తిరస్కరించిన బెర్న్‌స్టీన్, మానవతా మార్క్సిస్టుల, డాంగే సరసన్నే కోబాడ్ చేరాడు. మార్క్సిజం–లెనినిజం–మావోయిజం మూల సూత్రాలను తిరగదోడడం, పాలకవర్గాల పంచన చేరి పార్టీపై బురద చల్లడం, వర్గపోరాటం బదులు వర్గ సామరస్య భావనలను ప్రత్యామ్నాయంగా ఎంచుకొని భావవాద ఆధ్యాత్మిక గురువుగా మారడం, ఘోరంగా పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించడంతో కోబాడ్ ఘాండీని పార్టీ నిబంధనావళిననుసరించి కేంద్రకమిటీ ఆయన పార్టీ సభ్యత్వాన్ని తొలగించి పార్టీ నుండి బహిష్కరిస్తున్నది.

ప్రియమైన ప్రజలారా,

కోబాడ్ ఘాండీ ముందుకు తెచ్చిన విప్లవ వ్యతిరేక, పచ్చి అవకాశవాద రాజకీయాలను, భావాలను, ప్రతిపాదనలను తిరస్కరించాలని మా పార్టీ ప్రజలకు, ప్రజాస్వామిక వాదులకు, మేధావులకు, విప్లవ సానుభూతిపరులకు విజ్ఞప్తి చేస్తున్నది. నిరాశవాదంతో విప్లవ చేవ చచ్చి పాలకవర్గాల భావజాలం పంచన చేరిన కోబాడ్ అవకాశవాద రాజకీయాలను తిరస్కరించి, ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు తెలియజేస్తున్నది. పరమ స్వార్థంతో ఉద్యమం నుండి తప్పుకొని కుళ్లు సమాజంలో భాగమవుతున్న వ్యక్తులలో కోబాడ్ మొదటివాడు కాదు. ఇలాంటి వారిని చరిత్ర పెంటకుప్పపైకి విసిరి కొట్టి విప్లవోద్యమం పురోగమించింది. కమ్యూనిస్టు సమాజాన్ని స్థాపించే లక్ష్యంతో కార్మికవర్గ నాయకత్వంలో పీడిత ప్రజలను సమీకరిస్తూ మా పార్టీ విజయం వైపు మెట్టు మెట్టుగా ముందుకు సాగుతూనే వుంటుంది.

నోట్: కోబాడ్ ఘాండీ రాసిన "ఫ్రాక్చర్డ్ ఫ్రీడం ఎ జైల్ మెమోయిర్"కు వివరంగా మా జవాబు త్వరలో ప్రచురిస్తాం.

Abhay

**అభయ్**
**అధికార ప్రతినిధి**
**కేంద్ర కమిటీ**
**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**

# పీడిత ప్రజల ప్రియతమ నాయకుడు కామ్రేడ్ రామకృష్ణ (అక్కిరాజు హరగోపాల్)కు విప్లవ జోహార్లు! ఆయన ఆశయ సాధనలో పయనిద్దాం రండి!!



మన పార్టీ కేంద్రకమిటీ, పోలిట్‌బ్యూరో సభ్యుడు, పీడిత ప్రజల ప్రియతమ నాయకుడు కామ్రేడ్ రామకృష్ణ (అక్కిరాజు హరగోపాల్, శ్రీనివాస్, సాకేత్, మధు) 14 అక్టోబర్, 2021న మూత్రపిండాల వైఫల్యంతో అమరుడయ్యాడు. కామ్రేడ్ రామకృష్ణ అకాల మరణం భారత విప్లవోద్యమానికీ, ప్రత్యేకంగా ఆంధ్ర, తెలంగాణ, ఏఓబీ ఉద్యమాలకు ఎనలేని లోటు. కామ్రేడ్ రామకృష్ణ 40 సంవత్సరాల సుదీర్ఘ విప్లవ ఆచరణ నుండి ప్రేరణ పొంది, ఆయన నెలకొల్పిన ఉన్నత ఆదర్శాలను స్వీకరించి, ముందుకు తీసుకుపోవడానికి ఆయన విప్లవ ప్రస్థానాన్ని మననం చేసుకుందాం.

కామ్రేడ్ అక్కిరాజు హరగోపాల్ 1958, ఏప్రిల్ 19న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా, రెంటచింతల మండలం, తుమ్మకోట గ్రామంలో అక్కిరాజు సచ్చిదానందరావు, రాజ్యలక్ష్మీ దంపతులకు ఆరుగురి సంతానంలో రెండవ సంతానంగా జన్మించాడు. తనకు ఒక అక్క, నలుగురు తమ్ముళ్ళు ఉన్నారు. కామ్రేడ్ రామకృష్ణ తండ్రి గాంధేయవాది, సంస్కరణవాది, ప్రజాస్వామిక, ప్రగతిశీల భావాలు కలవారు. తుమ్మకోట గవర్నమెంటు స్కూల్లో ప్రధానోపాధ్యాయుడిగా పని చేసారు. 'అందరికీ విద్య అందాలి' అనేది ఒక దీక్షగా దళిత వాడల్లో ఇంటింటికీ తిరిగి పిల్లల్ని స్కూల్‌కి పంపే విధంగా కృషి చేసి, ఎంతో మందికి విద్యాభ్యాసం కల్పించారు. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా తుమ్మకోట గ్రామస్తులు ఆయన శిలా విగ్రహాన్ని స్కూలు ముందు నిర్మించి తమ ప్రేమను, గౌరవాన్ని చాటుకున్నారు. ఇప్పటికీ స్కూల్లో వివిధ రంగాల్లో రాణించే విద్యార్థులకు కామ్రేడ్ ఆర్కే తండ్రి పేరు మీద బహుమతులు ప్రధానం చేస్తుంటారు. ఈ విధంగా ప్రగతిశీల, ప్రజాస్వామిక భావాలు గత తండ్రి, ఆయనతోపాటు, సమాజసేవలో పాల్గొన్న తల్లి నుండి ఆదర్శాలు, ఉన్నత విలువలు, నీతి నిజాయితీ కామ్రేడ్ ఆర్కేకు బాల్యం నుండే

అలవడ్డాయి. చిన్నప్పటి నుండీ చదువుతో సహా అన్నింట్లోనూ చురుగ్గా ఉండేవాడు. స్వతహాగా మితభాషి, మృదుస్వభావి, అన్యాయాన్ని సహించనితత్వం, పేద ప్రజలపట్ల ప్రేమను కలిగి ఉండేవాడు. 1977లో గుంటూరు జిల్లా మాచర్ల ఎస్‌కెబీఆర్ కాలేజీలో డిగ్రీ చదువుతున్న కాలంలో రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ కార్యక్రమాలకు ప్రభావితుడయ్యాడు. 'గ్రామలకు తరలండి' క్యాంపెయిన్‌లో చురుగ్గా భాగం అయ్యాడు. 1978లో గుంటూరు జిల్లా ఆర్ఎస్‌యూ మహాసభలకు హాజరై వాలంటీర్‌గా సేవలందించాడు. ఆ కాలంలో మాచర్లలో జరిగిన ఆందోళనల్లో ధనలక్ష్మిపై అత్యాచారం, హత్య, ఫిలిప్ లాకప్ హత్య, అంజమ్మపై అత్యాచారం, హత్య వంటి ఘటనలపై, సిమెంట్ ఫ్యాక్టరీ కాలుష్యంపై అనేక పోరాటాలకు నాయకత్వం వహించాడు. ఇలా జిల్లాలో ఆర్ఎస్‌యూ చేపట్టిన అనేక పోరాటాల్లో చురుగ్గా పాల్గొనటమే కాకుండా తన విద్యార్థి జీవితం నుండే మరెన్నో పోరాటాలకు నాయకత్వం వహించాడు.

1980లో తండ్రి పదవీ విరమణతో కామ్రేడ్ ఆర్కే కుటుంబం హైదరాబాద్‌కు వచ్చి స్థిరపడింది. పదవీ విరమణ తర్వాత తండ్రి హైదరాబాద్‌లోని ప్రైవేటు స్కూల్లో టీచర్‌గా పని చేసేవాడు. తండ్రితోపాటు ఆర్కే కూడా అదే స్కూల్‌లో పని చేస్తూ ఇతర విద్యార్థులతోపాటు, తన తమ్ముళ్ళకు కూడా ట్యూషన్స్ చెప్పేవాడు. పోస్టుగ్రాడ్యుయేషన్ (ఎం.ఏ రాజనీతిశాస్త్రం) చదువుతుండగానే పార్టీ పిలుపు మేరకు 1981లో పూర్తికాలం వృత్తి విప్లవకారుడిగా ఉద్యమంలో భాగమయ్యాడు.

1982 నుండి 1986 వరకూ కేంద్ర ఆర్గనైజర్(సీఓ)గా దాచేపల్లి ప్రాంతంలో పని చేసాడు. ఆ ప్రాంతంలోని గామాలపాడు అనే గ్రామంలో దళితవాడ (క్రిష్టియన్‌పాలెం) కామ్రేడ్ ఆర్కే నివాసం. అందుకే ఆ ప్రాంత ప్రజలందరూ గామాలపాడు గోపాల్ అని పిలిచేవారు. ముఖ్యంగా దళితులు, రైతాంగం, కార్మికులు, విద్యార్థుల్లోనూ కామ్రేడ్ ఆర్కే చేసిన రాజకీయ, నిర్మాణాత్మక కృషి వలన ఆ ప్రాంతంలోని ప్రజలు అనేక సమస్యలపై పలు పోరాటాలు చేయడంతోపాటు, ప్రజాసంఘాల్లో, పార్టీ నిర్మాణాల్లో సంఘటితమయ్యారు. ఆ ప్రాంతం నుండి పూర్తికాలం విప్లవకారులుగా కూడా తయారయ్యారు. 1986 డిసెంబర్‌లో గుంటూరు జిల్లా ప్లీనంలో కామ్రేడ్ ఆర్కే జిల్లా కమిటిలోకి ఎన్నుకోబడ్డాడు. జిల్లా కమిటీ సభ్యుడిగా దాచేపల్లి, మాచర్ల, వెల్దుర్తి సెంటర్లను గైడ్ చేస్తూ, ప్రత్యేకంగా విద్యార్థి ఉద్యమ బాధ్యతలను కూడా చూసాడు. కామ్రేడ్ ఆర్కే నాయకత్వంలో గుంటూరు జిల్లాలో తునికాకు కూలిరేట్ల పెంపుదల పోరాటం, సారా వ్యతిరేక పోరాటం, మత్స్యకారుల సమస్యలు, ఫారెస్టు, బంజర భూముల ఆక్రమణ పోరాటం తదితర అనేక ప్రజా పోరాటాలు ముందుకు వచ్చి విశాల గ్రామీణ ప్రాంతంలో పార్టీ సంఘటితం కావడానికి దోహదం చేసాయి. 1989 నాటికి సుమారు 300 గ్రామాలలో పార్టీ కార్యక్రమాలు విస్తరించడంతోపాటు, 6 కేంద్రాలలో పని చేస్తున్న పార్టీ 6 దళాలుగా ఏర్పడ్డాయి. 1989లో కామ్రేడ్ ఆర్కే 'శ్రీనివాస్' పేరుతో జిల్లా కమిటీ కార్యదర్శిగానూ, దక్షిణ కోస్తా రీజినల్ కమిటీ సభ్యుడిగానూ బాధ్యతలు తీసుకున్నాడు.

1990లో కోస్తా జిల్లాలో పెను తుఫాను బీభత్స సమయంలో బాధిత ప్రజలకోసం జిల్లాలోని మిగతా ప్రాంతాల నుండి చందాలు సేకరించి బాధితులకు అందజేయడంలో కామ్రేడ్ ఆర్కే చేసిన కృషి మరువలేనిది. ఒకవైపు ప్రజలకు సహాయ సహకారాలు అందజేస్తూ, మరోవైపు ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టడంలో ఎంతో చొరవతో చురుకైన కార్యక్రమాలు నిర్వహించాడు. 1991లో చుండూరులోని దళితులపై నరమేధంలో బాధితులను స్వయంగా కలుసుకొని వారి ఆవేదనలో పాలుపంచుకున్నాడు. ఆ తర్వాత చుండూరు ఏరియాలో దళాన్ని ఏర్పర్చి, ప్రత్యక్షంగా గైడెన్స్ అందించాడు. 1992లో గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల దళ కమాండర్లకూ, సీఓలకు పార్టీ నిర్వహించిన మిలటరీ క్యాంప్‌లో ఇన్‌స్ట్రక్టర్‌గా బాధ్యతలు నిర్వహించాడు. అదే సంవత్సరం ఇంటలీజెన్స్ సీఐ ద్వారా కోవర్టుగా మారి రాష్ట్ర స్థాయి నాయకత్వ కామ్రేడ్స్ అరెస్టుకు కారకుడయిన సాయి అనే వాడిని పట్టుకొని వీడి ద్వారా ఇంటలీజెన్స్ సీఐ ఇమాన్యూయల్ రాజుగాడి అనుపానులను తెలుసుకొని, విజయవాడలో యాక్షన్ టీం వాడిని ఖతం చేసిన ఘటనకు కామ్రేడ్ ఆర్కే ఎంతో చాకచక్యంగా పథకాన్ని రూపొందించాడు. 1993లో రామాపురంలో దళితవాడ (క్రిష్టియన్‌పాలెం)పై దాడికి భూస్వాముల పథకాన్ని తిప్పికొట్టడంలో భాగంగా గ్రామ భూస్వాములు అచ్చిరెడ్డి, అంకిరెడ్డిలను నిర్మూలించడం ద్వారా సమస్యకు సాయుధ పోరాట కోణాన్ని జోడించాడు. జిల్లా కమిటీ కార్యదర్శిగా జిల్లాలోని అన్ని నిర్మాణాలను రాజకీయంగా, సైద్ధాంతికంగా, మిలటరీపరంగా, నిర్మాణపరంగా సంఘటితం చేయడంలో విశేషంగా కృషి చేసాడు. జిల్లాలో గ్రామీణ ప్రాంత ఉద్యమమే కాకుండా గుంటూరు, విజయవాడ, తెనాలి వంటి పట్టణాలలో విద్యార్థి, యువజన, మహిళా, మేధావి, కార్మికులలో విప్లవ కృషిని చేస్తూ, పట్టణ, గ్రామీణ ఉద్యమాలను సమన్వయంతో నడిపించాడు. 1993లో జిల్లాకమిటీ కార్యదర్శి బాధ్యతల నుండి రిలీవ్ అయ్యి దక్షిణ కోస్తాజిల్లాల రీజినల్ కమిటీ కార్యదర్శి బాధ్యతలు చేపట్టాడు.

1995లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించాడు. 1995-98 కాలంలో ఎన్‌టీఆర్ పాలనలో రాష్ట్రంలో లభించిన వెసులుబాటును సమర్థవంతంగా వినియోగించుకునేందుకు పార్టీ రూపొందించిన నూతన ఎత్తుగడలను నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించి అమలు జరపడంలో అత్యంత చొరవను, నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. ప్రత్యేక మహిళా ఉద్యమాన్ని నిర్మించాలనే పార్టీ అవగాహనలో భాగంగా సమాజంలోని వ్యవస్థీకృత పితృస్వామ్య భావాల గురించి సిద్ధాంతపరమైన, రాజకీయపరమైన అవగాహనను అందించి పట్టణాల్లోని ఉద్యోగులు, విద్యార్థులు, మేధావులు, బస్తీలలోని కార్మిక స్త్రీలలో జరిగిన రాజకీయ కృషి వలన మహిళా సమస్యలపై పోరాటాలతోపాటు, సంఘటితమైన, బలమైన మహిళా ఉద్యమం రూపుదిద్దుకోవడంలో కామ్రేడ్ ఆర్కే పాత్ర విశిష్టమైనది. సాంస్కృతిక రంగానికి సంబంధించి జననాట్యమండలి వికాసంలో, మార్గదర్శకత్వంలో కామ్రేడ్ ఆర్కే పాత్ర కీలకమైనది. జననాట్యమండలి వర్క్‌షాప్‌లను నిర్వహించడం, ఆ సంస్థ బహిరంగంగా పని చేయలేని నిర్బంధ పరిస్థితులలో దాని పని విధానాన్ని రూపొందించడం, పర్‌స్పెక్టివ్‌నూ, 50 సంవత్సరాల జననాట్యమండలి చరిత్రను తయారు చేయడంలోనూ తను విశేషమైన కృషి చేసాడు.

1995 రాష్ట్ర కన్ఫరెన్స్‌లో నిర్దేశించుకున్న గెరిల్లాజోన్ పర్‌స్పెక్టివ్‌ను పరిపూర్తి చేసేందుకు అలుపెరుగని కృషి చేసాడు. 1997లో దక్షిణ తెలంగాణ ఉద్యమానికి బాధ్యుడిగా ఉన్న కామ్రేడ్ సంజీవ్ అమరుడు కావడంతో దక్షిణ తెలంగాణ బాధ్యతలను పార్టీ, కామ్రేడ్ ఆర్కేకు

అప్పగించింది. నిప్పులు చెరిగే నిర్బంధంలో ఎంతో మంది కామ్రేడ్స్ అమరులవుతున్న పరిస్థితుల్లో దక్షిణ తెలంగాణ తనకు కొత్త ప్రాంతం అయినప్పటికీ, కామ్రేడ్ ఆర్కే పార్టీ ఇచ్చిన బాధ్యతలను విప్లవ స్ఫూర్తితో స్వీకరించి కొద్ది కాలంలోనే అక్కడి క్యాడర్ల అభిమానాన్ని పొందాడు. 1997 నుండి 2000 వరకూ దక్షిణ తెలంగాణ రీజినల్ కమిటీ కార్యదర్శిగా కొనసాగాడు. 1996-97లలో వచ్చిన మరో విడత నిర్బంధ తాకిడిలో విప్లవ ప్రజాసంఘాల కార్యక్రమాలు దాదాపు నిలిచిపోయిన పరిస్థితులలో వివిధ కవర్లలో బహిరంగ, రహస్య సంగాలను నిర్మించి పని చేయించడంలోనూ, విద్యార్థి, మహిళా, సాంస్కృతిక సంఘాలలో వాటి రహస్య పనివిధానంపై అవగాహనను పెంపొందిస్తూ, వర్క్‌షాప్‌లను నిర్వహించి, వాటిని సమర్థవంతంగా నడిపించడంలో కామ్రేడ ఆర్కే మంచి అనుభవాన్ని, నైపుణ్యాన్ని గడించాడు. దక్షిణ తెలంగాణలో నయీముద్దీన్ ముఠా, విప్లవ ప్రజాసంఘాల నాయకులను హతమారుస్తూ, గ్రామాల్లో బలహీనమైన సంఘనాయకులను లొంగదీసుకుని, పార్టీలోనూ కోవర్టులను తయారు చేసి, దళాలపై దాడులు చేయడం వంటివి చేస్తున్న పరిస్థితుల్లో, కామ్రేడ్ ఆర్కే దక్షిణ తెలంగాణ జిల్లాలలోని దళాలతో ఉంటూ పరిస్థితులను రాజకీయంగా సమీక్షిస్తూ, దళాల్లో చొరబడిన కోవర్టులను ఏరివేస్తూ, కేడర్లలో తిరిగి ఆత్మవిశ్వాసాన్నీ, ధైర్యాన్ని నింపేందుకు ప్రతిభావంతమైన కృషి చేసాడు. ఎల్ఐసీలో భాగంగా ఎదురైన కోవర్ట్‌వంటి అనుభవాలను పార్టీకి అందించి అప్రమత్తం చేయడంలో కామ్రేడ్ ఆర్కే పాత్ర కీలకమైనది.

1999 డిసెంబర్ 2న మన పార్టీ ప్రియతమ నాయకులు, కేంద్రకమిటీ సభ్యులు కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళిలు అమరులయ్యారు. ఈ ఘటనతో ఇక పీపుల్స్‌వార్ పని అయిపోయిందని విర్రవీగుతూ పాలకవర్గాలు సంబరాలు చేసుకున్నాయి. అటువంటి పరిస్థితులలో ఆంధ్రరాష్ట్ర విప్లవోద్యమాన్ని పురోగమింపచేయడానికి కామ్రేడ్ ఆర్కే రాష్ట్రకమిటీ కార్యదర్శిగా బాధ్యతలను స్వీకరించాడు. పీపుల్స్‌వార్‌ను తుదముట్టించాలని దూకుడుగా ముందుకొస్తున్న పరమ క్రూరులైన పోలీసు అధికార్లనూ, దుష్ట భూస్వాములనూ, రాజకీయ ముఠా నాయకులను శిక్షించకుండా విప్లవోద్యమాన్ని కాపాడుకోలేని పరిస్థితి ముందుకు వచ్చింది. దాంట్లో భాగంగా క్రూర భూస్వామి బుడ్డా వెంగళరెడ్డిని, ఆత్మకూరు డీజీపీనీ, హోం మంత్రి ఎలిమనేటి మాధవరెడ్డినీ, క్రూర పోలీసు అధికారి ఉమేష్‌చంద్రనూ, ముఖ్యమంత్రి చంద్రబాబుపై అలిపిరి వద్ద మన పీఎల్‌జీఏ యాక్షన్‌టీం వీరోచితంగా చేసిన సాహసోపేత చర్యలన్నింటి పథక రచనల్లో కామ్రేడ్ ఆర్కే కీలకమైన భాగస్వామ్యం ఉంది. 2001లో జరిగిన మునుపటి పీపుల్స్‌వార్ పార్టీ 9వ కాంగ్రెస్‌లో కామ్రేడ్ ఆర్కే కేంద్రకమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. ఈ కాంగ్రెస్ కేంద్రకర్తవ్యాన్ని అమలు చేయడంలో లోపాలను చర్చించి, ఆశించిన ఫలితాలను సాధించలేకపోయామని సమీక్షించింది. రానున్న కాలానికి నిర్మాణ, సైనిక, రాజకీయ కర్తవ్యాలను రూపొందించింది. నూతన బాధ్యతల్లోకి వచ్చిన కామ్రేడ్ ఆర్కే తను పని చేస్తున్న రాష్ట్రంలో ఈ కర్తవ్యాల అమలుకు పూనుకున్నాడు.

2004 ఎన్నికల్లో టీడీపీ పార్టీ ఘోరంగా ఓడిపోయింది. ఆ తదుపరి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మీద రాష్ట్రంలోని ప్రజాస్వామిక మేధావులు, హక్కుల కార్యకర్తలు విప్లవ పార్టీతో రాజకీయ చర్చలు జరపాలని తీవ్ర ఒత్తిడి తెచ్చారు. ప్రభుత్వంతో రాజకీయ చర్చల ప్రక్రియ పార్టీ ఉద్యమ చరిత్రలో ఒక మైలు రాయిగా నిలిచిపోయింది. కామ్రేడ్ ఆర్కే పార్టీ ప్రతినిధిగా, రాజకీయ చర్చల బృంధానికి నాయకుడిగా చర్చల్లో పాల్గొన్నాడు. మొదటిదఫా చర్చల్లో **'భూమి, స్వావలంభన, ప్రజాస్వామ్యం'** అనే డిమాండ్‌లను ప్రజల తరపున పార్టీ, ప్రభుత్వం ముందుంచింది. చర్చల కోసం ఆగిన మంజీర గెస్ట్‌హౌస్‌లోని 7 రోజుల కాలంలో కామ్రేడ్ ఆర్కే, పార్టీ తరపున అనేక కార్యక్రమాలు నిర్వహించాడు. పోరాట సంస్థలతో, సంఘాలతో, పార్టీలతో, ప్రముఖులతో సంప్రదింపులు జరిపాడు. రెండు విప్లవ స్రవంతుల విలీనంలో ఆవిర్భవించిన సీపీఐ(మావోయిస్టు) ఏర్పాటును కామ్రేడ్ ఆర్కే బహిరంగంగా ప్రకటించాడు. 'ప్రభుత్వంతో రాజకీయ చర్చలు' అనే ఎత్తుగడ ద్వారా పార్టీ విప్లవ రాజకీయాలను ప్రచారం చేసి, ప్రజాయుద్ధ రాజకీయాలకు విశాల ప్రజల సాధికారతను సాధించడంలో కామ్రేడ్ ఆర్కే కీలకమైన భూమికను పోషించాడు. చర్చల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మారుతున్న విప్లవానుకూల రాజకీయ వాతావరణాన్ని ఇంకెంత మాత్రం సహించలేని రాష్ట్ర ప్రభుత్వం రెండవదఫా చర్చలకు తలుపులు మూసివేసి, 2005 జనవరి నుండి రాష్ట్రవ్యాప్తంగా అప్రకటిత, సైనిక అణచివేతకు శ్రీకారం చుట్టింది. ఈ అణచివేతలో 150 మందికి పైగా, పార్టీ నాయకులు, క్యాడర్లు, ప్రజలు అసువులు బాసారు. కామ్రేడ్ ఆర్కేను ప్రధాన లక్ష్యంగా చేసుకొని వేలాది హంతక గ్రేహౌండ్స్ బలగాలతో నల్లమల్లను చుట్టుముట్టి, హత్య చేయడానికి కుట్ర చేసింది. ఈ నేపథ్యంలో పార్టీ కేంద్రకమిటీ కామ్రేడ్ ఆర్కేను ఏపీ కార్యదర్శి బాధ్యతల నుండి రిలీవ్ చేసి, ఏఓబీ ఉద్యమ బాధ్యతలను అప్పగిస్తూ, 2006లో ఏపీ నుండి ఏఓబీకి బదిలీ చేసింది.

2007లో జరిగిన ఐక్యతా కాంగ్రెస్-తొమ్మిదో కాంగ్రెస్ ఏఓబీ, ఉత్తర తెలంగాణా ఉద్యమాలను లోతుగా సమీక్షించింది. విప్లవోద్యమాన్నీ, దానిలో జరిగిన తప్పు-ఒప్పులనూ, నష్టాలకు కారణాలనూ, గుణపాఠాలను తిరిగి విప్లవోద్యమాన్ని పునరుద్ధరించే లక్ష్యాన్ని అందించింది. సీసీ, పీబీలలో ఉన్న లోపాలనూ, బలహీనతలను కూలంకషంగా గుర్తించి, వాటిని అధిగమించాలని నిర్ణయించింది. దేశవ్యాప్త ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు స్థావర ప్రాంతాల నిర్మాణం గురించి, సైన్య అభివృద్ధి గురించి, ఐక్యసంఘటన పెంపొందించడం గురించి కర్తవ్యాలు రూపొందించింది. ఏఓబీలో గెరిల్లా యుద్ధాన్ని ఉధృతం చేయాలనీ, పార్టీని సంఘటితపరచాలనీ, పీఎల్‌జీఏను పటిష్టపరచాలనీ, రాజకీయ అధికార అంగాలను విస్తరించాలని నిర్ణయించింది. ఆంధ్ర, ఎన్‌టీలలో ఉద్యమాన్ని నిలబెట్టుకోవాలని, స్వీయాత్మక బలగాలను కాపాడుకోవాలని, కచ్చితమైన రహస్య నిర్మాణ పద్ధతులను చేపట్టాలని నిర్ణయించింది. ఏఓబీ ఉద్యమానికి సీసీ తరపున బాధ్యుడిగా కామ్రేడ్ ఆర్కే ఈ కర్తవ్యాలను ఆ జోన్‌లో అమలు చేసేందుకు తీవ్రమైన కృషి చేసాడు.

కామ్రేడ్ ఆర్కే సాకేత్ పేరుతో ఏఓబీకి వచ్చేటప్పటికీ, 2006 ఏఓబీ జోన్ 3వ కాన్ఫరెన్స్‌లో ఏఓబీ ఉద్యమం తాత్కాలిక వెనుకంజలో ఉ ందని అంచనాకు రావడంతోపాటు, రివైవల్‌కోసం చేపట్టాల్సిన కర్తవ్యాలను రూపొందించింది. కామ్రేడ్ సాకేత్ ఏఓబీలోని నిర్దిష్టతలనూ, ప్రత్యేకతలను ఆకళింపు చేసుకుంటూనే ఉద్యమ వర్తమాన పరిస్థితులనూ, భవిష్యత్ గమనాన్ని విశ్లేషిస్తూ, సంశ్లేషణకు పూనుకున్నాడు. ఏఓబీ ఉద్యమంపై కొనసాగుతున్న శతృదాడిని ఎదుర్కోవడానికి ఎన్‌టీ, ఏపీ ఉద్యమాల తాత్కాలిక ఓటమి, అనుభవాలు, గుణపాఠాల నుండి సైద్ధాంతిక స్థాయిలో విశ్లేషణ చేస్తూ, ఎత్తుగడలను రూపొందించి, వాటి అమలుకు శక్తివంచన లేకుండా

కృషి చేసాడు. పార్టీలోని అన్యవర్గ ధోరణులను సరిదిద్దటానికీ, పార్టీని తీర్చిమలచటానికి చేపట్టిన దిద్దుబాటు ఉద్యమానికి నాయకత్వం వహించాడు. శతృదాడిని ఎదుర్కోవడానికి ప్రజాయుద్ధంలో ప్రజల క్రియాశీల భాగాస్వామ్యాన్ని పెంపొందిస్తూనే, పీఎల్‌జీఏను అభివృద్ధి చేస్తూ, ఉన్నత ఫార్మేషన్లను ఏర్పర్చటంలో భాగంగా ఏఓబీలో 2007లో సీఆర్‌సీ 1వ కంపెనీ నిర్మాణం చేపట్టడంలో కామ్రేడ్ సాకేత్ పాత్ర కీలకమైనది.

శతృదాడిని ప్రతిఘటించడానికి ఏఓబీలోని నాయకత్వకోర్‌తో ఏర్పడిన సెంట్రల్ కమాండ్‌కు కామ్రేడ్ సాకేత్ రాజకీయ నాయకత్వాన్ని అందించాడు. ఈ కమాండ్ నాయకత్వంలో గునికిరాయి ఆంబుష్, బలిమెలదాడిలో 38 మంది ఏపీ గ్రేహౌండ్స్‌ను ఖతం చేసిన చారిత్రాత్మక ఘటన, తెల్లరాయి వద్ద మైన్‌ప్రూఫ్ వాహనాన్ని పేల్చి 17 మంది ఎన్ఓజీ కమాండోలను మట్టిగరిపించిన ఘటనలు విజయవంతమయ్యాయి. 2008 చివర్లో కామ్రేడ్ సాకేత్ సీసీ నుండి ఏఓబీకి ఇన్‌చార్జ్‌గా ఉంటూనే, ఏఓబీ ఎస్‌జడ్‌సీ కార్యదర్శిగా బాధ్యతలను చేపట్టాల్సి వచ్చింది. 2009లో జరిగిన జోన్ 3వ కాన్ఫరెన్స్ మొదటి ప్లీనంలో ఉద్యమం ఎదుర్కొంటున్న సమస్యలు, చేపట్టవలసిన కర్తవ్యాలపై అన్ని స్థాయి పార్టీ కమిటీలలో భావసమైఖ్యతను తీసుకురావడంలో, సరైన దిశానిర్దేశాన్ని కల్పించడంలో కామ్రేడ్ సాకేత్ కీలక భూమికను పోషించాడు.

2009 నాటికి ఏఓబీలోని కోరాపుట్ జిల్లా నారాయణపట్నా ప్రాంతంలో నెలకొని ఉన్న విప్లవకర పరిపక్వ, భౌతిక పరిస్థితులకు మన స్వీయాత్మక శక్తుల విప్లవ కృషిని జోడించి నాయకత్వం అందిస్తూ, ఆ ఉద్యమానికి సరైన ప్రజాయుద్ధ దిశానిర్దేశాన్ని కల్పించడం, వర్గపంథా–ప్రజాపంథాను అన్వయించడం, ఆ ఉద్యమంలోని ప్రజలను రాజ్యాధికార లక్ష్యంతో సంఘటితపర్చడం, పోరాటాన్ని నూతన ప్రాంతాలకు విస్తరింపచేయాలనే లక్ష్యంతో, కామ్రేడ్ సాకేత్ 2009 నుండి 2012 చివరి వరకూ, నారాయణపట్న ప్రాంతంలో కేంద్రీకరించి, నారాయణపట్న సాయుధ రైతాంగ పోరాటాన్ని ఉన్నతస్థాయికి తీసుకువెళ్ళటంలో, అక్కడ బీజప్రాయంలో ప్రజల ఆర్‌పీసీలను నిర్మించడంలోనూ ప్రత్యక్షంగా గైడ్ చేస్తూ అనేక అనుభవాలను అందించాడు. నారాయణపట్న ఉద్యమంపై కేంద్రీకరిస్తూనే, విశాఖ–ఈస్ట్‌లోని బాక్సైట్ వ్యతిరేక పోరాటానికీ, కాఫీ తోటల స్వాధీన పోరాటానికీ, కోరాపుట్‌లోని మాలి–దేవ్‌మాలి విస్థాపన వ్యతిరేక ఆందోళనలకు గైడెన్స్‌ను అందించాడు. పార్టీలో తలెత్తిన మితవాద, అతివాద, అవకాశవాద పంథానూ, రాజకీయాలనూ తిప్పికొడుతూ, పార్టీ పంథాను ఎత్తిపట్టడంలోనూ, క్యాడర్లనూ, ప్రజలను సరైన పంథావైపు నిలబెట్టడంలోను కామ్రేడ్ సాకేత్ మహత్తర భూమికను పోషించాడు. 2013లో కోరాపుట్ డీవీసీ సభ్యుడు నాచికలింగ మితవాదపంథానూ, ఏఓబీఎస్‌జడ్‌సీ సభ్యులు లక్కు, విజయ్‌ల అతివాద, అవకాశవాద వాగాడంబరం, మితవాద పంథాలనూ, ఒడిశా రాష్ట్ర కార్యదర్శి సవ్యసాచిపండా మితవాద, అవకాశవాద రాజకీయాలను తీవ్రంగా ఎండగడుతూ వీరందరికీ ధీటుగా జవాబు చెప్పాడు.

సిద్ధాంతాన్ని ఆచరణకు అన్వయిస్తూ, సాధారణత్వాన్ని నిర్ధిష్టత్వానికి జోడించి ఎత్తుగడలను రూపొందించడంలో, అభివృద్ధి చేయడంలో కామ్రేడ్ సాకేత్ చేసిన కృషి నిరంతరం అనుసరణీయమైనది. 2014లో ఆర్‌పీసీల వర్క్‌షాప్ నిర్వహించడం, 2015లో ఏఓబీలో సామాజిక పరిశోధన, వర్గపరిశీలన చేపట్టడంతోపాటు, 2016లో దీనిపై వర్క్‌షాప్ నిర్వహించి దానిపై ఆధారపడి ఉత్పత్తి విధానం–ఉత్పత్తి సంబంధాలపై 'సామాజిక పరిశోధన–మన కార్యక్రమం' పత్రాన్ని ఫైనల్ చేసి, ఎత్తుగడలను అభివృద్ధి పర్చడంలో కీలక భూమికను పోషించాడు. ఏఓబీఎస్‌జడ్‌సీ అధికార, రాజకీయ ప్రచార పత్రిక 'బోల్షివిక్'ను ప్రారంభం నుండీ క్రమం తప్పకుండా ప్రచురించి, పత్రికను వినూత్న సృజనాత్మక పద్ధతిలో తీసుకురావడంలో కామ్రేడ్ సాకేత్ గొప్ప రాజకీయ కృషి చేసాడు.

కామ్రేడ్ సాకేత్ సిద్ధాంత, రాజకీయ రంగంలో గణనీయమైన కృషి చేశాడు. కేంద్ర కమిటీ రూపొందించిన వివిధ డాక్యుమెంట్‌లలో ఆయన పాత్ర చెప్పుకోదగినది. అలాగే వాటిని సుసంపన్నం చేయడానికి ఆయన కమిటీలో లోతుగా చర్చించాడు, సవరించాడు. ఉద్యమ పరిస్థితులను కమిటీలో స్పష్టంగా ముందు పెడుతూ సరైన నిర్ధారణలకు రావడానికీ, సరైన ఎత్తుగడలు రూపొందించుకోవడానికి ఎంతగానో దోహదం చేశాడు. 2018 సీసీ 6వ సమావేశంలో కామ్రేడ్ సాకేత్ పోలిట్ బ్యూరో సభ్యుడిగా బాధ్యతలు చేపట్టాడు. ఏఓబీకి బాధ్యునిగా ఉంటూనే పని విభజన ప్రకారం ఇతర బాధ్యతలు కూడా నిర్వహిస్తూ వచ్చాడు.

కామ్రేడ్ సాకేత్ 2006లో ఏఓబీ బాధ్యతలు తీసుకున్నప్పటి నుండీ 2020 ఆగస్టు వరకూ అనేక చుట్టివేత దాడుల నుండి తృటిలో తప్పుకున్నాడు. 2007లో విశాఖ–తూర్పుగోదావరి జిల్లాల్లో వందలాది గ్రేహౌండ్స్ బలగాలు నెలల తరబడి చేసిన దాడులు, 2010–11లో నారాయణపట్నం ప్రాంతంలో జరిగిన దాడులు, 2014–15లో ఎమ్‌కేవీబీలో 'ఆలౌట్ అభియాన్' పేరుతో చేపట్టిన భారీ సైనిక ఆపరేషన్స్, 2016లో పార్టీ చరిత్రలో అతిపెద్ద విషాదకర సంఘటనగా నమోదయిన రాంగూడ ఘటనలోనూ, 2018లో టిక్రపడ, పానిపోదర్, 2019లో తిరియా, 2020లో దల్‌దల్, జీపీఎస్ ట్రాకర్స్ ద్వారా 2020 జులైలో 10 రోజుల వ్యవధిలో జరిగిన రెండు దాడులు వీటన్నింటిలోనూ కామ్రేడ్ సాకేత్ తనతోపాటు, ఉన్న కామ్రేడ్స్‌కు నిబ్బరాన్నీ, ధైర్యాన్ని చెబుతూ సురక్షితంగా దాడుల నుండి బయటపడ్డాడు. రాంగూడ దాడిలో కామ్రేడ్ సాకేత్ గాయపడ్డప్పటికీ, క్షేమంగా రిట్రీట్ అయ్యాడు. ఏఓబీలో అననుకూల టెర్రయిన్, తీవ్ర అనారోగ్య సమస్యలు తనను వేధించినప్పటికీ, ప్రత్యక్షంగా ప్రతి సందర్భంలోనూ, క్యాడర్లతోపాటే ఉంటూ, క్షేత్రస్థాయిలో సమస్యలను అధ్యయనం చేస్తూ, శతృవు హంతక పథకాలను వమ్ము చేస్తూ, ప్రజాయుద్ధాన్ని ముందుకు నడిపాడు.

2016లో ఏఓబీఎస్‌జడ్‌సీ కార్యదర్శి బాధ్యతల నుండి కామ్రేడ్ సాకేత్ రిలీవ్ అయినప్పటకీ, సీసీ పని విభజనలో భాగంగా ఏఓబీ ఉద్యమాన్ని తను అమరుడయ్యేనాటి వరకూ గైడ్ చేసాడు. ఏఓబీ ఉద్యమాన్ని గైడ్ చేస్తూనే, వెనుకంజకు గురైన ఏపీ రాష్ట్ర విప్లవోద్యమాన్ని పునర్నిర్మించడానికి కామ్రేడ్ సాకేత్ నాయకత్వంలో పార్టీ నూతన ఎత్తుగడలను రూపొందించింది. విశాల పీడిత ప్రజలలో, పీడిత సాంఘీక సముదాయాలలో అత్యంత రహస్యంగా పని చేసి, అనేక ప్రజాస్వామిక ఉద్యమాలను నిర్మించడంలోనూ, ప్రత్యేక ప్రజాస్వామికవాదులనూ, విద్యార్థి, మేధావులను ఉమ్మడి కార్యాచరణకు దింపి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలోను కామ్రేడ్ సాకేత్ విశేషమైన కృషి చేసాడు.

తరువాయి భాగం 36వ పేజీలో

# కేంద్రకమిటీ సభ్యులు అమరులు కామ్రేడ్ చింతన్‌దాకు రెడ్‌సెల్యూట్స్!



సీపీఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ సభ్యులు కామ్రేడ్ నరేంద్ర సింగ్ (ఆశోదా, చింతన్‌దా) ఒక పట్టణంలోని ఆసుపత్రిలో 2020 జనవరి 6న అంతిమశ్వాస విడిచారు. ఆయన దీర్ఘకాలికంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. 2018 నుంచి కోమాలో ఉన్నారు. ఆయన వయసు 74 సంవత్సరాలు. ఆయన బిహార్ రాష్ట్రంలో తూర్పు చంపారన్ జిల్లా, కేసరియా పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక గ్రామంలో మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించారు. ఆయనకు ఒక సోదరి ఉన్నారు. ఆయన అవివాహితులు. పోలీసుల తీవ్రమైన చిత్రహింసలతో సుదీర్ఘకాలం అనారోగ్యంగా ఉంటూ, కోమాలోకి వెళ్లి తుదకు 2020 జనవరి 6న అంతిమశ్వాస విడిచిన కామ్రేడ్ చింతన్‌దాకు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్రకమిటీ వినమ్రంగా విప్లవ జోహార్లర్పిస్తున్నది. ఆయన ఆశయాలను పరిపూర్తి చేస్తుందని శపథం చేస్తోంది.

స్వగ్రామంలోనే ఆయన ప్రాథమిక విద్య పూర్తి చేసారు. దిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో ఉన్నత విద్య అభ్యసించారు . హిమాలయ ప్రాంతంలో బిహార్-నేపాల్ సరిహద్దున తెరాయి ప్రాంతంలో నివసించే థారూ ఆదివాసీ ప్రజలపై ఆయన పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందారు. పీహెచ్‌డీ చేసిన తర్వాత ఆయన ఉద్యోగం చేయాలని భావించలేదు. దోపిడీకి తావులేని సమాజ స్థాపనకై పీడిత ప్రజలలో కృషి చేయనారంభించారు. చదువుకునేటప్పుడే ఆయన మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వైపు ఆకర్షితులయ్యారు. దానిని విస్తారంగా అధ్యయనం చేసారు. విద్య పూర్తి చేసుకున్న తర్వాత దిల్లీలో కార్మికుల మధ్య పని ఆరంభించారు. దిల్లీలో జనరల్ వర్కర్స్ యూనియన్ స్థాపకులలో ఆయన ఒకరు. ఈ యూనియన్‌లో కార్మికులను సంఘటితం చేసారు. ఈ కాలంలో, 1998-99 మధ్య ఆయన మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ (ఎంసీసీ) సభ్యులకు పరిచయం అయ్యారు. 2001లో ఆయన బిహార్ పార్టీలో భాగమయ్యారు. ఎంసీసీ కార్యకర్తగా ఆయన గ్రామాలలో రైతాంగాన్ని సంఘటితం చేయసాగారు. ఆయన పరిశోధన చేసే కాలంలో పశ్చిమ

చంపారన్ జిల్లాలో థారూ, ఒరాన్ ఆదివాసుల, దళితుల, భూమిలేని రైతుల దుర్భర పరిస్థితులను చూసి కదిలిపోయారు. అక్కడి రైతాంగం భూస్వామ్యం నుంచే కాకుండా బందిపోటు దొంగల నుంచి కూడా పీడనను ఎదుర్కొంటున్నారని అర్థం చేసుకున్నారు. దాంతో ఆ ప్రాంత ప్రజలు భయంతో ఉండేవారు.

ఆ ప్రాంతానికి ఆయన వెళ్లగానే 'జన్ శిక్షా కేంద్ర్' (ప్రజా విద్యా కేంద్రం) పేరుతో నాలుగు స్కూళ్లను ప్రారంభించారు. అందులో దళిత, ఆదివాసీ పిల్లలకు విద్యను అందించనారంభించారు. ఆ స్కూళ్లలో స్కూల్ విద్యతో పాటు సామాజిక మార్పు గురించిన విద్యను కూడా అందించారు. ఆ స్కూళ్లలో చదివిన కొంతమంది విద్యార్థులు తర్వాతి కాలంలో వర్గ పోరాటంలో సైతం భాగమయ్యారు.

ఆ కాలంలో బిహార్‌లో విముక్తి ప్రాంతాల పర్‌స్పెక్టివ్‌తో విప్లవోద్యమ కృషి కొనసాగుతున్నది. ఆయన ఆ ప్రాంత ప్రజల మధ్య విప్లవోద్యమ నిర్మాణానికి కృషి చేశారు. ప్రజాపునాదిని అభివృద్ధి చేసారు. క్రాంతికారీ కిసాన్ కమిటీలను, గెరిల్లా దళాలను ఏర్పరచారు. ఆయన విప్లవ కృషి ప్రారంభించిన తొలిరోజుల్లో ఒక సంఘటన చోటు చేసుకుంది. బందిపోటు దొంగలు సుందర్‌పుర్ స్కూల్‌కు పక్కనున్న ఒక మైనారిటీకి చెందిన కుటుంబంపై దాడి చేసారు. ఆ ఇంటి పురుషులు ఆ సమయంలో పనికి వెళ్లారు. ఇద్దరు ఆడపిల్లలు, తల్లి మాత్రమే ఉన్నారు. బందిపోట్లు వారిపై లైంగిక దాడికి ప్రయత్నించారు. ఆ మహిళలు కేకలు పెట్టారు. ఆ కేకలు విని కామ్రేడ్ ఆశోదా ఒక కర్ర పట్టుకుని తన తోటి విద్యార్థులు, ఆ పరిసరాల్లోని ప్రజలతో కలిసి ఆ ఇంటి వైపుగా వెళ్లారు. దౌర్జన్యాన్ని ఆపమని బందిపోట్లను హెచ్చరించారు. దానితో అక్కడ నెలకొన్న వాతావారణంలో ఒక ఎర్ర సైనికుని శక్తివంతమైన గర్జనతో, గ్రామ ప్రజల ప్రతిఘటనతో బందిపోట్లు కలవరపడి పరుగు లంకించుకున్నారు. ఆయన ఆ కుటుంబాన్ని అదే రోజు రాత్రి స్కూల్‌కు తీసుకొచ్చి చాలా రోజుల పాటు అక్కడ ఆశ్రయం కల్పించారు. ఈ సంఘటన అక్కడి ప్రజలను సంఘటితం చేయడానికి, వారిని పోరాటాలలో కదిలించడానికి తోడ్పడింది. పశ్చిమ చంపారన్‌లోని ఈ అటవీ ప్రాంతం గెరిల్లాజోన్‌గా అభివృద్ధి చెందింది. అక్కడ పెంపొందిన విప్లవోద్యమంతో దోపిడీ భూస్వాముల వద్ద గల అక్రమ భూములు, ఆయుధాలు ప్రజల స్వాధీనమయ్యాయి. విచక్షణా రహితంగా భూస్వాములు, ప్రభుత్వాలు కొనసాగించే అడవుల నిర్మూలనను ప్రజలు అడ్డుకొని వాటిని సంరక్షించారు. ప్రజలకు బెడదగా మారిన బందిపోట్లను తరిమికొట్టారు. ప్రజలపై తరచుగా దాడులకు దిగుతున్న పోలీసులపై, పోలీసు క్యాంపులపై గెరిల్లా దాడులు చేసారు. వారి నుండి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

ఎంసీసీ ఉత్తర బిహార్ కమిటీ ఏర్పడిన వెంటనే, కామ్రేడ్ చింతన్‌దా అందులో సభ్యుడయ్యారు. కానీ ఆ తరువాత జరిగిన ఉద్యమ విస్తరణలో భాగంగా ఏర్పడిన 3యు (ఉత్తర బిహార్–ఉత్తరప్రదేశ్–ఉత్తరాఖండ్) స్పెషల్ ఏరియా కమిటీ లో సభ్యునిగా ఎన్నికయ్యారు. 2004లో ఎంసీసీఐ, సీపీఐ (ఎంఎల్) (పీపుల్స్‌వార్) విలీనమైనప్పుడు ఐక్యపార్టీ కేంద్రకమిటీ సభ్యుడయ్యారు. ఆ క్రమంలోనే కేంద్ర కమిటీ ఏర్పరచిన ఉత్తర రీజినల్ బ్యూరో (ఎన్‌ఆర్‌బీ)లో భాగమయ్యారు. కానీ, 2011 తరువాత ఉత్తర్ రీజియన్‌లో పార్టీకి ఎదురైన నష్టాలతో ఆ బ్యూరో రద్దవడంతో అంతిమ శ్వాస వదిలే వరకు చింతన్‌దా సీసీఎంగా కొనసాగారు.

కామ్రేడ్ చింతన్‌దా స్కూల్ విద్యను మాత్రమే కాకుండా, మార్క్సిజాన్ని కూడా బోధించే ఒక మంచి టీచర్. ఆయన పార్టీ కేడర్లకు విద్య గరిపే బాధ్యతలు తీసుకున్నారు. ఉద్యమ ప్రాంతాలలో కేడర్లకు మార్క్సిస్టు తత్వశాస్త్రం, మార్క్సిస్టు అర్థశాస్త్రం, విప్లవ రాజకీయాలు బోధించారు. ఆయన బోధనా పద్ధతి సరళంగా, సహజంగా ఉండేది. జటిల విషయాలను సరళంగా వివరించేవారు. ఆయన మార్క్సిజాన్ని ఆచరణకు అన్వయిస్తూ వర్తమాన ఉదాహరణల ద్వారా వివరించేవారు. ఆయనకు ఇంగ్లీషు, హిందీ భాషలలో మంచి పట్టు ఉండేది. ఆ రెండు భాషల్లో వ్యాకరణం బోధించేవారు.

కామ్రేడ్ చింతన్‌దా ఉత్తర బిహార్‌లో మూడు సార్లు అరెస్టయ్యారు. మొదట 2005లో ఉత్తర బిహార్‌లో, చివరగా 2010లో ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో అరెస్టయ్యారు. జైలు నుంచి విడుదలైన వెంటనే ప్రతిసారీ ఆయన్ని తిరిగి అరెస్టు చేసారు. కాన్పూర్‌లో ఆయన అరెస్టు మరింత భయానకమైంది. అక్కడ తీవ్రమైన చిత్రహింసలకు గురయ్యారు. ఆయనను ఆ పాశవిక చిత్రహింసలు శారీరకంగా, మానసికంగా ప్రభావితం చేశాయి. పోలీసుల చిత్రహింసల కారణంగా ఆయన మూడుసార్లు మెంటల్ షాక్‌కు గురయ్యారు. 2010 నాటికి ఒక చెవి వినికిడి శక్తి కోల్పోయారు. జైలులో ఉన్నప్పుడు బోన్ (ఎముకలు) టీబీ వచ్చింది. అంతేకాకుండా ఆయనకు బీపీ, హెర్నియా, పైల్స్ జబ్బులు కూడా ఉండేవి. 2014లో విడుదల అయిన తరువాత ఇక గురుతరమైన బాధ్యతలేవీ చేపట్టలేకపోయారు. క్రమంగా తన శరీరంపైనా, మెదడుపైనా అదుపు కోల్పోయారు. పోలీసులు, జైలు అధికారుల పీడన ఆయన శరీరాన్ని మరింతగా క్షీణింపజేసింది. మానసిక సంతులనం కోల్పోయారు. చికిత్స జరిగినప్పటికీ పూర్తిగా కోలుకోలేకపోయారు. తుదకు కామ్రేడ్ చింతన్‌దా అనారోగ్యం నుండి బయటపడలేకపోయి 2020 జనవరి 6వ తేదీన ఈ ప్రపంచానికి వీడ్కోలు పలికారు. భౌతికంగా ఇక ఆయన మనకు లేరు.

ఇవాళ కామ్రేడ్ చింతన్‌దా మన మధ్య లేరు. కానీ ఆయన జ్ఞాపకాలు, ఆదర్శాలు, ఆశయాలు మనకు ఉన్నాయి. ఆయన రాజకీయ కృషి, త్యాగం, అంకితత్వం, సాహసం మనకు ఎల్లప్పుడూ ప్రేరణను, మార్గదర్శకత్వాన్నీ అందిస్తూ ఉంటాయి. ఆయన స్మృతులు మనకు బలాన్నిస్తాయి. ఆయన అద్భుతమైన, అవిస్మరణీయమైన అనుభవాన్ని స్మరించుకుందాం.

కాన్‌పూర్ జైలు నుంచి విడుదల అయిన తరువాత కామ్రేడ్ చింతన్‌దా బిహార్–ఝార్ఖండ్ సరిహద్దు ప్రాంతానికి వెళ్లారు. అక్కడ అర్థసైనిక బలగాలతో ఎదురుకాల్పులు జరిగాయి. ఫైరింగు, షెల్లింగు జరిగాయి. కానీ ఆయన భయపడలేదు, నిరాశపడలేదు. శారీరకంగా బలహీనంగా ఉన్నారే కానీ ఆయన గొంతు మహా శక్తిమంతంగా ఉన్నది. నిబ్బరంగా, వీరోచితంగా సమరంలో పురోగమించారు. పీఎల్‌జీఏ యోధులను ఉత్సాహపరుస్తూ శత్రువుపై దాడిలో పాల్గొన్నారు. 'కామ్రేడ్స్! అర్థసైనిక బలగాలు సింహాలు కాదు. పీఎల్‌జీఏ యోధులు బతికి ఉన్న పులులు. చిరకాలం వర్ధిల్లుతారు. స్నేహితులారా, ముందుకు ఉరకండి, వారిని తుడిచిపెట్టివేయండి'. ఈ ప్రేరణను అందుకున్న పీఎల్‌జీఏ యువ యోధులు శత్రువుపై దునుమాడారు. అర్థసైనిక బలగాలు వెనకడుగు వేయక తప్పలేదు.

కామ్రేడ్ చింతన్‌దా సరైన పద్ధతిలో స్వయం విమర్శ చేసుకునేవారు. తన వైపు నుంచి తప్పు జరిగిందని అర్థమయిన తరువాత దాన్ని అంగీకరించడానికి, సరిదిద్దుకోవడానికీ ఏ మాత్రం వెనుకాడేవారు

కాదు. రోజువారీ జీవితంలో కచ్చితమైన క్రమశిక్షణ పాటించేవారు. తన తోటి కామ్రేడ్స్‌తో మంచిగా వ్యవహరించేవారు. జైలులోనూ, చివరికి స్పృహ లేని పరిస్థితి ఏర్పడే వరకు కూడా ఎంతో క్రమశిక్షణాయుతంగా ఉన్నారు. అవిశ్రాంతంగా చదివే, రాసే, మాట్లాడే శక్తిని మానసిక షాక్ వల్ల కోల్పోయారు.

**ఆయన జీవితం నుంచి కొన్ని ఉల్లేఖనలు, గుణపాఠాలు**

1. కామ్రేడ్ చింతన్ దోపిడీ కులంలో పుట్టి పెరిగి పీడిత ఆదివాసీ, దళిత, వెనుకబడిన శ్రామిక కులాల పక్షాన నిలబడ్డారు. విప్లవం కోసం తన యావత్ జీవితాన్ని అర్పించారు. దోపిడీ కుల అహంకారాన్ని ఈషణ్మాత్రం కూడా ప్రదర్శించేవారు కాదు. ఉత్తమ లక్షణాలు ఉన్న మంచి కమ్యూనిస్టు.

2. దేశంలో ప్రతిష్టాకరమైన విద్యా సంస్థలో ఉన్నత విద్యను అభ్యసించారు. ఏ విశ్వవిద్యాలయం లోనైనా ఆచార్యులు కాగలిగేవారు. కానీ సౌకర్యవంతమైన జీవితాన్ని వదిలిపెట్టి విప్లవ కమ్యూనిస్టుగా మారారు. కార్మికునిగా కార్మికవర్గానికి సేవ చేసారు. ఆయన త్యాగం, అంకితభావం ఆదర్శవంతమైనవి, అభినందనీయమైనవి.

3. భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పరిపూర్తి చేయడానికి ఏదీ అడ్డం రాకూడదని ఆయన భావించాడు. చివరి నిముషం వరకు సాయుధ పోరాట మైదానంలో దృఢంగా నిలబడ్డారు.

4. పదవి, డబ్బు ఆశ విప్లవానికి శత్రువులు. వీటి పట్ల ఆయన జాగరూకత కలిగి ఉండేవారు. తన వారసత్వ ఆస్తిని వదిలివేసి పార్టీలో, ప్రజలలో కార్మికునిగా జీవించారు. తన ఇంటిని, కుటుంబాన్ని త్యాగం చేసి సహచర కామ్రేడ్స్‌నే తన కుటుంబంగా భావించారు. వారి మధ్యనే ప్రాణాలు వదిలారు. కష్టకాలంలో తన కామ్రేడ్స్ వద్దకు వెళ్లారే తప్ప కుటుంబం వద్దకు వెళ్లలేదు. తన పరిస్థితులు, లక్ష్యాలకు అనుగుణంగా జీవించారు. పార్టీ బయట ఎవ్వరితో రాజీ పడలేదు.

5. మనం జీవించి ఉండకపోయినా ఈ ప్రపంచం మారుతుంది. మన జీవిత కాలంలోనే విప్లవం పరిపూర్తి కావాలని లేదు. అయితే దాన్ని పరిపూర్తి చేయవలసిన బాధ్యత మనకు ఉన్నది. మిగిలిన పనిని భవిష్యత్తు తరం నెరవేరుస్తుంది. ఆయన ఈ విషయాన్ని ఆకళింపు చేసుకుని తన యావత్తు జీవితం అమలు చేసారు.

6. నైజీరియా కవి, నాటక రంగ ప్రముఖుడు బోల్ షోయెంకా చెప్పిన మాటను ఆయన నిజం చేసారు. రెండు సంవత్సరాలకు జైలు నుంచి విడుదల అయిన తరువాత షోయెంకా తన జైలు జీవితం గురించి ఇలా అన్నారు - 'జైలుకు వెళ్లే ముందు దేన్నైతే నమ్ముతామో విడుదల అయిన తరువాత కూడా అదే నమ్ముతాం. అయితే ఈ నమ్మకం ఇంకా బలపడుతుంది'. మూడు సార్లు అరెస్టై, చిత్రహింసలకు గురి అయ్యి కూడా కామ్రేడ్ చింతన్‌దా నిరాశపడిపోలేదు, లొంగిపోలేదు, భయపడలేదు. ప్రాణం కన్న మిన్నగా పార్టీ రహస్యాన్ని కచ్చితంగా కాపాడారు. ఆయన వల్ల పార్టీకి ఏ రకమైన నష్టం కానీ జరిగినట్టుగా ఏ రాష్ట్రం నుంచి కూడా రిపోర్టులు లేవు. విడుదల అయిన ప్రతిసారీ ఆయన మరింత రాటుదేలి నిశ్చయంగా వర్గ పోరాటంలో, ప్రజా యుద్ధంలో భాగం అవుతూ వచ్చారు.

7. ఆయన జీవితంలో ఒక ప్రత్యేక లక్షణం ఉన్నది. అత్యంత కష్టతరమైన పరిస్థితులలో విప్లవంలో, ప్రజలలో నమ్మకం నిలబెట్టుకున్నారు. పార్టీ అధికారిక పంథాను అంటిపెట్టుకుని ఉన్నారు. వర్గ పంథా-ప్రజా పంథాపై, మార్క్సిజం-లెనినిజం-మావోయిజంపై బలంగా నిలబడ్డారు.

కామ్రేడ్ చింతన్‌దా గొప్ప ఉపాధ్యాయుడు, జనరంజకమైన ఉపన్యాసకుడు, ఉన్నత విద్యావంతుడు, అలుపెరుగని కార్యకర్త. ఆయనలో ఉన్న కార్మికవర్గ లక్షణాలు ఆయనను బలమైన కమ్యూనిస్టుగా, నిశ్చయమైన మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టుగా నిలబెట్టాయి. మన ప్రియతమ కామ్రేడ్, సహచర యోధుడు, ఉపాధ్యాయునికి కేంద్రకమిటీ కన్నీటి నివాళి అర్పిస్తున్నాది. ఆయన ఆశయాన్ని పరిపూర్తి చేస్తామని శపథం చేస్తున్నది. కామ్రేడ్ చింతన్‌దా జీవితం నుంచి అవిరామ విప్లవ కృషిని, చొరవను, పట్టుదలను, నిబద్ధతను విప్లవ శ్రేణులన్నీ నేర్చుకోవాలి. ఆయన అమరత్వం కలిగించిన ఆవేదనను శక్తిగాను, కన్నీటిని దోపిడీ రాజ్యంపై క్రోధంగాను మార్చుకోవాలి. అమరవీరుల ఆశయాలను పరిపూర్తి చేస్తామని మళ్లీ మళ్లీ శపథం చేద్దాం,

'కామ్రేడ్, చేతిలో ఎర్రజెండాతో, గుండెల్లో మీ జ్ఞాపకాలతో ముందడుగు వేస్తుంటాం

మీ అమరత్వం కలిగించిన దుఃఖాన్ని దిగమింగుతూ మునుముందుకే సాగుతాం'.

## 33వ పేజీ తరువాయి భాగం

కామ్రేడ్ సాకేత్ వ్యక్తిగత జీవితంలో కూడా ఉన్నతమైన ఆదర్శాలను నెలకొల్పాడు. కుటుంబాన్ని విప్లవకరంగా తీర్చిదిద్దడంలో సఫలమయ్యాడు. తన ఏకైక కుమారుడు పృథ్వీకి (మున్నా) పార్టీ నాయకుడిగానే సరైన దిశానిర్దేశం చేసాడు. కామ్రేడ్ పృథ్వీ 2016 అక్టోబర్ 24న రాంగూడ ఘటనలో అమరుడయ్యాడు. కామ్రేడ్ సాకేత్ జీవిత సహచరి కామ్రేడ్ శిరీష తన కొడుకు మున్నా అమరత్వం సందర్భంగానూ, కామ్రేడ్ సాకేత్ అమరత్వం సందర్భంగాను అంతులేని విషాదాన్నీ, వేదననూ, కన్నీళ్ళను దిగమింగుకుంటూనే మీడియాలోనూ, అనేక ఇంటర్వ్యూలలోను ఆమె చేసిన రాజకీయమైన, చైతన్యవంతమైన ప్రకటనలు, ప్రదర్శించిన మనోనిబ్బరం వెనుక సహచర జీవితంలో కామ్రేడ్ సాకేత్ నెలకొల్పిన గొప్ప ఆదర్శాలను, ప్రేరణను మనం చూడవచ్చు.

భారత విప్లవోద్యమం సెట్‌బ్యాక్‌లో ఉన్న నేటి అత్యంత క్లిష్ట పరిస్థితులలో అమరుడు కామ్రేడ్ సాకేత్‌లా ప్రతీ కామ్రేడ్ ప్రత్యేకంగా నాయకత్వ కామ్రేడ్స్ కఠోర, చేతనాబద్ధ వ్యక్తిగత, సమిష్టి కృషి చేయడం ద్వారా ఉద్యమానికి ఉన్న గొప్ప అవకాశాలను మన పార్టీ సద్వినియోగం చేసుకోగలుగుతుంది.

కామ్రేడ్ సాకేత్ తుదిశ్వాస వదిలే వరకు కఠోర శ్రమకూ, రిస్కులకూ, సవాళ్లకూ, నూతన ఉన్నత బాధ్యతల నిర్వహణకు వెనుకాడలేదు. నష్టాలకు బాధ్యత పడడానికి ఏనాడు తప్పుకోలేదు. సాదా సీదా జీవన శైలి, సరళమైన మాటతీరు, తీక్షణ దృష్టి, చురుకైన చర్చా పద్ధతి, సరైన మార్క్సిస్టు విశ్లేషణా పద్ధతి, సూటైన మాటతో పాటు తన రాత శైలి అర్థవంతమైనవి. తన విప్లవ జీవితంలో అనుక్షణం కమ్యూనిస్టు మానవ సంబంధాలనూ, విలువలను బోధించి, ఆ ఉన్నత విలువలతోనే జీవించి నూతన మానవుడికి ఒక నమూనాగా నిలిచాడు. కార్మికవర్గ ఉత్తమ పుత్రుడుగా కామ్రేడ్ సాకేత్ సదా మనల్ని తన విప్లవ జీవిత ఆచరణ ద్వారా మేల్కొల్పుతూనే ఉంటాడు.

# కలిమెల విప్లవోద్యమంలో ఉద్భవించిన ఉద్యమ నాయకుడు కామ్రేడ్ రణదేవ్ అమర్ రహె!



మల్కనగిరి జిల్లా, కలిమెల బ్లాక్, బొడగట్ట పంచాయితీ, చిన్న టేగ్గూడ గ్రామంలో సుమారు 35 సంవత్సరాల క్రితం కోయ ఆదివాసీ రైతు కుటుంబంలో కామ్రేడ్ రణదేవ్ జన్మించాడు. తల్లిదండ్రులు మాడవి ముఖేష్ అనిపేరు పెట్టుకున్నారు. 5గురి సంతానంలో రణదేవ్(ముఖేష్) 3వ వాడు. 7వ తరగతి వరకు చదువున్నాడు. దండకారణ్య విప్లవోద్యమం ప్రారంభకాలం నుండే కలిమెల ప్రాంతం కూడా ఆ విప్లవోద్యమంలో భాగమైంది. అక్కడ ప్రజాయుద్ధం అభివృద్ధి చెందుతున్న క్రమంలో శత్రువుకు కంటి మీద కునుకు లేకుండా చేసి, ఎంతో మంది ఆదివాసీ రైతాంగాన్ని విప్లవకారులుగా తీర్చిదిద్దిన చరిత్ర కలిమెల ప్రాంతానికి ఉంది. ఈ క్రమంలో 2001లో ఏఓబీ ప్రత్యేక జోన్‌గా ఏర్పడిన తర్వాత కలిమెల, పప్పులూరు ప్రాంతాన్ని గెరిల్లా బేస్‌గా నిర్మించేందుకు గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేయాలని పార్టీ నిర్ణయించింది. ఈ కృషిలో భాగంగానే 2002లో కలిమెల, మోటు వంటి రెయిడ్స్ జరిగాయి. కలిమెల-పప్పులూరు ప్రాంతంలోని కోయ, కొండరెడ్డి ప్రజలు తమ మౌలిక సమస్యల పరిష్కారం కోసం పార్టీ నాయకత్వంలో అనేక పోరాటాలు, కరువుదాడులు, మిలిటెంట్ చర్యలను చేస్తూ, వర్గ సంఘాలలోనూ, మిలీషియాలోను సమీకృతులవుతూ, 2005 నాటికి ప్రజారాజ్యాధికార అంగాలైన ఆర్‌పీసీ (విప్లవ ప్రజా కమిటీలు)లను ఏర్పర్చుకున్నారు. చురుకైన, తెలివైన విద్యార్థిగా స్కూల్లో చదువుకుంటున్న రణదేవ్‌కు తమ ప్రాంతంలో జరుగుతున్న వర్గపోరాటం, ప్రజాయుద్ధంలో పీడిత ప్రజలు సాధిస్తున్న విజయాలు, పొందుతున్న ఫలితాలు సహజంగానే విప్లవోద్యంవైపు ఆకర్షితుడ్ని చేసాయి. 2004లో తను పూర్తికాలం కార్యకర్తగా కామ్రేడ్ అర్జున్ పేరుతో విప్లవోద్యమంలో భాగమయ్యాడు. ఆర్‌పీసీలో కొంతకాలం డాక్టర్‌గా పని చేసి, ప్రజలకు వైద్యాన్ని అందించాడు. 2006లో పొట్టేరు ఎల్ఓఎస్‌లో పని చేసాడు. దళంలో తన చురుకైన కార్యాచరణనూ, రాజకీయ ఎదుగుదలను దృష్టిలో పెట్టుకొని, పార్టీ ఏసీఎమ్‌గా ప్రమోట్ చేస్తూ, ఉద్యమ అవసరాల రీత్యా విస్తరణలో భాగంగా 2007 చివరలో గుమ్మ ఏరియా కమిటీ కార్యదర్శిగా తనకు బాధ్యతలను ఇచ్చింది. ఆర్గనైజేషన్ రంగంలో నిరంతరం ప్రజలను అంటిపెట్టుకొని ఉంటూ, ప్రజల సమస్యలను అధ్యయనం చేస్తూ, ప్రజలను అనేక పోరాటాల్లోకి సమీకృతుల్ని చేస్తూ, నిర్మాణాల్లోకి సంఘటితపరుస్తూ, ప్రజల హృదయాల్లో అభిమాన నాయకుడిగా గుర్తింపు పొందాడు. ఏరియా కమిటీ కార్యదర్శిగా తోటి కమిటీ సభ్యులనూ, దళ సభ్యులను రాజకీయంగా, మిలటరీ, నిర్మాణపరంగా ఎదిగించుకోవడంలో తన వంతు కృషిని కొనసాగించాడు. 2009లో ఎమ్‌కేబీ డీఓసీ (డివిజనల్ ఆర్గనైజేషనల్ కమిటీ)సభ్యుడిగా ఒక సంవత్సర కాలం పని చేసిన తర్వాత 2010లో డీవీసీ సభ్యుడిగా ఎన్నుకోబడ్డాడు. డీఓసీ సభ్యుడిగా, గుమ్మ ఏరియా, బైపరిగూడ ఏరియా కమిటీ కార్యదర్శిగా ఆ ప్రాంతాలలోని ఉద్యమానికి నాయకత్వం వహించాడు. ఈ ప్రాంతాలు 2007, 2009ల తర్వాత కొత్తగా విస్తరించాయి. ఈ ప్రాంతాలలో ఉద్యమాన్ని నిర్మించడానికి అక్కడి భౌగోళిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ, నిర్దిష్ట పరిస్థితులను అధ్యయనం చేసాడు. ప్రజలను విప్లవ రాజకీయాలతో చైతన్యపరుస్తూ, వారి పోరాట సంసిద్ధతపై ఆధారపడి సమస్యల పరిష్కారానికి నాయకత్వం వహించాడు. మొదట అటవీశాఖ అధికారులు ప్రజలపై కొనసాగిస్తున్న దోపిడీ, అణచివేత, ధౌర్జన్యాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి వందలాది ఎకరాల అటవీ భూములు, ప్లాంటేషన్‌లను స్వాధీనం

చేసుకొని ప్రజలకు పంపిణీ చేసాడు. ప్రభుత్వంలోని వివిధ విభాగాలలో జరుగుతున్న అవినీతిపై ప్రజలను కూడగట్టి పోరాటాలు నడిపాడు. బలమెల రిజర్వాయర్ ముంపుతో నిర్వాసితులైన వేలాదిమంది ప్రజలను కదిలించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా బలమైన ప్రజాందోళనలు నిర్మించి నాయకత్వం వహించాడు.

2015 చివరలో ఈస్ట్-మల్కనగిరి ఉమ్మడి డివిజనల్ కమిటీ ఏర్పడినప్పుడు తను ఆ డీవీసీలో భాగమయ్యి తిరిగి కలిమెల ఏసీ కార్యదర్శిగా 2019 చివరి వరకూ కొనసాగాడు.

2019 అక్టోబర్‌లో ఏఓబీ జోన్ ప్లీనంలో పాల్గొని ఉద్యమ సమీక్షలో తన వంతు పాత్రను పోషించాడు. ప్లీనం కర్తవ్యాల అమలులో భాగంగా, ఉద్యమ అవసరాలరీత్యా నిర్మాణాలలో జరిగిన మార్పుల్లో భాగంగా తను తిరిగి ఎమ్‌కేబీ డీవీసీలో భాగమయ్యి బైపరిగూడ ఏసీ కార్యదర్శిగా, డివిజన్ కమాండ్ ఇన్‌చీఫ్‌గానూ బాధ్యతలను నిర్వర్తించాడు. 2021లో వ్యూహాత్మక అవసరాలరీత్యా మన పార్టీ కలిమెల ఏసీని పునర్నిర్మించి పని చేయించాల్సిన కర్తవ్యాన్ని కామ్రేడ్ రణదేవ్‌పై పెట్టింది. దానికి శక్తులను కూడా కేటాయించింది. అయితే కలిమెల ప్రాంతం గతంలో బలమైన ఉద్యమంగా అభివృద్ధి చెందినప్పటికీ, క్రమంగా ఆ ఉద్యమంపై శత్రువు జరిపిన తీవ్రమైన, క్రూరమైన దాడితోపాటుగా మన స్వీయాత్మక బలహీనతలు కూడా తోడై, ఉద్యమం బలహీనపడింది. శత్రువు కార్పెట్ సెక్యూరిటీలో భాగంగా నెలకొల్పిన క్యాంపులు, అదే ప్రాంతం నుండి రిక్రూటయ్యి డీవీసీ స్థాయికి ఎదిగిన సుఖదేవ్ వంటివారు, మరికొంత మంది ఏసీ సభ్యులు దిగజారిపోయి, శత్రువు పంచన చేరి, ద్రోహులుగా మారటం, శత్రునెట్‌వర్క్ బలోపేతం కావడం, ఎన్‌కౌంటర్‌లలో నాయకత్వాన్ని కోల్పోవటంతో ఉద్యమంలో అనేక సంక్లిష్టతలు, పరిమితులు ఏర్పడ్డాయి. అటువంటి పరిస్థితుల్లో కామ్రేడ్ రణదేవ్ పార్టీ ఇచ్చిన కర్తవ్యాన్ని నెరవేర్చేందుకు మళ్ళీ కలిమెల ఏసీ కార్యదర్శిగా బాధ్యతలు తీసుకొని నిబ్బరంగా, పట్టుదలతో తన కార్యక్షేత్రానికి వెళు తున్న క్రమంలోనే 2021 జూన్ 16న తీగలమెట్ట వద్ద శత్రువు చుట్టుముట్టి జరిపిన భీకరమైన దాడిలో శత్రువుతో హెూరాహెూరీగా పోరాడుతూ తన తుది శ్వాస విడిచాడు.

కామ్రేడ్ రణదేవ్ మొదటి నుండీ చివరి వరకూ ప్రధానంగా ఆర్గనైజేషన్ రంగంలో పని చేసినప్పటికీ, తన సమర్థతలను దృష్టిలో పెట్టుకొని పార్టీ తనకు మిలటరీ రంగంలో ఇచ్చిన బాధ్యతలలో చురుగ్గా పాల్గొన్నాడు. 2007లో మల్కనగిరి ఎమ్ఎల్ఏ అరవిండ్‌దాలీ ఇంటి వద్ద వాడికి రక్షణ కోసం ఏర్పాటు చేసిన గార్డ్స్‌పై మన పీఎల్‌జీఏ దాడి చేసి, 5 ఆయుధాలను స్వాధీనం చేసుకున్న ఘటనలో పాల్గొన్నాడు. 2009లో జన్నుగూడ వద్ద బ్యాంకుకు సంబంధించిన వాహనంపై దాడి చేసి, ఒక 12 బోర్ తుపాకీ, 1 కోటి రూపాయలు స్వాధీనం చేసుకున్న ఘటనల్లోనూ, సప్తధార పవర్ ప్రాజెక్టు పేల్చివేతలోనూ, గోవిందపల్లి ఔట్‌పోస్ట్‌పై దాడిలోనూ, సెల్‌టవర్స్‌ను దగ్ధం చేసిన ఘటనల్లోను తను భాగమయ్యాడు. శత్రువు ఇన్ఫర్మర్ నెట్‌వర్క్‌ను ధ్వంసం చేయడంలో భాగంగా అనేక మంది ఇన్ఫార్మర్స్‌పై రాజకీయంగా, సైనికంగా ప్రజలను కదిలించడంలో క్రియాశీల పాత్రను పోషించాడు.

శత్రువు జోన్ ఉద్యమాన్ని సమూలంగా నిర్మూలించడం కోసం తలపెట్టిన అనేక చుట్టివేత, అణచివేత దాడుల్లోనూ, ఎన్‌కౌంటర్స్‌లోను కామ్రేడ్ రణదేవ్ ధైర్యంగా, దృఢంగా శత్రువును ప్రతిఘటించాడు. 2004లో జరిగిన పూజారిగూడ దాడి మొదలు టేగ్గాడ, తెంతులిపాదూర్, చింతలవీధి, చందురుపల్లి, కొండజర్త, గొయిగూడ, చాంద్‌మెట్ట తదితర ఎన్‌కౌంటర్స్ నుండి శత్రువుతో పోరాడుతూ బయటపడ్డాడు.

కామ్రేడ్ రణదేవ్ వైవాహిక జీవితంలో తన జీవిత సహచరి రాజకీయంగా బలహీనపడి ఉద్యమం నుండి వెళ్ళిపోయిన సందర్భంలో మానసికంగా కొంత ఘర్షణ పడినప్పటికీ, పార్టీ కల్పించిన రాజకీయ చైతన్యాన్ని అందుకొని సమిష్టి ప్రయోజనాలకూ, ఉద్యమ ప్రయోజనాలకు ప్రాధాన్యతను ఇచ్చి తన వ్యక్తిగత సమస్యను అధిగమించి ఉద్యమంలో మరింత క్రియాశీలంగా భాగమయ్యాడు. శత్రువు ఉద్యమంలో ఉన్న కార్యకర్తలను వివిధ పద్ధతులలో బలహీనపర్చి లొంగదీసుకోవడం కోసం చేస్తున్న అనేక కుట్రల్లో భాగంగా మల్కనగిరి ఎస్‌పీ కటాఫ్ ఏరియాలో రాంగూడ ఘటన తర్వాత కామ్రేడ్ రణదేవ్ కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేసి, వారి ద్వారా లొంగిపోమ్మంటూ ఉత్తరాలను రాయించడం, తల్లిదండ్రులకు బట్టలు ఇవ్వడం, హస్పిటల్‌కు తీసుకెళ్ళి వైద్యం చేయించడం వంటివి చేస్తూ, రణదేవ్‌ను లొంగిపోమ్మనీ, ముసలి తల్లిదండ్రులతో కలిసి జీవించమని సెంటిమెంటల్‌గా బ్లాక్‌మెయిన్ చేస్తూ ప్రకటనలను ఇచ్చారు. వీటన్నింటినీ కామ్రేడ్ రణదేవ్ రాజకీయంగా అర్థం చేసుకొని శత్రువు కుట్రలను తిప్పికొడుతూ తన చివరి శ్వాస వరకూ ఉద్యమంలో దృఢంగా నిలబడ్డాడు.

కామ్రేడ్ రణదేవ్ బూర్జువా స్కూళ్ళో వానాకాలం చదువులే చదివినప్పటికీ, ఒడియా భాషపై మంచి పట్టును సంపాధించాడు. చదవడం, రాయడం, స్పష్టంగా మాట్లాడటమే కాకుండా, ఒడియా భాషలో ప్రజలకూ, ప్రజా నిర్మాణాలకూ, క్యాడర్‌లకు రాజకీయ క్లాసులను వాళ్ళకు అర్థమయ్యే రీతిలో చెప్పేవాడు. ఒడియాలో చాలా సరళంగా పోస్టర్లనూ, కరపత్రాలనూ, రిపోర్ట్స్‌ను రాసేవాడు.

ఏఓబీలోని అనేక ప్రాంతాల్లో ఆర్గనైజేషన్ బాధ్యతలను నిర్వహిస్తూ, అన్ని ప్రాంతాల ప్రజలతోను మమేకమయ్యేందుకూ, వారి భాషలను నేర్చుకోవడానికి ప్రయత్నిస్తూ, తన రాజకీయ చైతన్యాన్నీ, విప్లవ సమర్థతలను మరింత మెరుగుపరుచుకుంటూ, ఏఓబీ జోన్ ఉద్యమంలో ఆధారపడదగ్గ నాయకుడిగా ఎదుగుతున్న క్రమంలో తనను కోల్పోవడం నేడు ఆటుస్థితిలో ఉన్న ఏఓబీ ఉద్యమానికి ఎనలేని లోటు. అయినప్పటికీ, అమరులు మనకందించిన ప్రేరణతో, స్ఫూర్తితో వారుకన్న కలలను నిజం చేసేందుకై మరింత పట్టుదలగా కృషి చేద్దామని శపథం చేస్తూ, అమరులకు తలవంచి వినమ్రంగా నివాళ్ళర్పిద్దాం!

# ఏఓబీ విప్లవోద్యమ ప్రజా వైద్యుడు
# కామ్రేడ్ అశోక్ (సందె గంగన్న)



కా. సందె గంగన్న (అశోక్) ఉమ్మడి కరీంనగర్ జిల్లా (ప్రస్తుతం పెద్దపల్లి), ఓదెల మండలం, గుంపుల గ్రామంలో 1982 సంవత్సరంలో జన్మించాడు. తల్లిదండ్రులకు నలుగురు సంతానంలో మూడవవాడు. కా. అశోక్ వాళ్లది విప్లవ కుటుంబం. కా. అశోక్ పెద్దన్న కా.సందె రాజన్న 1995లో రిక్రూట్ అయి, విద్యార్థి ఆర్గనైజేషన్‌లో పనిచేస్తూ, పార్టీ పనిపై వెళ్తుండగా, 1996లో శత్రువు చేతికి చిక్కి బూటకపు ఎన్‌కౌంటర్‌లో అమరుడయ్యాడు. కా. సందె రాజమౌళి (ప్రసాదన్న), కా. అశోక్ ఒకే కుటుంబానికి చెందిన వాళ్లు. తన అన్నలిద్దరూ పీడిత ప్రజల విముక్తికోసం పని చేయడం అశోక్‌ను బాగా ప్రభావితం చేసింది. వాళ్ళ ప్రేరణతోనే తాను కూడా పార్టీలోకి వెళ్ళాలని దృఢంగా నిశ్చయించుకున్నాడు. దీంతో తన నిర్ణయాన్ని పార్టీ ముందు ప్రతిపాదించాడు. 1998లో ఆర్‌వైఎల్(రాడికల్ యువజన సంఘం)లో పనిచేసాడు. తనతోటి యువకులతో చేరి, గ్రామంలో భూస్వాములకు వ్యతిరేకంగా భూ ఆక్రమణ పోరాటాలలోనూ, పెత్తందార్ల అవినీతి, దోపిడీ, అజమాయిషీకి వ్యతిరేకంగాను యువతను, ప్రజలను కూడగట్టి పోరాటాలు చేయించాడు. ఈ దోపిడి వ్యవస్థ మారాలంటే, సాయుధ పోరాటమే సరైన మార్గమని నమ్మి 2000 సం.లో పూర్తి కాలంగా రిక్రూట్ అయినాడు.

కామ్రేడ్ అశోక్ రిక్రూట్ అయిన వెంటనే పెద్దపల్లి ఏరియా, కాల్వ శ్రీరాంపూర్ ఎల్ఓఎస్ దళంలో పనిచేసాడు. ఏరియాలో పని చేస్తున్నప్పుడు ప్రజలతో మమేకమై, కలిసిపోతూ వాళ్లకు అప్యాయతలు పంచుతూ వారి విశ్వాసాన్ని చూరగొన్నాడు. కా. అశోక్‌ను ప్రజలు గుర్తుపెట్టుకుని అడిగేవారు. 2001 జూన్‌లో హుజురాబాద్ దళానికి బదిలీ అయినాడు. 2002 చివరిలో ఆయుధాల తయారీ, మరమత్తు చేసే విభాగం(టీడీ)లోకి బదిలీ అయినాడు. 2002-2007 వరకు అక్కడే పనిచేసాడు. టీడీలో నాయకత్వానికి తనకు తెలిసిన మెకానిక్ విషయాలు చెపుతూ ఎంతో సహకరించేవాడు. ఆయుధాలు తయారు చేయడంలో, రిపేరింగ్ చేయడంలో ఎంతో పట్టుదలతో, నిబద్ధతతో పనిచేస్తూ తన వంతు పాత్ర నిర్వహించాడు. ఉద్యమ అవసరాలరీత్యా సీఆర్‌సీకి చెందిన రెండవ కంపెనీలోకి 2008 సం. మే నెలలో బదిలీ అయినాడు. అక్కడే తీవ్రఅనారోగ్య సమస్యలతో కొద్దికాలం కార్యకలాపాలకు దూరంగా ఉన్నాడు. కామ్రేడ్ అశోక్ శరీరంలో తగినంత ఎముకపుష్టి లేకపోవటంతో, శరీరం ఒకవైపుకు వంగుతూ వచ్చింది. ఈ వ్యాధిలో భాగంగానే శరీరంపై, పెద్ద పెద్ద గడ్డలు ఏర్పడ్డాయి. ఈ మార్పులన్నీ తనకు బాగా ఇబ్బంది కల్గిస్తూ వచ్చాయి. ఈ పరిస్థితులలో, పార్టీ కా. అశోక్‌ను ట్రీట్‌మెంట్ నిమిత్తం పంపింది. కా. అశోక్ శరీరాన్ని పరీక్షించిన డాక్టర్లు, ఆయనకు చాలా పెద్ద వెన్నెముక ఆపరేషన్ చేసి, విజయవంతం చేసారు. ఈ సమయంలో, కా. అశోక్ ఎంతో బాధను ఓర్చుకొంటూ కనబరిచిన నిబ్బరత్వానికి, డాక్టర్లు ఆశ్చర్యపోయారు.

ఆపరేషన్ అనంతరం, ఆయనకు శరీరం సహకరించడం ప్రారంభమైంది. మళ్ళీ ఎప్పుడూ, అనారోగ్య సమస్యలు రాలేదు. 2009లో పార్టీ అవసరాలరీత్యా ఏఓబీకి పంపింది. అప్పటినుంచీ ఆయన వైద్యరంగంలో సేవలు అందిస్తూ వచ్చాడు. ఆయన పెద్దగా చదువుకోక పోయినప్పటికీ, వైద్యరంగంపై ఉన్న మక్కువతో ఏ విషయాన్నైనా కష్టపడి, పట్టుబట్టి నేర్చుకొనేవాడు. వైద్యానికి సంబంధించిన విషయాలను నేర్చుకోవడంలో, ఆయనను "ఏక సంథాగ్రాహి" అని కూడ చెప్పవచ్చు. ఒక సారి పార్టీ క్యాడర్లకు 'వేసెక్టమీ' ఆపరేషన్ చేసేందుకు నిష్ణాతుడైన, క్వాలిఫైడ్ డాక్టర్ ఉద్యమ ప్రాంతానికి వచ్చాడు. ఆ సందర్భంగా, పార్టీ 'వేసెక్టమీ' చేసే విధానాన్ని కా. అశోక్‌కు నేర్పమని డాక్టర్‌ను కోరింది. డాక్టర్ ఆమోదించడంతో, కా. అశోక్ 1,2 కేసులలో ఆపరేషన్ సందర్భంగా ప్రత్యక్షంగా పాల్గొన్నాడు. అంతే,

అప్పటి నుంచీ ఆయన పార్టీ క్యాడర్లకూ, ప్రజలకు పదుల సంఖ్యలోనే 'వేసెక్టమీ' ఆపరేషన్లు చేసాడు. ఏఒక్కటీ ఫెయిల్‌కావడం గానీ, ఇతర సంక్లిష్టతలు చోటుచేసుకోవడం గాని జరగలేదంటే, అతిశయోక్తి కాదు.

ఆయన ఏఓబీ వచ్చిన తర్వాత, వైద్యరంగంలో నిర్వహించిన సేవలు, ఏఓబీ విప్లవోద్యమ పురోగమనానికి ఎంతో దోహదపడ్డాయి. ప్రధానంగా ఆయన మల్కన్‌గిరి, కోరాపుట్ డివిజన్‌లోనూ, విశాఖ–ఈస్ట్ డివిజన్‌లోను వైద్య సేవలు అందించాడు. అతి తక్కువ సమయంలోనే ఒడియా భాషను నేర్చుకొని, ఒడిశా ప్రజలలో ఒక్కడిగా కలిసిపోయాడు. ఒడియా భాషలోనే ప్రజలకు పార్టీ రాజకీయాలను బోధించేవాడు. స్థానిక పార్టీ కమిటీలు చేసిన నిర్ణయాలకు అనుగుణంంగా, అనేక మెడికల్ క్యాంపులలో, గ్రామస్థాయి కార్యకర్తలకు వైద్యంలో తర్ఫీదునిచ్చాడు. అనారోగ్య సమస్యలతో తీవ్రంగా బాధపడుతున్న గ్రామ ప్రజలకు ఎంతో ప్రేమగా వైద్యాన్ని అందించాడు. ముఖ్యంగా కట్‌ఆఫ్ ఏరియాలో, ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఎప్పుడు, ఎక్కడ అనారోగ్య సమస్య ఉన్నా, వెంటనే వెళ్లి వాళ్లకు సహాయం అందించేవాడు. 'వాళ్లకు తల్లో నాలుకలా' తయారైనాడు. 2020లో కరోనా వచ్చినప్పుడు, పార్టీతో చర్చించి, లక్షలాది రూపాయల మందులు తెప్పించి, ప్రజలకు అందించాడు. మెడికల్ టీంలను ఏర్పరిచి, ప్రజలకు ఆరోగ్య నియమాలను అర్థం చేయిస్తూ, ప్రచారం చేయడంలోనూ, వైద్యం అందించడంలోను ఎనలేని కృషి చేసాడు. కా. అశోక్ సమర్థతలను దృష్టిలో పెట్టుకొని, ఎస్‌జెడ్‌సీ 2018లో జరిగిన మీటింగ్‌లో ఆయనను ఎంకేబీ (మల్కనగిరి, కోరాపుట్ బోర్డర్)డివిజన్ కమిటీలోకి తీసుకుంది.

అయితే ఆయన వైద్యరంగంలో నిర్వహించిన కృషి, 'నల్లేరు మీద బండి'లా సాగలేదు, రోజు రోజుకు పెరుగుతూ వచ్చిన శత్రు ఫాసిస్టు దాడుల మధ్యనే, ప్రజల సహకారంతో, తన కృషిని నిర్వహించాడు. అనేక ఎన్‌కౌంటర్లలో, శత్రుదాడిని తిప్పికొట్టడంలో ప్రత్యక్షంగా పాల్గొన్నాడు. ఆ ఎన్‌కౌంటర్ల సందర్భంగా గాయపడిన పీఎల్‌జీఏ యోధులకు, ఆయన దగ్గర ఉండి వైద్యం అందించాడు. రాంగూడ ఎన్‌కౌంటర్లో గాయపడిన కామ్రేడ్స్‌కు కా. అశోక్ నేతృత్వంలోనే వైద్యం అందించడం జరిగింది. వాళ్లు అనతికాలంలోనే కోలుకొని, తమ తమ పనుల్లోకి వెళ్ళగలిగారు.

కామ్రేడ్ అశోక్ కేవలం 'విప్లవ ప్రజా వైద్యుడే' కాదు, అనేక రంగాలలో ఆయనకు ప్రవేశముంది. ఒక్క మాటలో చెప్పాలంటే, ఆయనను 'బహుముఖ ప్రజ్ఞాశాలి' అని చెప్పవచ్చు. తుపాకుల రిపేర్ మొదలుకొని, ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ పరికరాల మరమత్తు పనులను సైతం చేసేవాడు. పార్టీకి ఏ అవసరం పడ్డా కా. అశోకే గుర్తుచ్చేవాడు. ఇక విప్లవం యెడల అంకితభావంలోనూ, వర్గ దృక్పధంలోనూ, ప్రజలను ప్రేమించడంలోనూ చరిత్ర పురోగమనంపై విశ్వాసం ఉంచడంలోను ఆయన నిజాయితీని వేలెత్తి చూపే అవకాశమే లేదు. ఇటువంటి కామ్రేడ్‌ను కోల్పోవడం, పార్టీకి, పీడిత ప్రజానీకానికి ఎనలేని నష్టమే. కామ్రేడ్ అశోక్ జూన్ 16, 2021న విశాఖ జిల్లా, తీగలమెట్ట వద్ద గ్రేహౌండ్స్ పోలీసులు చేసిన అకస్మాత్ దాడిలో అమరుడైనాడు. ఆయనతో పాటు కా. రణదేవ్, కా. కిషోర్, కా. చైతె, కా. పాయికె, కా. లలిత అమరులైనారు. ఈ కామ్రేడ్స్ అందరికీ వినమ్రంగా జోహార్లు అర్పిస్తూ, వాళ్ల ఆశయాలను నెరవేర్చేందుకు తుదకంటా మొక్కవోని విశ్వాసంతో పోరాడడమే, వాళ్లకు మనమిచ్చే నిజమైన నివాళి.

**"ఎక్కడ పోరాటం ఉందో అక్కడ త్యాగం ఉంది. మరణమనేది సామాన్యమైన ఘటన. కాని ప్రజల ముందు ప్రజల అవసరాలు, బాధలు పర్చుకొని ఉన్నాయి. మన హృదయాల్లో ఇవి స్పందిస్తున్నవి. మనం ప్రజల కొరకు చనిపోయినప్పుడు మన చావు సార్థకమవుతుంది."**

*– మావో*

# మట్టిలో మాణిక్యం కామ్రేడ్ అనిల్ (సోడి మూక)కు విప్లవ జోహార్లు అర్పిద్దాం!
# ఆయన ఉన్నతమైన ఆశయాన్ని ముందుకు తీసుకుపోదామని ప్రతినబూనుదాం!!



ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతంలో గత 2 సంవత్సరాలుగా వ్యూహాత్మక 'సమాధాన్', అందులో భాగంగా ఆపరేషన్ 'ప్రహార్' పేరుతో కొనసాగుతున్న సైనిక దాడి ప్రత్యేకంగా కేంద్రీకరించబడి తీవ్రరూపం దాల్చింది. ఈ దాడిని ప్రతిఘటించి ఓడించడంలో ప్రజలు, పార్టీ, పీఎల్‌జీఏ అనన్యమైన త్యాగాలను చేస్తున్నారు. అందులో భాగంగానే నాయకత్వ కదలికల సమాచారం అందుకున్న ఇంటలీజెన్స్ ఇచ్చిన పక్క సమాచారం(అక్టోబర్ 12, 2021)తో ఏపీ గ్రేహౌండ్స్ బలగాల నాయకత్వంలో చత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన ప్రత్యేక కమాండో బలగాలు చత్తీస్‌ఘడ్, ఒడిశా సరిహద్దులోని చాందమెట్ట గ్రామ అటవీ ప్రాంతంలో అక్టోబర్ 12, 2021 తెల్లవారుజామున 5:30 గంIIలకు దళమకాంను పకడ్బందీ ప్లాన్‌తో వందలాది బలగాలతో నలువైపుల నుండి అనేక వలయాలుగా చుట్టుముట్టి దాడి చేసాయి. ఈ వలయాన్ని గండికొట్టి నాయకత్వాన్నీ, క్యాడర్‌ను రక్షించడానికి వీరోచితంగా పోరాడుతూ కామ్రేడ్ అనిల్‌తోపాటు కామ్రేడ్ సోని, చిన్నారావులు అసువులు బాసారు. పార్టీ నాయకత్వాన్నీ, శ్రేణులను రక్షించి శత్రువు లక్ష్యాన్ని నెరవేరకుండా వమ్ము చేసారు. ఈ పోరాటంలో మొదట అనిల్ గాయపడ్డాడు. అయినా గుండె నిబ్బరం కోల్పోకుండా తన టీంకు నాయకత్వం వహించాడు. చివరకు తన చేతిలోని ఆయుధాన్ని కూడా శత్రువుకు స్వాధీనం కాకుండా, తన సహచర కామ్రేడ్స్‌కు అందించి, ప్రాణత్యాగం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచాడు.

ఒడిశా రాష్ట్రంలోని మల్కనగిరి జిల్లా, కలిమెల ఏరియా, సుద్దకుంట గ్రామంలో సుమారు 38 సంవత్సరాల క్రితం నిరుపేద ఆదివాసీ కుటుంబంలో కామ్రేడ్ అనిల్ పుట్టాడు. తల్లిదండ్రులు ఆయనకు పెట్టిన పేరు సోడి మూక. ఉమ్మడి కుటుంబంలో పెరిగి పెద్ద వాడయ్యాడు. అప్పటికే ఆ ప్రాంతంలో బలమైన వర్గపోరాటం జరుగుతూ విప్లవోద్యమం అభివృద్ధి చెందింది. అందులో తన స్వంత గ్రామం అయిన సుద్దకుంట కూడా ఉంది. ఆ విప్లవ రాజకీయాలు తనపై గాఢమైన ప్రభావం వేసాయి. బాలలసంఘంలో సభ్యుడిగా చేరి పని చేసాడు. పెద్దవాడయిన తర్వాత పితూరి ఎందన దళం (పీఏడీ) సభ్యుడిగా చేరి, తన గ్రామంతోపాటు చుట్టుపక్కల గ్రామాలలో సాంస్కృతిక ప్రదర్శనలు యిచ్చి ప్రజల్లోకి విప్లవ రాజకీయ ప్రచారాన్ని తీసుకుపోయాడు. దానితోపాటు పార్టీ అప్పగించిన ప్రతి పనిని ఎంతో బాధ్యతాయుతంగా నిర్వహించేవాడు. ఈ క్రమంలోనే పార్టీ పిలుపుతో 2003లో వృత్తివిప్లవకారుడిగా పార్టీలోకి రిక్రూట్ అయ్యాడు. కొద్ది రోజులు స్థానికంగా కలిమెల దళంలో సభ్యుడిగా పని చేసాడు. ఆయనలో రాజకీయ పరిణతినీ, క్రమశిక్షణనూ, విప్లవ నిబధతను గుర్తించి ఆయనకు పార్టీ సభ్యత్వం యిచ్చి, నాయకత్వ కామ్రేడ్‌కు గార్డుగా నియమించింది. తనకు అప్పగించిన కర్తవ్యాన్ని మనస్ఫూర్తిగా నిర్వర్తించాడు. పార్టీ 2004లో ఒడిశా రాజధాని భువనేశ్వర్ నగరంలో సాంస్కృతిక ప్రదర్శన ఇవ్వడానికి పితూరి ఎందన దళంతో కలిసి కామ్రేడ్ అనిల్‌ను కూడా పంపింది. కార్యక్రమాన్ని పూర్తి చేసుకొని తిరిగి వస్తున్నప్పుడు ఆ బృందాన్ని మల్కనగిరి పోలీసులు అరెస్టు చేసి, తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపారు. ఒక సంవత్సరకాలం జైలు జీవితం గడిపి బెయిల్‌పై విడుదలై నేరుగా దళంలోకి వచ్చాడు. అప్పటి నుండి 2007 వరకు కలిమెల దళంలో సభ్యుడిగా పని చేసాడు. 2007 చివరలో ఉద్యమ విస్తరణలో భాగంగా గుమ్మ (బోండగాటి) దళాన్ని నిర్మాణం చేసి, అందులో సభ్యుడిగా పంపింది. అప్పటి నుండి

తాను అమరుడయ్యే వరకు సుమారు 14 సంవత్సరాలు అదే ప్రాంతంలో వివిధ స్థాయిల్లో పార్టీ అప్పగించిన బాధ్యతలను నిర్వర్తించాడు.

2009లో ఏరియా కమిటీ సభ్యుడిగా ప్రమోట్ అయ్యాడు. ఆ ప్రాంత ప్రజల సమస్యలను అర్థం చేసుకోవడంతోపాటు, వారికి విప్లవ రాజకీయాలను బోధించి, వర్గపోరాటంలోకి సమీకరించడంలో చురుకైన పాత్రను పోషించాడు. 2010లో మల్కనగిరి-కొరాపుట్ సరిహద్దు (ఎమ్‌కేబీ) డివిజన్ ప్లీనంలో ప్రతినిధిగా పాల్గొని, డివిజన్ పర్‌స్పెక్టివ్‌పై చర్చ చేసి, దానికి తుదిరూపం ఇచ్చిన దాడిలో ముఖ్యమైన భూమికను పోషించాడు. కామ్రేడ్ అనిల్‌లో పెరిగిన రాజకీయ, నిర్మాణ, మిలటరీ సమర్థతలను దృష్టిలో పెట్టుకొని పార్టీ 2011లో గుమ్మ ఎల్‌ఓఎస్ కమాండర్‌గా నియమించింది. ఆ ప్రాంతంలో బలిమెల రిజర్వాయరు నిర్మాణం తర్వాత వందలాది గ్రామాలకు చెందిన వేలాది మంది ప్రజలు ముంపు సమస్యతో నిర్వాసితులుగా మారినా, ప్రభుత్వం వారికి ఎలాంటి నష్టపరిహారం చెల్లించలేదు. ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించక తీవ్రమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. ఈ సమస్యను కేంద్రంగా చేసుకొని ఆ ప్రాంతంలోని విశాల ప్రజలను కూడగట్టి, విశాల ప్రజలలో పోరాట కమిటీని ఏర్పాటు చేసి, వేలాది మంది ప్రజలను కదిలించి, చిత్రకొండ స్టీల్‌వే వద్ద బైఠాయించి ఆందోళనకు దింపాడు. ప్రభుత్వం ఈ పోరాటానికి తలవంచక తప్పలేదు. పోరాటకమిటీతో కలెక్టర్ చర్చలు జరిపి కొన్ని డిమాండ్లను అంగీకరించాడు. ఈ విజయం ప్రజలలో గొప్ప పోరాట స్ఫూర్తిని పెంచింది. ప్రతి సంవత్సరం రిజర్వాయర్ నీటిమట్టం పెంచడం మూలంగా రైతుల పంటలు ముంపుకు గురికావడంతో తలెత్తె కరువు సమస్యపై ఈ ప్రాంత ప్రజలను ఆదుకోవాలని ఇతర ప్రాంతాల ప్రజలకు పిలుపునిచ్చి, విరాళాలు సేకరించి పంపిణీ చేసి, అన్ని ప్రాంతాల ప్రజల మధ్య సంఘీభావాన్నీ, సమైక్యతను పెంచాడు. క్రమంగా (ఆ పోరాటాన్ని) స్థానిక భూస్వాములకు వ్యతిరేకంగా 'దున్నేవారికే భూమి, విప్లవ ప్రజా కమిటీలకే సర్వాధికారాలు' అనే నినాదం చుట్టు ప్రజలను వర్గపోరాటంలోకి దింపి, గురుశెట్టి గ్రామానికి చెందిన కరుడగట్టిన నుండి భూస్వాములకు చెందిన వందలాది ఎకరాల భూములతోపాటు, ఇతర భూస్వాముల భూములను స్వాధీనం చేసుకొని, వ్యవసాయ కూలి, పేద రైతులకు పంపిణీ చేసాడు. దీని వెన్నంటి ఏరియాలో ఏపీ-ఓఎస్ బలగాల సమన్వయంతో 2015 ఆలౌట్ ఆపరేషన్ పేరుతో భారీసైనిక దాడి ప్రారంభమయ్యింది. 2016 అక్టోబర్ 24న రాంగూడ అడవిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 31 మంది కామ్రేడ్స్‌ను శత్రువు హత్య చేసాడు. ఈ సంఘటన తర్వాత ఆ ప్రాంత ఉద్యమాన్ని దెబ్బతీసామని ప్రభుత్వం ప్రగల్బాలు పలికింది. ఇందుకు ధీటుగా 2017లో కామ్రేడ్ అనిల్ గుమ్మ ఏరియా కమిటీ కార్యదర్శిగా ఎన్నికయ్యాక, పార్టీ గైడెన్స్‌తో తిరిగి ఆ ప్రాంత ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో అలుపెరగని కృషి చేసాడు. రాంగూడ అమరత్వాలు ప్రజల్లో శత్రువుపై మరింత వర్గకసిని పెంచాయి. దానికి సరైన రాజకీయ దిశానిర్దేశం ఇచ్చి వ్యవసాయక విప్లవ కార్యక్రమాన్ని ముందుకు తీసుకుపోవడంలో భాగంగా విప్లవ భూసంస్కరణలు అమలు చేస్తూ, దానిని సమిష్టి వ్యవసాయం వైపుగా అభివృద్ధి చేసాడు. 2017లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తిగా బహిష్కరించే విధంగా ప్రజలను రాజకీయంగా చైతన్యపరిచి ప్రభుత్వ యంత్రాంగాన్ని నిర్వీర్యం చేసాడు. ప్రత్యామ్నాయ ప్రజాభివృద్ధి నమూనాను ముందుకు తెచ్చి, స్థానికంగా రోడ్లు, విద్య, వైద్యం, త్రాగునీటి సమస్యలను పరిష్కరించాడు. అంతేకాక బీజప్రాయంలో ప్రజల రాజ్యాధికార నిర్మాణాల ఏర్పాటుకు కృషి చేసాడు.

ప్రభుత్వం మాత్రం ఈ ప్రాంత విప్లవోద్యమాన్ని రూపుమాపడానికి రోడ్లు, బ్రిడ్జీలు, సెల్‌టవర్స్ నిర్మించి,కార్పెట్ సెక్యూరిటీని విస్తరింపజేస్తూ ఇదే 'ప్రజాభివృద్ధి' అంటూ ప్రచారం గావిస్తున్నది. దీనికి వ్యతిరేకంగా కామ్రేడ్ అనిల్ నాయకత్వంలో వేలాది మంది ప్రజలను కదిలించి ఆ ఆందోళనకు నాయకత్వం వహించాడు. కార్పెట్ సెక్యూరిటీ మధ్య కూడా శత్రువు కనుగప్పి, రహస్యంగా ప్రజలతో, ప్రజా నిర్మాణాలతో సజీవ సంబంధాలను నెరుపుతూ, ప్రజాయుద్ధాన్ని నడిపాడు. ప్రజలలో తన విప్లవ కృషి అంతటిలో సరైన వర్గపంథా, ప్రజాపంథాలను అనుసరించి పని చేసాడు. 2007 నుండి 2021 వరకు సుమారు 14 సంవత్సరాలపాటు, అదే ప్రాంతంలో వివిధ స్థాయిల్లో పార్టీ అప్పగించిన బాధ్యతలను నిర్వహించాడు. ఈ క్రమంలో ఉద్యమంలో ఎదురయ్యే ఆటుపోట్లలో ప్రజలను అంటిపెట్టుకొని దృఢంగా ఉంటూ, వారికి నాయకత్వం వహించడంలో ప్రజలకు ఎనలేని విశ్వాసపాత్రుడైన నాయకుడయ్యాడు.

2021లో తాను అమరుడు కావడానికి కొద్ది నెలల క్రితమే డివిజన్ కమిటీ సభ్యుడిగా ప్రమోట్ చేయబడ్డాడు. ఏ బాధ్యతలనైనా స్వీకరిస్తూ, ఆ బాధ్యతలకు న్యాయం చేసే విధంగా తనను తాను మలుచుకోవడంలో ఎంతో విప్లవ విధేయత కలిగి ఉండేవాడు. ప్రజలతోనే కాదు, క్యాడర్‌లను డీల్ చేయడంలో ఎంతో ఓపికతో వ్యవహరించేవాడు. నూతన క్యాడర్‌లకు బాధ్యతగా చదువు నేర్పడం, రాజకీయాలు బోధించడం, క్రమశిక్షణను అలవర్చడం తదితర విషయాలలో ఓర్పు-నేర్పును ప్రదర్శించేవాడు. గొప్ప ప్రజానాయకుడిగా ఎదిగినా, అత్యంత సాదాసీద జీవితం గడిపేవాడు. కష్టపడి పని చేస్తూ, ప్రజాస్వామికంగా ఉండటంతో అందరికీ ఆదర్శప్రాయుడయ్యాడు. 18 ఏళ్ళ సుదీర్ఘ జీవితంలో ఎదురయిన అనేక ఆటుపోట్లలో విప్లవ దృఢసంకల్పాన్ని ప్రదర్శిస్తూ రాటుదేలాడు. ఆయన జీవితం విప్లవ ఆచరణ, నాయకత్వశైలి భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా, అనుసరణీయంగా మలిచి అనేక మందిని విప్లవ వారసులుగా తయారు చేద్దామని ప్రతిన బూనుదాం.

# వర్గపోరాట కొలిమిలో రాటుదేలిన అడవి పుత్రిక కామ్రేడ్ సోని(పారో)కి అరుణారుణ వందనాలు!

చత్తీస్‌ఘఢ్ రాష్ట్రం, దంతెవాడ జిల్లా, గీదం పట్టణానికి దగ్గరలో ఉన్న కూలిపేటలో వారి నివాసం. పొట్టచేతబట్టుకొని బతుకుదెరువు కోసం ఆ కుటుంబం అక్కడికి చేరింది. సరిగ్గా అక్కడే పేద ఆదివాసీ కుటుంబంలో కామ్రేడ్ సోని(పారో) జన్మించింది. అప్పటికే రక్తహీనతతో, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న తల్లి, సోనికి సరిగ్గా పాలు కూడా పట్టేది కాదు. రెక్కాడితేగాని డొక్కాడని బతుకులతో జీవనం నడిచేది. సోని తల్లిదండ్రులిద్దరూ కూలి పనులు చేస్తుండేవాళ్ళు. అర్ధాకలితో, చాలిచలని బ్రతుకులతో జీవిస్తూ, పిల్లలను కూడా కూలీలుగా మార్చడం ఇష్టంలేని ఆ కుటుంబం భూమి సంపాధించి, వ్యవసాయం చేసి స్వతంత్రంగా బ్రతకాలని నిర్ణయించుకున్నారు. పొట్టచేత పట్టుకొని బ్రతుకుదెరువు కోసం బీజాపూర్ జిల్లా, బైరన్‌ఘడ్ ఏరియా, సురకడకు మకాం మార్చారు. అడవిలో దొరికే ఇప్పపువ్వు, తూనికాకు తదితర వాటిపై ఆధారపడ్తూ సంవత్సరం గడిపారు. కానీ అక్కడ కూడా భూమి సంపాధించలేకపోయారు. దానితో విప్లవ పోరాటం జరుగుతున్న పక్కనే ఉన్న కేశూర్‌కి మకాం మార్చారు. అక్కడ పార్టీ నాయకత్వంలో జనతనసర్కార్ల ఆధ్వర్యంలో ఆ ప్రాంతమంతా విప్లవాధికారం అమలవుతున్నది. దీంతో కొద్ది కాలానికే సోని తండ్రి పార్టీ రాజకీయాలకు ఆకర్షితుడై సంఘంలో చేరాడు. అప్పటికీ సోనికి 6 సంవత్సరాలు. ఒక చెల్లి, ఒక తమ్ముడు ఉన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న తల్లి మరణించింది. ఆ తర్వాత సంవత్సరం తిరక్కుండానే తమ్ముడు చనిపోయాడు. ఈ క్రమంలో గ్రామంలోని పార్టీ నిర్వహించే మీటింగ్‌లు, సీఎన్ఎమ్ సాంస్కృతిక కార్యక్రమాలకు ఆకర్షితురాలై సోని బాలల సంఘంలో చేరింది.

పార్టీ విప్లవ భూసంస్కరణల్లో భాగంగా సోని కుటుంబానికి కూడా కొంత భూమి దక్కింది. తండ్రి పొలం పనులు చేసుకుంటూనే, వీలైనప్పుడు కూలి పనులకు పోతూ గొడ్లను కొన్నాడు. తండ్రి సంఘంలోని అధ్యక్షుడిగా ఎదగడంతో ఎక్కువ సమయం పార్టీ పనులకే కేటాయించేవాడు. గొడ్లను మేపడం, తనకన్న చిన్నదైన చెల్లిని పెంచడం, కుటుంబ బాధ్యతలు కూడా చూడడం సోని వంతయింది. బాలల సంఘంలో పని చేస్తూనే, తండ్రి చేసే ప్రజాపనిని చూసి ఎంతో ఉత్సాహపడేది. అలాంటి పనిని తను కూడా ఎన్నుకోవాలని నిర్ణయించుకుంది. అప్పటికీ సోనికి 16 సంవత్సరాలు. ఈ క్రమంలో మిలీషియాలో సభ్యురాలిగా చేరింది. సంవత్సర కాలంపాటు పని చేసింది.



పార్టీ పిలుపునందుకొని 2014 డిసెంబర్ 2 పీఎల్‌జీఏ వారోత్సవాలలో భాగంగా కామ్రేడ్ సోని పార్టీలోకి పూర్తికాలం కార్యకర్తగా రిక్రూట్ అయింది. స్థానిక దళంలో 6 నెలలు పని చేసింది. అనంతరం పార్టీ నిర్ణయంలో భాగంగా ఏఓబీ జోన్‌కు బదిలీ అయింది. ఏఓబీ అవసరాలకనుగుణంగా కామ్రేడ్ సోనిని సీసీఎమ్ నాయకత్వ కామ్రేడ్‌కు గార్డ్‌గా నియమించింది. ఇంటిదగ్గర చిన్ననాటి నుండే కష్టాలను చవిచూసిన కామ్రేడ్ సోనికి విప్లవ జీవితం సమస్యగా ఏమి అనిపించలేదు. తెలియని భాషకి తోడు, ఎత్తైన కొండలు, గుట్టలతో ఏఓబీ ప్రాంతమంతా ఎగుడు, దిగుడులతో ఉండేది. ఆ ప్రాంతానికి అనుగుణంగా తనను తను అతితక్కువ సమయంలోనే మలుచుకుంది. చిన్ననాటి నుండే కుటుంబ బాధ్యతలు నిర్వహించడం మూలంగా జీవితానుభవం సంపాధించింది. ఆ అనుభవం విప్లవంలో ఆమె ఎదుగుదలకు అదనపు అంశంగా తోడ్పడింది. ఏ పని చేసినా ఆర్భాటం లేకుండా ప్రణాళికాబద్ధంగా, నైపుణ్యంతో విధులు నిర్వహించేది. బాధ్యుడి అవసరాలను ముందుగానే గుర్తించి తీర్చేది. స్కూలు, సమిష్టి ఇతర పనులను చూస్తూనే బాధ్యుడిని ఓ కంట కనిపెట్టుకొని ఉండేది. గార్డ్ విధులను నిర్వహిస్తూనే తెలుగు భాష రాయడం, చదవడంతోపాటు

తరువాయి భాగం 45వ పేజీలో

# ఇంద్రావతి నది ఒడ్డున జన్మించిన గెరిల్లా వీర పుత్రుడు కామ్రేడ్ అంజన్న (సన్ను)కు రెడ్‌శాల్యూట్స్!



చత్తీస్‌గఢ్ రాష్ట్రం, బీజాపూర్ జిల్లా, పశ్చిమ బస్తర్ డివిజన్, కెర్పి పంచాయితీ, నేషనల్‌పార్క్ ఏరియా, కర్కవాడ గ్రామంలోని నిరుపేద ఆదివాసీ కుటుంబంలో తల్లి కొతే, తండ్రి మల్లులకు కామ్రేడ్ అంజన్న మూడవ సంతానంగా జన్మించాడు. అంజన్న తోబుట్టువులు ఒక అక్క, ఒక తమ్ముడు ఉన్నారు. తల్లిదండ్రులు పెట్టిన పేరు సన్ను. పార్టీ ఆధ్వర్యంలో జనతనసర్కార్లు పంచిన భూమి సాగు చేసుకుని కుటుంబం జీవనం కొనసాగించేది. అంజన్న కూడా చిన్నతనంలోనే తల్లిదండ్రులతోపాటు పొలం పనుల్లో భాగమయ్యేవాడు. అప్పటికే ఏర్పాటు అవుతున్న జనతనసర్కార్ల ఆధ్వర్యంలో ఆ ప్రాంతమంతా విప్లవ ప్రజారాజ్యాధికారం నెలకొల్పబడుతున్నది. తమని తాము పాలించుకుంటూ, ప్రజలు జల్, జంగల్, జమీన్, ఇజ్జత్, అధికారం కోసం దోపిడీ రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడుతున్నారు. సరిగ్గా అప్పుడు 8 సంవత్సరాల వయస్సు నిండిన అంజన్న బాలలసంఘంలో సభ్యుడయ్యాడు. బాలలసంఘానికి ఇచ్చిన బాధ్యతల విషయంలో తోటివారితో కలిసి ఉత్సాహంగా పని చేసేవాడు. గ్రామానికి దళం వచ్చినప్పుడు వారి అవసరాలను తీరుస్తూనే, వారితో పాటలు నేర్చుకోవడం, వారు చెప్పే విషయాలను శ్రద్ధగా వినడం చేస్తుండేవాడు. అంజన్న చురుకుదనాన్ని గమనించి బాలలసంఘానికి నాయకుడుగా ఎన్నుకున్నారు. ఈ క్రమంలో మరింత బాధ్యతగా ఉంటూ జనతనసర్కార్లు, మిలీషియా, సీఎన్ఎమ్ నిర్వహించే అన్ని కార్యక్రమాలలో తాను భాగం అవడమే కాకుండా, తోటిమిత్రులను కూడా భాగంచేస్తూ తమకిచ్చిన పనిని సమర్థవంతంగా నిర్వహించేవాడు.

పాటలపై అంజన్నకున్న ఇష్టంతో సీఎన్ఎమ్ కార్యక్రమాలలో పాల్గొనేవాడు. అంతేకాక పాటలు నేర్చుకొని గ్రామంలో సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చేవాడు. ఈ క్రమంలో తనకున్న ఇష్టాన్ని గమనించి పంచాయితీ సీఎన్ఎమ్ బాధ్యతలు అప్పగించారు. సీఎన్ఎమ్ విధులు నిర్వహిస్తూనే ఏరియాలోని భూమి చదును కార్యక్రమాల్లో, పార్టీ వారోత్సవాల కార్యక్రమాలలో పాల్గొనేవాడు. సీఎన్ఎమ్‌లోని పాటలు, డాక, నాటికలు అన్నింటిని నేర్చుకుంటూనే ఇంటి పనుల్లో భాగమయ్యేవాడు. సీఎన్ఎమ్ పనులపై వివిధ గ్రామాలకు వెళ్ళినప్పుడు ప్రజల పనిలో పాల్గొంటూ, పాటలు పాడి, దానిలోని సారాన్ని వివరిస్తూ, వారితో తల్లో నాలుకలా కలిసిపోయేవాడు.

కామ్రేడ్ అంజన్న 2013లో పార్టీలోకి పూర్తికాలం కార్యకర్తగా రిక్రూట్ అయ్యాడు. అప్పటికీ తనకు 16 సంవత్సరాల వయస్సు. స్థానిక దళంలో 4 నెలలు పని చేసాక డీవీసీఎమ్ కామ్రేడ్‌కి గార్డుగా నియమించబడ్డాడు. గార్డుగా ఉంటూ, రక్షణ బాధ్యతలు చూస్తునే, రోజువారి సమిష్టి పనుల్లో పాల్గొనేవాడు. అప్పటివరకు చదువేరాని అంజన్న చాలా చురుగ్గా, హుషారుగా చదువు నేర్చుకున్నాడు. బాధ్యుడికి అన్ని విధాల సహాయ సహకారాలను అందిస్తూ, కమాండర్ కాషన్‌ను విధిగా క్రమశిక్షణతో పాటించేవాడు.

2019లో కామ్రేడ్ అంజన్న మద్దేడు 11వ ప్లాటూన్‌లోకి బదిలీ అయ్యాడు. మిలటరీ విషయాలను నేర్చుకోవడంలో ముందుండేవాడు. ఎక్సర్‌సైజ్‌లు, డ్రిల్స్ నేర్చుకొంటూనే పార్టీ నిర్ణయించిన మిలటరీ చర్యలలో పాలుపంచుకునేవాడు. తామున్న ఏరియాలోకి శత్రువు ప్రవేశించాడనే విషయం తెలియగానే అఫేన్స్ టీమ్స్ ఎంగేజ్ అయ్యేవి.

ఆ టీమ్స్‌తోపాటు కామ్రేడ్ అంజన్న కూడా పాల్గొనేవాడు. ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను ధ్వంసం చేసే క్యాంపెయిన్‌లలో పాల్గొన్న సందర్భాల్లో వర్గకసిని ప్రదర్శించేవాడు. శతృనిర్మూలనలో భాగంగా టీసీఓసీ క్యాంపెయిన్‌లలో పాల్గొన్నప్పుడు తన దగ్గర ఉన్న బీజీఎల్(బెటాలియన్ గ్రెనేడ్ లాంచర్)తో సెల్స్ ప్రయోగించేవాడు. సెల్స్ లాంచ్ చేయడంలో మంచి పట్టును సంపాధించాడు. మిలటరీపరంగా నైపుణ్యాన్ని సంపాదిస్తూనే, అధ్యయనాన్ని మరిచేవాడు కాదు. పార్టీ పత్రికలైన ప్రభాత్, వియుక్క, మిడుంగూర్, పితూరీ తదితర పుస్తకాలను చదువుతూ, అర్థంకాని విషయాలను నోట్ చేసుకొని అడిగి తెలుసుకునేవాడు. తనలోని మిలటరీపరంగా, రాజకీయ పరంగా ఎదుగుదలని చూసి, పార్టీ 2020లో పీపీసీఎమ్‌గా ప్రమోట్ చేస్తూ, సెక్షన్ డిప్యూటీ కమాండర్‌గా నియమించింది.

ఇన్‌ఫార్మర్ సమాచారంతో శతృవు దేరాని చుట్టుముట్టిన ఇసునార్, కర్క, ఎర్రాం, ఈతగూడెం సంఘటనలలో ఫైరింగ్ చేస్తూ రిట్రీట్ అయ్యాడు. టొండమర్క, కస్నాల్‌పాడ్, పాలోడ్, వినప, కేష్‌కుతుల్ (సీఆర్‌పీఎఫ్ క్యాంపుపై దాడి), నెల్లిమడుగు తదితర అంబూష్‌లలో శతృవుపై బీజీఎల్ సెల్స్ ప్రయోగించాడు. కొన్నిసార్లు శతృవును గాయపర్చాడు. మిలటరీపరంగా పార్టీ పనిపద్ధతులను పాటిస్తూ, గెరిల్లాయుద్ధ నియమాలనూ, క్రమశిక్షణా సూత్రాలను తూ.చ తప్పక పాటించేవాడు.

2021 మార్చిలో పార్టీ అవసరాల రీత్యా కామ్రేడ్ అంజన్న ఏఓబీ జోన్‌కు బదిలీ చేసింది. పార్టీ అవసరమెరిగి తన బదిలీని మనస్ఫూర్తిగా ఆమోదించి అమలు చేసాడు. ఏఓబీలో తీవ్రమైన శతృ నిర్బంధాన్ని చవిచూస్తూన్నప్పటికీ, రాజకీయంగా, చైతన్యవంతంగా పరిస్థితులకు అనుగుణంగా తనను తాను మలుచుకున్నాడు. మల్కనగిరి జిల్లాలోని కలిమెల ఏరియా కమిటీ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించాడు. ఈ క్రమంలో 2021, జూన్ 16వ తేదీన తీగలమెట్ట (విశాఖపట్నం జిల్లా)వద్ద శతృవు మకాంను అన్నివైపుల నుండి చుట్టుముట్టి, తమ సెక్షన్‌కు అత్యంత సమీపానికి వచ్చి, అకస్మాత్తుగా చేసిన దాడిలో అమరులైన కామ్రేడ్స్ అశోక్, రణదేవ్, పాయికే, లలిత, చైతేలతోపాటు కామ్రేడ్ అంజన్న కూడా శతృవుతో పోరాడుతూ తన తుదిశ్వాస విడిచాడు.

ఛత్తీష్‌ఘడ్ రాష్ట్రంలోని ఇంద్రావతి నది ఒడ్డున జన్మించి, కార్మికవర్గతత్వాన్ని పునికిపుచ్చుకొని, కమ్యూనిస్టులకు ఎల్లలు లేవని ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దులో తన నులివెచ్చని రక్తాన్ని ధారపోసిన యువ వీరకిశోరం కామ్రేడ్ అంజన్నకు తలవంచి వినమ్రంగా జోహార్లర్పిందాం. అంజన్న కలలు గన్న నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం తుదకంటా ఉద్యమిద్దాం. ఇదే మనం అంజన్నకిచ్చే నిజమైన నివాళి!

## 43వ పేజీ తరువాయి భాగం

ఒడియా, తెలుగు భాషల్లో మాట్లాడటం నేర్చుకున్నది. మెజారిటీ ఆదివాసీ కామ్రేడ్స్ రక్తహీనతకు గురవుతుంటారు. కామ్రేడ్ సోని కూడా రక్తహీనత సమస్యను ఎదుర్కొనేది. ఏజెన్సీ ప్రాంతాలను వెంటాడే మలేరియా జ్వరం పార్టీలోని కామ్రేడ్స్‌ని మరింత ఇబ్బందికి గురి చేసేది. ఇలాంటి అనారోగ్య సమస్యలను భరిస్తూనే తనని తాను ఆ సమస్యలనుండి బయటపడటానికి ప్రయత్నం చేసేది. అప్పటికే నిత్య నిర్బంధాన్ని ఎదుర్కొంటున్న ఏఓబీ, 2015లో శతృవు మరింత దూకుడుగా 'ఆపరేషన్ ఆలౌట్' అభియాన్ పేరుతో రెండు రాష్ట్రాల పోలీసు (గ్రేహౌండ్స్, ఎస్ఓజీ)బలగాల సమన్వయంతో, తన పాశవిక దాడిని మరింత ఉధృతం చేసాడు. అప్పటివరకు అతిపెద్ద సంఘటనగా నిలిచిన రాంగూడ ఎన్‌కౌంటర్‌లోనూ, ఆ తర్వాత జరిగిన టిక్రపడ, పానిపాదూర్, దొరగూడ, లందూలు, దగుడుపల్లి, పాలసముద్రం, తీగలమెట్ట తదితర అనేక ఎదురుకాల్పుల సంఘటనలలో నాయకత్వంతో వెన్నంటే ఉంటూ రక్షించడంలో, తననుతాను రక్షించుకోవడంలో నిబ్బరంగా ఉంది. ఈ నిర్బంధాన్ని రాజకీయంగా అర్థం చేసుకొని ముందుకు సాగింది. కామ్రేడ్ సోని రాజకీయ ఎదుగుదలను పరిశీలించిన పార్టీ 2018లో ఏసీలోకి ప్రమోట్ చేసింది. 2015 నుండి 2021 తను అమరురాలయ్యేవరకు పార్టీ అప్పగించిన నాయకత్వ బాధ్యతను అత్యంత నిష్టతో, పట్టుదలతో, బాధ్యతాయుతంగా నిర్వహించింది.

2021 అక్టోబర్ 12న కాంఫేర్‌ఘాటి ఏరియాలోని, టీవేంగూర్ అనే గ్రామ అటవీ పరిసర ప్రాంతంలో ఇన్‌ఫార్మర్ సమాచారంతో శతృవు దేరాని చుట్టుముట్టి చేసిన ఫైరింగ్‌లో హోరాహోరిగా పోరాడుతూ కామ్రేడ్స్ అనిల్, ఆజాద్‌లతోపాటు, కామ్రేడ్ సోని అమరురాలయ్యింది. దండకారణ్యంలోని జనతనరాజ్యంలో పుట్టిపెరిగి అదే రాజ్యాన్ని నిర్మించే లక్ష్యంతో ఏఓబీలో అడుగుపెట్టి పార్టీ రాజకీయాలకు అంకితమై తన తండ్రికీ, ప్రజలకు చేసిన వాగ్దానం అమరుల ఆశయ సాధనకు అంకితం అవుతానని చేసిన ప్రతిజ్ఞను నిలబెడుతూ తుది శ్వాస వరకు పోరాడి అసువులు బాసిన అడవి పుత్రిక కామ్రేడ్ సోనికి అరుణారుణ వందనాలు.

'విప్లవమంటే విందుభోజనం' కాదని తెలిసి కూడా తనని నమ్మిన ప్రజల కోసం చివరి ఊపిరి వరకు తన రక్తాన్ని చిందించింది. తమలాంటి వలస బతుకులు లేని, తన తల్లిలా, తమ్ముడిలా అనారోగ్యంతో చనిపోకుండా అసమానతలు లేని, అందరికి వైద్యం అందే మరో నూతన సమాజం కోసం తన రక్తాన్ని చిందించిన కామ్రేడ్ సోని కలలను నిజం చేద్దాం.

# దండకారణ్య విప్లవోద్యమంలో ఉదయించి
# ఏఓబీలో క్రాంతి కెరటమై ఎగసిన కామ్రేడ్ పాయికే అమర్ రహే!



చత్తీస్‌ఘడ్ రాష్ట్రం, బీజాపూర్ జిల్లా, భైరంగడ్ బ్లాక్, ఆరియెల్ గ్రామంలో సుమారు 25 సంవత్సరాల క్రితం కడ్తి పాయికే ఒక పేద కుటుంబంలో జన్మించింది. దండకారణ్య విప్లవోద్యమ ప్రాంతంలో ఉన్న తన గ్రామం కూడా ఆ విప్లవోద్యమ నిర్మాణంలో భాగమవుతూ వస్తున్నదే. ఆ విప్లవ రాజకీయ ప్రభావం చిన్ననాటి నుండే తనపై బలంగా ఉంది. ఆడిపాడుకునే వయస్సులోనే విప్లవ బాలల సంఘంలో చేరింది. శ్రమ గౌరవాన్ని గుర్తించి కష్టించే పని చేయడం, పేదరికానికి కారణాలు తెలుసుకోవడం, క్రమశిక్షణగా ఉండటం నేర్చుకున్నది. తల్లిదండ్రులతోపాటు అన్ని పనులలో పాల్గొంటూనే, అడవిలో పశు వులను మేపింది. పెరిగి పెద్దైన తర్వాత కుటుంబ పోషణకోసం దూర ప్రాంతాలకువెళ్ళి కూలిపనులు చేసింది. యివన్నీ తనకు గొప్ప జీవిత అనుభవాన్ని అందించాయి. 2005 ప్రారంభమై కొనసాగిన సల్వాజుడుం, 2009 నుండి కేంద్ర ప్రభుత్వ నాయకత్వంలో కొనసాగుతున్న 'ఆపరేషన్ గ్రీన్‌హంట్' అమానవీయ, నరసంహార, క్రూర అణచివేత దాడుల మధ్య మిలీషియాలో సభ్యురాలిగా పని చేసి, ప్రజలకూ, ప్రజా నిర్మాణాలకూ, పోరాట విజయాలకు రక్షణ కల్పించిన దానిలో భాగస్వామి అయింది. ఎంతటి నిర్బంధాలకు కూడా అదరలేదు, బెదరలేదు సరికదా, మరింత వర్గకసితో పోరాడింది. "ప్రజాసైన్యం లేకుండా ప్రజలకు ఉండేది ఏమి లేదు"నే విషయాన్ని అవగతం చేసుకున్న పాయికే తాను కూడా పీఎల్‌జీఏలో చేరి పూర్తికాలం పని చేయాలని నిర్ణయించుకున్నది. 2014వ సంవత్సరం చివరలో పార్టీలోకి రిక్రూట్ అయింది. ఉద్యమ అవసరాలను దృష్టిలో పెట్టుకొని పార్టీ కేంద్ర రీజినల్ కమాండ్ సప్లైదళానికి పంపాలని నిర్ణయించింది. పార్టీ నిర్ణయాన్ని ఎలాంటి తటాపటాయింపులు లేకుండా మనస్ఫూర్తిగా ఆమోదించింది. ఆ నిర్ణయంలో భాగంగా 2015లో ఏఓబీ ప్రాంతానికి బదిలీ అయింది. ఆ ప్రాంతం, ప్రజలు, వారి భాష తనకు పూర్తిగా కొత్త. అయినప్పటికీ పట్టుదలగా కృషిచేసి, తెలుగు, ఒడియా భాషలను నేర్చుకొని ప్రజలకు విప్లవ రాజకీయాలను బోధించే స్థాయికి ఎదిగింది. ఆ అత్యంత కఠిన పరిస్థితులలో కూడా ప్రజాయుద్ధ అవసరాల కోసం ఎన్నో కష్టాలకు ఓర్చి సప్లైలను అందించే కర్తవ్యాన్ని తనవంతుగా పూర్తి చేసింది. అంతకు మించి నాయకత్వ బాధ్యతలను కూడా ఎంతో క్రమశిక్షణగా, సాహసంగా, త్యాగపూరితంగా చేపట్టి ఆదర్శంగా నిలిచింది. ఏఓబీలోని నిత్యనిర్బంధం మధ్య కష్టభరితమైన గెరిల్లా జీవితాన్ని కొనసాగిస్తూ, రహస్య పని పద్ధతులను అమలు చేస్తూ పట్టుదలగా పని చేసింది.

ఏఓబీలో పోలీసులతో ముఖాముఖి జరిగిన అనేక ఎదురుకాల్పుల ఘటనలో పాల్గొన్నది. 2016లో బైపరిగూడ ఏరియా ముండగూడ గ్రామ పరిసర అటవీ ప్రాంతంలో ఎస్ఓజీ బలగాలు పక్క సమాచారంతో చుట్టుముట్టి చేసిన దాడిని ప్రతిఘటించి ఎలాంటి భౌతిక నష్టాలు లేకుండా బయటపడ్డారు. అలాగే నందపూర్ ఏరియా పనసపుట్ ఎన్‌కౌంటర్, 2018 పాన్‌పొద్దూర్ ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్నది. 2019లో చత్తీస్‌ఘడ్‌లోని తిరియా అటవీ ప్రాంతంలో పోలీసులు, దళముకాంపై దాడి చేసినప్పుడు సురక్షితంగా బయటపడినప్పటికీ, మరో గంటదూరంలో శత్రువు ఏర్పర్చిన

తరువాయి భాగం 48వ పేజీలో

# శ్రమైక జీవన సౌందర్యానికి మారు పేరు

# కామ్రేడ్ లలిత [కిల్లో తెల్లమ్మ]



మన్యం ఆదివాసులకు తరతరాలుగా అణచివేతకు గురవుతున్న చరిత్ర ఉంది. ఆ అణచివేతకు వ్యతిరేకంగా తిరగబడిన చరిత్రా ఉంది. ఆ పోరాట చరిత్రను కా॥ లలిత కూడా కొనసాగించింది. తూర్పు గోదావరి జిల్లా పాతకోట పంచాయితీ, బురదకోట గ్రామంలో సుమారు 30 సంవత్సరాల క్రితం కా॥ లలిత (కిల్లో తెల్లమ్మ) నిరుపేద కువ్వి ఆదివాసీ కుటుంబంలో పుట్టింది. ఈమె తండ్రిది ఒడిశా రాష్ట్రం, మల్కనగిరి జిల్లాలోని ఒక మారుమూల గ్రామం. చిన్నతనంలోనే బ్రతుకు తెరువు కోసం తూర్పుగోదావరి జిల్లా, బురదకోటలోని బంధువుల వద్దకు వచ్చి కూలిపనులు చేసుకుంటూ జీవిస్తున్న క్రమంలో అక్కడి అమ్మాయినే పెళ్ళి చేసుకున్నాడు. వీరికి కలిగిన 6గురి సంతానంలో కా॥ లలిత పెద్దది. బురదకోట గ్రామంలో కూడా వీరికి భూమి లేకపోవడంతో ఆ గ్రామానికి దూరంగా పెద్ద కొండపైన పోడు వ్యవసాయం చేసుకుంటూ మరో 2, 3 కుబుంబాలతో కలిసి లలిత చిన్నతనంలోనే 'ఫేములగొంది' అనే గ్రామాన్ని ఏర్పర్చుకొని స్థిరపడ్డారు. అయితే అక్కడ కూడా సరిగా పంటలు పండక మిగతా కుటుంబాలన్నీ క్రమంగా వెళ్ళిపోగా చివరకు ఒక్క లలిత కుటుంబం మాత్రమే అక్కడ మిగిలింది. కా॥ లలిత జీవితం చిన్నప్పటి నుండీ ఇంటిపని, వంటపని, వ్యవసాయపని, తన తర్వాత పుట్టిన చెల్లెళ్లనూ, తమ్ములను ఎత్తుకోవడం, గొడ్లను మేపటం వంటి పనుల్లో నిరంతరం శ్రమ చేసినా అర్ధాకలితోనూ, కష్టాలతోనే గడిచింది. తనకు ఇల్లు, కొండపోడు తప్ప మరో ప్రపంచం తెలియదు. ఏనాడు సంతకు కూడా వెళ్ళేది కాదు. కొండపైన ఒంటరి జీవితం కావడంతో తన వయసు పిల్లలు లేక తను ఎటువంటి సరదాలనూ, సంతోషాలను ఎరుగదు. అందువలన చాలా అమాయకత్వంతో, సిగ్గు, బిడియంతో ఉండేది. ఎప్పుడైనా బంధువులు వచ్చినా ఇంట్లో నుండి బయటకు వచ్చేది కాదు. అలాంటి కా॥ లలితకు ఆ ప్రాంతంలో పని చేసే గాలికొండ దళం తమ ఇంటికి వచ్చినప్పుడు వాళ్ళు పాడే పాటలు, వారు చెప్పే రాజకీయాలు, దళంలోని మహిళా కామ్రేడ్స్ తనతో స్నేహం చేస్తూ, చెప్పే విషయాలు తనకు ఎంతో ఆసక్తిని కలిగించాయి. పార్టీ చెప్పే రాజకీయాల ద్వారా బయటి ప్రపంచాన్నీ, దోపిడీనీ, పితృస్వామ్యాన్ని క్రమంగా అర్థం చేసుకున్నది. తను కూడా దళంలో పని చేయాలని ఆలోచించేది. అయితే తన తల్లికి కంటి జబ్బు వచ్చి రెండు కళ్ళూ కనిపించకపోవడం, తండ్రి నిరంతరం కల్లు తాగి ఉండటం, తల్లినీ, తమ్ముళ్ళు, చెల్లెళ్ళను తానే చూసుకోవాల్సి రావడం వంటి బాధ్యతలు తనను ఎంతో ఘర్షణకు గురి చేసాయి. అలా ఘర్షణ పడుతూనే చివరకు తాను దళంలో చేరాలనే స్థిరమైన నిర్ణయం తీసుకొని 2016 ప్రారంభంలో గాలికొండ దళంలోకి రిక్రూట్ అయ్యింది. ఆ తర్వాత తనను రిక్రూట్ చేసుకున్న డీవీసీ మెంబర్ కామ్రేడ్ రవి అమరత్వం, 2016 మేలో జరిగిన పాలసముద్రం ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్ ఆజాద్, ఆనంద్, కమలలు తన కళ్ళముందే అమరులు కావడం తనను ఎంతో కలచి వేసినప్పటికీ, శత్రువుపట్ల మరింత కసితో ధైర్యంగా నిలబడింది. దళంలో చదువు, రాజకీయాలు, మిలటరీ నేర్చుకోవడంలో ఎంతో క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేసింది. పార్టీ సభ్యురాలిగా బాలలసంఘం బాధ్యతలు తీసుకుని ఏ గ్రామానికి వెళ్ళినా పిల్లలతో మీటింగ్‌లు వేసి, సంగాలు పెట్టేది. గ్రామాలలో బహిరంగంగా మీటింగ్ చేయమన్నా, పాటలు పడమన్నా తను చాలా సిగ్గుపడేది. కానీ విడిగా బాలల సంఘాలకు మాత్రం రాజకీయాలు చెప్పడం, పాటలు నేర్పించటం బాధ్యతగా చేసేది.

దళంలో కమాండర్ ఆజ్ఞలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ఎంతటి శ్రమకైనా సిద్ధపడుతూ, ఎంతటి బరువులనైనా మోసేది. 2019మార్చిలో కోరాపుట్ జిల్లాలో కితుబా వద్ద జరిగిన ఫైరింగ్‌లో తన మేనమామ కామ్రేడ్ దాసు అమరత్వం తనకు ఎందో బాధను కలిగించింది. అదే సంవత్సరం గాలికొండ దళం కమాండర్ డీవీసీ సభ్యుడు నవీన్‌తోపాటు ఏసీ సభ్యులు, దళ సభ్యులు అందరూ పారిపోయి, శత్రువు ముందు లొంగిపోయినా, ఆ దళంలో తాను ఒక్కతే మిగిలినా కూడా కామ్రేడ్ లలిత ఎటువంటి ఊగిసలాటకు గురికాకుండా లొంగిపోయిన వాళ్ళను అసహ్యించుకుంటూ, అమరుల ఆదర్శాలను ఎత్తిపడుతూ దృఢంగా నిలబడింది. శత్రువు కూడా ఆమె కుటుంబం ద్వారా ఆమెను లొందీగసుకోవటానికి అనేక ప్రయత్నాలు చేసినా ఆమె తిప్పికొట్టింది. కామ్రేడ్ లలితలోని క్రమశిక్షణనూ, నిబద్ధతను దృష్టిలో పెట్టుకొని 2019 చివరలో ఆమెను పార్టీ ఎస్‌జడ్‌సీఎమ్‌కు గార్డుగా నియమించింది. అదే సంవత్సరం సెప్టెంబర్‌లో కొండజర్త వద్ద జరిగిన ఫైరింగ్‌లో తన బాధ్యురాలి వెన్నంటే ఉంటూ, ఆ ఫైరింగ్ నుండి బయటపడటంలో తన వంతు బాధ్యతను నిర్వహించింది. ఈ ఫైరింగ్ సంధర్భంగా రిట్రీట్ అయ్యి ఫేములగొందిలో లలితవాళ్ళ ఇంట్లో దాగి ఉన్న కామ్రేడ్ రమేష్, భూమాల్‌లను పసిగట్టి పోలీసులు పట్టుకొని కొండపైకి తీసుకపోయి కాల్చి చంపడంతో తను ఎంతగానో చలించిపోయింది.. లలిత వాళ్ళ కుటుంబాన్ని కూడా పోలీసులు కొట్టి, ఇంట్లో సమాన్లన్నీ చిందరవందర చేసి, పార్టీకి సహకరిస్తున్నారనీ, ఊరు ఖాళీ చేసి పోవాలని బెదిరించడంతో ఆ కుటుంబం అక్కడి నుండి ఖాళీ చేసి తిరిగి పొట్టచేత పట్టుకుని బురదకోటకే వెళ్ళిపోయింది. తనకు ఎంతో ప్రియమైన అమ్మ 2021లో చనిపోయిన 3 నెలల తర్వాత తనకు ఆ విషయం తెలిసినప్పుడు ఎంతో వేదనకు గురయ్యింది. కానీ దళానికి వచ్చిన తర్వాత మొత్తం కాలంలో తను ఏనాడు కూడా ఇంటినీ, కుటుంబాన్ని చూడాలని ఎప్పుడూ అడగలేదు. పార్టీ ఎప్పుడు ఏ పని చెప్పినా, ఎక్కడకు పంపినా ఎటువంటి శషభిషలు లేకుండా తనకిచ్చిన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ ఉన్నతమైన చైతన్యాన్ని ప్రదర్శించింది. 2021 మే 20న జరిగిన పాలసముద్రం ఫైరింగ్‌లో తన బాధ్యురాలితోపాటు, క్షేమంగా రిట్రీటయ్యింది. 2021 జూన్ 16వ తేదీన తీగలమెట్ట వద్ద శత్రువు మకాంను అన్నివైపుల నుండి చుట్టుముట్టి తమ సెక్షన్‌కు అత్యంత సమీపానికి వచ్చి అకస్మాత్తుగా చేసిన దాడిలో అమరులైన కామ్రేడ్స్ అశోక్, రణదేవ్, అంజన్న, పాయికే, చైతేలతోపాటు కామ్రేడ్ లలిత కూడా తన తుదిశ్వాసను విడిచింది.

కామ్రేడ్ లలిత 6 సంవత్సరాల విప్లవ జీవితంలో కల్లాకపటంలేని ఒక అమాయక ఆదివాసీ మహిళ ఒక విప్లవ వీర వనితగా ఎదిగిన ఉన్నత చైతన్యాన్ని మనం చూడవచ్చు. స్వచ్ఛమైన చిరునవ్వుకు, శ్రమైక జీవన సౌందర్యానికి మారుపేరుగా, అల్లూరి వారసురాలిగా, మన్యం పోరాట చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన కామ్రేడ్ లలిత ఆదర్శాన్నీ, త్యాగాన్ని ఎత్తిపడదాం.

46వ పేజీ తరువాయి భాగం

వలయంలో చిక్కుకొని దానిని గండికొట్టే క్రమంలో తన సహచర క్రామ్రేడ్స్ ఆరుగురు అమరులయ్యారు. అయినప్పటకీ, ఏ మాత్రం గుండె జారిపోకుండా వారి త్యాగాలనూ, ఆశయాలను మనస్సులో నింపుకొని మరింత విప్లవ దృఢసంకల్పంతో పని చేసింది. శత్రువు కోవర్ట్ ద్వారా వాకీటాకీలలో జీపీఎస్‌లు అమర్చి మనకు పంపాడు. వాటి ఆధారంగా 2020 జులై మాసంలో 10 రోజులలోనే వరుసగా దొరగూడ, లందూలు, దగుడుపల్లి వద్ద పీఎల్‌జీఏ బలగాలపై దాడులు చేసాడు. లందూలువద్ద జరిగిన పోలీసుల దాడిని తీవ్రంగా ప్రతిఘటిస్తూనే శత్రువు పేల్చిన తూట తగిలి గాయపడింది. ప్రజల సహకారంతో వైద్యం చేయించుకొని తిరిగి తన బాధ్యతలలోకి వెళ్ళింది.

ప్రజా వ్యతిరేకులనూ, పోలీసు ఏజెంట్లను శిక్షించిన అనేక సంఘటనలలో ఎంతో ఉత్సాహంగా పాల్గొనేది. ప్రజలలో వారుకన్నబిడ్డలా కలిసిపోయేది. ఏ పని అప్పటించినా వెనుకడుగు వేయకుండా చొరవ, పట్టుదలతో పూర్తి చేసేది. పార్టీ పద్ధతులు, క్రమశిక్షణ విషయంలో ఎవరినుండి లోపాలు జరిగినా, ఎలాంటి ఉదారవాదం లేకుండా సూటిగా విమర్శించేది. తాను వాటిని అమలు చేయడంలో ముందుండేది. ఉద్యమంలోకి వచ్చింది మొదలు అమరురాలయ్యేనాటి వరకు ఏ రోజు కుటుంబాన్ని కలువలేదు. ఎలాంటి ఊగిసలాటను ప్రదర్శించలేదు. మిలటరీపరంగా, రాజకీయంగా ఎదుగుతూ వచ్చింది. 2021 మార్చిలో పార్టీ కామ్రేడ్ పాయికేను ఏరియా కమిటీ సభ్యురాలిగా ప్రమోట్ చేసి సీఆర్‌సీ సప్తై దళం నుండి బదిలీ చేసి, కలిమెల ఏరియా కమిటీ సభ్యురాలిగా నియమించింది. ఆ బాధ్యతలు స్వీకరించిన అనతికాలంలోనే విశాఖ జిల్లా, తీగలమెట్ట అటవీ ప్రాంతంలో పక్క సమాచారంతో వందలాది గ్రేహౌండ్స్ బలగాలు జూన్ 16న ఉదయం 9:30 గంIIలకు అనేక వలయాలుగా దళమకాంను చుట్టుముట్టి చేసిన దాడిలో ప్రతిఘటిస్తూ రిట్రీట్ అవుతున్నప్పుడు శత్రువు కాల్పుల మధ్య చిక్కుకొని అమరురాలైంది. చత్తీస్‌ఘడ్‌లో పుట్టి దండకారణ్య విప్లవోద్యమంలో ఎదిగి, ఆంధ్ర-ఒడిశా రాష్ట్రాలలో బాధ్యతలు నిర్వహించి ఉద్యమంలోని అనేక ఆటు-పోటులు, ఒడదొడుకుల నడుమ గుండెనిబ్బరం కోల్పోకుండా చివరి నెత్తుటిబొట్టు వరకు నమ్మిన ఆశయం కోసం కట్టుబడి చిరుప్రాయంలోనే తృణప్రాయంగా ప్రాణాలర్పించిన కామ్రేడ్ పాయికే అసంపూర్తిగా మిగిలిన లక్ష్యాన్ని తుదకంటా కొనసాగిద్దామని శపథం చేద్దాం.

# దండకారణ్య ప్రజాపోరులో జన్మించి ఏఓబీని ఎరుపెక్కించిన కామ్రేడ్ చైతే

చత్తీస్‌ఘఢ్ రాష్ట్రం, బీజాపూర్ జిల్లా, గంగులూర్ ఏరియా, మంకిల్ పంచాయితీ, గోర్నాం గ్రామంలోని నిరుపేద ఆదివాసీ కుటుంబంలో 20 సంవత్సరాల క్రితం కామ్రేడ్ చైతే జన్మించింది. చైతే తల్లి చిన్నతనంలోనే ఆనారోగ్యం బారిన పడి చనిపోయింది. ఆ తర్వాత చైతే తండ్రి దగ్గర కన్నా, చిన్నాన్న దగ్గరే ఎక్కువ గడిపేది. కొద్దికాలం గడిచాక తండ్రి మరో పెళ్ళి చేసుకున్నాడు. ఆమె చైతేని సరిగా చూసుకోకపోవడంతో తనను ప్రేమగా చూసుకునే చిన్నాన్న ఇంట్లోనే ఉంటూ పెరిగింది. తన చిన్నతనం నుండే జనతనసర్కార్ల మధ్య పుట్టి, పెరగడంతో 7వ ఏట బలల సంఘంలో సభ్యురాలయ్యింది.

సహజంగా ప్రతివ్యక్తి పాటని ఇష్టపడతాడు. రైతుకూలి, శ్రామికజనం పాట పాడుతూ, తాము చేసే పనిభారాన్ని మరచిపోతారు. పసిపిల్లలు సైతం పాట విని ఏడుపు మానేస్తారు. అలా అందరిలాగే కామ్రేడ్ చైతే కూడా పాటలంటే బాగా ఇష్టపడేది. అందులో విప్లవ పాటలు పీడిత ప్రజల జీవితాలకు పరిష్కారం చూపుతుండటంతో, సీఎమ్ఎమ్ కళాకారులు గ్రామంలోకి వచ్చారంటే వారు వెళ్ళేవరకు వారితోనే గడిపేది. వారు నిర్వహించే సాంస్కృతిక కార్యకలాపాలలో భాగమయ్యేది. పెరుగుతున్న వయస్సుతోపాటు, గ్రామంలోని విషయాలను గ్రహించి, సంఘ నాయకులకు గుర్తుచేసేది. అప్పటికీ చైతేకి 14 సంవత్సరాల వయస్సు. స్థానిక దళం గ్రామ పరిసరాలలోకి వచ్చినప్పుడు వారిని కలిసి శతృపరిస్థితిని చెప్పడంతోపాటు, వారి అవసరాలను తీర్చడంలో తన సహచరులను కలుపుకొని పని చేసేది. గ్రామంలోని పెద్దాల్ల ఆధిపత్యాన్ని గమనించి, దళం వచ్చినప్పుడు వారితో చర్చించేది. విప్లవ దినాలు నిర్వహించే సమయంలో జనతనసర్కాలతోపాటు, బాలల సంఘంలోని సభ్యులను తీసుకొని, ఏరియాలో రాజకీయ ప్రచార క్యాంపెయిన్‌లో చురుగ్గా పాలుపంచుకునేది.

కామ్రేడ్ చైతే బాలల సంఘం తర్వాత పాటలపై తనకున్న మక్కువతో సీఎన్ఎమ్‌లో చేరింది. తనకిచ్చిన ఏ బాధ్యతనైనా పట్టుదలతో నిర్వహించేది. గ్రామంలోని సీఎన్ఎమ్ నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటూ, తనకు వచ్చిన పాటలను బాలలసంఘం సభ్యులకూ, మిలీషియా కామ్రేడ్స్‌కు నేర్పించేది. డిసెంబర్ 2, 2017 పీఎల్‌జీఏ ఆవిర్భావ వారోత్సవాల సందర్భంగా పార్టీ పిలుపునందుకొని పూర్తికాలం కార్యకర్తగా స్థానిక దళంలో భాగమయ్యింది. ఈ క్రమంలో దళం గ్రామాలలో నిర్వహించే మీటింగ్‌ల సందర్భంగా కామ్రేడ్ చైతే తనకు



తెలిసిన పార్టీ రాజకీయాలను చెబుతూ, పాటలను గ్రామంలోని యువతీ, యువకులకు నేర్పించేది.

ఆరు నెలలు గడిచాక పార్టీ అవసరాల రీత్యా కామ్రేడ్ చైతే నేషనల్ పార్క్ ఏరియా, 11వ ప్లటూన్‌లోకి బదిలీ అయింది. ఈ క్రమంలో ప్లటూన్ నిర్వహించే అన్నింటిలో పాల్గొంటూనే, చదువుకోవడంలో, చదివిన తర్వాత తెలియని విషయాలను తెలుసుకోవడంలో, మిలటరీ డ్రిల్స్ నేర్చుకోవడంలో ఎంతో చురుగ్గా ఉండేది. 2018లో టెక్నికల్ డిపార్ట్‌మెంట్‌కు ప్రొటక్షన్‌గా ప్లటూన్ నుండి ఒక టీంను పంపాలనే పార్టీ నిర్ణయంలో భాగంగా, కామ్రేడ్ చైతే కూడా వెళ్ళింది. మిలటరీ క్రమశిక్షణ, రోజువారి సమిష్టి పనులలో పాల్గొనడం, గెరిల్లా యుద్ధనియమాలను పాటించడం మొదలైన వాటిలో బాధ్యతగా ఉండేది. ఈసునార్, కర్క, మర్‌వాడ, గొరుగుట్ట వద్ద జరిగిన ఫైరింగ్‌లలో ధైర్యంగా ఉంటూ తన వంతు పాత్ర నిర్వహించింది. 2020 ప్రత్యేక టీసీఓసీలో తొండమర్క, ఎర్రం, గాజులగుట్ట, మినప తదితర ఘటనలలో పాల్గొన్నది.

2021, మార్చిలో పార్టీ అవసరాల రీత్యా కామ్రేడ్ చైతేని ఏఓబీ

తరువాయి భాగం 53వ పేజీలో

# చిరుప్రాయంలోనే అమరత్వపు శిఖరాన్ని అధిరోహించిన వీరగెరిల్లా కామ్రేడ్ చిన్నారావు (ఆజాద్) ధైర్యసాహసాలను ఎత్తిపడదాం!



విశాఖ ఏజెన్సీలోని గూడెం కొత్తవీధి మండలం, గూడెం పంచాయితీలోని వీరవరం అనే గ్రామంలో కువ్వి ఆదివాసీ పేద కుటుంబంలో 2004 జనవరిలో కామ్రేడ్ చిన్నారావు పుట్టాడు. అప్పటికే ఆ ప్రాంతానికి 2 దశాబ్దాల వీరోచిత వర్గపోరాటంలో అనేక ఆటుపోట్లతో రాటుదేలుతున్న చరిత్ర ఉంది. ఆ విప్లవోద్యమం నుండి కామ్రేడ్స్ రుప్పి, టుబ్రి, చిన్న బుల్లక్క, జాంబ్రి, రవి, శరత్ లాంటి ఎందరో భూమి పుత్రులు, పుత్రికలు మన్యం పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తూ తమ రక్త తర్పణతో తూర్పు కనుమలను ప్రజ్వలింపజేసారు. నేడు కామ్రేడ్ చిన్నారావు కూడా వారి సరసన చేరాడు.

కామ్రేడ్ చిన్నారావు తల్లిదండ్రులకు పుట్టిన 8 మంది సంతానంలో తనే పెద్దవాడు. తనకు నలుగురు తమ్ముళ్ళు, ముగ్గురు చెల్లెల్లు ఉన్నారు. చిన్నారావు వాళ్ళ మేనమామ కుటుంబం బ్రతకు తెరువు కోసం, భూములకోసం తూర్పు గోదావరి జిల్లా, రాజవొమ్మంగి దగ్గర కొన్ని కువ్వి కుటుంబాలతో కలిసి గుడిసెలు వేసుకొని కొద్దిగ కొండపోడు చేసుకుంటూ, జీడితోటల్లో కూలి పనులకు వెళుతూ జీవిస్తున్నారు. వీరికి మగపిల్లలు లేకపోవడంతో చిన్నారావును 6 ఏళ్ళ వయసులోనే తీసుకుపోయారు. అలా రాజవొమ్మంగి స్కూళ్ళో, హాస్టల్లో ఉంటూ చిన్నారావు 6వ తరగతి వరకు చదువున్నాడు. అయితే ప్రతీ సంవత్సరం సెలవుల్లో తన ఊరికి వచ్చేవాడు. ఈ క్రమంలో తమ గ్రామాలకు వచ్చే గాలికొండ దళాన్ని, జన మిలీషియా కామ్రేడ్స్‌నూ, కాఫీ తోటల స్వాధీన పోరాటాన్నీ, తమ పక్క గ్రామంలో చీడిగొంది భాస్కరరావు అనే భూస్వామిని తరిమేసి ప్రజలు భూములు పంచుకున్న పోరాటాలనూ, దళం గ్రామాల్లో పాడేపాటలను చూస్తూ చాలా ప్రభావితమయ్యేవాడు. అన్నింటికంటే ఒక రోజు దళం పెద్ద వర్షంలో తమ గ్రామానికి వచ్చినప్పుడు గ్రామంలో అందరూ జబ్బులు, జ్వరాలలో ఉంటే దళ కమాండర్ కామ్రేడ్ ఆజాద్ అందరికీ వైద్యం చేసిన దృశ్యం తన మనసులో చెరగని ముద్ర వేసిందనీ, ఇంత పెద్ద చదువులు చదివిన వాళ్ళు కూడా పార్టీలో ఉంటారా! అని అనుకున్నానని ఎప్పుడూ చెప్పేవాడు. తన తండ్రి కూడా సంఘ నాయకుడిగా, మిలిటెంట్ కార్యకలాపాల్లో క్రియాశీలంగా పాల్గొంటూ, పార్టీ రాజకీయాలను కొడుకుకి చెప్పేవాడు. మరోవైపు తను చదువుకుంటున్న రాజవొమ్మంగి ప్రాంతంలో రాజులు ఇప్పటికీ, జీడితోటల్లో చిన్న పిల్లలకు తక్కువ కూలి ఇచ్చి ఎక్కువ పనులను చేయించుకోవడం, తను కూడా సెలవుల్లో కూలి పనులకు పోయేవాడు. రాజుగారు గ్రామాలకు వస్తే ప్రజలంతా చేతులు కట్టుకొని వంగి, వంగి దండాలు పెట్టడం, ఫారెస్టు గార్డులు వచ్చి కొండపోడు నరకనీయకపోవడం, అడవికి గొడ్లను మేపుకోనీయకపోవడం, కేసులు పెట్టడం వంటివన్నీ చూస్తూ, ఇక్కడ కూడా నక్సలైట్లు ఉంటే బాగుండేది కదా అనుకునేవాడు. తన స్కూళ్ళో స్నేహితులకు నక్సలైట్ల గురించి కథలు కథలుగా చెప్పేవాడు. తను పెద్దయితే ఎలాగయినా పార్టీలో చేరి నక్సలైట్ అవ్వాలని 12, 13 ఏళ్ళ వయస్సులోనే అనుకున్నానని చెప్పేవాడు.

2016 నాటికీ 6వ తరగతి వరకూ తన స్కూలు, హాస్టల్ జీవితం సాఫీగానే సాగిపోయింది. 6వ తరగతి పూర్తయ్యాక తను విశాఖ జిల్లాకు చెందినవాడు కనుక అక్కడ స్కూళ్ళో చదివితేనే తనకు భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని చెప్పటంతో తండ్రి తనను తిరిగి ఊరికి తీసుకువచ్చి విశాఖలోని పెదవలస హైస్కూల్‌లో 2017లో 7వ తరగతిలో జాయిన్ చేశాడు. కానీ చిన్నారావుకు కొత్త స్కూలు, హాస్టలు వాతావరణం నచ్చకపోవడం, మాస్టరు సరిగా క్లాసులు చెప్పకపోవడం, చీటికి మాటికి కొట్టడం, స్నేహితులు లేకపోవడం వీటన్నింటితో తను అక్కడ ఇమడలేక హాస్టల్ నుండి పారిపోయి ఇంటికి వచ్చేవాడు. తండ్రి మొదట్లో బుజ్జగించి కనీసం 10వ తరగతి వరకైనా బుద్ధిగా చదువుకొమ్మని చెప్పి తిరిగి స్కూలుకు దిగబెట్టేవాడు. కానీ చిన్నారావు

మళ్ళీ పారిపోయి వచ్చేవాడు. ఇలా 2,3 సార్లు అయ్యేసరికి తండ్రి బెదిరించడం, కొట్టడం చేసేసరికి తను తండ్రికి కనిపించకుండా దాక్కుంటూ తిరగటం, తండ్రిలేని సమయంలో ఇంటికి వచ్చి అమ్మ పెట్టే అన్నం తినిపోవడం చేసేవాడు. తను చిన్నప్పుడే నక్సలైట్ కావాలనే కోరికను మాత్రం మర్చిపోలేదు. తన గ్రామంలో మిలీషియాను పార్టీ గురించి, దళం గురించి వాకబు చేసేవాడు. ఈ క్రమంలో 2018లో ఆ ప్రాంతంలో పని చేస్తున్న జన మిలీషియా కామ్రేడ్స్‌తో కలిసి తిరగడం మొదలుపెట్టాడు. 2019లో తను పూర్తికాలం దళంలో పని చేయాలని నిర్ణయించుకున్నాడు. తనకు అప్పటికి చిన్న వయసే అయినప్పటికీ, తన పట్టుదలనూ, తన కుటుంబ నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకొని 2019లో పార్టీ తనను దళంలో చేర్చుకుంది.

2019 మే నెలలో గుడ్లవాడ వద్ద రాత్రి 7:30 గం॥ల ప్రాంతంలో ఒక లోయలో వంట చేస్తున్న కామ్రేడ్స్‌పై శత్రువు కొండపై నుండి గమనించి కాల్పులు చేసిన ఘటనలో కామ్రేడ్ చిన్నారావుకు మొదటి అనుభవం. 'ఈ టైంలో ఎవరు దీపావళి టపాకాయలు పేలుస్తున్నారు' అనుకున్నానని నవ్వుతూ చెబుతుంటాడు. తర్వాత అదే సంవత్సరం ఆగస్టు నెలలో మండపల్లి వద్ద దళంపై ఫైరింగ్ జరిగింది. అప్పుడు చాలా ధైర్యంగా తనకు ఇచ్చిన సామాన్లు, వార్త పత్రికల బ్యాగ్, తన సామాన్లు ఏవీ వదిలిపెట్టకుండా దళంతో కలిసి క్షేమంగా రిట్రీట్ అయ్యాడు. ఈ రెండు సందర్భాల్లో తన దగ్గర ఆయుధం లేదు. 2019 సెప్టెంబర్‌లో కొండజర్త వద్ద జరిగిన శత్రుదాడిలో తను లేడు కానీ, ఆ సంఘటనలో 6గురు కామ్రేడ్స్ అమరత్వంతో తను చాలా చలించిపోయాడు. శత్రువుపై మరింత కసితో దృఢంగా, పట్టుదలగా పని చేసేవాడు. 2020 జులైలో కటాఫ్ ప్రాంతంలో దొరగూడ వద్ద ఉదయాన్నే పెట్రోలింగ్‌కు వెళ్ళిన టీంలో తనే పైలట్‌గా ఉన్నాడు. అప్పటికే అక్కడ మాటుగాసి ఉన్న శత్రువు సమీపంలోకి వెళ్ళిన వెంటనే కాల్పులు ప్రారంభించారు. పెట్రోలింగ్ టీం కామ్రేడ్స్ అంతా చెల్లాచెదురైపోయారు. శతృకాల్పుల్లో చిన్నారావు తుపాకి క్రిందపడిపోయింది. తను తిరిగి ఆ తుపాకిని తీసుకొని శత్రువుపై కాల్చడానికి ప్రయత్నించాడు. కానీ అప్పటికే ఆ తుపాకికి తూటాలు పడి 2 ముక్కలుగా విరిగిపోయింది. అయినా దాన్ని వదిలిపెట్టకుండా తిరిగి మకాం వైపు వచ్చాడు. అప్పటికీ అక్కడ ఎవరూ లేరు. అందరూ రిట్రీట్ అయిపోయారు. కానీ ఎవరో వదిలిపెట్టిన 303 తుపాకి, కిట్టు, ఇంకా తన శక్తి మేరకు ముఖ్యమైన సామాన్లు పట్టుకుని ఒంటరిగానే రిట్రీట్ అయ్యాడు. అది తనకు కొత్త ప్రాంతం, గ్రామాలు, దార్లు, భాష ఏమి తెలియదు. అయినా నిబ్బరంగా, ధైర్యంగా తుపాకులను, సామాన్లను దాచిపెట్టి అందుబాటులో ఉన్న గ్రామానికి వెళ్ళి ప్రజల సహకారంతో దళాన్ని కలుసుకున్నాడు. అదే నెలలో పెదబయలు ఏరియాలో లందులు వద్ద జరిగిన పెద్ద చుట్టివేత దాడిలో కూడా తను నాయకత్వం వెంట ఉండి, నాయకత్వాన్ని రక్షించడంలో ముఖ్య పాత్ర వహించాడు. అదే నెలలో దగుడుపల్లి వద్ద జరిగిన మరో ఫైరింగ్‌లో కూడా తను శత్రువుపై కాల్పులు చేస్తూ రిట్రీట్ అయ్యాడు. 2020 అక్టోబర్‌లో కొత్తూరు వద్ద శత్రువు మకాంను చుట్టుముడుతున్న క్రమంలో తనే శత్రువును ముందుగా చూసి, వెంటనే తన 303తో 20 తూటాల వరకూ కాల్పులు జరిపి అందరూ క్షేమంగా రిట్రీట్ కావడానికి వీలుగా శత్రువును నిలువరించాడు. 2021 సెప్టెంబర్ 21న చాందమెట్ట ఫైరింగ్‌లో కూడా అందరితో కలిసి క్షేమంగా రిట్రీట్ అయ్యాడు. ఇలా తను వచ్చిన తక్కువ కాలంలోనే జరిగిన అనేక ఫైరింగ్‌లలో తన చేతిలో ఆయుధం వున్న అన్ని సందర్భాల్లోనూ శత్రువుపై తూటా పేల్చకుండా రిట్రీట్ అయ్యేవాడు కాదు.

కామ్రేడ్ చిన్నారావు చాలా తెలివైనవాడు, చురుకైనవాడు. గెరిల్లా దళ జీవితంలో తనకు ఎదురయ్యే ప్రతికొత్త అనుభవాన్ని ఎంతో అపురూపంగా తన మనసులో పదిలపర్చుకునేవాడు. ఏఓబీలోని కఠిన పరిస్థితిని, కష్టనష్టాలను ఎంతో చైతన్యవంతంగా అర్థం చేసుకుంటూ, అందుకు అనుగుణంగా తనను తాను రాజకీయంగా మలచుకోవడానికి కృషి చేసాడు. తను చాలా మెహమాటస్తుడు. తన కోసం ఎప్పుడూ ఏదీ కావాలని అడిగేవాడు కాదు. పార్టీ ఏ పని చెప్పినా, ఏ బాధ్యతను ఇచ్చినా క్రమశిక్షణగా, పట్టుదలగా నిర్వహించేవాడు. తక్కువ కాలంలోనే హిందీ, ఒడియా భాషలు చదవడం, రాయడం నేర్చుకున్నాడు. కోయ భాష నేర్చుకొని ఆ కామ్రేడ్స్‌తో కలిసిపోయేవాడు. నాయకత్వంతోనూ, సహచర కామ్రేడ్స్‌తోను ఎంతో గౌరవ మర్యాదలతో, వినయ విదేయతలతో, ప్రేమ ఆప్యాయతలతో మెలిగేవాడు. డీకే నుండి ఏఓబీకి వచ్చిన కామ్రేడ్స్‌ను చూసి ఎంతో ప్రేరణ పొందేవాడు. ఇంత మంది విప్లవకారులు తయారయ్యి వస్తున్న దండకారణ్యాన్ని ఎప్పటికైనా చూడాలనేది తన మధుర స్వప్నం. కానీ అది తన కలగానే మిగిలిపోయింది.

2021 అక్టోబర్ 12వ తేదీన దర్బ డివిజన్‌లోని కాంకేర్‌ఘాటి ఏరియాలో టీవేంగుర్ వద్ద మన పీఎల్‌జీఏ బలగాల మకాంను ఏపీ గ్రేహౌండ్స్, ఛత్తీస్‌ఘఢ్, ఒడిశా పోలీసు బలగాలు సమన్వయంతో పకడ్బందీగా చుట్టుముట్టి చేసిన దాడి సందర్భంలో ఆ రోజు ఉదయాన్నే పెట్రోలింగ్‌కు వెళ్ళిన 4గురి టీంలో కామ్రేడ్ చిన్నారావు కూడా ఉన్నాడు. ఈ టీం పెట్రోలింగ్‌కు పోయి మకాంకు అందుబాటులోకి వస్తున్న క్రమంలో మకాంపై కాల్పులు ప్రారంభమయ్యాయి. దాంతో ఈ టీం వేరే దిశలో రిట్రీట్ అవుతున్న క్రమంలో అక్కడ ఆంబుష్‌లో వున్న మరో పోలీస్ బ్యాచ్ కాల్పులు జరపడంతో ఆ టీం కమాండర్, డీవీసీఎమ్ కామ్రేడ్ అనిల్‌కు తూటా తగిలి పడిపోయాడు. టీంలో మరో కామ్రేడ్ వేరేవైపు రిట్రీట్ అయి వెళ్ళిపోయింది. కానీ చిన్నారావుతోపాటు మిగిలి ఉన్న మరో కామ్రేడ్ కలిసి శత్రువుపై కాల్పులు జరుపుతూ కామ్రేడ్ అనిల్‌ను గాయపడి ఉంటే మోసుకుపోవాలని తీవ్రంగా ప్రయత్నం చేసి కాల్పుల మధ్యనే పడిపోయి ఉన్న అనిల్ దగ్గరకు వెళ్ళారు. కానీ అప్పటికే అనిల్ అమరుడయ్యాడు. అనిల్ వద్ద ఉన్న ఏకే 47 తుపాకీని, పౌచ్‌లోని తూటాల మ్యాగ్జిన్‌లను తీసుకుని శత్రువును ప్రతిఘటిస్తూనే ఈ ఇద్దరు కామ్రేడ్స్ రిట్రీట్ అవుతున్న క్రమంలో మరికొంత దూరంలో మాటుకాచి ఉన్న శత్రువు చేసిన కాల్పుల్లో కామ్రేడ్ చిన్నారావు వీరోచితంగా ప్రతిఘటిస్తూ తుదిశ్వాస విడిచాడు. నూనూగు మీసాల నవ యువకుడు యుద్ధభూమిలో గొప్ప వీరుడిగా నేలకొరిగాడు. మన్యం పోరాట చరిత్రను మరింత ఎరుపెక్కించాడు. ఏఓబీ విప్లవోద్యమం ఉజ్వల భవిష్యత్ కలిగిన మరో యువకిరణాన్ని కోల్పోయింది.

కామ్రేడ్ చిన్నారావు విప్లవ జీవితం కొద్ది కాలమే అయినా ఉన్నత చైతన్యాన్నీ, గొప్ప ధైర్యసాహసాలను ప్రదర్శించి "ఎంత కాలం జీవించాం అన్నది కాదు, ఎలా జీవించాం, ఎవరికోసం జీవించాం, ఎవరికోసం మరణించాం అన్నదే ముఖ్యం" అనే మాటలకు నిజమైన అర్థానిచ్చి నిలువెత్తు ఆదర్శంలా మన ముందు నిలిచాడు. అమరత్వపు మహోన్నత శిఖరాన్ని అధిరోహించాడు. తనకు తలవంచి వినమ్రంగా నివాళ్ళర్పిద్దాం. తన ఆదర్శాన్ని, ధైర్యసాహసాలను ఎత్తిపడదాం.

# ఏఓబీ జోన్‌లో శత్రు నిర్బంధం-ప్రతిఘటన

ఏఓబీ జోన్ విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో శత్రువు మునుపెన్నటికంటే ఈ సంవత్సర (2021) కాలంలో తన పాశవిక అణచివేత దాడిని మరింత తీవ్రతరం చేసాడు. కార్పొరేట్ సెక్యూరిటీని బలోపేతం చేయడంలో భాగంగా కటాఫ్ ప్రాంతంలో కొత్తగా 6 బీఎస్ఎఫ్ (వంతలగూడ, దార్లబెడ, గురుశెట్టి, ఒండ్రాలు, ముదిలిపడ, గునబెడ) క్యాంపులు ఉనికిలోకి వచ్చాయి. ప్రతి బీఎస్ఎఫ్ క్యాంపుకు అందుబాటులో ఒక్కొక్క ఎస్ఓజీ, డీవీఎఫ్ యూనిట్స్‌ను వుంచుతూ, మన సమాచారం తెలిసిన వెంటనే దాడులు చేసే విధంగా ఈ బలగాలను శత్రువు నిరంతరం మోటివేట్ చేసి వుంచుతున్నాడు. శత్రువు జోన్ వ్యాప్తంగా పాత కొత్త అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లోనూ ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేస్తున్నాడు. ముఖ్యంగా ఉద్యమం నుండి దిగజారిపోయిన ద్రోహుల ద్వారా ఎప్పటికప్పుడు మనం ఆధారపడుతున్న ప్రాంతాలు, గ్రామాలు, నిర్మాణాల, వ్యక్తుల సమాచారం సేకరిస్తూ, వీటిపై ఆధారపడి మన మకాంలపై దాడులు చేస్తున్నారు. ఈ విధంగా సమాచార ఆధారిత అభియాన్‌లు చాలా సర్‌ప్రైజ్‌గా ఒకేరోజు రాత్రి 30-40 కిలోమీటర్ల ప్రాంతాన్ని కవర్ చేస్తూ, అనేక వలయాలుగా బలగాలను మోహరించి (ఉదా : తీగలమెట్ట, చాంద్‌మెట్ట) దిగ్బంధనం చేస్తున్నారు. ఈ డామినేషన్ల ఫ్రీక్వెన్సీ కూడా గతంతో పోల్చితే అనేక రెట్లు పెరిగింది. ఈ సంవత్సర కాలంలో సమాచార ఆధారిత ఆపరేషన్స్ 50కి పైగానే జరిగాయి. అందులో 14 ఎన్‌కౌంటర్స్ జరగగా, వివిధ స్థాయిలకు చెందిన 12 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. ఒక సాధారణ ఆదివాసీ రైతును కాల్చి చంపారు. మరో సంఘ నాయకుడిని అరెస్టు చేసి, తీవ్రమైన చిత్రహింసలకు గురి చేయడంతో, జైలులోనే ప్రాణాలు విడిచాడు. కొంత మంది గాయపడ్డారు. అనేక సందర్భాల్లో ప్రజల సహకారంతో తృటిలో తప్పుకున్న ఘటనలు అనేకం ఉన్నాయి. ఆంధ్ర-ఒడిశా పోలీసు ఆఫీసర్ల, బలగాల మధ్య సమన్వయం రెగ్యులర్‌గా కొనసాగిస్తున్నారు. కొన్ని సందర్భాలలో ఆంధ్ర-ఒడిశా-చత్తీస్‌గఢ్ బలగాల సమన్వయంతో దాడులు చేయడం (చాంద్‌మెట్ట) జరిగింది. ముఖ్యంగా ఆంధ్రా-ఒడిశా బలగాలు జాయింట్‌గానూ, విడివిడిగానూ ఈ ఆపరేషన్స్‌లో పాల్గొంటున్నాయి. ఒక్కో డామినేషన్ ఆపరేషన్స్ వారం నుండి 10 రోజుల వరకూ కొనసాగుతూ, బలగాలు చిన్న చిన్న టీమ్స్‌గా విడిపోయి, ఈ టీమ్స్ మధ్య సమన్వయంతో ఒక్కోటీం 10-15 నిమిషాల దూరాన్ని మెయింటైన్ చేస్తూ, ఒక్కొక్క నిర్దిష్ట ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకొని, కూంబింగ్స్ చేస్తున్నారు. ఈ విధంగా పెద్ద ఎత్తున శత్రు బలగాలను ఎంగేజ్ చేయడం వలన ఏ క్షణానైనా, ఎక్కడయినా శత్రువు తారసపడే అవకాశాలు గతం కంటే అనేక రెట్లు పెరిగాయి. శత్రువు రవాణా, అధునాతన కమ్యూనికేషన్ వ్యవస్థను బలోపేతం చేసుకోవడంలో భాగంగా, జోన్ వ్యాప్తంగా మారుమూల గ్రామాలకు సైతం యుద్ధ ప్రాతిపదిన రోడ్లను నిర్మిస్తూ, జిల్లా కేంద్రాలతో అనుసంధానిస్తున్నారు. ప్రతి బీఎస్ఎఫ్ క్యాంపువద్ద సెల్‌టవర్స్‌ను నిర్మించడం ద్వారా అన్ని ప్రాంతాలను అనుసంధానించడంతోపాటు, మన సమాచారం నిమిషాల్లో తెలుసుకునే అవకాశాలు శత్రువుకు చాలా ఎక్కువగా పెరిగాయి. మనం ఉపయోగించే వాకీటాకీల్లో జీపీఎస్‌ను అమర్చడం వలన 10 రోజుల వ్యవధిలో 3 ఫైరింగ్స్ జరిగాయి.

ఈ సంవత్సర కాలంలో శత్రు నిర్బంధంలో నలుగురు పీఆర్స్(పూర్తికాల కార్యకర్తలు), ఒక ఎస్‌జడ్‌సీఎమ్, ఏసీ/పీపీసీఎమ్స్ 8 మంది, అరెస్టయ్యారు. గ్రామాలపైన, సంతల్లోనూ పోలీసుల దాడుల్లో పదుల సంఖ్యల్లో గ్రామస్థాయి పీఎమ్స్, సంఘ నాయకులు, సాధారణ ప్రజలు అరెస్టయ్యి, కొంత మంది జైళ్ళలో నిర్బంధించబడ్డారు. మరికొంత మంది పీఆర్స్‌ను శత్రువు కోర్టుకు హాజరు పర్చకుండా, గతంలో లాగా ఎన్‌కౌంటర్ల పేరిట హత్యలు చేయకుండా, నెల తరబడి నిర్బంధించి, వివిధ పద్ధతుల్లో లొంగదీసుకొని సరెండర్స్‌గా ప్రకటిస్తూ, కొంత మందిని ద్రోహులుగా తయారు చేస్తున్నారు.

పోలీసు బలగాలు కూంబింగ్‌ల పేరుతో అడవుల గాలింపు ద్వారా రోడ్లపై చెకింగ్‌ల పేరిటా ప్రజలను వేధిస్తూ, వారికి స్వేచ్ఛగా తమ గ్రామాలలో, అడవులలో సంచరించకుండా అడ్డుకుంటూ, అప్రకటిత యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. పోలీసుల ఆగడాలతో మహిళలకు రక్షణ కరువైంది. లొంగిపోయిన విప్లవ ద్రోహులనూ, గతంలో ప్రజల చేత శిక్షించబడిన, గ్రామ బహిష్కరణలకు గురి అయిన ప్రజా వ్యతిరేకులు, శత్రువు ఏజెంట్లు పోలీసుల రక్షణలో ప్రజలపై బెదిరింపులకు, దాడులకు పూనుకుంటున్నారు. పారిపోయిన భూస్వాములు తిరిగి గ్రామాలకు చేరుకొని ప్రజల భూములను పునఃరాక్రమణకు తెగబడ్డారు. పెత్తందారులు ప్రజలపై తమ పాత ఆధిపత్యాన్ని చలాయించ చూస్తున్నారు. ఫారెస్టు డిపార్ట్‌మెంట్ ప్రజలు స్వాధీనం చేసుకున్న భూములను తిరిగి ఆక్రమించుకోవాలని చూస్తున్నది. ప్రభుత్వ అధికారులు, కాంట్రాక్టర్‌లు కుమ్మక్కై లక్షలాది రూపాయాల ప్రజాధనాన్ని కాజేస్తున్నారు. ప్రజల పోరాట విజయాలను సాయుధ బలగాల అణచివేత ద్వారా వమ్ము చేయాలని చూస్తున్నారు. ఈ సమస్యలపై ప్రజలు నోరు మెదపకుండా, కాలుకదపకుండా నిరంతర నిఘా-బెదిరింపులు, దాడులు చేస్తూ, కాన్‌సంట్రేషన్ క్యాంపుగా మార్చి దీనినే ప్రభుత్వం పోలీసు ఉన్నతాధికారులు ఈ ప్రాంతంలో శాంతిని నెలకొల్పుతామనీ, అభివృద్ధిని శరవేగంగా ముందుకు తీసుకుపోతున్నామని నిసిగ్గుగా ప్రకటించుకుంటున్నారు.

శత్రువు జోన్ ఉద్యమంపై ప్రధానంగా సైనిక అభియాన్‌లను తీవ్రతరం చేస్తూనే, ప్రజలను పోరాటాల నుండి పక్కదారి పట్టించేందుకు బూటకపు సంస్కరణలను, సివిక్ యాక్షన్ ప్రోగ్రామ్స్‌ను, విప్లవోద్యమంపై దుష్ప్రచారదాడిని నిరంతరం కొనసాగిస్తూ, ప్రజల్లో ఒక సెక్షన్‌ను తమకు అనుకూలంగా మలచుకోవడానికి తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నాడు.

ఒడిశా రాష్ట్రం, మల్కనగిరి జిల్లా కటాఫ్ ఏరియాలోని ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయ అభివృద్ధి నమూనాను పార్టీ నాయకత్వంలో ముందుకు తీసుకుపోతున్నారు. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల

ప్రజలపై కూడా దీని ప్రభావం పెరుగుతున్నది. అందువలన కటాఫ్ ప్రాంతం నుండి పార్టీని పూర్తిగా ఖాళీ చేయించాలనే లక్ష్యంతో ప్రభుత్వం, పోలీసు ఆఫీసర్లు ప్రత్యేకంగా కేంద్రీకరించి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వందలకోట్ల రూపాయలను వెచ్చించి ప్రజల మౌలిక సదుపాయాల అభివృద్ధి పేరుతో రోడ్లను వేయడం, ఇంటర్నెట్ సదుపాయాన్ని కల్పించడం, ప్రతి ఒక్కరికీ స్మార్ట్ ఫోన్ ఇవ్వడం, సెల్‌ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరికీ సిమ్‌కార్డ్ ఉంటేనే రేషన్ బియ్యం దొరుకుతాయనే నిబంధనను పెడుతున్నారు. ఒడిశా డీజీపీ, బీఎస్‌ఎఫ్ ఆఫీసర్లు తరచుగా కటాఫ్ ప్రాంతాన్ని సందర్శిస్తూ, పోలీసు బలగాలకు అవసరమైన గైడెన్స్ అందిస్తున్నారు.

ఏపీలో వైఎస్ఆర్‌సీపీ జగన్ ప్రభుత్వం సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య అనుకూల విధానాలను మరింత దూకుడుగా అమలు చేస్తున్నది. పోరాడుతున్న ప్రజలపై, ప్రజాస్వామికవాదులపై, చివరకు పత్రికలపై కూడా నిరంకుశ పద్ధతులను అనుసరిస్తున్నది. విశాఖ మన్యాన్ని పర్యాటక హబ్‌గా మార్చి, ఆదాయాన్ని పెంచుకోవడంపై కేంద్రీకరిస్తున్నది. బాక్సైట్ తవ్వకాలకు అడ్డదారులు అనుసరిస్తూ, కొత్తగా 89 జీఓను విడుదల చేసింది. లాటరైట్ పేరుతో తవ్వకాలకు ప్రయత్నిస్తున్నది. కాఫీతోటలను ప్రజలనుండి తిరిగి స్వాధీనం చేసుకోవడానికి తీవ్రంగా ఆరాటపడుతున్నది. విశాఖపట్టణాన్ని పాలనా రాజధానిగా ప్రకటించి తమ అశ్రితులను భూములు కట్టబెట్టడానికి రియలెస్టేట్ వ్యాపారాలకు శ్రీకారం చుట్టారు. వీటికి అడ్డంకిగా ఉన్న సీపీఐ (మావోయిస్టు)ను వీలైనంత తొందరగా నిర్మూలించడం ద్వారా పోరాడే ప్రజలకు నాయకత్వం లేకుండా చేయాలనే దుష్టతలంపుతో 'చుట్టుముట్టి-నిర్మూలన క్యాంపెయిన్ పథకం' రూపొందించి పక్కరాష్ట్రాల పోలీసు బలగాలతో సమన్వయించుకొని హంతకదాడిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్నాయి.

శత్రు దుష్ప్రచార దాడిలో భాగంగా నిరంతరం మనకు వ్యతిరేకంగా కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలను వేయడం, విప్లవ ప్రాముఖ్యత గల దినాలుగా మన నిర్వహించే ప్రతి కార్యక్రమానికి కౌంటర్‌గా ప్రచారం చేయడం, ముఖ్యంగా జులై 28 సందర్భంగా అమరుల సంస్మరణ సభలకు పోటీగా పీఎల్‌జీఏ చేతిలో ఖతం చేయబడ్డ ఇన్‌ఫార్మర్ల ఫోటోలతో శాంతి స్థూపాలు నిర్మించడం, ఇన్‌ఫార్మర్లను ఖతం చేస్తే నిరసన ప్రదర్శనలు, శాంతి ర్యాలీలు చేయడం లాంటి అనేక పద్ధతుల్లో దుష్ప్రచార దాడి కొనసాగుతున్నది.

గడిచిన సంవత్సర కాలంలో శత్రుదాడిని ప్రతిఘటించడంలో భాగంగా, నూతన పోలీసు క్యాంపుల నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ, వేలాది మంది ప్రజలు కదిలి వివిధ రూపాలలో ఉద్యమించారు. కటాఫ్ ఏరియాలోని పనసపుట్, ఒంద్రాలు, జొడాంబ పంచాయితీలకు చెందిన పదుల గ్రామాలకు చెందిన సుమారు 10 వేలమంది ప్రజలు మే 6న గురుశెట్టి చౌక్ వద్ద ఊరేగింపు జేసి, క్యాంపులను వెంటనే ఎత్తివేయాలనీ, అక్రమంగా అరెస్టులు చేసి జైళ్ళలో నిర్బంధించిన వారిని బేషరతుగా విడుదల చేయాలనీ, గ్రామాలపై దాడులు ఆపివేయాలనీ, అడవులలో కూంబింగ్‌ల పేరుతో గాలింపులు చేపడుతూ, అడవికి వెళ్ళిన ప్రజలను ఇబ్బందులకు గురి చేయడాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేసారు.

పెదబయలు ప్రాంతంలో గ్రామాలపై దాడులు చేసి, సంఘనాయకత్వాన్ని అరెస్టులు చేసినప్పుడు ప్రజలు ప్రతిఘటించి విడిపించుకుంటున్నారు. దళాలను రక్షించుకోవడంలో భాగంగా పోలీసుల కూంబింగ్ ఆపరేషన్‌లను వ్యతిరేకిస్తున్నారు. దళాలపై పోలీసులు దాడులు చేసినప్పుడు వాటిని రక్షించుకోవడంలో భాగంగా ప్రజలు పోలీసులను సాయుధంగా ప్రతిఘటిస్తున్నారు. ఎన్‌కౌంటర్లను నిరసిస్తూ, వేలాదిమంది ప్రజలు పోలీసులకు వ్యతిరేకంగా ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. స్థానిక మిలీషియా కొన్ని ప్రాంతాలలో పార్టీనీ, ప్రజానిర్మాణాలనూ, ప్రజలను రక్షించుకోవడంలో భాగంగా సెంట్రీలు చేయడం, పెట్రోలింగ్స్ నిర్వహించడం, బూబిట్రాప్స్ అమర్చి పోలీసులను గాయపర్చడం లాంటి చిన్న చికాకు పరిచే చర్యలను చేస్తున్నారు. స్థానికంగా శత్రువు నెట్‌వర్క్‌కు ప్రజా శత్రువులకు వ్యతిరేకంగా ప్రజలను కదిలించి చర్యలు తీసుకుంటున్నారు.

మొత్తంగా గత సంవత్సర కాలంలో ప్రజలు, మిలీషియా, పీఎల్‌జీఏ నిర్వహించిన ప్రతిఘటనా చర్యలలో 10 మంది పోలీసులు గాయపడగా, 5 మంది శత్రు ఏజెంట్లను ఖతం చేయడం జరిగింది. ●●●●

49వ పేజీ తరువాయి భాగం

జోన్ బదిలీ చేస్తూ, అక్కడ నిర్దిష్ట పరిస్థితిని అర్థం చేయించినప్పుడు ఎంతో చైతన్యవంతంగా, "పార్టీ అవసరం కోసం ఏక్కడికి పంపినా వెళ్ళాలిగా" అని చిరునవ్వుతో సమాధానం చెప్పింది. ఈ క్రమంలో ఏఓబీ ప్రయాణంలో శత్రువు చుట్టుముట్టిన సందర్భంలో కూడా ఎంతో నిబ్బరంతో వ్యవహరించింది.

2021, జూన్ 16వ తేదీన తీగలమెట్ట వద్ద శత్రువు మకాంను అన్నివైపుల నుండి చుట్టుముట్టి, తమ సెక్షన్‌కు అత్యంత సమీపానికి వచ్చి, అకస్మాత్తుగా చేసిన దాడిలో అమరులైన కామ్రేడ్స్ అశోక్, రణదేవ్, అంజన్న, పాయికే, లలితలతోపాటు కామ్రేడ్ చైతే కూడా తన తుదిశ్వాసను విడిచింది. ఈ ఎన్‌కౌంటర్ ఒకరోజు ముందు తనకు అత్యంత ఆప్తుడు, తన రాజకీయ గురువైన తన చిన్నాన్న కామ్రేడ్ గంగాల్ అనారోగ్యంతో హస్పిటల్‌కి వెళ్ళగా, ఆ సమయంలో ద్రోహి ఇచ్చిన సమాచారంతో రాజ్యం హత్య చేసిందని విన్నది. ఒకవైపు కన్నీళ్ళను తుడుచుకుంటూ, ఆయన ఆశయసాధనలో తుదివరకు పోరాటడతానని శపథం చేసి, ఆచరణలో నిజం చేసింది.

జనతనసర్కార్ల మధ్య దండకారణ్యంలో పురుడుబోసుకున్న వీర గెరిల్లా అయిన కామ్రేడ్ చైతే, నిత్యనిర్బంధం చవిచూస్తున్న ఏఓబీ జోన్ తాత్కాలిక వెనుకంజలో ఉద్యమాన్ని పురోగమింపజేసే కృషిలో భాగంగా ముందుకు సాగి, చిరునవ్వుతో పయనం గట్టి, అంతర్జాతీయతత్వాన్ని చాటిన ఆ ఆదివాసీ ముద్దుబిడ్డ ఆశయసాధనకై మనం ముందుకు సాగుదాం. చైతే కలలను సాకారం చేద్దాం.

# విశాఖ-ఈస్ట్ డివిజన్

## ఎన్నికల బహిష్కరణ క్యాంపెయిన్

ఆంధ్రప్రదేశ్‌లో 2021 ఫిబ్రవరిలో స్థానిక (పంచాయితీ) ఎన్నికలను ప్రకటిస్తూ, జనవరిలో ఎన్నికల కమీషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ బూటకపు ఎన్నికలను బహిష్కరించాల్సిందిగా, "దోపిడీ వర్గ పార్టీలైన వైఎస్ఆర్‌సీపీ, టీడీపీ, బీజేపీ ప్రభుత్వాలను తన్ని తరమండి. ప్రతిపక్ష, బూర్జువా, రివిజనిస్టు పార్టీలను ఎండగట్టండి. ప్రజాయుద్ధంలో భాగమవుతూ విప్లవ ప్రజా కమిటీల(ఆర్‌పీసీ)ను నిర్మించండి, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయండి!" అని పిలుపునిస్తూ విశాఖ-ఈస్ట్ డివిజన్ కమిటీ పత్రికలకూ, ఎలక్ట్రానిక్ మీడియాకు ప్రకటనను విడుదల చేసింది. డివిజన్‌లోని పీబీఎల్-కేకే ఏసీ, జీకే ఏసీలు ఆయా ఏరియాలలో కరపత్రాలు, పోస్టర్స్ ద్వారా ప్రచారం చేసాయి. పెదబయలు ప్రాంతంలో ప్రజా సంఘాలు, మిలీషియా కామ్రేడ్స్ కలిసి 4 క్యాంపెయిన్ టీమ్స్‌గా ఏర్పడి జనవరిలోనే ఇంజెరి, జాంగూడ, గిన్నెలకోట, కిల్లంకోట, బూసిపుట్ పంచాయితీలలోని గ్రామాలలో కరపత్రాన్ని చదివి వినిపిస్తూ, ఎన్నికలను బహిష్కరించాల్సిందిగా పిలుపునిస్తూ, 5 రోజులపాటు ప్రచారం చేసారు. ఇంజెరి పంచాయితీకి సంబంధించి సర్పంచ్ అభ్యర్థిగా గతంలో గంజాయి వ్యాపారం చేస్తూ, ప్రజలకు ఇవ్వాల్సిన బకాయిలను ఎగ్గొట్టి, ప్రజా వ్యతిరేకిగా మారి, గ్రామం నుండి పారిపోయి ప్రస్తుతం జి.మాడుగులలో ఉంటున్న గెమ్మెలి జాన్ అనేవాడి భార్య రమణమ్మ నామినేషన్ వేసింది. దీనికి వ్యతిరేకంగా ఇంజెరి పంచాయితీ ప్రజలంతా సుమారు 2 వేల మంది కలిసి ఇంజెరిలో పెద్ద ర్యాలీ నిర్వహించారు. ప్రజావ్యతిరేకిగా మారి గ్రామం వదిలి పారిపోయినవారు మాకు సర్పంచ్‌గా వద్దనీ, జాన్ భార్య నామినేషన్ విత్‌డ్రా చేసుకోవాలనీ, లేనట్లయితే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరిస్తూ, తాము ఈ ఎన్నికలను బహిష్కరిస్తున్నామని ప్రకటిస్తూ ప్రజలు మీడియా ముఖంగా మాట్లాడారు. అలాగే బూసిపుట్ పంచాయితీకి సంబంధించి కంఠవరం గ్రామానికి చెందిన కిల్లో రాజమ్మ అనే మహిళతో కొంత మంది రాజకీయ నాయకులు వెనుక ఉండి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేయించారు. ఈమె భర్త నాగేష్‌ను మిలీషియా కామ్రేడ్స్ తీసుకొచ్చి ప్రజల్లో పెట్టి ప్రశ్నించారు. ఎన్నికలు బహిష్కరించాలనే పార్టీ పిలుపుతోనూ, ప్రజల అభిప్రాయంతోను సంబంధం లేకుండా నామినేషన్ ఎందుకు వేశారనీ ప్రజలు నిలదీయటంతో తప్పయిందనీ, ఎన్నికలనుండి వైదొలగుతానని అన్నాడు. అయితే అప్పటికే నామినేషన్ విత్‌డ్రా చేసుకునే సమయం ముగిసిపోవడంతో తాను గెలిచినా రాజీనామా చేస్తానని ప్రజల ముందు హామీ ఇవ్వడంతో మిలీషియా ఇతడిని దేహశుద్ధి చేసి విడిచిపెట్టారు. గిన్నెలకోట పంచాయితీలో మొదటిసారి ఎన్నికలలో చివరి వరకూ ఎవరూ ఒక్క నామినేషన్ కూడా వేయలేదు. రీ ఎలక్షన్ సందర్భంగా సర్పంచి అభ్యర్థి నామినేషన్ వేయడం జరిగింది. కిల్లంకోట పంచాయితీలో ముత్యాలమ్మ అనే మహిళ సర్పంచ్ అభ్యర్థిగా సింగిల్ నామినేషన్ వేయడంతో ఎన్నికలు జరగకుండానే ఏకగ్రీవం అయింది. కోరుకొండ ఏరియా బలపం పంచాయితీలో గత 10 సంవత్సరాలుగా ప్రజలు ఎన్నికలను బహిష్కరిస్తుండటంతో ఎలక్షన్లు జరగలేదు. 2013 జనవరిలో ఒకసారి నోటిఫికేషన్ విడుదల చేస్తే రాళ్ళగడ్డకు చెందిన సిందెరి కార్ల అనేవాడు సింగిల్ నామినేషన్‌లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. వీడు ప్రజా వ్యతిరేకి, ఇన్ఫార్మర్ కావటంతో ఫిబ్రవరిలో మన పీఎల్‌జీఏ, మిలీషియా కలిసి వీడిని ఖతం చేసింది. ఆ తర్వాత మళ్ళీ ఎన్నికల కోసం నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ, ఎవరూ నామినేషన్ వేయకపోవడంతో ఇప్పటి వరకూ ఎన్నికలు జరగలేదు. అయితే ఈసారి గతంలో కోరుకొండ నుండి పారిపోయి చింతపల్లిలో ఉంటున్న పాంగి వెంకట్ అనే వ్యక్తిని పోలీసుల ప్రోద్భలంతో స్వతంత్ర్య అభ్యర్థిగా నామినేషన్ వేయించారు. ఇతడు పోలీసు కుటుంబానికి చెందిన వ్యక్తి, ప్రజా వ్యతిరేకి అనీ, ఇతడు ఏకగ్రీవంగా ఎన్నికయితే పంచాయితీ ప్రజలకు ఏమీ ఉపయోగం ఉండదనీ, కనుక పంచాయితీ గ్రామాల నుండే ఎవరినైనా నిలబెడితే బాగుంటుందనీ, అవసరమైతే గెలిచిన తర్వాత రాజీనామా చేయించవచ్చని ఆ పంచాయితీకి చెందిన కొంత మంది మనుషులు స్థానికంగా వున్న ఏసీ సభ్యుడి దృష్టికి ప్రతిపాదనను తీసుకురాగా, మన ఏసీఎమ్ దీనిపై ఉదాసీన వైఖరిని ప్రదర్శించడంతో తడకపల్లి గ్రామానికి చెందిన కొర్ర రమేష్ నాయుడు అనే వ్యక్తి వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థిగా నామినేషన్ వేసి సర్పంచ్‌గా ఎన్నికయ్యాడు. మొత్తంగా చూస్తే బూటకపు ఎన్నికల బహిష్కరణ క్యాంపెయిన్‌ను అడ్డుకొని ఎన్నికలను 'సజావు'గా నిర్వహించే పేరుతో ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినప్పటి నుండీ మన్యంలో వేలాది పోలీసు బలగాలను దింపింది. అలాగే పంచాయితీల నుండి నామినేషన్లు వేయని దగ్గర ప్రజా వ్యతిరేకులుగా పారిపోయి, మండల సెంటర్లలో ఉంటున్న వారితో పోలీసులు ప్రోద్భలంతో నామినేషన్లు వేయించి, ప్రజల ఓట్లలో పాల్గొనకపోయినా, ఏకగ్రీవంగా ఎన్నికయినట్లుగా సర్పంచ్‌లను ప్రకటించారు. మెజారిటీ పంచాయితీ సెంటర్లలో ప్రజలు, మిలీషియా దాడులు చేస్తారనే భయంతో సంబంధిత పంచాయితీలకు చాలా దూరంగా తమకు అనుకూలమైన చోట పోలింగ్ బూత్‌లను పెట్టి ఎన్నికలను నిర్వహించారు. ఈ విధంగా మన్యంలో మన పార్టీ ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో ప్రజలు ఎన్నికలలో పాల్గొనకుండా, ఎన్నికలను బహిష్కరించినప్పటికీ, ప్రభుత్వం, పోలీసులు మాత్రం అప్రజాస్వామిక పద్ధతుల్లో ఎన్నికలను నిర్వహించి, మావోయిస్టుల కంచుకోటగా ఉన్న పంచాయితీలో ఎన్నికలను సజావుగా నిర్వహించామని నిసిగ్గుగా ప్రకటించుకున్నారు.

## పోలీసు ఇన్ఫార్మర్ కొర్ర పిల్కు ఖతం

గాలికొండ ఏసీ పరిధిలోని జీకే వీధి మండలం, గూడెం పంచాయితీ, కొత్తపాలెం గ్రామానికి చెందిన కొర్ర పిల్కు గతంలో సంఘంలో పని చేస్తూ బలహీనపడి ఎవరికి తెలియకుండా పోలీసుల వద్ద లొంగిపోయాడు. అప్పటి నుండి విచ్చలవిడిగా తిరగటం మొదలుపెట్టాడు. దళం ఆ పాకెట్‌కు వెళ్ళిన వెంటనే పోలీసులకు సమాచారం వెళ్ళడం, వెంటనే పోలీసుల కూంబింగ్ ఆపరేషన్ జరపడం అనేకసార్లు జరిగింది. దీంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పరిశీలించి, పాకెట్ కమిటీవాళ్ళు పిల్కుని ప్రజల ముందు అడగటం, హెచ్చరిండం చేసారు. అయినప్పటికీ, పోలీసుల అండతో పిల్కు ప్రజల మీద కూడా ధౌర్జన్యం చేయడం, బెదిరించడం, కొట్టడం వంటివి చేస్తూ, తన కార్యకలాపాలను కొనసాగిస్తూనే వచ్చాడు. చివరకు ఈ విషయాలన్నీ అక్కడి పాకెట్ కమిటీ, ప్రజలు దళానికి తెలియజేయడంతో 2020 సెప్టెంబర్‌లో గాలికొండ దళం పిల్కును ప్రజాకోర్టులో పెట్టి తన పద్ధతిని మార్చుకోవాలని హెచ్చరించి విడిచిపెట్టింది. ఇది జరిగిన వెంటనే సమాచారం పోయి శతృవు కూంబింగ్ ఆపరేషన్ జరిగింది. మరోసారి 1+1 టీం కామ్రేడ్స్ ఈ విషయమై పిల్కుని ప్రజల ముందు పెట్టి అడిగారు. ఇది కూడా పోలీసులకు సమాచారం పోయి మరో ఆపరేషన్ చేసారు. 3వ సారి 2021 జనవరిలో పిల్కుతో మాట్లాడాలని దళం కబురు చేయగా తాను రాకుండా పారిపోయి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. మరుసటి రోజే పోలీసులు ఏరియా మొత్తం కూంబింగ్ నిర్వహించారు. ఈ అన్ని సందర్భాలలోనూ దళం ప్రజల సహకారంతో పోలీసు బలగాల మధ్య నుండి తృటిలో తప్పుకున్నది. పిల్కు పోలీసు ఇన్ఫార్మర్‌గా పని చేయటమే కాకుండా గ్రామంలో ప్రజలను కూడా బెదిరించడం, కొట్టడం వంటి అరాచకాలకు పాల్పడుతూ ప్రజా వ్యతిరేకిగా పార్టీకీ, సంఘాలకూ, ప్రజలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాడు. ఈ విషయాలన్నీ పాకెట్ కమిటీలోనూ, ప్రజలలోను చర్చించిన తర్వాత పిల్కులో మార్పు రాదనీ, ఇతడిని ఇలాగే విడిచిపెడితే ఇంకా ప్రమాదం ఉంటుందనీ, ఇతడికి మరణశిక్ష విధించడమే సరైందని ప్రజలు అభిప్రాయపడటంతో మన పీఎల్‌జీఏ మార్చి 5వ తేదీన కొర్ర పిల్కుకి మరణశిక్ష విధించింది.

## జులై 28 అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

జులై 28, అమరవీరుల సంస్మరణవారం సందర్భంగా విశాఖ-ఈస్ట్ డివిజన్ కమిటీ ఒక కరపత్రాన్ని విడుదల చేసింది. పీబీఎల్-కేకే ఏసీ పరిధిలో కరపత్రాలు, పోస్టర్స్ ద్వారా విస్తృతంగా ప్రచారం చేయడంలోపాటు, కోరుకొండ ప్రాంతంలో గురికిరాళ్ళ కొండపైన అమరుల సంస్మరణార్థం ప్రజలు రాళ్ళతో పెద్ద స్థూపాన్ని నిర్మించారు. పెదబయలు ప్రాంతంలో కోంద్రు పాకెట్‌లోని నానాబరి, ఇంజెరి, సాలెబులు, తగ్గుపాడు తదితర గ్రామాల్లో పాత స్థూపాలకు రంగులు వేశారు. చిట్టంగరువు దగ్గర పాత స్థూపం పాడైపోవడంతో తరిగి రాళ్ళతో కొత్త స్థూపాన్ని నిర్మించారు. సింగవరం పాకెట్‌లో కొత్తూరు వద్ద ఆ పాకెట్ ప్రజలంతా కలిసి సిమెంట్‌తో పెద్దస్థూపాన్ని నిర్మించారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను విఫలం చేయడంకోసం డివిజన్ వ్యాపితంగా శతృవు బలగాలను మోహరించి కూంబింగ్‌లను నిర్వహించడం, కొన్ని మండల, పంచాయితీ సెంటర్లలో పోలీసులు శాంతి స్థూపాలను ఏర్పర్చి ప్రజల, పీఎల్‌జీఏ చేతుల్లో ఖతం చేయబడ్డ ప్రజావ్యతిరేకుల, ద్రోహుల ఫోటోలను ప్రదర్శించడం వంటివి చేసాడు. తీవ్రమైన శతృదాడి కారణంగా గతంలోలాగా పెద్ద ఎత్తున ప్రజలు సభలను జరుపుకోలేక పోయినప్పటికీ, అమరులను స్మరించుకుంటూ స్థూపాలను నిర్మించడం, రంగులు వేయడం ద్వారా అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు.

## రాజకీయ ప్రచారం

మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినాన్ని పురస్కరించుకొని విశాఖ-ఈస్ట్ డివిజన్ కమిటీ పత్రికలకు ప్రకటనను విడుదల చేసింది. పీబీఎల్-కేకే, గాలికొండ ఏరియా కమిటీలు తమ ప్రాంతాల పరిధిలోని పంచాయితీలు, మండల సెంటర్లలోనూ, గ్రామాలలోను పోస్టర్స్ వేయడం ద్వారా విస్తృతంగా ప్రచారం చేసాయి.

– 2021 మార్చిలో గాలికొండ ఏరియాలో కొర్ర పిల్కు ఇన్ఫార్మర్‌ను చంపిన తర్వాత శతృవు నిరసన ప్రదర్శనలు, కొవ్వొత్తుల ప్రదర్శనలు, ర్యాలీలు వంటివి నిర్వహిస్తూ మన పార్టీకి వ్యతిరేకంగా చేసిన దుష్ప్రచార దాడిని, డివిజన్ ఉద్యమంపై తీవ్రతరం చేసిన నిర్బంధ దాడిని ఖండిస్తూ విశాఖ-ఈస్ట్ డివిజన్ కమిటీ పత్రికలకూ, ఎలక్ట్రానిక్ మీడియాకు ప్రకటనను విడుదల చేసింది.

– 2021 ఏప్రిల్‌లో మన్యంలో జరుగుతున్న లేటరైట్ పేరుతో బాక్సైట్ తవ్వకాలపై, ప్రజలపై పోలీసుల దాడులపై రాజకీయ నాయకుల వైఖరిని ప్రశ్నిస్తూ, విశాఖ-ఈస్ట్ డీవీసీ పత్రికలకు ప్రకటన విడుదల చేయడంతోపాటు, సర్పంచులు, ఎమ్‌పీటీసీ, జడ్‌పీటీసీ, ఎమ్‌ఎల్‌ఏ, ఎమ్‌పీల వరకూ లేఖలను పంపడం, పోస్టర్స్ ద్వారా డివిజన్ వ్యాపితంగా విస్తృతంగా ప్రచారం చేయడం జరిగింది.

– 2021 జులైలో ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వం విడుదల చేసిన 'జాబ్ క్యాలెండర్'లోని మోసాన్ని ఖండిస్తూ, దీనికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాపితంగా జరుగుతున్న ఆందోళనలకు, నిరసన ప్రదర్శనలకు మద్దతు తెలిజేస్తూ విశాఖ-ఈస్ట్ డీవీసీ ఆడియో స్టేట్‌మెంట్‌ను మీడియాకు విడుదల చేసింది.

– 2021 జులై 14న విశాఖ-ఈస్ట్ డీవీసీ సభ్యుడు సుధీర్ దిగజారిపోయి, ప్రజలకూ, ఉద్యమానికి ద్రోహం చేసి, పారిపోవడాన్ని ఖండిస్తూ, అతడిని పార్టీ నుండి బహిష్కరిస్తూ డీవీసీ మీడియాకు ప్రకటన విడుదల చేసింది.

**2021లో ఏఓబీ ఎస్‌జడ్.సీ విడుదల చేసిన ప్రకటనలు**

– జనవరిలో రైతాంగ ఉద్యమానికి మద్దతును తెలియజేస్తూ, 3 వ్యవసాయ చట్టాలను తీవ్రంగా ఖండిస్తూ ఒక ప్రకటన విడుదల చేసింది.

– 2021 ఏప్రిల్ 26న 'ప్రహార్' దాడికి వ్యతిరేకంగా సీసీ పిలుపిచ్చిన బంద్‌ను ఏఓబీలో విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిస్తూ, ఒక ప్రకటన చేసింది.

– కరోనా సెకండ్ వేవ్ సందర్భంగా ప్రజల ప్రాణాలపై, వైద్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రదర్శిస్తున్న అలసత్వాన్ని, నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండిస్తూ, మే నెలలో ఒక ప్రకటన విడుదల చేసింది.

– 2021 జూన్‌లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ 2 సంవత్సరాల పరిపాలనలో రాష్ట్రాన్ని తెగనమ్ముతూ, మోడీకి నమ్మిన బంటుగా చేస్తున్న ప్రజావ్యతిరేక పరిపాలనను తీవ్రంగా ఖండిస్తూ ఒక స్టేట్‌మెంట్ ఇచ్చింది.

– జూన్ 16న జరిగిన తీగలమెట్ట ఫైరింగ్‌కు నిరసనగా జులై 1వ తేదీన ఏఓబీ జోన్ వ్యాప్తబంద్‌కు పిలుపునిస్తూ ఒక ప్రకటన చేసింది.

– ఆగస్టులో మన్యంలో విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల్లో లేటరైట్ ముసుగులో జరుగుతున్న బాక్సైట్ తవ్వకాలను ఖండిస్తూ, మన్యం వ్యాపితంగా జరుగుతున్న మైనింగ్‌కు వ్యతిరేకంగా ఆగస్టు 10న బంద్‌కు పిలుపునిస్తూ ప్రకటన విడుదల చేసింది.

– సుధీర్ లొంగుబాటును, దీన్ని అవకాశంగా తీసుకొని శత్రువు చేస్తున్న దుష్ప్రచార దాడిని తీవ్రంగా ఖండిస్తూ ఆగస్టులో ఏఓబీ ఎస్‌జడ్‌సీ పేరుతో మీడియాకు స్టేట్‌మెంట్ ఇవ్వడమైంది.

– విశాఖలోని స్టీల్‌ప్లాంట్ ఉద్యమానికి మద్దతునిస్తూ, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న కార్మిక వర్గానికీ, విశాఖ ప్రజానీకానికీ పరిష్కారమార్గాన్ని తెలియజేస్తూ ఏఓబీ ఎస్‌జడ్‌సీ విడుదల చేసిన బుక్‌లెట్‌ను ఆగస్టులో పత్రికలకు ఎలక్ట్రానిక్ మీడియాకు పంపడమైంది.

## ఎమ్‌కేబీ డివిజన్

### కార్పెట్ సెక్యూరిటీలో భాగంగా ఏర్పాటు చేసిన పోలీసు క్యాంపులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ప్రజల ఆందోళన

మల్కనగిరి జిల్లాలోని చిత్రకొండ బ్లాక్, కటాఫ్ ఏరియాలో నూతన ప్రజా రాజ్యాధికార లక్ష్యంతో ముందుకెలుతున్న విప్లవోద్యమాన్ని నిర్మూలించే దిశగా గత 2 సంవత్సరాల నుండి రోడ్లు, బ్రిడ్జీలు, సెల్‌టవర్స్ నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాడానికి కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ప్రభుత్వం నీళ్ళలా ఖర్చు పెడుతున్నది. ఇదంతా ఈ ప్రాంత ప్రజల అభివృద్ధిలో భాగమేనని ప్రచారం చేసుకుంటున్నది. కానీ ప్రజలు ఎవ్వరూ దీనిని ఆమోదించడం లేదు. గత దశాబ్ద కాలానికి పైగా ఈ ప్రాంత ప్రజలు పార్టీ నాయకత్వంలో బలిమెల డ్యాం ముంపు సమస్య, మౌలిక, ప్రాథమిక సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ, వివిధ రూపాలలో తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం వాటిని పరిష్కరించడానికి బదులు వందలకోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ప్రజలను అణచివేయడానికి అవసరమైన మౌలిక వసతుల(ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)ను అభివృద్ధి చేసి, వందలాది కేంద్ర అర్ధసైనిక బలగాలను మోహరించి, కార్పెట్ సెక్యూరిటీని నిర్మించి విస్తరిస్తున్నది.

2021 సంవత్సరంలోనే కొత్తగా ఒంతలగూడ, దార్లబెద, గురుశెట్టి, ఒంద్రాలు, ముదిలిపడ, గొనబెడలలో బీఎస్‌ఎఫ్, ఎస్‌ఓజీ, డీబీఎఫ్ బలగాలను మోహరించి క్యాంపుల నిర్మాణం చేసారు. ఈ బలగాలు నిరంతరం గ్రామాలపై దాడులు చేసి, ప్రజలను అక్రమంగా అరెస్టులు చేయడం, తప్పుడు కేసుల బనాయింపు, జైలు నిర్బంధాలను నిత్యకృత్యం చేసాయి. కూంబింగ్‌ల పేరుతో అడవుల గాలింపు ద్వారా రోడ్లపై చెకింగ్‌ల పేరిటా ప్రజలను వేధిస్తూ, వారికి స్వేచ్ఛగా తమ గ్రామాలలో, అడవులలో సంచరించకుండా అడ్డుకుంటూ, అప్రకటిత యుద్ధ వాతావరణాన్ని సృష్టించారు. పోలీసుల ఆగడాలతో మహిళలకు రక్షణ కరువైంది. లొంగిపోయిన విప్లవ ద్రోహులనూ, గతంలో ప్రజల చేత శిక్షించబడిన, గ్రామ బహిష్కరణలకు గురి అయిన ప్రజా వ్యతిరేకులు, శత్రువు ఏజెంట్లు పోలీసుల రక్షణలో ప్రజలపై బెదిరింపులకు, దాడులకు పూనుకుంటున్నారు. పారిపోయిన భూస్వాములు తిరిగి గ్రామాలకు చేరుకొని ప్రజల భూములను పునఃరాక్రమణకు తెగబడ్డారు. పెత్తందారులు ప్రజలపై తమ పాత ఆధిపత్యాన్ని చలాయించ చూస్తున్నారు. ప్రభుత్వ అధికారులు, కాంట్రాక్టర్‌లు కుమ్మక్కై లక్షలాది రూపాయాల ప్రజాధనాన్ని కాజేస్తున్నారు. ఈ సమస్యలపై ప్రజలు నోరు మెదపకుండా, కాలుకదపకుండా నిరంతర నిఘా–బెదిరింపులు, దాడులు చేస్తూ, కాన్‌సంట్రేషన్ క్యాంపుగా మార్చి దీనినే ప్రభుత్వం పోలీసు ఉన్నతాధికారులు ఈ ప్రాంతంలో శాంతిని నెలకొల్పుతామనీ, అభివృద్ధిని శరవేగంగా ముందుకు తీసుకుపోతున్నామని నిస్సిగ్గుగా ప్రకటించుకుంటున్నారు. ఈ శ్మశాన శాంతిని బద్దలు కొట్టడానికి ప్రజలు ధైర్యంగా నడుం బిగిస్తున్నారు. పోలీసు క్యాంపుల నిర్మాణాన్ని ప్రారంభం నుండే వ్యతిరేకిస్తూ, వేలాది మంది ప్రజలు చేసిన ఆందోళనలను ప్రభుత్వం అణచివేస్తూ, కార్పెట్ సెక్యూరిటీని నిర్మించి విస్తరింపజేస్తున్నది. దీనికి వ్యతిరేకంగా కటాఫ్ ఏరియాలోని పనసపుట్, ఒంద్రాలు, జొడాంబ పంచాయితీలకు చెందిన పదుల గ్రామాలకు చెందిన సుమారు 10 వేలమంది ప్రజలు మే 6న గురుశెట్టి చౌక్ వద్ద ఊరేగింపు జేసి, క్యాంపులను వెంటనే ఎత్తివేయాలనీ, అక్రమంగా అరెస్టులు చేసి జైళ్ళలో నిర్బంధించిన వారిని బేషరతుగా విడుదల చేయాలనీ, గ్రామాలపై దాడులు ఆపివేయాలనీ, అడవులలో కూంబింగ్‌ల పేరుతో గాలింపులు చేపడుతూ, అడవికి వెళ్ళిన ప్రజలను ఇబ్బందులకు గురి చేయడాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేసారు. గ్రామాలపై పోలీసుల దాడికి వ్యతిరేకంగా ర్యాలీ ఫోటోలు వివరి పేజీలో...

# ఎమ్‌కేబీ డివిజన్‌లో కార్పెట్ సెక్యూరిటీ నడుమ జులై 28 అమరుల స్మారక వారోత్సవాలు జరుపుకున్న ప్రజలు

ఏఓబీ జోన్ వ్యాప్తంగా ఆపరేషన్ 'సమాధాన్-ప్రహార్' సైనిక దాడిని ప్రతిఘటిస్తూ, ఓడించి విప్లవోద్యమాన్ని రక్షించి, పురోగమింప జేయడానికి పార్టీ, పీఎల్‌జీఏ ప్రజలు అనన్యమైన త్యాగాలు చేస్తున్నారు. అక్టోబర్ 26 తోటగుడ గ్రామం వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో సీఆర్‌సీపీఎల్ కమాండర్ కిషోర్ నేలకొరిగాడు. ఆర్గనైజేషన్ పనిమీద వెళ్ళి, సింగవరం గ్రామంలో నిద్రిస్తున్న టీంను డిసెంబర్ 13న రాత్రి 12 గంటల ప్రాంతంలో పోలీసులు చుట్టుముట్టి జరిపిన కాల్పులను ప్రతిఘటిస్తూ కామ్రేడ్స్ మల్లాల్, శాంతమ్మలు అసువులు బాసారు. 2021 జూన్ 16న విశాఖ జిల్లాలోని తీగలమెట్ట అటవీ ప్రాంతంలో దళ మకాంను చుట్టుముట్టి అకస్మాత్తుగా జరిపిన కాల్పుల్లో కామ్రేడ్స్ రణదేవ్, అశోక్, అంజన్న, పాయికే, లలిత, చైతేలు అమరులయ్యారు. వీరే కాకుండా కొజ్జరిగూడ గ్రామ సంఘ నాయకుడు పార్టీ సభ్యుడైన కామ్రేడ్ దన్నును పోలీసులు అరెస్టు చేసి, తీవ్రమైన చిత్రహింసలకు గురి చేసినా, పార్టీ రహస్యాలను కాపాడి జైలులో ప్రాణాలు విడిచాడు. ఒంద్రుపల్లి గ్రామంలో పార్టీ సభ్యుడు కామ్రేడ్ కేశవ్ తీవ్ర అనారోగ్యానికి గురై శత్రువు నిర్బంధంలో వైద్యం అందక తుదిశ్వాస విడిచాడు. 2021 జనవరి 30న రాత్రి కొరాపుట్ జిల్లా, గొనబెడ గ్రామస్తులతో సమావేశం అయిన దళంపై పోలీసులు కాల్పులు జరిపి ఒక సాధారణ రైతును పట్టుకొని హత్యచేసి ఎన్‌కౌంటర్ కట్టుకథ అల్లారు. పోలీసుల కూంబింగ్‌లు, నిరంతర దాడుల మధ్య కూడా వందలాది మంది ప్రజలు కదిలి అమరుల త్యాగాలకు చిహ్నంగా కటాఫ్ ఏరియాలోని కాల్‌గూడ గ్రామంలో, అలాగే తాబేరు, కొండంజరి గ్రామాలలో స్మారక స్థూపాలను నిర్మించుకున్నారు. జులై 28 అమరుల స్మారక వారోత్సవాల సందర్భంగా సభలను అడ్డుకోవడానికి పోలీసులు కూంబింగ్‌లు నిర్వహించినా, బెదిరింపులకు పాల్పడినా ప్రజలు లెక్క చేయలేదు. తోటగూడ గ్రామంలో గతంలో నిర్మించిన రాంగూడ అమరుల స్మారక భవనం వద్ద 6 గ్రామలకు చెందిన సుమారు 400 మంది ప్రజలు ఊరేగింపుగా వెళ్ళి, సంస్మరణ సభను జరుపుకొని, అమరుల ఆశయాలను ముందుకు తీసుకుపోతామని శపథం చేసారు. తాబేరు, కాల్‌గూడ అమరుల స్థూపాల వద్ద వందలాది మంది ప్రజలు శత్రువు బెదిరింపులను లెక్క చేయకుండా, మిలీషియా ఏర్పాటు చేసిన పటిష్టమైన రక్షణ మధ్య సభలు జరుపుకొని శత్రువును ఖంగుతినిపించారు. అమరుల త్యాగాలు ప్రజలలో నిత్యం పోరాట స్ఫూర్తినీ, వర్గకసి పెంచుతాయి తప్ప, పిరికితనాన్ని లొంగుబాటుతత్వాన్ని కాదని శత్రువును సవాళ్ళు చేస్తూ, అమరుల ఆశయాల బాటలో వడివడిగా అడుగులు వేస్తూ ముందుకు సాగారు.





# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

పత్రికా ప్రకటన

నవంబర్ 7, 2021

## ఫాసిస్టు నరేంద్రమోదీ ప్రభుత్వం అమలు జరుపుతున్న 'ప్రహార్ సైనిక అభియాన్'కు వ్యతిరేకంగా నవంబర్ 24ను అంతర్జాతీయ కార్యాచరణ దినాన్ని విప్లవ దృఢ సంకల్పంతో జయప్రదం చేయండి.

భారత విప్లవోద్యమ నిర్మూలనా లక్ష్యంతో భారత దోపిడీ పాలకవర్గాలు సామ్రాజ్యవాదుల అండదండలతో 2009లో రూపొందించి దీర్ఘకాల పథకంతో ప్రారంభించిన ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ప్రజలపై యుద్ధంగా ప్రకటిస్తూ దేశ, అంతర్జాతీయంగా అనేక కార్మికవర్గ సంస్థలు, వామపక్షాలతో పాటు ప్రజాస్వామిక, విప్లవ సంస్థలు ముందుకువచ్చాయి. ఆ క్రమంలో 2011లో మా కేంద్రకమిటీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కామ్రేడ్ కిషన్‌జీ (మల్లోజుల కోటేశ్వర్లు) అమరత్వ దినాన్ని పురస్కరించుకొని ఇటలీలోని మిలాన్‌లో అనేక దేశాల కార్మికవర్గ, మావోయిస్టు పార్టీలు, సంస్థలతో కలసి 'భారత ప్రజాయుద్ధ అంతర్జాతీయ సంఘీభావ కమిటీ' (ఐసీఎస్‌పీడబ్ల్యుఐ) ఏర్పడింది. గత పదేళ్లుగా అది అంతర్జాతీయ కార్మిక వర్గ దృక్పథంతో భారత ప్రజాయుద్ధానికి అండగా నిలుస్తోంది. ఆ సంస్థ వర్తమాన ప్రహార్ – 3ను ఖండిస్తూ భారత హిందుత్వ పాలకుల విప్లవ వ్యతిరేక రియాక్షనరీ అణచివేత చర్యలను వ్యతిరేకిస్తూ ప్రజాయుద్ధానికి సంఘీభావంగా అంతర్జాతీయ కార్యాచరణ దినాన్ని నవంబర్ 24 (కామ్రేడ్ కిషన్‌జీ పదవ వర్ధంతి) నాడు పాటించాలని పిలుపునిచ్చింది. మా పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్రకమిటీ విప్లవాభివందనాలు తెలియచేస్తూ దానిని విప్లవ దృఢ సంకల్పంతో జయప్రదం చేయాల్సిందిగా దేశవ్యాప్త విప్లవ ప్రజాసంఘాలకు, జనతన సర్కార్లకు (విప్లవ ప్రజా కమిటీ), పీఎల్‌జీఏకు పిలుపునిస్తోంది. దేశవ్యాప్త విప్లవాభిమానులు, వామపక్షాలు, దేశభక్త ప్రజాస్వామికవాదులు, హిందుత్వ వ్యతిరేక లౌకికశక్తులు, కార్మిక, కర్షక, విద్యార్థి, మేధావులు, మహిళలు, అల్పసంఖ్యాకులు, దళితులు, ఆదివాసులు అందులో పాల్గొని ఆ పిలుపును జయప్రదం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేస్తోంది.

ఇటీవల నరహంతక ఫాసిస్టు మోదీ కొన్ని అంతర్జాతీయ సమావేశాల్లో పాల్గొని దేశాన్ని సామ్రాజ్యవాదులకు మరింతగా అప్పజెప్పడానికి ఒప్పందాలు చేసుకొని వచ్చాడు. దేశాన్ని అమ్మివేయడంలోనూ, ఫాసిజాన్ని అమలు జరుపడంలోను ప్రపంచంలోనే నెం.1గా వున్నాడు. అందువలన సామ్రాజ్యవాద రేటింగ్ సంస్థలు మోదీని ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన నాయకుడని ప్రచారం చేస్తున్నారు.

26 సెప్టెంబర్ 2021 నాడు అభివృద్ధి పేరుతో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మావోయిస్టు ఉద్యమ ప్రాంతాల ముఖ్యమంత్రులు, పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమై విప్లవోద్యమ నిర్మూలనా పథకాన్ని రూపొందించాడు. దానిని అనుసరించి దేశవ్యాప్తంగా ముఖ్యంగా మధ్య రీజియన్‌లో శరవేగంగా అణచివేత చర్యలు తీవ్రమవుతున్నాయి. ఇటీవలే 3 నవంబర్ నాడు నిర్మూలనా కేంపెయిన్‌కు బలగాలు సిద్ధంగా ఉన్నాయనీ, త్వరలో 24 క్యాంపులు నెలకొల్ప నున్నామనీ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లలో మరిన్ని అధికంగా నెలకొల్పి విజృంభిస్తామనీ కేంద్ర పోలీసు అధికారులు ప్రకటించారు. హోం మినిస్టర్ ప్రకటించిన 'వికాస్' కార్యక్రమాలలో ఏ ఒక్కటీ ఇప్పటి వరకు వెలుగు చూడలేదు కానీ, ఆఘమేఘాల మీద పోలీసు క్యాంపులు మాత్రం వెలుస్తున్నాయి. ఈ విప్లవోద్యమ అణచివేత చర్యలను మా పార్టీ తీవ్రంగా ఖండిస్తూ దేశ ప్రజల జీవన్మరణ సమస్యల పరిష్కారానికి తక్షణం నడుం బిగించాల్సిందిగా దేశ ప్రజలను కోరుతున్నది.

దేశంలో ఒక వైపు దాదాపు గత యేడాది కాలంగా లక్షలాది రైతాంగం అనేక త్యాగాలకు సిద్ధపడి కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక సాగు చట్టాల రద్దుకై పోరాడుతున్నారు. మరోవైపు పశ్చిమ్ బెంగాల్, ఝార్ఖండ్, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రాలలోని విశాల అటవీ ప్రాంతాలలో జల్, జంగల్, జమీన్ మరియు అధికారం కోసం మూలవాసులంతా పోరాడుతున్నారు. దండకారణ్యం, ఝార్ఖండ్,

ఏఓబీ, ఒడిశాలలోని మూలవాసులంతా తమ అడవులలోని ప్రజా ఉద్యమాలను ఉక్కు పాదంతో అణచివేయడానికి కేంద్ర సాయుధ పోలీసు బలగాలతో క్యాంపులను నెలకొల్పడాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా సిలింగేర్ పోలీసు క్యాంపు వ్యతిరేక మూలవాసుల ప్రజా ఉద్యమం గత ఆరు మాసాలుగా నిరుపమాన అనుభవాలతో కొనసాగుతోంది. దేశంలోని అన్ని రకాల ప్రజా ఉద్యమాల అణచివేతే వర్తమాన ప్రహార్ 3 లక్ష్యం. సీపీఐ(మావోయిస్టు)నాయకత్వంలోని విప్లవోద్యమాన్ని దేశ అంతర్గత భద్రతకు పెను ముప్పుగా చిత్రిస్తున్న హిందుత్వ శక్తులు ప్రజల జీవన్మరణ సమస్యలను వదలి విప్లవోద్యమ నిర్మూలనకు రంగం సిద్ధం చేయడాన్ని మా పార్టీ నిర్ద్వందంగా ఖండిస్తూ 24 నవంబర్ నాడు అంతర్జాతీయ కార్యచరణ దినాన్ని జయప్రదం చేయాల్సిందిగా మరోసారి కోరుతోంది. ప్రహార్‌లు, అణచివేత చర్యలు చరిత్రలో ఏ విప్లవోద్యమాలను నిరోధించలేక పోయాయనీ ప్రజా ఉద్యమాల వెల్లువలను మరింత తీవ్రం చేస్తూ భారత ప్రజల ప్రజాస్వామిక విప్లవ విజయానికై తుదివరకూ పోరాడాలనీ విశాల ప్రజారాసులకు విజ్ఞప్తి చేస్తోంది. తుదివరకూ పోరాడుదాం, అంతిమ విజయం సాధిద్దాం.

☆ **24 నవంబర్ నాడు గ్రామ గ్రామాన *ప్రహార్* వ్యతిరేక ప్రజా ప్రదర్శనలు నిర్వహించండి.**

☆ **ప్రజా ఉద్యమ కేంద్రాలలో భారీ ప్రజా సభలు నిర్వహించి *ప్రహార్* విధానాలను ఖండించండి.**

☆ **ప్రజల వికాసం పేరుతో హిందుత్వ శక్తులు అమలు చేస్తున్న *ప్రహార్* వినాశకర విధానాలను బహిర్గతం చేస్తూ ఎద్ద ఎత్తున ప్రచార కేంపెయిన్ చేపట్టండి.**

☆ **మోదీ-అమిత్ షా-భాగవత్‌ల దిష్టి బొమ్మలు దగ్ధం చేస్తూ వారి అణచివేత చర్యల నివేదికలను అంతర్జాతీయ మానవహక్కుల సంస్థలకు, ఐసీఎస్‌పీడబ్ల్యూఐకి అందచేయండి.**




**అభయ్**
**అధికార ప్రతినిధి**
**కేంద్ర కమిటీ**
**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**









# విశాఖ – ఈస్ట్, ఎమ్ కే బీ డివిజన్లలో ప్రజాందోళనలు



గ్రామాలపై పోలీసుల దాడులకు వ్యతిరేకంగా



అరెస్టులకు వ్యతిరేకంగా



పంటలను పాడుచేసిన పోలీసులను తరిమివేస్తూ



స్థానిక ఎన్నికలకు వ్యతిరేకంగా



నిర్బంధానికి వ్యతిరేకంగా



పోలీసు క్యాంపులకు వ్యతిరేకంగా